# స్వేచ్ఛా కవిత్వం

ఎనిమిదో సంపుటం (2022-2023)



మాదిరాజు రంగారావు

2026
రసధుని సాహితీ పరిషత్తు
శాంతినగర్, హైదరాబాద్-28.

# స్వేచ్ఛా కవిత్వం

**ఎనిమిదో సంపుటం**

**రచనా కాలం 2022 - 2023**

**మాదిరాజు రంగారావు**

## నాన్నగారి జ్ఞాపకార్థం

మా నాన్నగారు, ఆచార్య మాదిరాజు రంగారావు గారి విశిష్ట సాహిత్య సేవలకు నివాళిగా, మాదిరాజు రంగారావు గారి స్వేచ్ఛా కవిత్వం ఎనిమిదో సంపుటం **(Volume VIII)** పునః ముద్రణ చేసి సాహితీ సహృదయులకు, శ్రేయోభిలాషులకు అందుబాటులోకి తీసుకొస్తున్నాము.

**మాదిరాజు సంతోష్ కుమార్**

**దేవులపల్లి హరిత**

**మాదిరాజు చరిత**

**రసధుని**

**సాహితీ పరిషత్తు**

**శాంతినగర్, హైదరాబాద్-28.**

**SWECCHAA KAVITHVAMU**
**Volume VIII (2022 - 2023)**

**by**
**Prof. Madiraju Ranga Rao**

© **Dr. M. Santhosh Kumar**

Edited by Madiraju Santhosh Kumar
Devulapally Haritha
Madiraju Charitha

Frist Edition 2023
Second Edition 2026

ISBN : 978-93-5680-947-5

**Price : 1000/-**

*For Copies :*
Dr. Madiraju Santhosh Kumar
98499 79899

*Printed at :*
**Anupama Printers**
Shantinagar, Hyderabad - 28
Phone : 040-23391364
E-mail : anupamaprinters1978@gmail.com

# స్వేచ్ఛా కవిత్వం

## ఎనిమిదో సంపుటం

## రచనా కాలం 2022 - 2023

## విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | మార్నింగ్ వాక్ (121) | 1-44 |
| 2. | విప్లవ ప్లవనం & స్వేచ్ఛలో మనోజ్ఞం (122) | 45-106 |
| 3. | అదృష్టం (123) | 107-140 |
| 4. | మేల్కొన్న కవిత 1 & 2 (124) | 141-206 |
| 5. | ఆగని పయనం (125) | 207-262 |
| 6. | కవిత్వమొక థెరపి (126) | 263-290 |
| 7. | తెలంగాణ స్వరం | 291-306 |

# పీఠిక

కవిత్వాన్ని ప్రభావ శీలంగా మార్చేసే అంశాలు కొన్ని ఒకటి తరువాత మరొకటి పద్ధతిగా చోటు చేసుకొని దృష్టికి వస్తాయి. ఇవి (1) శబ్ద ప్రసారం (2) అర్థ ప్రకాశం (3) భావ వికాసం (4) హ్లాద విధం (5) తన్మయత (6) సమ్యక్ మేళనం (7) ప్రతీకతలు (8) వ్యక్తిత్వంతో ఇవి కలిసినపుడు మనోహరంగా కవిత్వం ఆవిష్కృతమవుతుంది. రచనకు విశిష్టత చేకూరుతుంది. వివిధ స్థాయిల్లో అనుభవానికి వస్తుంది.

కవిత్వం సుమదళ స్పర్శలా జలధి అలల స్పృహాలోలంగా, వేగంగా, ఒక చోట కలుసుకోబోయే మబ్బు తునకల వలె, ఉదయం పలచని మంచు తెరలను చీల్చుకొని వచ్చే సూర్యరశ్మిలా తలపుకు వస్తుంది. రవి కిరణ శక్తిని పొందుతుంది. ఇది కవి దృష్టిని బట్టి దార్శనిక స్వేచ్ఛాగతిలో స్వతంత్ర మయిన అక్షర విజయాన్ని సూచిస్తుంది. ప్రతి హృదయ దర్పణంలో ప్రతిఫలనం అనుభవానికి వస్తుంది. పాఠకులను, శ్రోతలను, సహృదయులను, అభిమానులను అలరిస్తుంది. వేరు వేరు దృష్టి కోణాలలో అనేక కారణాల చేత ప్రకటితం కావడం సహజం. దీని లక్ష్యం సజీవమయిన సుందర రూపం. నాటి నుండి నేటి వరకు బహు విస్మరమైన (ప్రభావితమైన) కృతిగా తోచినా ఇదే సత్పథం. అంతర్వివేచనలో స్వేచ్ఛతో అభినవ సమాలోచనాన్ని పొందుతుంది.

ఈ కళాత్మక (aesthetic) మయున ప్రక్రియ (process) సంచయాన్ని అనుసరించి ఉత్తమ కవిత్వంలో దార్శనిక (ideological) ప్రకాశం అపూర్వ మైన తేజో రూపాన్ని ప్రసరిస్తుంది. రసాకృతికి దారి తీస్తుంది. హ్లాదమో ఖేదమో ఉత్సేకమో ఉద్వేజమో ఉద్భ్రాంతమో యథార్థమో!

**–ఆచార్య మాదిరాజు రంగారావు**

స్వేచ్ఛా కవిత్వం - 121

# మార్నింగ్ వాక్/
## మలి తెలంగాణ

మాదిరాజు రంగారావు



2022

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

**121 SWECCHA KAVITHVAM**

**MORNING WALK**

by

Prof. Maadiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Year of Publication 2022

*Presented to*
*my wife*
*Smt. Indira*

# పీఠిక

కొత్త పరిచయాలు పాత ముఖాముఖి సందర్భాలు కాలక్షేపం వ్యాయామం ముచ్చట్లు చిన్నపాటి చర్చలు సాధారణం నుండి సీరియస్ వరకు సంభాషణలు ఇలా ఎన్నో! ఇది ఉల్లాసాన్ని ఇచ్చేది, ఉత్సాహాన్ని కలిగించేది; వెరైటీతో కళకళలాడేది. ఒంటరిగా సమూహాలుగా విశేష వాతావరణాన్ని కలిగింది. ఎన్ని విషయాలో. ఈ దృశ్యాలతో ఖండ ఖండాలుగా సంగ్రహ ఖండికలుగ వీటి సమాహారంగా రూపొందిందీ కృతి, మార్నింగ్ వాక్.

ఉదయం పట్టణాల్లో నగరాల్లో బాగా వ్యాప్తిలో ఉన్న కాలి నడక. ఆరోగ్యానికి మంచిదని డాక్టర్ల అభిప్రాయం. 'మార్నింగ్ వాక్' పేరుతో ఈ కవితలు దీని స్వరూపాన్ని తెలపుతాయి. స్థూలంగా ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని ఇస్తాయి. ఎన్నో విషయాల సమాహారం. రాజకీయ సామాజిక వైజ్ఞానిక తాత్త్విక కళా ప్రక్రియలే కాక, మరెన్నో అభిరుచులతో వ్యాప్తి చెందింది. కవిత్వ స్థాయిలో వ్యక్తిత్వాలు – సామాజికాలు – ఎక్కువగా చోటు చేసుకోవడం జరుగుతుంది. ఈ కాలక్షేపం ఏ కాలానికైనా చెందింది కావచ్చు.

స్వేచ్ఛా కవిత్వం అరవై ఏండ్ల నుండి వ్రాయబడుతూ నిశ్చయమైన దార్శనికంతో స్థిరమైన ఆలోచనా ప్రపంచంతో ప్రజాస్వామ్య భావనా స్ఫూర్తిని కలిగింది. ఇందులోను ఈ అంశం దృష్టికి వస్తుంది. ఈ ప్రక్రియ తన ప్రత్యేకతలను సాహిత్య చరిత్రలో నిలబెట్టుకోవడం గమనించవచ్చు. అన్ని దిశలకూ అవకాశమున్న విశాల వేదికగా కవులను కవిత్వాన్ని స్వాగతించే గౌరవించే వికాస భావనతో తన కర్తవ్యాన్ని నిర్వహిస్తూంది. వ్యక్తి పట్ల అనురాగం, అనురక్తి సమాజం పట్ల ఆలోచన శ్రద్ధతో అటు మనస్సుకూ ఇటు ప్రజలకూ ఉపయోగపడుతూంది.

ఇక కవిత్వ విషయానికి వస్తే వివిధ సందర్భాలలో అలంకారాలు– ధ్వని విశేషాలు – భావరూపాలు – ప్రతీకలు – వాస్తవికం – జీవన చిత్రణం విశ్వభావనతో కూడింది. ఇవి తమ అవసరాన్ని బట్టి పాత్రను నిర్వహించడం జరుగుతుంది. కవిత్వానికేది ముఖ్యమన్న ప్రశ్నకు కొన్ని! అవీ కవికి ఇష్టమైనవి ప్రజలకు అవసరమనుకున్నవీ చోటు చేసుకోవడం కనిపిస్తుంది. దేశానికీ పుస్తకానికీ వస్తువుకూ విషయానికీ ప్రక్రియకూ భాషకూ పేర్లలో (Alternatives) ప్రత్యామ్నాయాలు ఉండవచ్చు, ఉన్నాయి. "స్వేచ్ఛా కవిత్వం" గురించి నా అభిప్రాయమిదే. అరవై ఏండ్లుగా వాడబడుతూంది. కవుల విషయంలో అనుభవాలెన్నో! జ్ఞాపకాలెన్నో, చరిత్రకు ఆకరమైనవి. సమాజానికి ప్రయోజనకరమైనవి. వ్యక్తిని వికాసపరచేవి. ఈ కృతి ఉన్న స్థానం దేశం విశ్వం–మూడు అంచెలుగా నిర్వహణ శిల్పాన్ని పొందింది. కవిత్వ కళకు చెందింతవరకు ఎవరి ప్రత్యేకత వారిది. దార్శనిక ప్రకాశం మాత్రం ఎవరి దృష్టి వారిది. వీటి అమరికలో విప్రతిపత్తి లేదు.

ఇది స్వేచ్ఛాకవిత్వంలో 121వ ప్రచురణం, సాహిత్య సహృదయులను స్వాగతిస్తూ..

**– మాదిరాజు రంగారావు**

# 1. వెలుతురు యానం

పొద్దు పొడుస్తుంది, పలు దిశల ప్రజాస్వామ్య ప్రకాశం
అంతవరకు గుర్తింపు లేని వస్తువు లిపుడు బహు స్పష్టంగా
వివిధ వర్ణ బహువిధ పుష్పాలతో వికాసమాన వనంలా
బయటి దృశ్యమే దయినా చూడక తప్పనిదీ, కనుల ముందు

వెలుతురులో రంగుల బ్రతుకులో ప్రతీకలుగా అమరేను
సూర్య కిరణ స్పర్శతో రోజు ! మొదలవుతుంది బంగరు కళతో
తెలిసిన బిందువు నుండి అదృష్ట రేఖ అనుభవంలో చిత్రమై
తెలియని ప్రపంచంలోకి, అక్షర గతమై కవిత వెడలుతుంది

హ్లాదం శ్రేయం నాదం రాగంతో ఉత్తేజమొ ఉల్లాసమొ హృది
విశ్వమయమై పరంపరాభాగంగా అనుభవ రుచితో కమనీయం

ఎవరికి వారు తమకు తగిన విధంగా విజయం కోరేరు
ప్రయోజన బలంతో యత్నం! సార్థకం కావాలని
ఆహార సమస్య తీరి మనిషిలో తృప్తికి తగినవి
దీనికి తోడుగ కోరేవి, అవసరమైనవి విషయాలెన్నో

ధనం ప్రభుత అధికారం కీర్తి సంపద ఒకటొకటి
జీవన భాగ్యానికి అంతో ఇంతో విలువను చేకూర్చేను
ఆవాహనలో సమస్య స్వాగత తోరణం కావచ్చు
రోజు ఉదయం చేతనతో దృశ్యం! అలరించాలని

జలధి అలలపై పయనం హాయితో పాటు రిస్క్ కూడా
గాలులు అపుడపుడు తుపాను వారసత్వంతో వీచవచ్చు
ఒడ్డుకు చేరగానే చెట్టు నీడతో ఆహ్వానం వదలుతుంది
చెట్టును చేరగానే శాంతి ప్రేమ బంధుత స్నేహం ఆవహించేను

ఎవరితో ఏ క్షణాన కలహంతో ఎగసిన స్ఫులింగం
ఎవరిని గాయ పరచేదీ ముందుగ తెలియదు
భయంలోను మనిషి అడుగు ముందుకే పడుతుంది
గాయానికి భయపడని వీరం ఆదుకునేను

దీప ప్రకాశం రాత్రి వేళ చీకటిలో దారి చూపేను
అక్షర పంక్తులలో వెలుతురు యానం జరిగేను

## 2. వెలుగు రెక్కలపై

వెలుతురు రెక్కలు విప్పి ఎగిరి వచ్చే
ఉదయం వలె నాలో కవిత! స్పందన కళతో
మాటలాడుతుంది పాట పాడుతుంది స్వేచ్ఛగా
మానవ చేతనతో స్వతంత్ర శాఖపై ఊగుతూ

ప్రకృతి నుండి సమాజానికి సమూహాలతో
సమాజం నుండి ఏకాంతానికి చివరి దశలో
ఏ రోజు నిరంతరం ఆగని చర్యలతో
బ్రతుకులో రోజు పుటలను రెపరెపలాడించేను

తన ఆదర్శంలో ఇష్టమైన దేవతా రూపాలను
మనుషులు దిద్దుకునేరు, అతీతంపై దృష్టితో
ప్రతి వ్యక్తితో అంతో ఇంతో మెరపులా అతీతం
ఆకర్షణ ! భువి నుండి దివికి ఆలోచనా సోపానాలపై

భిన్న భిన్న మైన అనంత రాగ స్వరాలతో
దేని విలువ దానిది, ఎవరి ప్రయాణాలు వారివి
ఎవరికెంత ప్రతిభో! నిపుణతొ అంత వరకే కవిత
వెనుక సస్నేహంగా స్వర లయల అమరికలతో

లక్ష్యం సాధించే లోపల! ఆటంకాలేవేవో? ఎన్నో?
భౌతిక మానస సంస్థితి ప్రమేయాలతో ఎప్పటికీ
ఎడారిలో వస రాజిని ఫలవంతం చేసే పనిలో
ప్రతి వ్యక్తిచే సంకల్ప బీజాలు నాటబడేను

వ్యక్తిలో తనకు తెలిసిన వనరులే
సమాజానికి పూవో ఫలమో వస్తువో విజయకళనిస్తాయి

చీకటి ఆవల నుండి మెరపులా అతీతభావన
బ్రతుకులకు బలమిచ్చేను, ఆయా కార్య కలాపాలలో

ఆకాశతలంపై తిరగాలని కోరిక సహజం మనిషిలో
కొత్త అనుభవాలతో కొత్త ప్రపంచం; మనసులో
వాస్తవికం దార్శనికం కాల్పనికం దూర దూరంగా వేరువేరుగా
కవితకు అస్తితలో వ్యక్తిత్వం పెంచేను అవసరాలను బట్టి

# 3. ఒకదాని నొకటి అందుకొనీ

ఒక పరిచయం అర్థవంతమయిన సందర్భంలో
ఆ కాల శకలం మదిలో స్మృతి పుస్తకంగా మారుతుంది
స్నేహం సాగడానికి సమాన స్థాయి మిత్రం అవసరం
వైరానికి సమాన మయిన ఉజ్జీలో శత్రువు అవసరం

ఎదరు పడిన ముఖాన కనబడే బాధ తొలగేందుకు
ఇది సహనంతో పావురంలా మారవలసి ఉంది
ఈ పిడికిలి బ్రతుకుల్ని శిక్షణలో నడిపించేదీ
ఈ అరచేయి ! సంఘాన్ని దారి తప్పనీయనిదీ

బాణం దూసుకొని పోవడానికి ఉత్సాహ పడుతుంది
ప్రాణం తీసేందుకూ అడుగు వెనక్కు జరగనిదీ!
చెప్పడానికేన్నో పచ్చపచ్చని నీతులు ఉపదేశాలు
పూవునో పండునో కోరే సరికి! గగన కుసుమాలవుతాయి

సమస్యలన్ని ఇనుప పెట్టెలో భద్రంగా ఉంచబడీ
ఏండ్లు గడచినా బయటకు తీసే కన్నా మౌనంలో మనుషులు

నినాదాలతో దిశలు బద్దలు చేయడం సులభం
ప్రమాదాలతో బ్రతుకును బందను చేయడం సుకరం
దీన హీన దరిద్ర స్వరం వినిపించనిదెవరికి?
లౌకిక జగత్తులో కార్యతంత్రలో ఎవరే దారి పట్టేది తెలియదు

మాటల మధ్య రాపిడిలో గంధ వీచి కన్న
కలహ కారణమైన అగ్నికి అవకాశం మిన్న

నిప్పు నీరు గాలి మట్టి నింగి దేనికది స్వతంత్రంగా
ఉన్నట్లుగ అనిపిస్తుంది అనుభవంలో వివిధ నిష్పత్తులలో

పుట్టుక నుండి సంఘంలో చేరిన పాప
పెరిగే కొద్దీ స్వయం వ్యక్తితను ప్రకటించేను
ఎవరి పాత్రను వారు వారు నిర్వహించేపనిలో
సంతోష శిఖరాలపై అడుగులు వేసేరు
ఒక రుతువు నిష్క్రమణం తరువాత మరొకటి ఆగమనం
ఒక దానినొకటి అందుకొని మార్పులో ప్రభావాన్ని చూపేను!

# 4. కథ రూపొందేను

ఫాల తలంపై గాయం రవి కిరణ శకలం వలె
కొండంత గుణ రాశితో మనిషి పొందిన బహుమతిలా
చింతనపై చర్యలతో
క్రియా శక్తి తేజంతో

క్షణాల అలలపై బ్రతుకులు గట్టెక్కాలని
సమయానికి ధైర్యం సందర్భానికి యుక్తి చేరేను
నగరం చేరిన మనిషి తన వ్యక్తిత్వం
తానదైన సౌధం ఎత్తును మీరాలని

చంద్ర బింబం అందుకోవాలిన ఎప్పటి నుండో
కోరిక అలాగే ఆలోచన జరుగుతూనే

సౌధం ఎన్ని అంతస్తులు పెరిగినా
ఎత్తు ఇంకా అదుపులోనే
నింగిని తాకే చూపుతో తృప్తి పడేను
ప్రతి మదిలో పై లోకం కల్పనలో

సంఘంలో ప్రతి ఒకరు సమానమయినా
చిత్రంగా కొందరికే చెందిన దవుతూంది సంపద
దశదశలో మారే జీవన ప్రమాణాలతో
మారే స్థాయి భేదాలు అంతరాన్ని పెంచుతూ
పగిలిన ఆదర్శం ముక్కలలో ఒకరొకరు
తమ అనుభవ చిత్రాల్ని నింపుకో చూచేరు

మనిషి ముఖం మనిషితో మాట్లాడుతుంది
లోన ఉన్న మనసు అమాయకంగా కనిపిస్తుంది
వ్యక్తుల పెదవులపై నుండి దూకే ప్రశ్నలకు
అక్షరాకృతి పొందేను శబ్దమయం కవిత

నవ్వుకు జవాబుగా నవ్వు విసరి దాటి పోవడమే
అందరు కలిసి చేసే పని కలిమిడి పెంచేను
వాస్తవికం దార్శనికం దూరదూరంలో ఎప్పటివో
వ్యక్తిత్వాలను పెంచేను చరిత్రను వీలు కలిపించేను

## 5. మొదలు చివరలు

బ్రతుకులో మొదటి ఉదయం
చివరలో రాత్రి భయదం
రెండు కొసల మధ్య మాలా రూపం
జీవన సూత్రానికి కట్టిన పూలదండలా

మనుషులు కనే కలల సంగతి ఏమో కాని
శిలలు మాత్రం శిల్పాలను కలలు గనేను
దేవతలను క్రిందికి దింపి మానవాకృతులు పాలించేను
స్వర్గంపై ఆశపెట్టి మనుషుల్ని కాలచక్రంపై తిప్పేను

ప్రాణ భయం లేని చెట్టు అందరికీ స్వాగతమిస్తుంది
కదలే అలలు స్వేచ్ఛగా నృత్యం చేస్తూ వెళతాయి
ఆగని కెరటం భూమి నావహించాలని తొందర
మనుషుల క్రియా కలాపాలతోనే చరిత్రకు రేఖలేర్పడేను

మానవ జీవితం చరిత్ర పుట పుటలో వెనుక
పద పదం అవిరళ గతి సమాంతరంగా
నవ్వుకు లేని శక్తి ఏడుపుకు ఉంది
దీని వలె ఆకర్షించేది కరుణ ఒకటే

అందరికీ అవకాశం సమానంగా ఉత్సాహంగా
విశాలమైన ప్రమేయంతో బలంగా పాతుకొనీ
దీని ప్రమేయం అనంతం, ప్రసారం అసాధారణం
చమత్కారాలతో మనిషిని ఒడ్డుకు చేర్చేను.

చంద్రుని నవ్వు వెన్నెల విశ్వమయం హ్లాదకరం
ఒక సమయంలో స్నేహాన్ని లహరులుగా సాగిస్తుంది
విషాద సమయంలో ఆవేదన ప్రకటితమవుతుంది
ఏడ్పును కోరుకునే విషాదమతులూ ఉన్నారు
దీనికై రుదాలీలు చేసే పని కేవలం ఏడుపే
ఇది పొట్టను నింపేందుకు చేసే నటన

ఇది క్రమంగా సంస్కృతిలో అనివార్య భాగమై
కవితకు సంబంధించినంత వరకు స్పందనకు ప్రాధాన్యం

నవ్వు ఏడుపు రెండూ సమాజంలో పాతుకునీ
కవితలు వెడలేను దేనికది కళామయమై

# 6. పూల గుత్తిగ మార్చే

సమాజ వికాసంలో ఏర్పడిన ఏడాది మొదటి రోజు
అరవయి ఏండ్లకు ఒకటొకటీ ఆవృత్త మయ్యేను
అరవై ముక్కలలో మొదటిది ప్రభవ ఉగాది ప్రత్యక్షం
జీవన వాస్తవం శాస్త్ర నిర్ణయం కలిసిన పాలనతో

వత్సర కాలం రాజ మర్యాదతో ఏడాది కాలం ఆయువులో
ఏదో ఒక పేరిట ఉగాది, శుభాలనే ఎన్నుకునేను మనిషి
తనదైన విభవం చూపాలని ఒకటొకటీ!
తన పేరులో సూచనగా విశ్వాసంపై భరోసాగా

మనసును ఉల్లాస శిఖరంపై నిలుపుతుంది ఉగాది
పరం పరను సాగించే ఉత్సాహంలో బంధుతతో
పంచాంగం ఆదర్శంగా నిలుస్తుంది ఆ వత్సరం
అదృష్ట రేఖలు మనసులో చిత్రంగా మారేను
సఫల బిందువులు పచ్చని తరువులుగ తోచేను
మళ్ళీ అరవై ఏండ్లకు తిరిగి చక్ర భ్రమణంలో

స్నేహం ప్రేమ దయ త్యాగంతో
అక్షర పంక్తులు కాల గణనంలో విలువలతో
కాలం గడచే కొద్దీ లిప్త లిప్త కొక
కొత్త రూపంలో మనిషిలో పరిసరాల మార్పులతో

నిన్న పాతదై పోతూంది, మాసిన పట్టు వస్త్రంలా
నేడు కొత్తదై వస్తూంది మెరసే వికాస ముఖంతో
పాత నుండి కొత్త తరగని విలువలతో
మనిషిలో జీవన భూమికపై ఇచ్ఛా శక్తితో

అంతలోనే పెరిగే సుఖ సంపదలపై కొత్త దృష్టితో
పనిలో నిపుణతలను బట్టి స్థాయి భేదాలు సమాజంలో

ఎవరి ప్రపంచం వారిది అనుభవ వలయాలలో
దివిలో గ్రహ ప్రభావం, మనుషుల తల రాతలలో

అనల జ్వాలను పూల గుత్తిగ మార్చేను ఉగాది
విమల హృదయంతో వసంత శోభ తీర్చేను

## 7. శుష్కత ఎరగని

ఏరోజు కారోజు విజయ కాంక్షతో బ్రతుకులు
ప్రతి క్షణం పంచాంగం ఆప్త మిత్రంగా నిలిచేను
ఉగాది ఉదయం నాల్కలపై రుచులు నృత్యం చేసేను
మనిషిలో కళాభిజ్ఞత ఎవరి ప్రమాణంలో వారిది !

తనకు తప్ప మరొకరికి వినిపించని స్వరలహరి
జీవన వాస్తవ గమనాన్ని ఉత్సాహ పరచేను
పండుగ మరునాటి నుండి అంతా యథాక్రమం
వచ్చే రోజులు కూడా ఎప్పటి వలెనే గడచేను!

ప్రతి కవిత కవి భావనా ప్రవాహంలో తేలుతూ
కుసుమ ముఖంతో ఎదురుగ ప్రకృతినలంకరించేను
ఎదుటివారి ముఖాన గాయాన్ని పూలతో అద్దేను
నిన్నటి చెడు ఘటనలను మరపించేను ఆ క్షణం

ఎప్పటికీ మిగిలి ఉండే, తీరని కోర్కెలతో
బాధలలో వచ్చే ఏడాదికి పనులు పోస్ట్‌పోన్ కావచ్చు
చీకటి వలయం ఏకాంతాన్ని స్థాపిస్తుంది
మనిషిలో మరో జగత్తుకు వినిర్మిస్తుంది

తెలుపు నలుపు గళ్ళతో కాలం ధరించే
దస్తులు! మధ్య మధ్య ఎన్ని రంగుల లోవో
ఇక మనసులో ఆలోచనల సంగతి? చెప్పనక్కరలేదు
మనిషి మనో రూపం గురించి మరో మనసుకు తెలియదు
క్షణం క్షణం క్రియా గతులను బట్టి
మనిషి మనో జగంలో సూచనగానో ప్రతీకలోనో

ముందు కలగా ఉన్న అనుభవం తెలిసేందుకు
ఎన్ని విద్యలో ! శాస్త్రాలో ! ఎన్ని భవిష్య వాణులో!
ఇది ఉగాది అన్ని పండుగల వంటిది కాదు
ఒక కాలంతో తప్ప ఏ దేవతతో ముడి వడనిది
స్వతంత్ర శక్తి; మనిషిలో ప్రేరణయై
జీవన రసాల సాల నవ రూపంతో
చివురు పూవు ఫలం తప్ప మరొకటి తెలియనిది

# 8. విజయ గర్వంతో

కనిపించని జీవితం శాస్త్ర మర్యాదలలో ఒదిగి
కాలాన్ని అదృష్ట చిత్ర పరంపరగా చూపిస్తుంది

అభిప్రాయ భేదాలు లేని చరిత్ర లేదు
కొమ్మలు ఆకులు లేని వృక్షం లేదు

ఉగాది హృదయం ఎరగని ఆయువు లేదు
భౌతిక మానస వికాస పథంలో జీవితం

మనిషి మాత్రం ఉగాది నాడు కూడా
అదే! నింగిలో ఆపైన దివిపై విశ్వాసంతో
తనలో పొంగే ఉత్సాహ లహరులతో ఆనందంగా
ఒక సుందర వాస్తవానుభవ సంకేతం! ఉగాది

నిర్దిష్ట స్థానాలలో జంక్షన్‌ల స్థానాలతో
ఇరు పట్టాలపై రైలువలె మానవ యానం!
మనిషిలో తనకు కనిపించని ప్రపంచాన్ని
కళ్ళముందు నిలుపుతుంది! ఆప్తంగా ఆరోజు

పైన ఎత్తులో స్వర్గం, క్రింద వంపులో లోయలో
రెండు ప్రపంచాలు కవిలో ఉనికికై నిరంతరం యత్నం
పగలు రాత్రి భేదం లేని కాలానికి
తన అనుభవాలను జోడిస్తు మనో రూపం
ఏ పండుగ అయినా శాంతినే కోరుతుంది
ఉగాది రోజు మాత్రం పలు రుచులతో జీవన గమనం

గ్రహాల సంపుటి నియత గమన రేఖలతో
సృజన లోకం ఎదురుగా, విశ్వజనీనమై
గిరి శిఖరాలపై నదుల వలె నృత్యం చేయించేను
భూమి తలంపై వనరాజి వలె ఆశలు పెంచేను

నేలపై చెట్టు నీడ ! భూమికి వరంలా
మనిషి ప్రేయంగా శ్రేయం మాటను కాలనికి వదలీ

నేలపై నుండి నింగిలో ఎగిరేది మనిషి
చాల స్వల్పకాలమయినా విజయ గర్వం ఎప్పటికీ

# 9. ఉద్యమ భూమికలు

ఎవరి జీవిత మయినా, మెట్ల వరుస కాదు ఎన్నటికీ
క్రింది నుండి పైకి మధ్యలో ఎడారులు అడవులు చెరువులు నదులు
పర్వతాలు! ముళ్ళు బండలు ఇక మనుషులు సరే సరె!
తప్పనివీ ! నేలను వీడితేనే ఇవి తప్పనివీ ఆరోహణలో!

వచ్చే దారి పోయే దారి వేరు వేరుగా
ఒకరి నుండి ఒకరు సులభంగా దాటవచ్చు
వచ్చే దారి పోయే దారి ఒకటే అయినా
మనుషుల మధ్య భేదాలు పోటీలోకి దింపవచ్చు

అనుమానం లేని స్థానం ఎక్కడుంది?
భయంలేని స్థితి ముఖ్యం; ఎవరికయినా

భద్రమైన చోటుకై మానవ యత్నం! ఎప్పటి నుండో
గుహ నుండి గూడు నుండి సౌధం నుండి సబ్‌మెరిన్ వరకు
సన్నని పుల్లల్ని మెత్తని వస్తువుల్ని ఏరుకొని పక్షులు
చెట్టుపై ఎత్తులో కొమ్మలలో చేసే నివాసం సుభద్రం

నిశ్శబ్ద తంత్రులపై మీటుతూ గాలి కదలుతుంది
రాత్రి కనే కలల సంగతి కలానికి వదల బడేను
కలకలారావంతో గుంపులుగా మేల్కొనే పక్షులు
అంతవరకు నిశ్శబ్దంగా చుక్కలకు కూడ తెలియకుండా

నిద్ర నుండి మేల్కొగానే ఆకాశం ఆహ్వానిస్తుంది
వెలుగు దారులు పరచీ, దిశల తలుపులు తెరచీ
మానవ జీవితాన్ని మరిపించే సన్నివేశం భూమిపై
జీవితాన మనిషికి లభించిన అమూల్యమైన వరం

యుగాలుగా నేటివరకు జరిగిన కథలతో
మూలమైన ఆలోచనలొకటే ! నేలలో పాతుకొనీ
శాఖలుగా చీలినపుడే ! వేరు వేరు దిశలలో
నలువైపుల ప్రేమ కరుణ శాంతి వేదన పీడన హింస
నిరసన ప్రతిఘటనలతో ఉద్యమ భూమికలు చరిత్రలో

మనిషిలో తెలివికి రణతంత్రం, నిపుణత చూపేను
మనసులో సృజనను నవ్యత అందల మెక్కించేను

# 10. మారే అనుభవం

చీకటి బ్లాంకెట్‌నో వెన్నెల శాలువానో
కప్పుకొని వేదిక పైకి రవి వచ్చే యత్నం
ఈ యశోవంతునికై ఎదురు చూస్తుంది సమాజం
ఈ ఉదార చరితుని కోసం నిరీక్షిస్తుంది ప్రకృతి

కవిత ఆత్మభవం అక్షర పంక్తి మయం
సార్థంగా ప్రవాహ జలంలా తరల వచ్చు
హిమ శిఖరమై నిలుస్తుంది నిటారుగా
సారభూతమైన మానుష ధర్మం సూచిస్తుంది

రూపంలో ఆదర్శ పథం చూపుతుంది
పదపదాన జీవన కథను నింపుతుంది
ఏ రోజున కారోజు ఏ క్షణాని కాక్షణం
హృదయాశయ చేతనతో వెడలుతుంది కవిత

ఏ రోజున కారోజు ఏ క్షణాని కది
విజయాశయ చేతనతో కదలేను
మానవ హృధయానికీ హృదయానికీ మధ్య
గగనానికీ భూమికి మధ్య
మాటకూ బదులు మాటకూ మధ్య
శబ్దానికి అర్థానికీ మధ్య
నిస్తంత్రీ ప్రసారాల ధ్వని వార్తా మయం
వర్తమాన జీవన గమనం చూపే అంతర్జాలం

ద్వార బంధానికి కట్టిన పూల దండలా
మనిషిలో భావ సూత్రం శబ్ద మయమై

రాజ్యానికీ రాజ్యానికీ మధ్య అపుడపుడు అనల జ్వాల గనో
నెత్తురు చేరలతో తడిసిన కత్తి గనో
వెలుతురు రేఖలతో మసి బట్టిన వత్తిగనో
సంక్షోభానికో సంహారానికో సందేహానికో ప్రతీకలుగా

ఆలోచనా జలధిలో వస్తూ పోయే పడవలు
ఆకాశ పథంలో దూసుకపోయే విమానం
పలు దిశల నుండి ప్రజలు ! వివిధ స్థలాల నుండి
పరిచయంలో అనుభవాల్ని అక్షర నిలయంగా మార్చేను

# 11. రెండు రుతువులు

ఒక మారు అలజడిలో గాయ మయిన శరీరం
కాలంతరాన చెరగని మచ్చ కలహ కారణం కావచ్చు
మనిషి కావచ్చు దేశం కావచ్చు జాతి కావచ్చు
ఈ మూడు పరంపరగా ఎప్పటికీ ఉండేవే జ్ఞాపకంలో

ఎవరి బరువు వారిది! బుజాలపై వహించేరు ఓపికగా
దాన్ని మరొకరి బుజాలపైకి జరపడం లౌకికం
లౌకికం లేనిది వ్యవహారం జరగదు శూన్యం
రాజ్యం లేదు పాలన లేదు ప్రతిష్ఠ లేదు

మహా ఛత్రంలా ఆకాశం దీని కింద మేఘ బృందం
మరీ క్రింద భూమిపై ప్రాణులు ! మనుషులు
అన్నిటిపై ప్రభుతతో నేతలు కవులు వరసలో
మట్టిలో పాతిన విత్తు ఆకాశంతో పోటీ పడేను

ఎపుడో తగిలిన గాయం స్మృతిలో మంటలతో
జారిన కన్నీటి చుక్కలో బింబించే జ్వాలా రూపంచే
సహృదయునిలో సానుభూతి హృదయ స్పందనతో
గమ్యం వేరవుతుంతి ఆశయం చెదరుతుంది

తరం నుండి తరం దాటుతూనే దారి మారుతుంది
కొత్త దారిలో పయనం దృశ్యంలో మానవం
ఎండిన చెట్టు కొమ్మకు వ్రేలాడే వాడిన ఆకులు
రాలి వాటి స్థానంలో వస్తాయి చివురులతో కొత్తవి

విషాద ముఖం నుండి జారిన
ఒక్క కన్నీటి చుక్కలో సముద్రం
అలలపై తేలుతుంది మనో మయమైన నావ
జీవన యానంలో ప్రజల బలంతో ముందుకు
అనల రాగం ఆలపిస్తూనో
జల గీతం వినిస్తూనో
గ్రీష్మ వర్ష సమయాలు తప్పనివి
వసంతాని కభిముఖంగా తిప్పేను

# 12. హితమతికై

మేఘంలో జల బిందువుల వలె
అలలలో విద్యుదగ్ని గుప్తంగా
అనుగ్రహంతో పాటు ఆగ్రహమూ ప్రకటిస్తుంది
రెండూ బ్రతుకులో అస్తితను తీర్చిదిద్దే మౌలికాలు

భూమి నుండి బంగారం పంట రావచ్చు
విలువైన దేదయినా ఖనిజం బయట పడవచ్చు
ప్రకృతి సృజన జరగవచ్చు వనరాజితో
పెండ్లి ఉంగరం నుండి మంగళ సూత్రం వరకు
అమూల్యాలెప్పటికీ జీవిత సంబంధంతో
మనిషికి తన ఉనికిని జ్ఞాపకం చేసేను
బ్రతుకులు తీర్చేవి సమాజాన్ని పెంచేవి ఎన్నో!
మనిషికీ మనిషికీ భేదంతో సమాజ సంకలనం

శూన్యాన్ని నింపుతూ పూర్ణం చేస్తుంది కవిత
వర్తమానం వెలుగుతో పంక్తులుగా వెడలుతుంది
ఎవరి కోరికపై దీనికి బ్రేక్ పడదు
మనిషికి తన వశం కావాలని ఆరాటం!

ఇంటి ఆవరణంలో చెట్టు పెరుగుతుంది
ఇంటిలో పిల్లలతో పాటుగ స్వేచ్ఛగా
మనిషిలో చెట్టులో ఆయువు రూపం ఒకటే
నడకలో ఊహలో మాత్రం భేదం ఎప్పటికీ

ఇది సమస్యగా పరిణమించని ప్లోదకం
నిరంతరం మనుషులకు తోడుగ నిలిచేది
ఇది ఎప్పటికీ ముక్కలుముక్కలు కాక
ఒకటిగా ఉండాలని ఆశ కనిపిస్తుంది
మనిషిలో పచ్చగ బ్రతికే ఉపాయం తెలుపుతుంది
ఆశా బంధురమైన స్థితికి మనిషిని తెస్తుంది

చెట్టు ఎదురు చూచేది నింగిలో రావలసిన మేఘంకై
తన సంపద నాశించే తన హితమతి మనిషికై

# 13. మార్పులో

నిలయానికి తూర్పు నుండి సూర్యుని ఆగమనం
వేడి వేడి మృదుల కిరణాలతో సమస్త జీవన హేతువు
దీనికి ఉపశమనంగా రాత్రివేళ చంద్రుడు చుక్కలు
బ్రతుకుపై మనిషికి ధైర్యాన్ని ఆశ్వాసాన్ని ఇచ్చేవి

వెనకనే జీవన సూచనతో మహా సముద్రం అలలతో
భయదమై అంతలో పడవలతో ఆశా రూపం పొందేను
అస్తమయ దిశ మరొకటి నిరాశ పరచుకొనీ
శూన్యమయ మింకొకటి దరిద్రం వేలాడుతూ

పేద నుండి భాగ్యవంతుని వరకు మూల విషయాలొకటే
బ్రతుక్కి అవసరమైనవి అవసరాలు మీరిన రాసులతో భేదం
వివిధ జీవితాల్ని గురించి చింతన రూపం కవులచే
కవితలో చోటు చేసుకుంటుంది; పరిష్కార దార్శనికంతో

ఆరోగ్యం సంతోషం భాగ్యం, మానవం
నాలుగు అంచెలుగా నిర్మాణంలో జీవిత రూపాలు
మనో దృష్టికి ఉన్న వారి దృశ్యం కనిపిస్తుంది
ఇది ఎపుడు బడితే అపుడు కనిపించేది కాదు

ఏ ఫాల తలంపైనో ఏ చీకటి పలకపైనొ
అక్షర పంక్తులలో ఏ సూక్తులో! ఉపదేశాలో నీతులో
పుటకతో మొదటి పేజి నుండి చివరలో తుది పేజి వరకు
నది ఒడ్డున మైదానంలో పచ్చని చెట్ల మధ్య
జన సమూహంతో గడవాలని, బ్రతికినంత కాలం
మనుషుల పరిచయంతో ! తీగెలవలె మూల నుండి మూలకు

బ్రతుకు పుస్తకంలో అక్షర ప్రకాశం
అపుడపుడు అతీతంలోకి తీసుక వెళ్ళేను
కల్పన లెక్కడి వక్కడ భిన్నమై వాస్తవ మేలేను
పటుత కటుత విభుత అనుభవంలోకి వచ్చేను

సమాజమొక సుందర వనమే కాదు, మరెన్నో
అనల జ్వాలలు కదలవచ్చు, జలధారలు తరలవచ్చు

## 14. కొత్త దారులతో

చీలిన దారుల నుండి సరి కొత్త దారులు
లోన సంకెల ధ్వనులు స్వేచ్ఛను భావింప జేసేను
దగ్గరలో ఆలయం గంటల గణగణ శబ్దం
మనిషికి తన కర్తవ్యాన్ని ప్రబోధించేను

పనికి ముందు మనిషిలో సంకల్పం అవసరం
ఒడుదుడుకులతో వాస్తవమొక కఠిన యానం
ఆకర్షణ ఎక్కడ? ప్రయోజనంలో వాస్తవ గతిలో
భౌతికంలో మానసం కలిగిన సుందర మానుషం!

దైహిక పోషణ రక్షణలో శ్రమ బంధువు మనిషి
భౌతిక మానస విధాలుగా సత్క్రియా చరణంతో
ధనం పేరు యశసు భాగ్యం కోరేను ఏ రోజూ
జీవన ప్రయాణం! ఒక్కొక్క మెట్టు ఆరోహణలో

బ్రతుకు పై ప్రేమ సమాజంపై ఇష్టం హృదయ మయం
కొమ్మలతో బంధాలను నిలుపుకొనే విధంగా కవిత
పరస్పరం అవగాహనతో జన సమూహాలు
జీవన వాస్తవంలో మానవ మనస్తత్వం ప్రతిఫలించేను

ఝరియై ఎడారులను తడుపుతుంది కవిత
ఎదలను సస్య మయం చేస్తుంది ! సృజనతో

సాయం సంధ్య రవి కిందికి ఒరుగుతూ
సతమత మవుతూన్న లిప్తలు, విషాదాలుగా
రాత్రి రాకతో విరామాని కవకాశంతో
తోడుగ ఉండేది, చుక్కలు మాత్రమే, ధైర్యంగా

పగలంతా దుమ్ముతో కళ తప్పిన చెట్లు
మరునాటికి ఉదయం మంచుచే శుభ్రమయ్యేను

గతం తలపులతో బయటపడుతుంది కథ
వర్తమాన తలంపై తన ప్రమేయం కోరేను

భవిష్యత్తు యోజనతో మనిషిలో ఆలోచన
జీవన సుస్థితికీ వ్యక్తుల అస్తితకు కారణమయ్యేను

# 15. చీకటిని మరచి

ఆకాశం శూన్యం కాదు కనిపించేవీ కనిపించనివీ
ఎన్నిటి తోనో నిండి ప్రపంచాన్ని భ్రమలో పెడుతుంది
నిన్న పూచిన పూవు నేడో రేపో వాడిపోతూ
రేపు మరొకటి వచ్చేనని ఆశ బ్రతికిస్తుంది

వ్యక్తిలో జీవ కళను నిలపడమొక సత్క్రియ
సమాజ శక్తిని పెంచుతుంది రక్తిని నిలుపుతుంది

గాలి కదలుతుంది స్వేచ్ఛగా కవిత వలెనే
నీరు పారుతుంది వంపులలో ఆగదు
నీటికి వెలుతురు చీకటితో పనిలేదు
దేని పనిలో అది, ఉపయోగకరంగా

మనిషితో మనిషిని కలుపుతుంది స్నేహ గంధం
అందరినీ కలుపుకొని సమాజ శక్తి అవుతుంది
ఉనికిని విశాల తరం చేసేను
ఉన్న స్థితిలో వైవిధ్యం చేకూరేను
ఆప్తతను విశ్వమయం చేసి మనసులో
భౌతిక శక్తికి అతీతాన్ని సుమింపజేసేను

ఉద్యమానికి పాత లేదు
భవితకు అంతా కొత్తయే
పరివర్తన గుణంతో వర్తమానం
పరివర్తన చిహ్నాలతో ఆకర్షించేను

పెద్ద చిన్న భేదం లేకుండా
సమాజానికి పనికి వచ్చేది ఆగదు
లేనిది శూన్యంలో కలిసి పోతుంది
కాలి క్రింద మట్టిలో కలవక తప్పదు
ఇచ్ఛా పరితృప్తితో జీవన రూపం
ప్రభాతాన్ని అందుకొనీ, చీకటిని మరచిపోతుంది

ఆత్మ హత్యల కవకాశం లేని పరిసరాలతో
ప్రకృతి సమాజం జీవితం కలిసిన రూపమే కవిత

# 16. భగీరథ యత్నం

అద్దంలో తన ముఖం అందంగా కనిపించాలని
ఎవరికి వారు తమలో కోరికను పోషించేరు
తమకన్నా ఇతరుల అభిప్రాయాన్ని గౌరవించేరు
తన అభిప్రాయాన్ని చెప్పే సందర్భం కోరేరు

దేన్ని తక్కువ చేసినా ఎడ మొగం పెడ మొగం
మైత్రికి గుడ్ బై చెప్పే వారూ ఉన్నారు ! మౌనంగా
ప్రజాస్వామ్యంలో అభిప్రాయ ప్రకటన మొక హక్కు అయినా
దీనికీ కొన్ని హద్దులు నియమాలు రాజ్యాంగంలో ముందుకు వస్తాయి

హార్థికంగానే కాక ఆర్థికంగానూ ఆలోచన ఉపకరిస్తుంది
కవితలో అద్దంలో ముఖం “ప్రమేయం” విలువలు పెంచేను

చరిత్రను తనకు నచ్చిన విధంగా కత్తిరించి
ముక్కల్ని ఒకచోట చేర్చి రూపమిచ్చి
వాస్తవాన్ని తలక్రిందులు చేసే ప్రయత్నాలు
పరిశీలన పరిశోధన ఒకరి నుండి మరొకరి దాక
వ్యాపార సరణిలో కాలం గడచేను
ఆదర్శం గోడకు వేలాడుతూ కనిపిస్తుంది

నేరానికి శిక్ష జైలును ఖరారు చేసే కన్న
నేరం జరగకుండ నిలపడం గొప్ప విషయం
కలలకు మితంలేదు దోషాలకు హద్దులు లేవు
పీడనం నుండి హత్య దాకా గుప్తమైన వర్తనం

చక్రంపై బొమ్మలవలె తిరిగి కలలు వెళ్ళిపోతాయి
కాల వాహనంపై ప్రయాణికులవలె మనుషులు చరిస్తారు
కలలు కనని మనసులు ఉండవు
నిజం తెలియని అంతరంగం ఉండదు
కలలు రాని మనసు శశిర కాల తరువులా
అపాయం భయం బాధలు కష్టసుఖంతో బ్రతుకులు

ఆచరణంలో దార్శనికం సామాన్య విషయం కాదు
మనో బలంతో ముందుకు వెళ్ళే ధైర్యం అవసరం
అవసరంలో ముఖ్యమైంది జారిపోతుంది
దాన్ని పొందడమొక భగీరథ యత్నం

## 17. ఉగాది పొలనలో

ఏదో ఒక పేరుతో ఒక వత్సరం పాలిస్తుంది ఉగాది
అరవై ఏండ్ల ఆవృత్తంలో దేని ప్రత్యేకత దానిదే
మంచి చెడు కలయికతో వాస్తవాన్ని చెబుతుంది
రోజు పరమ మిత్రం ! ఆరు రుచుల మేళనంతో

ఈ రోజు క్షణాలు మంచు గడ్డల్లా కరగుతూ
వచ్చే రుతువు గురించి పరిచయం జరుగుతుంది
నిర్మల జలాలు ప్రసరిస్తూ మనుషుల్ని శుభ్రపరచేను
దేవతాకృతులకు భిన్నమైన పండుగ
భూమి పైకి దిగే దేవతా రూపం బదులు
బ్రతుకులోన మానవతా రూపం వహించేను

అట్టహాసం ఆర్భాటం సంరంభం కనిపించనిది
ఎవరి కోసం దేనికీ ఎదురు చూడని ప్రకృతి కల్పితం
జీవితాన భాగ్య రాశి గురించి తెలియజేసే విశేషం
విశ్వాసంతో జ్యోతిష చక్ర భ్రమణం మదిలో

స్నేహం దయ త్యాగం ఉదారత అనురాగం
హృదయవశంతో కాలం గడుస్తుంది, గుణ భావనతో
ఈరోజున ఉదయమే మస్తిష్కం గగనాన్ని స్పృశిస్తుంది
హృదయం మానవతా రాగంతో రంజిత మవుతుంది

రసాల సాల పరిమళ సుమ వికాస దృశ్యం
అశాంతికి తావులేని స్వచ్ఛమైన మనోమయం
ప్రసన్నత నుండి ఉజ్వలతను పొందుతుంది
ప్రతి వస్తువులో ఉన్న సృజన శక్తిని ప్రకటిస్తుంది
అదృష్టం స్థానంలో పరివేదన చేరకూడదనే
ఈ రోజున సుగంధం బదులుగ ధూమం చూడకూడదనే

ఇది ఉగాది రుచికీ శుచికీ ఆలవాలం
మనిషి మనిషితో స్నేహం మధుకర ఝుంకార మయం
ఈ సందర్భంలో అనల కళికలకు బదులు కవితలు
అక్షరాల మధు కణాలతో పొందే అమరతను చాటేను

# 18. సమీక్షా పర్వం

మనిషి గొంతుకలో ఆడే స్వరంతో
మనసు మాటలో కదలే శబ్దంతో
రానీ కవితను కల్లోల జలధిని శాంత పరుస్తూ
వేగంగా వీచే గాలితో సహన శీల సంభాషణతో

ఎవరికి వారు ఎక్కడికక్కడ విని,
తమ నాల్కలపై అక్షరాలు ఆడుతూ కనిపించనీ
శబ్దం అర్థం రెండు రెక్కలపై భావనా గగనంలో
ఎగిరే కపోతంతో తానూ పయనించాలనీ దిశలలో

వేదికపై నిశ్చలంగా ఉన్న కవి నుండి
వినే సృజనలో నవ సమాజం రూపొందనీ
ప్రజల గళాల నుండి అనుస్పందన దిశలు నిండనీ
మోడు వారిన హృదయం నుండి మానవత చివురించనీ

ప్రతిదీ తన పని తాను చేసుకొంటూ పోతుంది
దేని విలువ దానికి, కాలం వెనుకాడదు, కవిత ఆగదు
సృజన ప్రతిభ అక్షరాభిలాషిని ఉత్తేజపరుస్తుంది
చేతిలో పూల గుచ్ఛంతో స్వాగతిమిస్తుంది
ఇది ముగియని సంరంభం సంబరం సన్నాహం
అవసరమైనపుడు ముందుకు వస్తుంది కళా హృదయంతో

విధ్వంసంలో పాల్గొనేందు కెవరు సుముఖత చూపేరు?
నిర్మాణంతో ముందుకు వచ్చేరు ఉదార చరితులు
అడుగు ముందుకు వేసే ప్రతి కవి సమాజంలో
కొత్త బాట కొత్త మాటతో, ముఖాన మరో ఉదయంతో

నేతలలో రాజ్యకాంక్ష కవులలో అక్షర విజయం
జ్వాలా రూపంతో వర్తించే కన్నా
వర్షా మేఘంగా రావాలని కోరిక!
సామాన్యుల మతులను సస్యమయం చేసేను

శ్రమ జీవన గతిలో విజయం ప్రజలదే
ఉత్సాహం ఉత్తేజంతో ఉగాది పర్వం! సమీక్ష కవకాశం!

# 19. హృదయ తంత్రులపై

కవి నివాసం మనోజగం ఈ చోటు ఆచోటు కాదు
ఈ సమాజం ఆ సమూహం ఈ దేశం ఆ దేశం కాదు
ఇదొక ఆకర్షణ రూపం! భౌతిక మానస అతీత స్థాయిలలో
వివిధ జీవన భంగిమల్ని తన వశం చేసుకునేను, అనంతంగా

కవి నిష్క్రమణంతో సృజన రూపం పూర్తిగ సమాజానిదీ
దీన్ని గురించి దిశ దిశలో మాటలు మాలలై ఆలోచనలో
ఇల్లు నుండి బయటికి దబ్బులేదు బంధు మిత్ర గణం లేదు
అన్నిటికీ గుడ్‌బై, మిగిలేది శూన్య పటంపై కవితాచిత్రం

తిండి తిప్పలు గెలుపులు ఓటమి అన్నీ మటు మాయం
మిగిలేది మాత్రం యశో రూపం ముక్కలొకటొకటీ
శిల్పాల్లా చిత్రాల్లా చేతికందీ అందని ఎత్తులో గాలిలో
అక్షర పంక్తులు ప్రతి ఎదను స్పృశించేను జ్ఞాపకాలు మిగిలేను

కవిత వచ్చే దారి తెలిసీ తెలియని సందిగ్ధ స్థితిలో కవులు
దీనిపై సౌధాలెన్నో ప్రతి కృతి ఒక సుందర నిలయమై
జననంతో మొదలైన జీవన శ్రమ బంధం
మృత్యువుతో సమాప్తమై మాటల బంధం కొత్తది ఏర్పడేను

నడచిన దారి ఉంటుంది ఎక్కడికీ పోదు
గడచిన అనుభవం మబ్బుల వలె కనిపించి పోతుంది
కవి లక్ష్యం చిరంగా మరొకరికి గమ్యస్థానంగా
కవితలో గళ స్వరం ! వినిపిస్తూనే ఉంటుంది, ఆవృత్తం అవుతూ

ఎక్కడయినా నాది నీది అందరిదీ కనుమరుగై పోతుంది
మధ్య మధ్య ఆటవికం సంఘంలో చోటు చేసుకోవచ్చు
తిరిగి మానవ సంస్కృతి బలం నిలబడుతుంది సజీవంగా
అన్ని రోజులు మంచివే, మనిషి ఊహ క్రియలో భేదాలు తప్ప

ఎన్ని చెప్పినా తన చుట్టూ ఉన్నవి ఎప్పటివో!
కొద్ది మార్పులతో మనోజగం వాస్తవ వ్యవహారంతో
కవితను వదలని బంధంతో, హృదయ తంత్రులపై జీవన భాగ్యం

# 20. కొత్త రూపంతో

చుట్టు ఉన్న సమాజ పరిసరాలలో, నుండి అతడు!
"చేసే పని తనదేనా" అనిపిస్తుంది?
"నాదే" అని అనుకోక పోతే?
చేసే పని ఆగిపోతుంది!
నాది అనుకునే "గుర్తు" అవసరమవుతుంది
ప్రతి పనికీ ఒక కోడ్, ఒక అవసరం, ఒక గుర్తింపు

ఆ డ్రెస్‌కై డబ్బు వెచ్చించలేదు
ఇది ఎక్కడ బడితే అక్కడ దొరికేది కాదు
ఎవరికి వారు ఎట్లాగో సమకూర్చుకోవలసిందే!
ఇది! తన కొక ప్రత్యేకత నిస్తుంది!

ఈ పని చేసేది ఎప్పటి నుండో?
పనికి తగిన మార్పులతో చేర్పులతో
ఎప్పటికపుడు వివిధ దశలలో కొత్త "డ్రెస్"
అవసర మవుతుందని తెలియని దెవరికి?

అతనిలో దీని పట్ల అభిలాష! ఇతరులలో కూడా
లేదనుకోలేం కాని! ఇష్టం మాత్రం అవసరం
చుట్టూ ఉన్న వారిలో ! ఉన్న అతడు
కోరేవన్నీ ! తనకేనా? అనిపిస్తుంది

చేసే పని తనదే అనుకోవడంలోనే
బ్రతుకులో కవచం అవసరమవుతుంది!
అవసరాన్ని బట్టి పనికి తగిన డ్రెస్‌లో
కనిపించడమొక ప్రత్యేకత నిస్తుంది

ఈ కాళ్ళు నావి, ఈ చేతులు నావి
ఈ మేధ నాది, ఈ హృదయం నాది
వెలుతురులో పడే నీడ నాదే
లోని అంతరంగం నాదే! నిజ ప్రకాశ రూపం

ఎక్కడి నుండో శ్రుతి మనోహరంగా నాదఝురి
కవితలో శబ్దమయమై ! నాది కాదనిపించదు
నా అస్తితలో భాగమైంది, వేరు చేసి చూపుతుంది
నిజానికి ఒకటే, దిశదిశలో కొత్త దనంతో తిప్పుతుంది

# 21. మేల్కొన్న సమాజం

మాట తరువాత పాట కవితలో
దేనికది పరిమితులు ప్రత్యేకతలతో
వాస్తవం కల్పన! అభివ్యక్తి నిపుణత
సమాజ చలనంతో మనిషి విలువ పెంచేను

దిశల తలుపులు మూత బడిన రాత్రులు
దొరకిన సందులలో నుండి చుక్కల ముఖాలు
చంద్ర బింబం కనిపించని నిశా సమయంలో
కవికి మిత్రులుగా తలపించడం ప్రకృతి సహజం

శత్రుతకు పరాకాష్ఠ అయిన అగ్ని జ్వాల
మిత్రతకు శిఖర రూపమయిన హిమధామం
లిప్తల పూలతో అల్లిన పందిరి కాదు, వర్తమానం
దారిలో ముళ్ళు రాళ్ళు పరచిన నిప్పుల భ్రమలెన్నో

దాహం తీర్చే ప్రాణం నిలిపే 'జలం' వలె
ఎడారిలో పచ్చదనం పెంచేను ఆర్ద్రతతో కవిత

బాహ్యం నుండి మాటలో ఆంతర కళా రూపం !
వివిధ స్థాయిల్లో మోద ఖేద భాగ్య గతులలో
వయొలిన్ తీగెలపై మోద ఖేద ప్రసార శబ్దం
గమనంలో సహయోగానికి దారితీసే నైపుణితో

భయం తొలగి భద్రతలో మానసం
జలధిలో అలలపై పయనింప జేసేను

కవి ముఖం నుండి కవిత బయటకు వచ్చేను
చేతిలో నాగలితో కర్షకుడు కదలేను పొలంలో
సమాజ రూపంలో భాగ్య రాశికి కారణమయ్యేను
పూలతో పండ్లతో కాలాన్ని నింపేను, జీవంతో

ఎవరికి తగిన పని వారి చేతుల కవసరం
వృత్తిలో ప్రవృత్తిలో శ్రమ చక్రం తిరిగేను
జరిగిన మంచి చెడు గురించి ఆలోచన సమీక్ష పరీక్ష
నిద్రపోయే ముందు విరామంలో, ఆపైన మేల్కొన్న మనసులో

# 22. ఇది కల కాదు

కలలో విహరించే వ్యక్తి దేహమొక హిమ శిలా రూపం
బయట పడే విషయాలెన్నో ! కరగిపోయేను కదలికతో
క్రమంగా గతం ఎవరి కంటికి కన్పించదు
మనో వీధిలో ఖండఖండగా దృశ్యాలు! కదలేను

పుట్టింది మొదలు ప్రవాహ సమం జీవితం
వివిధ దశలలో రూపం మారుతుంది పలు విధాలలో
శ్రమతో అలంకృతమయ్యే మనుషులు వేరు
శ్రమచే పీడితులయ్యే దేహాలు వేరు

పోయినంత మేర మనిషితో మనిషి బంధం వివిధ స్థాయిల్లో
షోకేస్‌లో శిల్పాల్లా జీవితాలు, వివిధ వస్తు నిర్మితమై
ఎంత దూరమో సూటిగా సాగిన ప్రవాహం అంతలో
పెద్ద రాయి అడ్డు కొనీ వేగం తగ్గేను దిశమారేను
చలనంలో నీటి గుణం కనబరుస్తుంది, ఆశ బ్రతుకుతుంది
ఆటంకాలను దాటుతూ ముందుకు సాగుతుంది

మనసులో చుట్టుకొనీ దాగిన నిజాలెన్నొ!
కాలాన్ని అధిగమిస్తూ జీవితాల్ని సార్ధంచేస్తూ కొన్ని
నిజం భ్రాంతిలో చిక్కుకొనీ కలవరపరచేను
చర్యలలో పోటీలేనిది, ఒక కవితయే

పైనుండి హఠాత్తుగా కురిసే వానలా
నేలపై కిందికి దిగే ఝరిలా కవిత
కాల వాహనంపై పయనించేను వివిధ దృశ్యాలతో
దీని కొక సమయం సందర్భం లేదు, జల సేచనలో
ఎపుడైన పైన అవతరించి, ఆశీర్వదించవచ్చు
నిలకడగా ఒక చోటనే నిలిచే స్థితిని మేఘం

విరిసిన పూల పరిమళంలో గాలిచే
మనిషి మనో రూపం ధూళిచే కప్పబడీ
సమయాన్ని సందర్భాన్ని తన రాకతో మేఘం
భూమిపై మనిషిని సస్యమయంగా హ్లాదమయం చేసేను
మనిషిలో వ్యవహారం లౌకిక తంత్రంలో అల్లుకొనీ
మరో విధంగా జరిగే వీలు లేదు, ఇది కల కాదు వాస్తవం!

# 23. మానవ తేజం

ఒకరిలో తాటి చెట్టులా పైపైకి అహంకారం
స్వార్థంలో అగ్ని వృక్షంలా మిరుమిట్లు గొలుపుతుంది
కలలో దర్శన మిస్తాయి కొన్ని దృశ్యాలు
మనిషిని హెచ్చరిస్తూ సూచన చేస్తూ హితవు పలుకుతూ

నిద్రా రూపం అందరిలో ఒకటే మోస్తరు
బయటపడే దృశ్యాల పరంపర వేరు వేరు
బయటకు రాలేని చేయరాని చేయలేని
పనులలో రహస్యాల్ని బయట పడేసేను

పలు జ్ఞాపకాలతో సంకలనం రూపొందుతుంది
మరపు నుండి మతి ముక్తమై, జ్ఞానమయం కావచ్చు

మనిషి ఉన్నంతవరకు వాడినా వాడకపోయినా
మానవత తప్పని సరిగా గంధ రూపం వదలదు
రాజరికం ఆనవాళ్ళు ఇంకా అక్కడక్కడ మిగిలి
వాటి ప్రభావ ముద్రలలతో బాధా జీవితాలు

ప్రజాస్వామ్య చేతన ముద్రలలో ప్రతి పౌరునిలో
స్వేచ్ఛ - స్వాతంత్ర్యం అక్షరాల వెనక మానవ తేజం

బుజాల పై ఎత్తుకొన్ని మూటలతో పిల్లలతో
దూర దూరం పయనంలో గుంపులుగా
వలసదారులు, అనుకూలంగా లేని చోటు నుండి
బ్రతికే అవకాశంతో మరో చోటికి సవేగంగా

ఏది తమకు తక్కువో, లేదో దాన్ని పూరించే
ఉదారులు కనిపించే అవకాశం లేని కాలం
నడచే మనుషుల వాలకం చూస్తే చూపు నంటుకొనీ
దుర్భరమైన తమ జీవన శకలాలు వ్రేలాడుతూ కొందరు
అన్నిటికి కరువుగా పాలనా యంత్రాంగం
చెల్లుబాటు కాని అధికార సహాయం తలక్రిందులవుతూంది

ఉపదేశ మేమాత్రం పనికి రావడం లేదు
నిరంకుశం చెల్లుబాటు అయ్యే స్థితిలేదు

అలజడులను విసరుతూ కల్లోలాన్ని పంచుతూ
పోవడం సులభం! శాంతికి చర్యలు మాత్రం బహు క్లిష్టం

# 24. అనుకోనివి అవుతూ

వ్యక్తిలో నైతికం సమాజంలో సమభాగ్యం సమ న్యాయం
భద్రత త్యాగం కలిసి నిలిచిన ప్రజాస్వామ్యం
నాలుగు కాళ్ళ పీఠంపై మనుగడకు ఎత్తులు
రాజ్యతంత్రంలో రాజకీయం, దారి తప్పితే సర్వం ప్రభ్రష్టం

సహనం స్నేహంశాంతంతో జనవనంలా రూపొందేను
ఎవరు మిత్రమొ ! శత్రువొ ! అవసరంలో కాని, తెలియదు
ఒకరి పట్ల మరొకరు సానుభూతి చూప నక్కరలేదు
పొందే దానికి హద్దులు తప్పనివి, సార్ధక మయ్యేనా?
ఎవరి నుండి ఎవరూ నేర్చుకొనే స్థితిలో లేరు
రణ విముఖులు సామాన్యులు, శాంతిప్రియులు సహనశీలురు

శబ్దం నుండి అర్థం పక్షిలా పైకెగురుతుంది
సమూహాలలో సంక్షేమం కోరేవారు కొందరు
ఏకాంతంలో సంక్షోభం సృజించే వారు కొందరు
కాలం ఏ రోజూ ఒకే రంగులలో నడవదు
ఎంత ప్రకృతి దృశ్యమైనా బ్రతుకులో మార్పులు తప్పవు
ఈలోగా కాలం పలు చర్యలతో ఆశల చలనం
వినబడే వాటిలో ఒకరిపై ఒకరు దోషారోపణలు
ఎన్ని కథలో ఎన్ని వ్యథలో కాలం బరువు బరువుగా

రోజుకొక డ్రెస్‌లో కాలం నాటకాన్ని తలపించేను
అసలు రూపం తెలిసిన వారు లేరు, అంతా ఊహా జనితం

శశి కిరణం వహిస్తుంది, తేలికగా ఆర్ద్రభావం
రవి కిరణం వదలుతుంది బరువుగా గ్రీష్మ తాపం
ఇపుడు మృత్యు భయం లేదెవరికీ
బ్రతుకులో తారాడే క్రియా శిఖలు తప్ప!
అసలు మనిషి రూపం తెలియడానికి
ఎన్ని ఏండ్లయినా పట్టేననిపిస్తుంది

మేధలో శాస్త్ర జ్ఞానంతో ఆశల అనుభవంతో
అతీత జలధి తీరాను మనిషిలో నిరీక్షణం
గెలుపుకు తరం నుండి తరంపై విశ్వాసంతో
అనుకోనివి అవుతూ, మనిషికి దివ్యత చేకూర్చేను

# 25. కాలం వాహనమై

ఉదయం విరిసిన మహా పద్మంలా ఆకాశం
సింహాసనం రూపంపై మనిషి మనసు పడుతుంది
చూపు నాకర్షిస్తుంది, హృదిని రంజింపచేస్తుంది
ఇష్టానికి పట్టాభిషేకంతో ఎవరి గమ్యం వారిది
దశదశలో జీవన గతిని బట్టి పరివర్తనం
నాల్గు దిశలు చుట్టి రావాలని కోరిక బలంగా

తన నీడ వెనక మరో మనిషి! దాగిన వెలుగు రేఖ
అంతరంగ ప్రకాశరూపం ! సూర్యుని హృదయం
మనిషిని మనిషి గుర్తించేది ఒక ముఖమే కాదు
మాట చర్య తీరు తెన్ను ఒకటొకటీ ఉన్న అమరికలో

నీతి తప్పిన నియతి దాటిన జీవన వ్యాపారంలో
బయటికి కనిపించని 'నిజం' గురించి ఆలోచన
రణనీతిని మించింది రాజనీతి భవితకు సుహితం కూర్చేది
స్వార్థంలో మనిషి 'గీత' దాటేను స్వల్ప కాలంలో ఉన్న తెలివితో
ఏదో సాధించాలని, లక్ష్యం చేరాలని సాధారణ వాస్తవ స్థితిలో
కలం పూల గుత్తితో, మనిషి సమాజాన్ని భ్రమింప చేసేను

నిద్ర వీడిన మనసులో తెరచిన భవిత ద్వారం తలుపులు
అందరికీ చెందినవి కొందరి కబ్జాలో చిక్కినవి
'నిజం' విడుదలకై పోరాటం, ఎప్పటికీ ఉండే సమస్య
కళ్ళముందు కోటలు కూలి కిరీటాల కోసం గాలింపు

సమాజం ప్రవాహం కావచ్చు,
పరుగెత్తే రైలు కావచ్చు, చైతన్య గుణంతో
కాలం కొండ కాదు చెట్టు కాదు తిరిగే చక్రం కాదు
ఎన్నిటినో కలుపుకొని పోయే చేతన యానం
విశ్లేషణలో అనుభవానికి వస్తుంది ప్రతిదీ
జగత్తును వీడనిదీ తనతో తీసుక వెళ్ళుతుంది

ఇది కొంత దూరంలో ఒడ్డున వదలిపోయేను
సముద్రమయితే లోతులో అడుగున చేరుస్తాయి
కాలం మాత్రం మౌనంగా, నిశ్శబ్దంగా వాహనమై
ప్రతి రుతువులో జీవితాన్ని ప్రభావితం చేస్తుంది

# 26. ఆ యుద్ధాన్ని మీరి

కవితలో పదం కవి చేతిలో పుష్పం వలె
అక్షర బలంతో పద భావ సజీవ రూపం
తన సహజమైన రాకతో మనసు నావహిస్తుంది
ఆభరణం కాదు ఆయుధం కాదు ప్రతిభా ప్రయోగం

ఇది ప్రపంచంలో వివిధ విషయ భావ సంకలనం
ప్రభావాలలో తేజం కావచ్చు, ప్రవాహం కావచ్చు
కవి అస్తిత్వంలో కొంత మనోమయం కాల్పనికం
ప్రకృతి నుండి అనివార్యమైన వసంత భూమికతో
మనుషులలో పూచిన సమాజ వనం
ఎంతటిదయినా ప్రభావ ముద్రలో అతీతం తరువాతనే

ఇది దూసిన బాణం కాదు, సమస్యలో
అలంకార విభవం ఒకటే కాదు కళాకృతిలో
వ్యక్తుల మధ్య సత్సంబంధం స్థాపిస్తుంది
పనిలో దారిన వెళ్ళే వ్యక్తిని వ్యక్తి క్రాస్ చేసేను
చూపులు విసరుతూ ఒకరిపై ఒకరు వెళ్ళేరు
ఎక్కువగా మౌనంలోనే కాలం గడుస్తుంది ఇరువురికీ
మనుషుల ఆయువు తీరవచ్చు
కవితల ఆయువు సుభద్రం

గడప దాటి అడుగు కదలి గేటు తీయగనే
కాళ్ళక్రింద నలిగే, గాలికి రాలిన పూలు!
ఇది చూచే వారికి గుండెపై అడుగు వేసినట్లు ఉంటుంది
సాత్వికాలు ! అణగిమణగి దుమ్ములో వీధిలో పడి ఉన్నవి

ఎండిన ఆకులతో చెట్టు కొమ్మలు ఎప్పటికీ
చివురులు వేసే దాక ప్రబోధ ముద్రలో
కవితలో ప్రతి పదం కవితో స్నేహంగా
పుష్పం వలె సమాజ స్థానాన్ని వహిస్తుంది
అక్షర పద రూపం సమాజ బంధువుగా
ఆయుధాన్ని అతిశయించిన సహన శాంతిని పొందేను

# 27. బయట పడని నిజం

తిండికి బట్టకు పనికి ఎదురు చూడని
పాలన కోరేరు సామాన్య ప్రజలు, పాట్లు పడేరు,
త్యాగ ధనులు వీరులు కవులు నేతలు తాత్వికులు
తమ చివరి స్థానం మట్టిలోనొ బూదిలోనొ ! నీరులోనొ

బయట జన సమూహాలు ! ఉద్రిక్త నినాదాలతో
వర్తమాన స్వర లహరులు జ్వాలలై మనసులలో

అద్దంలో ప్రతిబింబించే ముఖం అబద్ధం చెప్పదు
కానీ నిజాన్ని ఎక్కడో దాచి పెడుతుంది, చూపదు
ఆ ముఖం వెనకనే, తారాడుతూ ఉంటుంది
అద్దం నలువైపుల కోణాల అమరికతో
ఏ వైపైనా కనిపిస్తుంది అదే ముఖం యథా తథంగా
కనబడే నిజం "ఔను" "కాదు"గా కోర్టులో ఇరు పక్షాలు
నియమ నిబంధనలను బట్టి సాక్ష్యాధారాలతో
వాదనలు జడ్జి నిర్ణయంకై ఎదురు చూచేరు

ఈలోగా "నిజం" పక్షిలా ఎగిరి పోతుంది
కాల సర్పంలా చకితంగా జారిపోతుంది
నెమలిలా చెట్టు కొమ్మపై కూర్చుంటుంది
సాక్ష్యాలన్నీ దేనికది బయటపడకుండా భద్రంగా

లోనుండి అనల గీతం వినిపిస్తుంది
విపరీత కృత్యాలను దగ్ధం చేసే పనిలో
వ్యక్తిలో పరివర్తన తెచ్చే మిషపై
కాలాంతరాన మిగిలేది బూది దిబ్బతో శూన్యం

ఇప్పుడున్న స్థితి మాత్రం ఎప్పటిదే
మానవ మానస రేఖలతో 'మూలц మదే
ఎవరికీ తెలియని, బయట పడని 'నిజం' తో
ఆలోచనలో సమస్య! మెలికల ముడులతో

గతాన్ని వదలలేదు వర్తమానం పరంపరలో భాగమై
అవశ్యం భోగ్యం! వర్తమానం, ఇది అనివార్యం తప్పదు

అమ్మ నుండి పుట్టుకతో ఒడిలో చేరి
చివరకు మట్టిలో కలిసేను బాష్ప జలంతో
మొలకయై ముఖమెత్తుతుంది మట్టి నుండి
జీవన పరిణామంలో మహా తరువు కావచ్చు

# 28. అస్తితకు పూర్ణత

మౌనంలో ఆకాశం ఎన్నిటికో సాక్ష్యం
సమస్య పరిష్కారం పైనుండి ఊడి పడదు
ప్రకృతిలో జీవిత సంకేతాలెన్నో! వేరు వేరుగా
కాల సహజ పరిణామంలో జీవన రీతులెన్ని విధాలో

గతమంటే బూది కుప్పకాదు కష్టాలు కాదు
గాలికి రాలి వాడి పోయే పూల తరువు కాదు
నదిలా ఆగని వర్తమాన గతిలో మనిషి ముందు
ఏ గమనం ఆగదు ఏ చలనం నిలవదు

జ్ఞాపకాల లోనే పగలు ఎక్కువగా గడచేను
అప్పటి అనుభవాల పరంపర భవిత నందుకునేను
ఉన్న సమయం కాపాడుకోవడం ఒక ఎత్తు
లేని సంపద స్వంత మవడం మరోఎత్తు

ఎప్పటికపుడు తూకాలతో విలువలతో గడచేను
ఆశా నిరాశలలో తెలుపు నలుపు గళ్ళలోకి జారుతూ
సాధ్యం కానిది దూరమై వదలి వెళ్ళి పోతుంది
సాధ్యం అయింది దగ్గరై యత్నంలో భాగమవుతుంది

చుక్కల్ని పూలుగా మణులుగా తలచేవారూ
అవి అందని ఎత్తులో, మనిషిలో ఆశలు నింపేను
హిమ శిఖరంపై చేరినా గంగా నదిలో ఈదినా
విజయ కాంక్షతో తనలో శక్తి ప్రకటనం ప్రదర్శనం

తూటాకు గాయపడినా, బాంబుకు దగ్ధమయినా
వికాసాన్ని సాగిస్తుంది! మనిషిలో విజయ భావన
నిన్నటి వరకు కలం పట్టిన చేయి
ఈరోజు ఆయధం పట్టవచ్చు
భయం వీడి హృదయం ! సన్యాసం పొందవచ్చు
దేనికయినా సాహసించే ఆత్మశక్తి పెరగగవచ్చు

ఇల్లును కూల్చేస్తే చెట్టు కొమ్మను నరికేస్తే
గూడునుండి స్వేచ్ఛాయానంలో పక్షి మాయమైపోయేనా?

ప్రకృతి ప్రాణి జడం మనిషికెన్ని పాఠాలు నేర్పేనో?
ఇది అస్తిత్వాలకి పూర్ణత కూర్చేను, గెలిపించేను కూడా

## 29. స్నేహం అల్లుకొనీ

చెట్టు రూపం ఎన్ని పనులకు పనికి వచ్చినా
లోన మనసు సంస్ఫురణ లేకపోవడం
చెట్టు కన్న మనిషి అస్తిత విశిష్టం, అపూర్వం
మనిషి పోలిక చెట్టుతో బాహ్యం వరకే

చేతిలో గొడ్డలితో నిల్చిన మనిషి ముందు
ముక్కలుగా మాయం! తన తోడు నీడతో సహా
ఒక దానితో మరొకటి నాశన గతిలో
చెట్టుకు బాధతో ఏమీ ఎరగని నీడకు ఆపద

ఆఘాతం విధ్వంసం సంక్షోభం సంహారం
ఒకదానికి మరొకటి సహాయం కావచ్చు
మనిషి మనుగడకు ప్రకృతి ఎంత ఆధారమో
ప్రకృతి స్థితికి మనిషి, అంత మహా విభవ కారణం

మేఘం ఉరుముకు ఆ క్షణం భయాక్రాంత మయినా
ఇది పచ్చని భవిత గురించి వర్షాహిత సూచనయే
కర్షకులకు తమ పంటను యోజన చేసే సమయం
సమాజ ప్రగతికి జీవన సంబంధాలు పెరిగేను!

వర్తనలో ఆలోచన అనుభవం రెండూ జంటగా
జన జీవన బింబంతో కలిసి పని చేసేను
సంపదలు ప్రమాణాలు కారణమై జీవితాలు
తిరిగేను ఆయువు చక్రం, ఎగువ దిగువ దశలతో

అనుకూల కాలానికి పెరుగుతూ
ప్రతికూల సమయానికి తరుగుతూ
అపుడపుడు సమయ సమయం ఎంతటి వారైనా
అనాసక్తి నిరాశ మెరపులా మనసులో తోచేను

పరిసరాల ఉత్సాహ ప్రభావాలతో నిష్క్రమించేను
ఎంతటి కష్టం నష్టం వ్యర్థం లోను తప్పక
ఆశా బంధం ద్వార తోరణంలా వేలాడేను
ఆ రోజున ఆరంభంతో మనిషిని జాగ్రత పరచేను

మానవ శక్తి ప్రకటన కవకాశం దొరకేను
స్నేహ వల్లి పూలతో విశ్వమంత అల్లుకోవాలనీ

# 30. కాప్సల్‌లో భవిత

భవిత ఎప్పటికీ కంటికి కనిపించని వాస్తవం
ఊహలో చరిస్తూ మనిషిని నిలిపే కాల ఖండం
ఎంత దూర మయినా పరచుకొని మనసు నావహిస్తుంది
తనలో విశ్వాస ప్రభావంతో కళామయ మవుతుంది

ఒక సమయం సామాజికం, మరో సమయం రాజ్యతంత్రం
ఇంకొక సమయం వ్యక్తిగతం వేరే సమయం తాత్త్వికం
విశేష సమయంలో సాహిత్య కళా రంజనం అపూర్వం
అయిదు ముఖాలు కలిసి అంతరంగ మయం కవిత అపూర్వం

అయిదు లక్షణాలు సంవృత రూపంతో రోజు
జీవన పథ నిబద్ధమై ప్రకాశ రూపంతో
కిందపైన దేని కోసమో పరుగెత్తాలని మనిషిలో
అందుకునే శక్తి చేతనే, ఏదయినా సాధ్యం

సాధారణ ప్రజల నుండి పెద్దల వరకు
దాహంలో నదిని చేరి అది తనకై ఆగే ననుకునేను
తీరాన భూమిపై దాని వెంట పరుగెత్తేరా?
పైన కదలే నీలిమబ్బు! క్రింద సాగే నదీ వేగం
చెమటలో మనిషి జలబంధువు అయ్యేను
ఒకరు కరుణతో మరొకరు తాపంతో పైన, క్రింద

బుజాలపై నుండి పావురాళ్ళు ఎగురుతూ
వీటికై మనిషి ఎంత దూరం ఎగురుతూ పోయేను?
ఇది సాధ్యం కాదని అందరికీ తెలుసు?
ఇది బ్రతుకులో ఎత్తులతో ఉపయోపదేను

ప్రకృతిలో వస్తువులు ప్రాణులు జీవితంలోను
పలు సందర్భాలలో బలమైన ప్రతీకలై నిలిచేను
స్టేషన్‌లో ప్లాట్‌ఫార్మ్‌పై ఆగిన రైలు
కదలే వేళ దానితో కొంతదూరం పరుగెత్తేరు

ఉత్సాహంతో ఎగసే కెరటం వలె
ఎంత దూరం? దేని కోసం ? అంటే
కాలక్షేపంకై కొందరు పోటీలో కొందరు
తన బల పరీక్షలో మనిషి, వాస్తవ జీవన తలంపై

# 31. పోస్టుపోన్ అవడం

జీవన వ్యాసంగంలో నిరంతర శ్రమ పథంలో
సామాజిక శక్తులను మనిషి కేంద్రమయ్యేను
ఆరంభంలో ఉన్న "నేను" అదృశ్యమై పోను పోను
ఎవరి ఊహలను బట్టి వారికి తోచేను "నిజం"

మనిషి పయనం చివరి దాక ఆయువు వాహనంపై
పాత దారి స్మృతిలో భద్రంగా, కొత్తవి అప్పటి అనుభవంతో
రాత్రి వేళ ఎక్కువగా మాటలు వినపడక పోవచ్చు
ఏదో అలకిడితో మెలకువలో శబ్దం వినిపిస్తుంది

రాత్రివేళలోను తప్పని పనులలో మనుషుల అలికిడి
అంతా నిశ్శబ్దంగా ఉన్నట్లుగ కాలం పై పొరలో
భూమి నుండి పైపైకి గగనానికి ఆరోహణలో
మనిషిలోని ఆశ లొకటొకటి సూచనలో స్వప్నంలో

ఎంత నడచినా తన చూపులు సాగుతూనే
భూమి తన వశం కావాలని తొందరలు
నడచి వచ్చిన దారి తన వెనకనే ఆగిపోతుంది
చేరబోయే మజిలి ముందు కొచ్చినట్లుటుంది

'సెల్'లో సంభాషణ ఎక్కడెక్కడినుండో
సమయంతో పని లేకుండా గాలిలో తేలుతూ
మనిషిని చేరుతుంది నిశ్శబ్ద పథంలో ఒంటరిగా
వయసు పైబడిన కొద్దీ భయం తగ్గి ధైర్యం పెరిగేను
నిశ్శబ్దం ప్రమోదాన్ని విషాదాల్ని చెవి కందిస్తుంది
పచ్చదనంతో పాటు ఎడారులు అరణ్యాలు జనపదాలు దాటుతూ
సమాచారాల నుండి ఆపై అవసరాల వరకూ తృప్తిగా
రాత్రి పగలు భేదం ఎరగని "సెల్‌ఫోన్", ఒక సమ్మితం

పయనం నిరంతర చేతనకు ప్రసార సంకేతం
ఒకరొకరిలో లక్ష్యాలు వేరుగా వివిధ విధాలతో

మరో రోజు వచ్చేనన్న ఆశా స్పందన స్వరంతో
మనిషికి కావలసింది, ముఖ్యాతి ముఖ్యమైంది
మృత్యువు చేసే వార్నింగ్‌లు
హఠాత్తుగా పోస్టుపోన్ అవడం

# 32. ఇది నా నిలయం

ఇది నా నివాసం, ఎప్పటిదో
ఎవరికి వారుగ నయినా స్వేచ్ఛగా
పరస్పరాను బంధంతో మానవ సూత్రంపై
దార్శనిక పథంలో జీవన గమనం
దారు లెన్నొ నడత లెన్నొ అన్నీ
వ్యక్తి వికాసంకై సమాజ పరిణామంలో

గుడిసో ఇల్లో మేడో సౌధమో భావనలో
అనుబంధం చిరమై తరం నుండి తరం
తోడుగ ఎదురగ పతాక వివిధ స్థాయిల్లో
ఎవరి మతం వర్ణం వారిది అవుతూనే వలయాలలో

సూత్రానికి బంధితమైన పూవుల్లా మణులవలె
మానవతా గంధంతో శ్రమ జీవన ప్రతిబింబాలు
దీన్ని ముక్కలుగా చేసి స్వలాభం పొందేవారు
దీన్ని వికల పరచి అలవలె పై కెగిరేవారు
విశ్లేషణలో మరికొందరు గుప్తంగా అమాయకంగా
సమస్యలేని నిరాశ చుట్టుకోని బ్రతుకులు లేవు
జటిలత కుటిలతతో చిక్కువడని సంఘం లేదు
ఇవి తొలగేందుకు చేసే ఉపాయాలెన్నో తంత్రాలెన్నో!

ఏడుపుతో మొదలైన ఘడియ నుండి
ఉన్న ఆయువు కాలం సుఖంగా గడవాలనీ
ఒక సందర్భంలో ఉపయోగపడిన సూత్రం
ఉన్న విధంలోనే అనుకూలించక పోవచ్చు

శాంతం నుండి అలజడి కెపుడు చేరేదీ తెలియదు
పరివర్తన ముఖంతో సమభావన స్వరంతో
చేతిలో ప్లే కార్డులతో నినాదాలతో
నైతిక బలంతో పవమాన వేగ గతికి
చెట్ల వలె ఊగిపోతూ కదలేను యువత

బ్యాగ్‌లో పెన్ పుస్తకాలు కన్న
పిస్టల్ రైఫిల్ తో ప్రగతిని సాధించేరా?

తప్తమై ఉదగ్రమైన విషమ స్థితిలో
ప్రజాస్వామ్య మొకటే హృది తృప్తికి సోపానం

# 33. కీర్తి కిరీటమై

ఈ యుగంలో అక్షర నాయకత్వంలో కవిత
రాజనీతి ఆదర్శంతో సమస్యల తీర్పులతో
తరం నుండి తరానికి వికాస పథం మారేనా?
నడవడిలో నైతిక స్ఫూర్తి కోరికలను నడిపించేనా?

ఎప్పటికపుడు మారే లక్ష్యంతో సమాజం
చక్రంలా తిరిగే శ్రమ విధానం మారేను
పనికి తగిన శ్రమ విధానంలో మారే దుస్తులతో
ఆదర్శం మరచేరా? దార్శనిక గమ్యం మారేనా?

జారే కన్నీటి చుక్కలో ప్రతిబింబిచేను
చూచే హృదిలోని రంగుల వెనక నిజం
అందరినీ సమంగా ఆశీర్వదిస్తుంది క్షితిజం
అందరికీ అందుబాటులో ఉంటుంది అవని

ఇది ఏ కొందరికో పరిమితం కాకూడదనే
నెరవేర్చే ఉత్తమ సాధనం ప్రజాస్వామ్యం
సూర్యుని తేజో రూపం చూడలేవు కళ్ళు
చండమైన కిరణాలకు మబ్బులు! అడ్డుగా
చల్లని సందేశంతో ఉపశమనంలో సస్యాకృతి
చంద్రుని హ్లాదబింబం ! చూడకుండ ఉండలేరు

బ్రతుకులలో బాధల గాథలు వేలాడుతూ
ఎడారిని మరపించే పచ్చదనం కోరుతుంది అవని
గాలి వీచవచ్చు, తుపానుగ మారవచ్చు
అద్దంలో ఉదయం విషాదవార్త చూపవచ్చు
బాంబు ప్రేలవచ్చు, భూకంపం అనుకోవచ్చు
మనిషిలో అశక్తతను మదిలో మెరపించవచ్చు

సమాజమొక జీవన నిలయం అంతస్తులతో
ప్రతి పనిలో మనిషి అడ్రసు చేతన దిశలో
జరిగిన దోషాలు నేరాలు ఆ వెనకనే
చీకటి శిలలవలె అనల శిఖలవలె నిలిచేను

పిల్లల చేతిలో పలక బలపం, పెన్ను పుస్తకం
దృశ్యం! సమాజానికి కీర్తి కిరీటమై వెలసేను

# 34. మార్నింగ్ వాక్

గాలి కదలుతుంది కదలకుండ ఉండలేదు
ఎక్కడి కక్కడ స్తంభితమైంది మృత్యు నిలయమవుతూంది
ఎంత దూరమయినా గాలికి అలసట ఉండదు
ఎంత బరువు అయినా మధ్యలో ఏదీ వదలబడదు

స్వేచ్ఛా పథంలో స్వతంత్ర భావనతో ప్రజాస్వామ్యం
ఒక అవసరమై సమాజ చరిత్రకు ఉత్తేజాన్ని ఇస్తుంది
ప్రాణ వాయువుపై భరోసాతో మనుషులు
మేధపై యుక్తుల పై విశ్వాసంతో మనసులు

సమాజాన్ని సరిచేసే ప్రవర్తనను సరిదిద్దే
సంకల్పానికి బలమిచ్చే కలానికతీతమైన చేతన

స్వచ్ఛం శుభ్రం తేజోవంతం శీలవంతం అయిన
అంతరంగం రంగుల చిత్రాల్ని వదలేను, బయటికి
ఈ జీవన రూపం! దేనికీ పట్టుపడని కట్టుపడని ధార
కవితలు సంశ్లిష్టాకృతిని తనలో ప్రతిబింబించేను

జలధి దాటి తీరం చేరాక ధైర్యం నిలపబడుతుంది
అంతవరకు ఎదురుగా దాటరాని క్లిష్టమైన
కల్లోల తరంగిణి ఒక సమస్యయే కథలో
మనిషిలో శక్తి ప్రకటన కిది సరియైన సందర్భం

దుర్గమ స్థితిలో సుగమమవుతుంది పయనం
క్షేమంగా బయటికి రావడం మనిషిలో నైపుణ్యం
ఇందులో రహస్య తంత్రమేమీ లేదు
సమయానికి తగిన ఆలోచనతో ఆచరణమే

వర్తమానంతో స్నేహం గతంపట్ల ఆదరణం
భవితపై ఆశ, ఇవి వికాస చరిత్రకు ప్రేరణ క్రియలు

యశో విజయంలో పోటీ లేని దొక కవితయే
ఆకాశం ఎత్తులో దిశల చివరల దాకా తృప్తి లేనిది

భూమిపై రవి రూపం వహించి మంచు దుస్తులతో
"మార్నింగ్ వాక్" చేయాలని ఆశ, వాస్తవ భావనలో

# 35. అక్షర శిఖలతో

తన జల తలంపై పయనించే పడవకు
సముద్రం ! అనుమతి నీయకపోయేనా? నిరాకరించేనా?
తీవ్రమయిన తుపాను చర్యలలో సర్వం బీభత్సమై
తలపెట్టిన పయనం పోస్ట్‌పోన్ కావలసిందే

తన అవని తలంపై సాగే కాలి బాటకు
అవరోధంగా ఎక్కడి దక్కడ నిలిపేస్తే
లోయలు గోతులు దిబ్బలు కొండలు నదులుతో
ముందు వెళ్ళే అవకాశం సన్నగిలేను

పయనం ఆగిపోవలసిందే, దుర్గమమైన అడవిలో
కాలం గడుస్తుంది మనిషిచే ఎప్పటికీ అన్వేషణంలో
సామరస్యం కుదిరే దాకా పయనం నిలిచి పోవలసిందే
దాటించేది, సాధించేది, మనిషిలో మేధ ఒకటే

ఏది తెలిసినా తెలియకపోయినా
తన దోషానికి నేరానికి ప్రభావ ఫలితం తప్పదు
వ్యవహారంలో పర్యవసానం అందరికీ తెలిసిందే
ఏదో ఒక పేరుతో బయట పడవచ్చు తిరగవచ్చు

కావాలని ప్రతి హృదయం తలుపులు మూత బడవు
తన మతి విభవంచే కావలసింది వశం చేసుకోవచ్చు
ప్రకృతి నుండి తోచే సందేశ వీచికలెన్నో
ఇంకెన్నో పూర్తిగ తన ఆచరణం లోకి రాలేనివి

దూరం నుండి మనిషి శిలను తలపించవచ్చు
దగ్గరి నుండి మనిషి చెట్టులా తోచవచ్చు

దాటరాని విషమ స్థితుల మధ్య
కవిత ! వంతెన వలె తోడ్పడేను

నిర్దేశంగానో ప్రసార సూచనగానో
మాటకు చేతకు మధ్య కనిపించని వంతెన
అద్దాల అల్మైరాలో అమర్చిన బహుమతులు
అద్దంలో పాత ముఖం ఊహలతో అలలవలె

సూర్యుని కిరణం మనిషి ముఖాన్ని సరిదిద్దుతుంది
ఇది కవితయై అక్షర శిఖలతో ప్రేరక మవుతుంది

# 36. వదలని వర్తమానం

మాటకు పాటకు దివ్య వాహనం పవనం
ఎందరికో దారిలో అందజేస్తూ పోవడం
దేశ దేశాలు తిరిగేను, స్వేచ్ఛగా
సశబ్దంలోనూ నిశ్శబ్దంలోనూ స్వతంత్రంగా

వినబడే మాటకూ కనబడని భావనకూ
మధ్య అతీత సంబంధంతో కవిత్వం
ఇది తెలిసిన మనసుకు జలధి రమణీయం
ఇది తెలియని వారికి గగన పుష్ప సదృశం

ప్రకృతి నుండి సమాజానికి కందే సూచనలెన్నో
సందేశాలెన్నో! ఉపదేశాలెన్నో! ఆప్తంగా
శ్మశాన స్థలి పచ్చని కొమ్మలతో, తరువు
జీవన రహస్య పేటిని తెరచే 'కీ' లాంటిది

కొందరికి "చెట్టు ఆదర్శం" ప్రతీక స్థానంలో
కొందరికి మనిషి ఆదర్శం అంతరంగ దర్శనంలో
భాష భావ జాలం అభివ్యక్తి దార్శనికత మానవత
కలిసిన సుందర రూపం! శిల్పాభిరామం

దీనిలో కొత్తను బట్టి కవిత స్థాయి పెరుగుతుంది
కవి ప్రతిభను బట్టి యశోరూపం అందుతుంది
ఇజం ఉండవచ్చు లేకపోవచ్చు
అది కవి అభీష్టంపై ఆధారపడింది

దీని వలన కవితకు పూర్ణత చేకూరుతుంది
"నిజం" చేతి కందితే చాలుననుకునేరు
ఏదో ఒక లక్ష్యంతో గమ్యం ముఖ్యం
కవితకు ఏ షరతులతో పనిలేదు

లోక యాత్రకు సాహిత్యంలో విరామం లేదు
కవిత్వానికి పఠనంతో సమాప్తి రేఖ లేదు

ప్రతి నియంతలో భూమికి వారసత్వం తనదేనని
జీవిత మంతా నమ్మకంతో మురిసి పోయేను
కవి హృదయం స్పందించని విషయం లేదు
వర్తమానాన్ని వదలి నవత లేదు, భవిత లేదు

## 37. మలి తెలంగాణ - 1

ఏర్పడిన మలి తెలంగాణ రాష్ట్రాని కిపుడు
పెద్ద ఒకరే, కాకపోతే ఇద్దరు ఉండవచ్చు
పాలనను ద్విచక్ర వాహనంపై నడిపేరు
వివిధ మతులతో రాజ్యతంత్రం జరగడం ఉంది

ఇంక కొన్ని ఏండ్లు గడిస్తే రాజ్యానికి
పరిణత కళ చేకూరుతుంది ముఖంలో
మరెన్నో ఘన కార్యాలయ్యేను సుగమంగా
మరెంతో అభివృద్ధికి యశసుకు వీలు కలిగేను

ఈ సమయంలో సంక్షేమ పథకాలు నిర్దిష్టంగా
ఇట సంక్షోభం లేదు సంకోచానికి తావులేదు
పైకెదిగేందుకు శ్రమ చేతనతో నేతలు ప్రజలలో
ఒక అవిచ్ఛిన్న ప్రవాహకత స్పష్టంగా కనిపిస్తుంది

ఎవరి స్థాయిలో వారు పైపైకెదిగే తెలివి తేటలతో
శ్రమ శక్తులు పరిశ్రమలు వృత్తులు తదితర కార్యకలాపాలు
అన్నిటి గ్రాఫ్ ఎదుగుతూ అంచనాలకు మించి
నీటి వనరులు విద్యుదుత్పాదకాలు బహు జీవన విధాలు

పాతను సరిచేసుకుంటూ కొత్తను ప్రవేశపెడుతూ
ఎటు చూచిన ప్రజల ముఖాలలో రవికిరణ ప్రకాశం
ప్రగతి వేగం తుపానులా ఒకపుడు వరదలవలె
ఉక్కిరి బిక్కిరి చేసేను, బాధలు లేని దిశగా పయనం

సంకల్ప బలంతో కార్యదీక్ష అంకిత భావంతో
ఉబుసుపోకకో కాలక్షేపానికో కాక కార్య సాధనలో
కాలం గడచేను పటుతర గతిలో ప్రతి పని
చరిత్రలో వాస్తవ దృష్టితోనే ఎవరి దారి వారిది

అనూహ్యమైన ఫలితాల సంబరం
అందరికీ తెలిసిన వాస్తవం!
కొందరి మనసు సంశయ గ్రస్తం

విలువలతో పాలన మొక చతుర మనోజ్ఞం
విజయ గాథలతో ఏర్పడేను యశోబింబం
పిల్లల నుండి పెద్దల వరకు భేదాలు లేకుండా
ఆదుకునే దిశగా ప్రభుత్వం ప్రజా పక్ష మనిపించేను

# 38. మలి తెలంగాణ - 2

మలి తెలంగాణ అవతరణంతో కొత్త శకం
పరంపరను మన్నిస్తూ ప్రత్యేకతల కవకాశం

పూర్వపు బాధలకు చెందిన గాయాలిపుడు
గులాబిగనో మోదుగగనో స్మృతిలో కదలేను

చేతికి చిక్కీ ఇంకా పూర్తిగ చిక్కని విజయంతో
ఆగని ప్రవాహ రూపం ! లక్ష్యం చేరేదాకా చెదరనిదీ
చేతిలో పుస్తకం పేజీలు చదవడంలో తిరగడం ఆగవు
బ్రతుకుల్ని వివిధ వ్యాపకాలతో అన్వయించడం వేరు

ఇంటి ముందు చెట్టు కొమ్మ నుండి
ఎగిరే పక్షిని చూచి ఏదో తట్టి
కంఠ మెత్తి పిలిచి తలచి ప్రేమగా
తనకు గగనంలో వాహనంగా మారేనా?

ఎవరి కర్థమయినా కాకపోయినా విషయం
మనిషికి తెలిస్తే చాలు సగం పైన పరితృప్తి
శ్రమ శక్తికి దీటుగా తెలంగాణలో సమాజ శ్రేణులు
స్థానికం నుండి దేశం విశ్వం అంచుల్ని స్పృశించేను

కార్యశాలలు పరిశ్రమలు వృత్తిపనులు తదితరాలు
అందరికీ చేతికి పని, పొట్టకు ఆహారం పేదకు తప్పనివీ
ఇపుడు నిరంతరం కార్య మగ్నమై కాలం స్పృహ తొలగేను
స్వేచ్ఛా వాతావరణంలో చూడ ముచ్చటగా ఒత్తిడి లేనిది

స్వచ్ఛందం దెబ్బతిన్న ఘడియలలోని స్మృతులు
తిరిగి మొదలు కావచ్చు, అవి ! ప్రేలే దీపావళి టపాసులు

అభిమానం దెబ్బతిన్నా గౌరవం మంట కలిసినా
ఎడారి మేటల ముఖాలు ఇపుడు పరచిన పచ్చని అనుభవాలు

ఊపందుకునే చరిత్ర దశలలో పరివర్తనం
సంతోష రేఖలతో రోజులు అనుభవ మనోజ్ఞం

కనుల ముందు చీకటి తెరలను చీలుస్తూ వెలుగుల అవతారం
దూర దూరం తోసేస్తూ, శ్రమ భాసుర రూపం అభినవ తెలంగాణ!

# 39. మలి తెలంగాణ - 3

చేపట్టిన గొప్ప పనులలోని బాధలు తెలిసీ
గాయాల పాలయి కొంతకాలం జైలులో బొమ్మలవలె
ఇపుడు నెత్తురు చుక్కలతో అలంకరింపబడి
పూల దండలతో స్వాగతమొక కాల్పనికం, ప్రజలలో

ఒక వీరుని మరణం వృథా కాదు
ఉద్యమ గమనానికి వేగాన్ని ఇస్తుంది
వెనుకబడిన వారికి అంతలోనే
ప్రేరణయై ముందుకు నడిపిస్తుంది

ప్రజల నాల్కలపై ప్రతీకలతో వీరుల బొమ్మలు
మాట్లాడేను, ఎన్ని విషమ స్థితులనో అధిగమించి
ఇపుడయితే ఇంతవరకు ఏ స్నిగ్ధమైన బంధం తెగలేదు
మానసిక మైన అనుభవ గంధాన్ని ఎవరు నిరాకరించేరు

పులులు స్థానంలో ఇపుడు పావురాళ్ళు ఎగిరేను
బాధా రూపాలు భూ చరులు ఖేచరులుగ మారేరు
జీవితంలో ప్రేమ చిహ్నం పూలవనం పెరిగేను
ఏ ఇంద్ర జాలంతో అయ్యేది కాదు, మానసికం

దశాబ్దాల తరబడి కలగి నలగిన పూలవనం
వాన చినుకు పడిన ఆనందం అందరికీ సహజం
చేతికి చిక్కిన స్వేచ్ఛ నెవరు వదలు కుంటారు
సహేతుకంగా దీనిని వాడుకోవలసి ఉంటుంది

నైతిక బలంతో విషయం విలువలు పెరిగేను
లేకపోతే బిగిసి మంచు గడ్డగ మారేను
కావలసిన దానికి పదింతల యత్నంతో
మహానేత ! అమర రూపమొందేను విజయగాథతో

ఒకపుడు తీక్ష్ణ తాపానికి మంచు గడ్డలు
కరగి ప్రవాహమై దాహం తీర్చేను, పచ్చదనం తెచ్చేను

జ్వాలా సంచారం ఆగి, స్నేహాచరణంలో
మలి తెలంగాణ! నీది నాది అందరిదీ విశ్వమయం

# 40. మలి తెలంగాణ - 4

వీర చరిత్రలో గాథలతో సంబంధం ఎప్పటిదో
ఇపుడు వీధులలో నినాదాలు ప్రదర్శనలతో

మాసి పోయి దుమ్ము చేరి చినిగిన బట్టలతో
దరిద్రాకృతులు, తెల్లవారే సరికి కొత్త బట్టలతో
పలు రంగుల పూల అమరికలో హృదయంతో
ప్రత్యక్షం వీధులలో తమ స్వంతం లభించినట్లు

బాగున్నది ఏది అంటే? అసంతృప్తి లేని దశ
తెలంగాణ సమాజం నిరాశ ఎరగదు ఉత్సేకం తప్ప
పెద్ద పెద్ద రాష్ట్రాల ఎత్తుకు చేరే కోర్కె
పూర్తికి శ్రమ వికసిత పద్మవనంలా సమూహాలు!

ప్రతి వ్యక్తిలో ఆదర్శ జగత్తును బింబించేను
ఇపుడు కావలసింది తాను నమ్మే దార్శనిక తేజం

కవిచే కవితలో పునర్దర్శనం జరుగుతూంది
ప్రజలో విజయ కేతనం జీవన వాస్తవమై
భూమిని వీడని చేతన ! సృజన చేతనతో
వికాసాలు ! తల ఎత్తిన వాస్తవ శిఖరాలు

కాలం ఎవరికీ శత్రువు కాదు అందరికీ సమానంగా
రాజనీతిలో అందరూ మిత్రులే స్నేహ హస్తమందేను
పేదల కవసరం ఏలే వారి నుండి ఆసరా అనివార్యం
తరాల గౌరవాన్ని మర్యాదను పొందిన సాదర దృశ్యం

గత చరిత్ర మరపున బడదు, కాల నాళికలో భద్రంగా
వర్తమానం ఒకటే మలి తెలంగాణ ఆయువు భాగ్యం

పయనంలో దిశలు మూతబడితే
పాలకులు తమ తలుపులు తెరచేరు
చెరువులలో నీరుతో కరువులలో ఆహారం
మనిషితో ఒక మంచి మాటతో యంత్రాంగం

కవితకు కళలకు 'హేట్స్ ఆఫ్" స్వాగతం
విపత్తులో నిలబడే రాజకీయానికి అగ్రతాంబూలం
ప్రజాస్వామ్య తేజానికి సన్మానం హృదయ పీఠంపై
మలి తెలంగాణ! ఇపుడు పరిణత ఘన రూపంతో

స్వేచ్ఛా కవిత్వం - 122 - I & II

# విప్లవ ప్లవనం
# స్వేచ్ఛలో మనోజ్ఞం

మాదిరాజు రంగారావు



2022

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

# SWECCHA KAVITHVAM

## VIPLAVA PLAVANAM - I

## SWECCHALO MANOJNAM - II

## విప్లవ ప్లవనం - 1

## స్వేచ్ఛలో మనోజ్ఞం - 2

by

Prof. Maadiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Year of Publication 2022

*Presented to*
*my wife*
*Smt. Indira*

# పీఠిక

ఈ సంపుటం రెండు వస్తు విషయ మర్యాదలతో సంపన్న మయింది. ఇది స్వేచ్ఛా కవిత్వంలో 122వ కృతి. ఒకదాని విస్తరణం మరొకటిని ప్రభావితం చేస్తుంది కూడా. రెండూ ఒకే సమాజ బంధుతను కలిగినవి. ఒకే కవిచే ఆవిష్కృతమయింది. జీవన వాస్తవాన్ని కలిగింది. హేండిల్ చేయడం సులభం కాదు.

1954 నుండి స్వేచ్ఛా కవిత్వం పేరుతో వ్రాస్తున్నది. మరొక పేరు దృష్టిలో నిలవడం లేదు. సమాజంలో శ్రేణుల స్థాయి భేదాలున్నట్లే, ప్రమాణాలు వేరుగా ఉన్నట్లే, కవులు – కవిత్వంలో వైవిధ్యం అనివార్యమవుతూంది. ఎవరి ప్రత్యేకత వారిదిగా స్వతంత్రమైన స్థితిని పొందుతూంది. ఇందులో పోటీలేదు. ఎవరి విశేషతలు వారివిగా రాణిస్తున్నాయి. మొత్తం 142 ప్రచురణలతో కవిత్వం సాహిత్యం, విమర్శ చోటు చేసుకున్నాయి. "తెలంగాణస్వరం పద్య కృతి మరొకటి."

వస్తువు విషయం – శిల్పం కళ, – కవి వ్యక్తిత్వం, సామాజిక అస్తిత్వం మొదలయిన పదజాలాన్ని సమాలోచనం వేరు వేరుగా గుర్తించడం జరుగుతూంది. కవి ప్రతిభ చేత వికాస సుందరతలో విశేషత స్పష్టంగా అవగతమవుతుంది.

నా మొదటి కృతి "కిర్మీరం" స్వేచ్ఛా భావనతో కవిత్వం స్వతంత్ర వ్యక్తిత్వంతో మొదలైంది. ఈనాటికీ అదే! ప్రకటితమవుతూంది. ఈనాడు ప్రతి కవీ తనదైన ప్రత్యేకతను కనబరచడం సంతోషకరమైన విషయం. ఇది పద పదం స్వేచ్ఛా రూపాన్ని పొందింది.

మొదటిది "విప్లవం – ప్లవనం" రెండోది "స్వేచ్ఛలో మనోజ్ఞం" మొదటిది విషయం ప్రధానంగానూ, రెండోది అనుభూతి స్పందనలతోనూ కళాత్మకంగా సమాలోచన కందుతూంది. కవిత్వం స్పందన గుణంతో సాహిత్య సహృదయులను ఆకర్షిస్తుంది. ఇక ఆధునిక కవిత్వంలో భావ రూపాలు (Images) ప్రతీకలు (Symbols) చైతన్య వాహిని (Stream of consciousness) మానవ మనస్తత్వ విశ్లేషణం (human Pschoanalysis) ఉండనే ఉన్నాయి. ప్రజాస్వామ్య సామ్యవాద భావన అన్నిటినీ కలుపుకొని పోతుంది.

సాహిత్య సహృదయులకు స్వాగత స్వరంతో ఆహ్వానం పలుకుతూ..

**– మాదిరాజు రంగారావు**

# I. విప్లవ ప్లవనం

## 1. గమ్యం ఒకటే

రణ విప్లవం తెచ్చిన వ్యక్తి స్వేచ్ఛ
శాంతి విప్లవం తెచ్చిన దేశ స్వతంత్రం
సమాజంలో రైలు పట్టాల వలె వ్యక్తిలో
జంటగా ఎడంగా మానవ పయనం నిరంతం

చరిత్రలో మరవ రాని మలుపులు తిప్పేను
నవ రూపం చూపేను, జన చేతన నింపేను
మరో దేశానికి దారి చూపే విలువలతో
స్వీయ గాథా సంకలనంతో కొత్తదనం వచ్చేను

ప్రవాహానికి నడక నేర్పే అవశ్యం లేదు
మనీషకు సూరీడును చూపే అవసరం లేదు
సంస్కృతీ వికాసానికి సూచనతో పనిలేదు
సదస్సులో పద్మంలా నింగిలో మబ్బులా వెలసేను

తమ చేతులకు పనులు పుష్కలంగా
కోరేరు దేశ ప్రజలు శాంతి పథంలో
పీడనలో రాపిడిలో నిరంకుశ బలంలో
పొందే కష్టాలు నష్టాలు గుర్తులు మిగిలీ

పూర్వపు లక్ష్యాన్ని పయనాన్నీ నెమరు వేసుకుంటూ
జ్ఞప్తిలో విలువలతో తమ సంపదలో భాగంగా
ఇది మానవ చరిత్రలో పుటలు కొత్తగా
చేరడంతో ఉత్సాహశీలమైన విభవం చూపించేను

తరం వీరులకు ప్రశంసల జల్లుతో
చరిత్రకు పెద్ద పీట వేయడం జరిగేను
ఆరంభమైన విప్లవం! ఫలితం పొందే వరకు
నడుస్తుంది నిరంతరంగా అంకిత భావంతో

జన పదం పట్టణం అరణ్యం ఎక్కడ మొదలయినా
ఒకే చోట ఒకే బాట ఒకే అడుగు జాడ ! గమ్యానికి
ఏదో ఆకర్షణలో జీవన భాగ్యం లేంది
ఇంతటి ప్రాచుర్యం విశ్వమయ మయ్యేనా?

## 2. నిరంతర పయనంలో

సాయం సంధ్యా నట తాండవ భావనతో
ఉదగ్ర వాద రాజకీయం సమాజ తలంపై
ఉన్న స్థితులు తల క్రిందులయ్యే పరివర్తనంపై
కాంక్షా విశేషం! విప్లవం, కదలే జ్వాలా శిఖరం

తత్కాలంలో చెలరేగే ఉగ్రరూపం
రంగంలోకి దిగి, బీభత్సం సృజించేను
ఇది ఉద్వేగం ఉద్రేకం కలిసిన
ఉత్సాహ తాండవ దృశ్య మయం

స్తబ్ధంగా ఉన్న స్థితిలో దీని అవసరం
అనివార్యంగా జ్ఞప్తికి రావచ్చు! పౌరునిలో
ఇరు వ్యవస్థల మధ్య ఇరు భావ ధారల మధ్య
తీవ్రమైన సంఘర్షణ హింసకు దారి తీస్తుంది

చీకటిని సహితం రక్త చిత్ర మయం చేసే
రాజనీతి చతురతతో, రహస్య ప్రణాళికలో
దీని కిదే సాటిగా, దేశమంతా ఆవరించాలని
ఆపై విశ్వమయమై నవ నిర్మాణం జరగాలని

ఇది ఒక బృహత్ప్రణాళిక! సాగుతూంది
మధ్య మధ్య విరామ చిహ్నాలతో సక్రియకు
సర్వ మానవ భావన వికాస నవ గీతమై
ప్రతి మనిషి గుండెను తట్టి మేల్కొలుపుతుంది

నిప్పు అంటిస్తూ పోవడమే తమ పనిలా ఉంది
వెనకనే ఫైర్ ఇంజన్ హుటాహుటిగ వచ్చేననీ
దీని నార్పడం తమ వంతు కాదన్నట్లే ఉంటుంది
ఇది మార్పు గురించి చింతనలో తగల బడే స్వప్నం

ఊరు నుండి అడవి కిపుడు యోధులు
ఆపైన అడవి నుండి నగరానికి
విప్లవ పవనం రాల్చే నెత్తురు చుక్కలతో నేలపై
నిరంతరం విరామం లేకుండా పయనించేరు

# 3. దహనం ప్రధానం కాదు

అగ్ని శిఖలు కొన్ని ఒక దశలో గుప్త చరంగా
యోజన ఫలితం గురించి రహస్య చర్చలు
ఆదర్శం గమ్యం చేరాలనే దృఢ సంకల్పం
పరిణామాల్ని బట్టి అపుడపుడు ఆగిన సందర్భాలూ

వర్గ రహిత సమ సమాజ లక్ష్యం ఒకటే
చేరే దారులు వేరు వేరు! దార్శనికాలు భిన్నం
తీవ్ర తరం వేగమయం అయ్యే ప్రయత్నంలో
నిప్పు చిమ్మినా కత్తి దూసినా బాంబు విసరినా
నీటి ధారలు కురిసినా, ఎదుర్కొనేరు నిర్భయులు
తమ తమ కార్య సాధనలో ఇరు పక్షాలు
అధికారం హస్తగతమయ్యే ఎత్తులలో
విధ్వంసం హింసలు ఆచరణంలో తప్పని వయ్యేను

పిడికిలిలో విప్లవ హృదయం ఆయుధ బలంతో
జీవన లయను మార్చేను, రహస్య యోజనతో
అన్నీ సమకూడితేనే, కాలాన్ని జయించేది
దీనికెంతో సంపద అవసరం, మానవ శక్తితో

ఎవరి లక్ష్యం వారి దయినా విశాల క్షేత్రంలో
ఇరువురి కవాతులు మాత్రం అడవిలోనో నగరం శివారులలో
అడవి నౌకరు, ఎంచుకుంటే, కార్యకలాపాలకు
జన పదాల నౌకరు ఇష్టపడేరు, ఖాకీ దుస్తులలో

ఛేదించే వ్యక్తి మెడపై ఏ కత్తి అయినా పడవచ్చు
అయినా! చరిత్రలో పాత్రల నడతను ప్రశ్నించేరు
ఎవరు మరచినా అంకిత రూపాలు మటుకు మెలకువలో
ఉద్యమ పద పంక్తులు కవితలో ఆకర్షణ రూపాలు

రణ తంత్రంలో శబ్దం! మనిషి కొక విధంగా అర్థమై
తప్పని రాజ్యాంగంలో మార్పుకు సిద్ధపడే దెందరు?
శత్రు నివాసాలకు నిప్పంటించితే సమస్య తీరదు
గాఢమైన ఆలోచన అంకిత భావంతో, ఇది సాగేను

# 4. అమాయకం నుండి అనుమానం

ఏది ఏమయినా రాత్రులు పరుగెత్తించేను
మనిషి మనిషినీ ఏ రోజూ లెక్కపెట్టుకునేరు
ఏ రోజు కారోజు జరిగేది జరుగుతూనే
సమయ సమయం స్థితిని బట్టి రంగులు మారేను

ఒకరి ఇష్టంతో పనిలేనిది! ఆచరణం
ప్రతి వీరుని పరీక్ష ! గుప్తంగా జరుగుతుంది
అధికారం హస్తగతమయినంత మాత్రాన
తాము చూపిన దోషాలు మాయమయ్యేనా?

ఏదో జరిగేనని ప్రజలలో భయ భ్రాంతులు!
అందుకు ముందుగ సిద్ధమవుతుంది అధికార యంత్రాంగం
అనుకోనివి ఆపదలు ప్రమాదాలు అనుకొన్నవి విపరీతాలు
కాస్త గీత దాటితే సామాన్యుని కష్టాలు, నష్టాలు వెనుకనే

ఊరు నుండి ఊరుకు మనుషుల కదలికలను
వడపోసి అంచనాలకు దిగేరు ఖాకీలు
అడవిలో పచ్చని గడ్డిపై రక్త బిందువులు
భ్రాంతి జనిత వాతావరణం కాదు, వాస్తవం

రాత్రులే ! అందునా కృష్ణ పక్షం విప్లకారులకు
అదను సమయమనీ, ముసుగులు అక్కరలేదు
వెన్నెల అయినా, గుప్త చరులు పట్టుబడవచ్చు
ఒకటి రెండు నెత్తురు చేక్కలు కనబడేది ఉదయమే

అలజడి హత్య మారణ రణం ఏదైనా కావచ్చు
ఎన్‌కౌంటర్‌లో విజయమంటూ చివరి చర్య లేదు
ఏదేని పరివర్తన పరంపరలో భాగంగానే కనిపిస్తుంది
ఎవరనేది! అనుమానం తేలుతుంది అమాయకం నుండి

# 5. కావలిసిన ప్రవాహకత

ఇంటి ముందు కాలింగ్ బెల్ మ్రోగితే అదే పనిగా
అడవికి దత్తమయిన అన్నల మనిషి కావచ్చు
జన పదాలను గాలించే ఖాకీ దుస్తుల వ్యక్తి కావచ్చు
భయాల్ని తీర్చుకున్న తరువాతనే తలుపులు తెరిచేది

ఇరు పక్షాలతో భేదించే వారూ లేకపోలేదు
ప్రజాస్వామ్య సామ్యవాద భావనా జగాలతో
సమస్యకు చేరువగా, చిక్కులకు దూరంగా
సమాజ శ్రేయానికి కట్టుబడిన రాజనీతితో

కిటికీ తెరవచ్చు కాని, అదొక భయ రూపం
గురి తప్పిన తూటా దూసుకొని రావచ్చు
తెల్లవారుతూనే గోడలపై హెచ్చరికలు, సూచనలు
ఎరుపు రంగు అక్షరాలు దూరం నుండి పతాకల వలె

శుభ్రమైన దర్పణంలా తళతళలాడే హృదయాలు
స్వచ్ఛమైన జీవితాల్ని అభినవ సుమమాలగ తీర్చేను
ఏ ఏ జాగ్రత్తలు తీసుకున్నా బందో బస్తులు ఉన్నా
భయ భయంగా సమాజం సందేహాల డోలలపై

ఈ సంవత్సరం అందునా వర్తమాన కాలంలో
జీవన గతిలో హింస పాలు ఎవరెవరివి ఎంత?
ఎంతెంతో పంచాంగం విప్పి చెప్పేరా? గుణించి
దర్శన శక్తితో జ్యోతిషం, రహస్యం బయట పెట్టేనా?

ఉన్న వ్యవస్థలో మార్పులేవేవో అనివార్యాలవుతాయి
ఒక రొకరిలో ఒక్కొక్కటి ప్రాధాన్యం ! వహించేను
సమూలచ్ఛేదం జరిగేది కాదు; ఒకవేళ అయితే మాత్రం
సమాజం సంక్షుబ్ద దృశ్యాల నెదుర్కోవలసి ఉంటుంది
ఏ వ్యవస్థ అయినా స్వార్థాన్ని కాపాడుకునే వారెందరో
ఏవైనా కానీ కొన్ని మార్పులకు సిద్ధం కాకపోతే
సమాజం తన ప్రవాహకతను కోల్పోతుంది

# 6. పయనం మలుపులలో

అసంతృప్తి రేఖ దాటితే వ్యతిరేకం పెచ్చు మీరుతుంది
ఎన్నికలలో ఓటర్లు తమ ప్రభావం చూపవచ్చు
ఈ విషమ పరిణామాల నెవరు ఒప్పుకుంటారు
కాలం గడచే కొద్దీ యశో రూపం కోల్పోయేరు
సామాజిక రాజకీయ ప్రశ్నలకన్నిటికీ జవాబులు దొరకవు
సమస్యపై ప్రజలందరి మన్ననలను పొందడం అసాధ్యం!
క్లిష్టమైన జటిలమైన చిక్కు ముడులలో నుండి
బ్రతుకులు బయటపడి శుభ్రమైన గాలి దొరకడం కష్టం

వెలిగే వత్తికి సెమ్మెలా రాత్రి చీకటి
ప్రయోజన పరంగా దీనిని నిందించే వారులేరు
దేని ఉపయోగం దానిదే ఎంత శక్తి వంతమైనా
మనిషి తలుపు తెరిస్తేనే లోనికి ప్రవేశించేది

వెలుగుతో ఆదర్శం మనిషికి మూడో కన్ను!
దృశ్యం పోటోలో వస్తువుతో విషయం తప్పదు
ఇరువురి మధ్య శత్రుత ఘర్షణ పాత విషయం
భూమిపై సంపద తన వశమయ్యే గమ్యంతో జరిగేను

ఏ కార్యాచరణ అయినా అనుభవ చరిత్రలో
జీవితాల ఆయువు పరిమళవంతం అవాలనే
ఎంతటి శ్రేయోమయ మనుకున్నా, ఈ జీవితం
ఎదపై నిప్పులు కుంపటితో తలపై జలదం మాటతో నడచేదెవరు?

విప్లవం నిప్పులు పరచిన మార్గం చూపిస్తుంది
ప్రజాస్వామ్యం మబ్బుల వంతెన నిర్మిస్తుంది
విప్లవం తత్కాలంలో ముళ్ళ బాట పట్టిస్తుంది
ప్రజా శ్రేయం ఆయువును పరిమళ వంతం చేస్తుంది

పూర్వపు నిప్పులు చల్లిన బాటల్ని సత్వరం
మొక్కలతో అందం తేవడమొక మానసిక విజయం
ప్రజలలో స్నేహలతను పెంచడమొక కర్తవ్యం
దర్శనాలు విప్లవాలు వస్తూ పోతాయి పయనం మలుపులలో

# 7. పేలాలు కారు

దారులెన్నొ ఎప్పటివో ఒక దాని నొకటి అతిక్రమిస్తూ
దిశలు వేరయి సరికొత్త ప్రయోజనా లేర్పడేను
కాలి నడక దారులు ! అసంఖ్యకాలు పాయలుగా
ప్రస్తుతానికి విప్లవ శాఖలతో ఘర్షణకు దిగేను రాజ్యం
మనిషిని తొలగించేందుకు వెనుదీయనిదీ నక్సలిజం
సంఘంలో హింసకు ప్రేరణయైన అండ ముందు నిలబడేదీ

స్థిరత లేని దార్శనికం ఎందరికి ఆమోదకరం
మనిషి మనిషి ఆదర్శమిపుడు ముక్కలు ముక్కలుగా

వివిధ వాద భిన్న భావ సంకలనం విశాల సమాజం
విడిపోయే స్థితులలో, ఒకరు చెప్పింది మరొకరికి పట్టదు

కాస్త తీరిక దొరికేది నేతలకు విరామంలోనే
అది ఎన్నికలు మళ్ళీ ఎన్నికల మధ్య విలాస యాత్రా సమూహాలు
నిరంకుశులు ప్రభువులుగా ఆసనాల నధిష్ఠించేరు
పీడితుల అలజడి శ్రామికుల నినాదం మళ్ళీ ధ్వనిస్తుంది

జాలి చేతనో బాధ్యత తెలిసో ప్రజలలో కలిసీ
తనలో ఇంతకాలం కనపించని విలువల్ని పైకి తీసేరు
సామాన్యుల పట్టాభిషేకం పేరుతో నినాదాలు
వీధులలో ప్రదర్శనలు కట్‌ఔట్‌లు పోస్టర్లు చర్చలు

విప్లవాచరణ పంక్తిలో “అన్నలు” అగ్ని సదృశులు
మరికొందరు సైద్ధాంతిక మిత్రులు విశ్వసనీయులు
ఎన్ని తరగతులుగనో, తమ తమ రహస్య చలనంలో
చరిత్ర కంటిన మలినాన్ని తుడిచేయాలనుకునే వారూ

ఏది జరిగేనొ! చెప్పలేని స్థితిలో
సంప్లవనం గతిలో విప్లవ వికాస శక్తులు

తిండి లేని గుడ్డ లేని చోటు దొరకని వారు
అందరి కంటబడుతూ యువత ! తిరిగేరు
ఉద్రేకంతో ఉద్వేగం పొందిన భ్రమణంలో గడిపేరు
సానుభూతి పరులు కొందరు చూపే
ఆలన పాలనలో శీతల స్పర్శతో తేరుకుంటూ
గాలికి రామార్పణ మయ్యే పేలాలు కారు

# 8. ఎవరికేది అవసరమో

చెట్ల కొమ్మల చాటున మౌనంగా ఉన్న
ఆయుధం హఠాత్తుగా ధ్వనిస్తుంది! చకితంగా

అడవిని మేల్కొల్పుతుంది
నిశ్శబ్దానికి రెక్కలు వచ్చి
ఎగిరినట్లు మెరపు తీగెల వలె దుర్వార్తలు
పల్లె నుండి నగరానికి నగరం నుండి అడవికి
బ్రతుకు నుండి యుద్ధానికి, యుద్ధం నుండి రహస్యానికి

తప్పుకొనే వీలున్న చోట ప్రభువులు
తప్పుకొనే వీలు లేని చోట నాయకులు
ప్రభువు నాయకుడు ఇరువురు కలిసిన రణతంత్రం
ఉద్యమ సన్నాహం కాదు ఎప్పటికప్పుడు చివరి దశలో

తాము చేసే పనిపై అహంకార చర్యల ముద్రలతో
వదలాలని ఒకరు, కోరికలతో పీడకులు
అణచి వేత నుండి తలను విదల్చి బయటపడి
ఎదురు తిరిగి ప్రశ్నల బోనులో వేసేరు పీడితులు

ప్రసంగ పదాల నుండి ప్రచార పర్వం వరకు
వ్యక్తుల అస్తిత్వంలో భాగాలయి దార్శనికం
ప్రేరణయై బాధితులను ఎదురుగ నిలబడ జేసేను
కాలం వినిపించేను ప్రగతి యశోగీతం! కవితలో

మనస్సును సాహస గాథలతో కట్టివేసేను
చరిత్రను మానుష కథలతో నింపివేసేను
ఎవరి కేది అవసరమో వారు దానికి వశులై
విజయ ఫాల ఫలకంపై అక్షరాలు నింపేరు,

నరకబడిన చెట్లు శుష్కమైన కొమ్మలు
మళ్ళీ చివురిస్తాయని ఉపయోగిస్తాయని ఆశలు
సమాజ వృక్షం పూలు పూస్తుందనీ
అవి తమ కోసం నిర్దేశింపబడినవనీ
జీవన రూపం నుండి ఫలాలు తమకు లభించాలనీ,
అవి తమ చేతుల నలంకరించాలనీ ఆకలి తీర్చాలనీ

# 9. ఎచట నుండో సహాయం

పూలు పూచి వాడి రాలి నేల పాలయ్యేను
మట్టి నుండి చినుకుతో మొక్కలు రావాలనీ
ఫలం పండి మనిషిలోని ఆకలి తీర్చాలనీ
దేని అస్తిత ఉపయోగం ప్రయోజనం దానిదే

వాస్తవ స్థితికీ జీవన కళకూ సంబంధం
ఎప్పటిదో? మనిషిలో వికాస శక్తిని చూపేను
లోన అనల జ్వాలా చలనం చేతనలో
ఇది ఒక నాటితో ఆరి పోయేది కాదు

అణచివేత పీడన లేని సమాజ చక్రభ్రమణంలో
మనిషి అస్తితలో సహజమైన సుందరతను చాటేను

అడవిలో నిర్భయంగా తాము అమరులన్నట్లు యువత
శాస్త్రవేత్తలు, రచయితలు మరెందరో
ముందు వరసలో ప్రగతి కవులు, స్వేచ్ఛా జగం కోరేవారు
మానవతా పూర్ణమైన మనో బింబాలతో

ఏకాంతంగా మాటలు, సమూహాలతో చర్చలు
ఒంటరిగా స్వగతం ప్రపంచంతో ఉపదేశం
వివేచనతో సమస్య చర్చలతో నిగ్గు తేల్చి
ఏదో ఒక నిర్ణయానికి రావలసి ఉంటుంది

సమస్య పోను పోను జటిలమై ముడులు ఎక్కువై
క్షోభ పెట్టడం! తన కాలక్షేపానికి బాగా ఉంటుంది
మార్పుపై కోరికతో పాటు పరిష్కార దిశగా ఆలోచన
సాగినపుడే ! భవిష్యత్తు సాగుతుంది, సమభావంతో

రాత్రి దారి తప్పి కనిపించని చీకటిలో
చెరువు కట్ట దిగి, నీటిలో పడి
మునిగితే ఎవరో మరునాటికి
ఏ సూర్యుడో, చేక్కలో! చంద్రుడో
గట్టుకు చేర్చేనని మదిలో ఆశ!
ఎచటి నుండో సహాయం వస్తుందనే

# 10. నిర్మాణంలో

ఉగ్రవాదులు ఊరులో అడవిలో పట్టణంలో
ఎక్కడైనా ఇమిడి పోగలరని; తెలిసిందే
తాము నమ్మిన సిద్ధాంతం! తప్ప
మరొకటి వినని మదికి అంకితమైనవారు

తీవ్ర భావజాలంతో పాలనా యంత్రాంగంలో
ఒకరుగా రహస్య ప్రకారాలతో బ్రతికేరు
ఎవరికైనా తెలియకుండా గుప్తంగా ఉన్నవారు
నిరంకుశులు ఉదారులు ఇరువైపుల ఉన్నదే

ఎవరికి వారు తాము చేసే ప్రతి పని
విజయానికి సోపానంగా తలచేవారూ
పనికి రాని వస్తువుగా ఎవరూ దేనినీ
ఎవరినీ తొలగించలేరు ఈ ప్రపంచంలో

పాత్రలుగా మలచబడి మరో నమూనాలో
ప్రకృతి వనరుల మధ్య సమాజ సహాయంతో
పుష్కలతను బట్టి నీరు వంపులలో దిగి
వేగమందుకొనీ, దాహం తీరుస్తూ పోయేను
శూన్యం పోగొట్టాలని ప్రవహించేను
అవనిలో సృజన సంపద పెంచాలని సాగేను

మట్టి కణం ఎప్పటికీ తిరస్కరణీయం కాదు
అడవులలో సృజన శక్తి ప్రకృతి నిహితమై
ఇది సంఘానికి రూపం ఇస్తుంది
అనలాన్ని చల్లార్చి కోపం తీర్చేను

మట్టిని అలరించే విప్లవ కారులు
తమ వీరంతో చరిత్రను అందల మెక్కించేరు
మోడును చివురింపచేసి విజయంగా మార్చేరు
సమాజాన్ని వసంతంగా మార్చాలనీ కొందరు

మట్టి కణం నీటి బిందువు రెండూ కలసి
చూపుకు సృజన సుందరతయే కాదు
సమాజానికి ప్రయోజనమూ కూర్చేను
వ్యక్తుల వినిర్మాణానికి చాలా ఉపయోగం

# 11. అనల తరంగాలతో

ప్రగతి ఎవరి స్వంతం కాదు
విప్లవ వాదమూ ఎవరి ఆస్తికాదు
ఎప్పటి కయినా వర్తించేను అవసరంలో
ఇప్పటి మార్పులతో సాగాలని ఎందరో

ప్రవాహ వేగంలో భూమి కొట్టుకపోయి
తగ్గాక ఎక్కడెక్కడో తల ఎత్తుతుంది
భూమిలోని ఉదారతతో ఉపయోగం
నీరు తగ్గాక సజీవంగా తల ఎత్తుతుంది

ఇది ఒక నాటికి అంతమయ్యేది కాదు
దీనిపై దార్శనికం ఒక విశాల ప్రేరణ రూపం
ఉగ్రవాదం పరివర్తన గాథకు పర్యాయపదంగా
మనిషిని మరీ మరీ పదును పెట్టే శిక్షణ స్థానం

దారిన రాళ్లు ముళ్ళు దొంగల భయం లేకుండా
చూచే కర్తవ్యం పాలనా యంత్రాంగానిదే
ప్రభుతను స్వాధీనం చేసుకొని వెలగబెట్టగా
నియంతలదే, తమ రాజ్యం మళ్ళీరావచ్చు

జీవితం ప్రవాహ సదృశ మనిపించినా
వివిధ స్థానాలలో ఎగుడు దిగుడు శిఖరాలతో
మనిషి జీవన వాస్తవాన్ని తెలిపేను
మనిషి సహన వహన శక్తులను చూపేను

జీవితం ఎప్పటికీ ఏదో ఆశామయమైనా
నిరాశ నుండి బయటపడి బ్రతికే శక్తి కలది
శిలల మధ్య ఆలోచన చేస్తుంది
మేటల వద్ద మౌనాకృతి వహిస్తుంది

ఆకాశం వీడాక జలానికి ఆధారతలం భూమి
ఊళ్ళూ అడవులూ దాటి సమాజాన్ని తలచేను

పల్లెలో పట్టణంలో నగరంలో అరణ్యంలో
ఇపుడు విప్లవకారులు, తీగెల వలె పాకుతూ
ఉగ్రవాదాన్ని ఆశ్రయించి ఉద్రేకం నెరపేరు
అనల తరంగాలతో ప్రతి వస్తువులో వేడిని
జనింప చేసేను చేతన కవకాశంతో

## 12.

మిత్ర బంధంతో మనుషులలో కదలుతుంది విప్లవం
మనిషిని ఆర్ద్ర పరుస్తూ మనసును సంతోషపెడుతూ

నియంతలకు వ్యతిరేకంగా నిర్మొహమోటంగా పోరాడే
సామాన్య జనంలో రాజకీయ చేతన ఒకటే మార్గం
మనిషి వర్తనంలో మేఘం ఆగమనం నిర్గమనం
శుష్కమైన జీవితాన్ని పరిమళ భరితం చేసేను

ఎప్పటికీ కాకపోతే అల్పంగానో స్వల్పంగానో
సమర స్పృహను సజీవంగా నిలిపే
ఉద్యమాన్ని నడిపే శూరు లెందరో ! విప్లవ కళికలు
వీరులుగా మారే చేతనతో ఏదో పేరుతో

సందర్భం ఉండాలే కాని అదనుగ దృశ్యం
వీరంగా మారేను నెత్తురు చుక్కల దండుతో
దీని తీవ్రతల్నిబట్టి సాధారణ జీవన స్థాయిని
సంఘం కోల్పోయేను బాధలకు గురి అయ్యేను

ఆధునిక కాలంలో ఏ విప్లవ చర్య అయినా
దీర్ఘ కాలం పోరాటం సాగే అవకాశం లేదు
ఎంత సహన సంస్కృతి లోను క్లిష్టమై
సమస్య తీరనిదై కష్టాలకు లోనయ్యేను

సమూహాల ఉద్యమాలతో వర్గాల పోరాటంతో
తన జీవనం స్తంభించి శిలాకృతులయ్యేను
అతిశయ రూపంతో విశ్వవ్యాప్తి చెందాలని
ఖండాలు దేశాలు ప్రదేశాలు విప్లవ కేంద్రాలతో

మధ్య మధ్య అణగుతూ
తలలు పైకెత్తుతూ వీలు చిక్కినపుడు
ఉద్యమించే తీవ్రవాదులు
రహస్య ప్రకారాలతో ఆకర్షణ యంత్రాలయ్యేరు
చంపడానికీ చావడానికీ వెనుదీయని పురోగాములు

## 13. విచిత్రం సాధారణమై

ఇటీవలి యుక్రేనియాలో చెలరేగిన ఆకలి కేకలు
రణ బాధలతో ఎగసే ఆర్తరవాలు
నిరంకుశ పథంలో ఏర్పడే విషమగతులు
ఒకరి మీద ఒకరు బాధ్యతను మోపేరు

విప్లవ మూలం నుండి పెరిగిన అశాంతి తరువు
ఆర్థిక సామాజిక రాజకీయ దుస్థితులేర్పడి
ముక్కలుగా ఛిన్నమైన స్థితిలో దైన్యాకృతిని
పొందడమే కాదు, మానసికంగా క్రుంగేరు

మనిషి మనిషిని విస్మరించి మౌనం వహించడం
మానవ బంధం మాయమై తెగిన పతంగులై పోవడం
మోయలేని బ్రతుకు బరువు జారి పోయి కొన ప్రాణం
గాలిలో కలిసేను, ఆత్మహత్యకు దిగేనో?
హత్యకు గురి అయ్యేనో; అనుమానం తీరేదెన్నడు?
అడవులలో వరదలకు నడకలు నేర్ప నక్కరలేదు

ఉద్యమంలో బాహాటంగా జరిగే చర్యలు
విప్లవంలో గుప్త చరంగా పథకంలో కదలేను
దేశంలో మనిషి ఉనికితో వ్యక్తిత్వాలను
శిఖరాలుగా ఉద్యమాన్ని విప్లవం బలపరస్తుంది

ప్రజల గౌరవాభిమానాల విలువల్ని కాపాడేందుకు
జీవన నవ వికాసాల్ని వివేచనలో జ్ఞప్తికి తెస్తుంది

దేశాలలో పయనమెంత దూరమయినా, కష్టమయినా
ఎక్కడయినా ఒకటే స్వేచ్ఛలో స్వతంత్రంతో మానవం

ఒక వైపున జ్వలించే దిశలు ! ఎవరి కారణాలు వారివి
ఉద్యమమొ విప్లవమో! జరుగుతూన్న యుక్రేనియా
కలహం లోనో దేశం ముక్కలయ్యే ప్రమాదంలో
ఎవరి అభిమతం వారిది, మౌన పటంచే కప్పబడీ

ఆశలు పూలు పూసేననే, నిప్పులు కనబడే ననుకోరు
ఇది విచిత్ర మయినా, బహు సాధారణ మయి పోతూంది

# 14. క్షతిలేనిది

నదుల నీరు జలధిలో కలిసినట్లు మురిసినట్లు
మస్తిష్కంలో ఊహలు క్షితిజాని కర్పిత మయ్యేను
కన్నీటి చేక్కలో అనల కళిక! జాడ మెరవడం
మదిలో తాపం కోపం శత్రుతలను బింబించేను

నియంతల ముఖ ఫలకంపై ఏ శాసనం కన్పించేనో కానీ
సందర్భంలో ప్రజాస్వామ్యం వెనకనే వీపున వేలాడుతూ
ఆలోచన రాని విప్లవం గురించి చింతన మొదలయ్యేను
వ్యక్తిలో ప్రాణం లేచి ఉత్సాహానికి క్రియాశక్తి నిచ్చేను

చిత్రంగా అనుకోనివి జరగడ మొక విశేషం
విప్లవ విషయంలో అరణ్యాన చరిస్తూ మృగ తత్త్వం అబ్బేనా?
మానవ శక్తి పరీక్షలో చివరకు మానుష లక్షణం నిలిచేననే
కృత్రిమమైన రెక్కలతో భూమికి కాస్త పైన ఎగరవచ్చు నేమొ

ఇది భూమిపై అనల ప్రవాహమై సరించవచ్చు
కల్లోల సముద్ర తరంగాలపై తేలుతూ పోవచ్చు
ఉల్లోల లహరుల సరస్సులో ఊగుతూ పోవచ్చు
విరామ సమయంలో ఒక చోటు నుండి మరో చోటుకు

చీకటి తెరలను తొలగించే సంకల్పంతో
వెలుగుల కవకాశం బదులు తానే వెలుగు కావాలనీ
విప్లవ మూర్తులు ! శిలా రూపాల్లో, ముష్టి ప్రహారాలతో
మనుషుల్ని బద్ధలు చేసే సాహస బల ధైర్యంతో

నింగినీ జలధిని వదలి భూమి నంతా ఆక్రమించి
విప్లవ శక్తులచే నింపాలని, దాడిలో సూర్యుని మ్రింగాలని
భూమిపైనే కాల వాహనంపై తిరగాలనీ
చక్రాలను అడ్డుకునే మృత్యువును జయించాలనీ

మనిషి వ్యక్తి సమూహం సమాజం ఎక్కడి కక్కడ
తమ తమ ప్రత్యేకతలతో జీవిత మొక స్వేచ్ఛా సంకలనం
విస్తరణంతో ఉద్యమం దీర్ఘ కాల ప్రయోజనంతో విప్లవం
చేతనలో గాఢత తీవ్రతతో, గతిలో ఎప్పటికీ క్షతిలేనిది

# 15. కావలసింది

గడచిన తరాల నతిక్రమిస్తూ వర్తమాన తరం
స్వేచ్ఛకు స్వతంత్రానికి మనోజ్ఞమైన ప్రేరణం
గతంలో కన్న కలలు లోయల్లో పడేను
కొన్ని విజయంలో గిరి శిఖరాలను చేరాలనీ

విప్లవానంతరం గిరి శిఖరాలు కలలో వ్యక్తిత్వాలతో
సామాజికి కార్యాలను జ్ఞాపకం చేసే పురావస్తు చయంలో
కొన్ని సందర్భాల్లో ఫలితంలో అంచనాలు తప్పినా
వెనక్కి తిరగడం జరగదు! యథాస్థితిలో ఉండవచ్చు

ఎంతకాలమైనా పాత మాట! అదే ! అప్పటిదే
ఈ సమయం లోనే కొత్త మాట తప్పని చొరవతో
ఇప్పుడు జరిగేదేదో జరగడం ప్రధానం
గమ్యంలో మార్పులు రావలసిందే సత్వరం

విప్లవంకై ఎదురు చూచే వారు లేకపోలేదు
నిరీక్షణలో సర్వశక్తుల్ని అంచనావేస్తూ ఉండేరు
వినాశనం నుండి వినిర్మాణానికి ప్రజాస్వామ్య గమనం
విధ్వంసం నుండి సృజన కళకు స్వేచ్ఛా కవిత్వం

ఏ విప్లవం నిశ్శబ్దంగా నడవదు
పిడుగుల వంటి నినాదాలతో కదలుతుంది
ఆయుధ బలంతోనైనా ఈ ప్రపంచాన్ని
తన వశం చేసుకొని పరివర్తనలో పాలన చూపాలనీ

సూర్యునిలో ప్రకాశ శక్తినీ, చంద్రునిలో వెన్నెల రక్తినీ
ఏ భేదంలేని సమభావన సమన్యాయం సహనంతో
ఉద్యమ స్ఫూర్తితో మొదలై విప్లవ దార్శనికంతో సాగి
ఈ భూమిని మానవతా రూపంతో ఫలవంతం చేయాలనీ

ఇపుడు ఇచట చెలామణిలో ఉన్నది నక్సలిజం
బీభత్స కాండలో దృశ్యాలొకటొకటీ వరసగా
జనతకు కావలసింది! నేత నుండి పాలనలో శ్రేయో రూపం
కవి నుండి కవిత, నిఖిల లోకంతో హృదయ బంధుత
పనికి రానిది! గడ్డ కట్టిన హిమ శిలల మౌనం
కావలసింది ! రస స్పర్శ స్పందనతో ప్రవాహ రూపం

# 16. కొత్త గాయంకై

ఏ దేశం అయినా ప్రజలు అయినా సమాజంలో
చరిత్రలో పరంపరగా వస్తూన్న నియమాలు
పేదరికంలో పీడితుల్ని కఠోరంగా అణచివేసి
పాతాళాన్ని పరిచయం చేసేరు, దమన కాండలో

పైకి రాలేని దుర్గమ స్థితిలో దారులు లేని దశలో
బ్రతుకొక ఎడారి వాలకాన్ని పొందేను
లేని రెక్కలు సమకూర్చుకొని మరికొందరు
పర పీడకులు గగన విహారాన్ని తలపెట్టేరు

కల్పనలో స్వప్న పరీక్షలకు పూనుకునేరు
దీని కెదురుగా వీరి నెదుర్కొనే యత్నంలో
తీవ్రవాదులు చండతకు పరాకాష్ఠగా ఉదగ్రులు
సమభావం సమన్యాయం కోరే విప్లవ మూర్తులు

ఈ విశాల భూమిపై దేశ దేశాలలోని ప్రదేశాలను
తమ వశం చేసుకొనే హింసకు వెనుదీయని
పై బూది పొరలలో దాగిన అగ్నికణాలతో తమలోని
పోరాట శక్తిని ప్రదర్శించేరు క్రాస్‌ఫైర్‌లో

అపుడపుడు తప్పించుకొనీ ఉపాయ మతిని చూపేరు
కలహమైనా యుద్ధమైనా ఏ పక్షాని కయినా
కనీస స్థాయిలో పాటించవలసిన మానుష ధర్మాన్నీ
మానవతను చూపడం మనోజ్ఞ విశేషం

ఇపుడు ఇచట చెలామణిలో ఉన్నది 'నక్సలైట్'ల ప్రతాపంతో
రాజ్య హింసను దృష్టికి తెచ్చే ఉపాయ గుణ వర్తనం
ఈ సమయం సజీవమైన మనిషి రూప దర్శనం
క్లిష్టమైన స్థితుల నధిగమించే రాజనీతి ప్రకటనం

ఆయుధాన్ని పేల్చి తమ బలాన్ని తెలియజేస్తూ జనతకు
వచ్చే పరివర్తనం, తెచ్చే సౌభాగ్యం రుచులు చూపాలనీ
ఒక్కొక్కరికొక్కక విధం రక్షణలో చాతుర్యం
పాత గాయం రణ చిహ్నంగా, కొత్త గాయంకై సిద్ధంగా

# 17. శ్రమను తగ్గించే వెన్నెల

ఒక మలుపు తిరిగాక కదలికలో మార్పు సహజం
నేడు జీవన చలనంలోను తరతరాల చిహ్నాలు మిగిలి
రక్షణ నుండి నర హత్యల దాకా ఒకే బుద్ధి విలసనం
స్నేహం ప్రేమ శత్రుత ద్వేషం తిష్ఠ వేసుకొనీ మదిలో

ఒక శిల తప్ప ఏదీ నిశ్చలంగా మనలేదు మౌనంలో
గగనంలో మేఘం స్థిరంగా ఉండలేదు, కదలుతుంది
పిడుగులతో శబ్ద ప్రపంచాన్ని కిందికి దింపుతుంది
చీకటి నిశ్శబ్దాన్ని అభిలషిస్తుంది, ఒంటరిగా
మేఘం నుండి మెరపు ! ఎన్నిటినో జ్ఞప్తికి తెస్తుంది
అవసరమైనది కనిపించని వస్తువు, చీకటిలో నయితే

వీచే గాలికి పూవు, పండు మట్టి పాలు కావచ్చు
స్థిరమైన ఉనికితో చెట్టు సుఖకరంగా బ్రతికేను
వీచే సన్నని గాలులు మనిషికి నమ్మకమిచ్చేను
పునర్నవంలో చెట్టు సుందర సంపదలను చూపించేను

మంచి చెడు సృజన విలయ రూపాలు
మనిషిలో ప్రకృతిలో వలె, దృశ్యమాన మయ్యేను
చెడు అనల కణం వలె, మిణుగురును తలపిస్తుంది
మంచి గులాబిలా మల్లెలా పారిజాతంలా గుబాళిస్తుంది

పగలు వెలుతురు వస్తుంది పోతుంది కాని
మనిషి మనస్సు ఎప్పటికీ లో వెలుతురుతోనే
చంద్ర వంక చేతిలో కొడవలిని జ్ఞాపకం చేస్తుంది
సూర్య బింబం కొలిమిని గొడ్డలిని ధగధగలాడిస్తుంది

రెండూ కృషీవలుని సాధనాలు, పని విషయంలో
ఎప్పటివో ఉపకరణాలు, ఉపయోగకరాలు
కర్షకుల బ్రతుకులలో శూన్యాన్ని అర్థవంతం చేసేను

ఆయుధ సాధనాలు పీడకుల చేతులలోనే ఇప్పటికీ
అదలించో బెదరించో హననంతోనో అన్నిటికీ సిద్ధంగా
ప్రకృతి వర్తనం మనుషుల బ్రతుకులకు ప్రత్యామ్నాయంగా
శ్రమను తగ్గించే వెన్నెల హ్లాదంతో పూర్ణత కూర్చేను

# 18. విజయ దీప్తితో

చెట్టు ఎంత ఎత్తు పెరిగినా నిటారుగా
దాని మూలం మట్టిలో భూమి లోనే భద్రంగా
ఇది మనిషికీ వర్తిస్తుంది, ఒక నడకలో తప్ప

శిరసు క్షితిజంలో గగన తలంవైపు
ఇది మనిషికీ చెందుతుంది 'మది'కి తప్ప
దశ దిశలలో క్రమించేను విశేషంగా

క్షణాల్ని నిప్పు రవ్వల వలె ఉపయోగించేరు
క్షణాల్ని పూల మొగ్గల వలె తలచేరు
విశ్లేషణలోనే మనసుకు విషయం తెలుస్తుంది
దీని కెంత విలువో ఏది దేనికి సరి అయిందో కూడా

ఆయుధాల మోత ఇపుడు అడవులలో
మానవుల సమాజం నుండి దూర దూరమవుతూ
శ్రమ శక్తుల విభజనం! ప్రజ ఇష్టంతోనే
విప్లవం ఎజెండా ఇంకా ఎక్కడిదక్కడే ఉంది

లక్ష్యంలో జన భాగ్యం సమాజ హితం రెండూ
అనుభవ జగత్తులో దృశ్యం చూడాలని కోరిక
మార్పు మంచి కయితే, స్వాగతం లభిస్తుంది
ఇది అణచివేతకయితే విముఖత కనబడేను

స్వప్నంలో ఆనంద విహారం కన్నా
మెలకువలో వాస్తవానుభవం మేలు
నియతమైన ఆయువు పరిమితం తెలిసీ
యశో రూపంకై ఆరాటం! మనుషులలో

తనలో భయం నీరు లేని లోతు బావిలా
తనలో ప్రియం మనసులో విజయ దీప్తితో

అసహనం అశాంతి మనసుకు ఇరువైపుల నాణెం వలె
దీన్ని నిలుపుకొనేది సగం సగం పంచుకో లేనిది
ఉగాది నాడు తరువును చూస్తే మానసికంగా
మనిషిలోని ఆశా రూపానికి వసంత ముఖం నవం

# 19. స్వేచ్ఛలో వికాస స్పృహతో

ప్రజలు ఎన్నుకొనే నేతలు, వేసే పాత్ర లెన్ని విధాలో
ఎవరి కిష్టమైంది వారు, వేసేరు మెప్పించేరు
అభిప్రాయ భేదాలు కలహ ప్రపంచానికి దారి తీయరాదు
ఇది మారణ రణ పరిస్థితికి అవకాశం కలగ జేయరాదు

అందరికీ చెందినవి సమస్యలే ఎక్కువ
మౌన ముఖంతో ప్రేక్షక పాత్ర అవసరం లేదు
గుడి గంటల మ్రోత అందరికీ వినిపిస్తుంది
అందరికీ తమ విధి జ్ఞాపక మొస్తుంది

విప్లవ మతులకు సమాజ చింతనలో
మనుషుల్ని గురించి ఆలోచన ముఖ్యమైంది
హక్కులు పంచబడవు, బాధ్యత మరవ బడదు
ఇవి తాయిలాలు కాదు; దాన విషయము కాదు

సమాజంలో ఒకరుగ అందునా శిష్టంగా
సచేతనతో బ్రతకడం గొప్ప విశేషం
ప్రశ్నల తూణీరంతో ఎదురవుతుంది విప్లవం
రోజులు గడచే కొద్దీ పథకం మారుతుంది

కొందరి చేతుల్లో నయితే ధూమ శిఖ లెగసేను
మధ్యలో ఆగిపోవచ్చు, ఎవరికీ తెలియకుండా
యత్నం సాగేందుకు నిజ సంకల్ప మవసరం
అంకిత భావంతో నిబద్ధత, విజయానికి ముఖ్యం

స్వప్నంలో స్వర్గ విహరణం మానసం
మెలకువలో మార్పు, సమాజానికి వాస్తవం
చక్రభ్రమ ణంలో తిరిగే ఇరుసు అరలవలె
పెద్దలు ఆగని చేతనతో సంతోషపడేరు

జలధిలో తాను కలిసేది ఏ నదికీ తెలియదు
పుట్టుకతో మొదలైన జీవితం పోను పోను
ఏయే స్థలాలలో ఎన్నిన్ని మలుపులు తిరిగేనో
ఎవరేమి అయ్యేది పోను పోను తెలుస్తుంది వాస్తవం
విప్లవ బల సంపద నుండి స్వేచ్ఛలో మనోజ్ఞ హృదయంతోనే

# 20. చేతన కిరణమై

ఉద్యమం దీని విస్తరణం హింసకు సయితం
కార్య సాధనలో దార్శనిక ప్రభతోనే విప్లవం
అహంకార అహంభావ అహం యుతం
జన శ్రేయో లక్ష్యంతో ప్రేయంలో దారి తప్పవచ్చు

కానీ ఇది ఉపయోగంలో ఉన్నతిని కోరుతుంది
వికాసంలో చరిత్ర రూపానికి రేఖలు చూపుతుంది
దేశానికి బ్రతుకులను జగతికి భాగాన్ని మనసుకు తృప్తిని
పట్టం మారుతుంది, ధూమం బదులు మేఘం! చేరుతుంది

ఆయుధం ఆశ్రయ మిస్తుంది, అదే ధైర్య మిస్తుంది
దారిలో అడ్డంగా పడి ఉన్న సజీవ విద్యుత్ తంత్రులను
ఎవరు కాలువేసి తొక్కుతూ పోతారు అమాయకంగా
కార్య సాధన గుణం ఎన్ని భయాలో అన్నిటిని దాటుతుంది

వీరం తాండవిస్తుంది ఇది ఉన్మాదం కాదు
ధైర్యానికి పూలు పండ్లు పరిమళం చూపిస్తుంది
ఊపిరి లయ సుందరతతో పాటు ఉత్సాహం
ఉదగ్ర తేజం గెలుపుకు ఓటమికి కారణమయ్యేను

రక్త సిక్తం కాని అవని మనిషి అయినా రణం లేదు
వీధులలో నినాద పంక్తులులేనిది, ప్రదర్శనం లేదు
అహంకార జ్వలనంతో చేతన ప్రకాశిస్తుంది
సామాజిక రాజకీయ నైతిక బలం పెరుగుతుంది

తాము జలధిలో కలిసేది ఏ నదికీ తెలియదు
ఆవేశం ఉద్రేకం ఉదగ్రం కలిసిన ఉత్తేజం
మనసులో భయ నిరాశలతో ఆత్మ హత్యకు దిగవచ్చు
ఒత్తిడిలో ఉన్నపళంగా ఆలోచన! చకితంగా ప్లవించేను

ఇరుపక్షాలు, పాలకులు విప్లవకారులు మోహరించిన
అరణ్యం! కాగితం పూలు చూపేనా? శాంతి కవచ మందించేనా?
చేదు గుర్తుల జ్ఞాపకాలు ఘర్షణకు దిగేనా?
ఆగని కన్నీరు బిందువు నుండి జ్వాలా శిఖ విప్లవం

ఒక్క బాష్ప కణం నుండి బయట పడే అగ్ని
రవి కిరణ తేజాన్ని మసక బార చేసేను

# II. స్వేచ్ఛలో మనోజ్ఞం

## 21. చేతన అవసరం

ప్రజా స్వామ్య సామ్యవాదంలో చేతన
ప్రజల జీవితాలను సంపుల్లం చేసేను
ఇది ముక్కలయ్యే సమాజాన్ని కలిపే సూత్రం
స్వేచ్ఛా కవితకు కావలసిన అమూల్య నేపథ్యం

పేదల గాథలు వీడని వ్యథలను వినగోరే
విపుల శబ్ద పటంపై ప్రజల కథా దృశ్యమయం

నియంతల మాటలపై సాగేరు కొందరు
నిరంకుశ సంజ్ఞలపై ఆడేరు కొందరు
వేదిక దొరికితే చాలు సమర్పణం
కాలం దేశం సంఘం ఏదయినా

ఎవరి అరచేతుల పైనొ ! అడుగులు పడాలనీ సాగాలనీ
ఎవరి చేతలతోనో బ్రతుకులు పండాలనీ, నిండాలనీ
పక్షులలో స్వేచ్ఛ ఎంతవరకు సాధ్యమో?
అంత కన్న ఎక్కువగా మానవ సంస్కృతిలో మనసున

ఆలోచనతో ఆకాశం కొలిచేను
బుద్ధి బలంతో భూమి నావహించేను
పేదను వీడని దార్శనికం ప్రజాస్వామ్యం
సామ్యవాద ఛాయలతో వాస్తవాల అవసరం

హృదిలో ఉన్నత ప్రయోజనం మొలకెత్తేను
నైతిక బీజంతో బ్రతుకొక ఆశ్రయ మయ్యేను
తరువును తలపించేను తాపం మరపించేను
ప్రకృతి అండ మనిషికి ఒక వసంత విభాతం

బ్రతికే సమాజంలో వివిధ మనో విధాలు
అవసరాన్ని బట్టి వ్యవహార జగతిని నడిపించేను
ఒకదాని నొకటి అతిక్రమించి పోటీ
మనిషి నుండి వికృతాలు బయట పడేను

అపుడపుడు శత్రు పక్షాలై అగ్ని శిఖలై
మనిషి పక్కన మనిషి సహభావం మరచేను
ఎండిన కొయ్య ముక్కవలె జడమై
సాయం వాడిన కిరణంలా క్రిందికి వాలీ

లిప్తలపై చేతనకై ఎదురు చూచేరు
మదిలో ఎదిగే దివ్యతను బింబించాలని

## 22. ప్రతిఫలం ముందుగా

మారే వ్యవస్థలో సమస్యలు తొలగేది
కొన్నే! కొంత వరకే సరికొత్తవి చేరేను
నీతి తప్పిన దారిలో పయనానికి
ఆటంకా లెన్నో! మధ్యలో విరోధాలు!

ఒక దాని కెదురుగా మరొకటి మౌనంగా
పచ్చగ బ్రతికే ఇచ్ఛ! ఎప్పటిదో? ఇప్పటికీ?
మధ్యలో కవి హృదయం శాంత సుందరంగా
ఉత్సాహ పరచే మనోజ్ఞమయిన కవితలతో

చెదరని లక్ష్యంతో చిత్తశుద్ధి అంకిత భావం
సంకల్పం కేంద్రంగా సమన్వయ రూపం
ప్రజాస్వామ్య విజయానికి సహాయకరమయ్యేను
సూర్య కిరణ తంత్రులపై స్వర ఝరి వినబడేను

ఒత్తిడి దమనం అలజడి ఆక్రందన లేని
సహభావ సమాజం! ఎప్పటికీ అవసరమే
ఇది ఒక సందర్భంతో తీరేది కాదు
వ్యక్తులలో సమూహాలలో రోజువారి
అనుభవాలను సరిచేసే యంత్రాంగ మవసరం
ఇది పాలనలో స్వచ్ఛత చేతనే సాధ్యం

ప్రతి ధ్వనించే నినాదాల ఘర్షణల నిరసన ప్రతిఘటనల
ప్రదర్శనల సంక్లిష్ట యుగం దృశ్యం వీధిలో సంరంభం
ఉండి ఉండి కల్లోల సముద్రమై అలలు గట్టు దాటేను
పాత ఆయుధం బల్లెం నుండి బాంబు వరకు వాడబడేను

భయంతో నిర్వాసితులు చెట్టునో గుట్టనో దూరదేశమో
చేరేరు! ఇది తెలియని దారులలో సంక్లిష్టదశ, పతనంలో రాజకీయం

నిందల బరువుతో నడుము వంగి పక్కకు తొలగిపోయి
చేతిలో పతాకతో మరొకరి నీడన ఉద్యమ చలనంతో
రేపు మరొకరు ఎదురయ్యేరు అశాంతి పర్వంలో
రోజు వారివి కాక అదనపు శ్రమ విలువలతో

తీరికగా ఆకలి చల్లారే! తత్కాలం ఉపాయాలు
ఆరోజు ప్రతిఫలం ముందుగ చేతిలో పడేను

# 23. అడవి తరగదు

పేద బ్రతుకుల దృశ్యాలు ఎక్కడ బడితే అక్కడ
ఏ దిశ చూచినా ధూళి ధూమం పొగలతో
అవల మనిషి రూపం గుర్తు పట్ట లేకుండా
ఎగసిన దుమ్ము బూది దిబ్బ బొమ్మలుగా మారేను

ఎక్కడికి పోయినా ఎవరికి కనిపించినా ఒంటరిగానే
ఎందరు కలిసినా వారెవరైనా అంతా ఒక్కరుగానే
ఊరు దాటితే ఏ గడ్డి బొమ్మో అనిపించేను
పుట్టిన రోజు నుండి ఒకే రంగు తీరు బట్టలు

ఈ దేశం సంస్కృతిలో భాగం, ఈ మాత్రపు భాగ్యం
పై స్థాయిలో దుస్తులు ఆభరణాలు తగిన విలాసాలు

రేపు వస్తుంది ఎవరికీ అనుమానం అక్కర లేకుండా
దీనికై ఈ రోజే ఎవరి నుండి సిఫారసో అక్కర లేదు

ఎవరికీ తాంబూలం సమర్పించనవసరం లేదు
శ్రమ జీవన శక్తులకు రోజులన్నీ ఒకటే, తిండి విషయంలో

అరచేతుల రేఖలో రేపటి సంగతులేమో కాని బ్రతుకులో
కాయలు కాచిన స్థితి మాత్రం అనుభవాన్ని ప్రకటిస్తూంది

నీలి మబ్బు రాక కాస్త ఆలస్యమయితే
పొలం పనులపై దృష్టి తీవ్రమవుతుంది
ఆదాయం ఖర్చుల లెక్కల సమీక్ష మొదలవుతుంది
ఏ రోజూ ఎవరూ చెస్‌లో ఆట వస్తువు కాదు

చెట్టు నీడ విరామ సంకేతం కాదు
శ్రమ జీవికి మాత్రం ప్రతి రోజు డిటోనే
ఈ నీడను నిషేధించే వారెవ్వరు?
కొమ్మలు నరికి ఆసరా పోయేనని విచారం

మనసులో అడవి పెరిగేంత కాలం
మనిషి మతిలో మృగాల సంచారం
మనసులో పూల వనం విరిసిన సమయం
మనిషిలో మనుషుల పరిచయం స్నేహ సుందరం

అడవి తరగదు, మనసులో భయం పోదు
తోటకు నీరు లేదు, మనసుకు మోదం లేదు

# 24. సంరక్షణ - భద్రత

స్టేషన్ చేరేందుకు సిగ్నల్ పని చేయక
రైలు ఆగ లేదు, ముందుకు దూసుకపోయింది
జరిగే ప్రమాదానికి బాధ్యులెవరు?
కర్తవ్యం మరచిన మనిషి ఎక్కడ? ఏ నిదురలో

ఎందరి ప్రాణాలకో మూకుమ్మడి ముప్పుగా
పోయిన ప్రాణాలకు సమానమేది? ఎంత?
ఎక్స్‌గ్రేషియాలో అన్నీ సరిగా సరిపోయేనా?
జరిగిన ఘటన పునరావృత్తం కారాదనే ఆశ
జరిగిన విషాదం మానవేతర కార్యదృశ్యమా

నిరంతరం జల నృత్యంతో సముద్రం ఎండి పోదు
ఎగసిపడుతూ హ్లాద పరుస్తుంది మనిషి కంటికి విందుగా
దాహం వేస్తే ఇది తీర్చగలదా?
అక్కడి నుండి మంచి నీటి కోసం పోవలసిందే
చెలమొ ! చెరువో నూయో నదియో!
ఏది ముందు కనబడితే అక్కడికి చేరవలసిందే

కవిలో చెలరేగే ఊహలకు మాటలకై
మథనం! ఆపై అమృత బిందువు జారేను
ఏది ఏమయినా కవిత మాత్రం ఆగదు
పద పదాన రస బిందువును సంస్పృశిస్తూ
అక్షర బిందువు సజీవ చరిత్రకు
ఒలికే అమృతాయమాన స్థితియే ప్రాధాన్యం

అనుకొనో అనుకోకనో అడవిలోకి నడిస్తే
మధ్యలో కాలిబాట భయావహం కావచ్చు
సంరక్షణ వ్యక్తి యోజనలో భాగం
భద్రత సమాజ పథకంలో అంశం
క్లిష్టమై స్పష్టత లేక అయోమయంలో
దారి తప్పి చిక్కుల్లో మనిషి! ధైర్యం సడలేను

కవర్ నుండి తీసిన వయోలిన్ తీగె వలె
స్వర లహరి ననుభవించాలని ఉత్సుకత!

# 25. అంచనాలు

స్వార్థం మనసున జలధిలో సబ్‌మెరైన్‌లా దాగి
పాలనలో రాజకీయం నీతి బాహ్యం ప్రమాదం
ప్రమాదాన్ని తలపడేందుకు సిద్ధంగా సమయం
ఈ సమయం ఎవరి చేతులలోనూ లేదు, తల రాతే

ఉద్యమ చలనంతో చరిత్రలో అదృష్టం
గమ్యం చేరేందుకు పయనం మొదలైంది
అంతవరకు నిటారుగా బిగిసింది తీగె
సడలుతుంది కదలుతుంది జలమై సరిస్తుంది

ఇది వికాస భావనతో నడవడ మొక విశేషం
సంశయాన్ని తుడిచివేసి విశ్వాసం నింపేను
ఒక ఉద్యమ వీరుడు నేతలు కవులు తప్ప
హింస ముందు లొంగని ఘను డెవ్వరు?

పీడనలో అణగి మణగి ఉన్న పేదలు
త్యాగ ధనుల చేతనే తలలు ఎత్తేరు
కలసి రాని దనుకున్న కాలం హఠాత్తుగా
నీతి నియమంలో ఒకటిగ సహకరిస్తుంది

ఎప్పటికి మరపురాని ఉద్యమాలు రణ చరిత్రలు
భవితకు ఆదర్శ సోపానాలయి నిలిచేను

స్వీయ రక్షణకై ఆయుధానికి అనుమతినిస్తే
పరస్పర కలహాలతో వ్యక్తుల హననం జరిగేను
అరాజకం జరిగేను అశాంతికి ఊతం దొరకేను
మనిషిలో దాగిన మలిన వృత్తి బయట పడేను

వికృత చర్యలొకటొకటి కలిసి పోయేను
రాజకీయ సంక్షోభంలో రాజ్యాంగం మటు మాయం

చేతి కందబోయే పాల కడవ వ్రేలాడే ఉట్టి
తాడు తెగి, పాముగా కనిపించేనా? కలయా?
కాలు జారి కడవ లోని అమూల్యం నేల పాలయ్యేనా?
కళ్లు బయర్లు క్రమ్మి, తల భ్రమలో తిరిగేనా?

ఎప్పుడేమయ్యేది తెలియని స్థితిలో మనస్సు
ఎవరి నెవరు నిందిస్తే లాభం చేకూరేనని అంచనాలు!

# 26. ఏదయినా

మంచి బ్రతుకు కోసం ఎదురు చూచేరు
అది తమ చేతిలో గుప్తంగా ఉందని తెలియదు
కోరిక నెరవేరే ఆలోచనలో సుళ్ళు తిరుగుతూ
దిశ నుండి దిశకు పయనం ప్రయత్నాలలో

ఉదయం లేచి బయటికి రాగానే
ఇంటి ముందు నుండి వీధిలో వస్తూ పోయేవారు
నాతో ఏవో చెప్పాలని నాకు తెలియనివి
నేను చూడనివి రాత్రివి చెప్పాలనీ

మనిషి మాత్రం తానొక రహస్య పేటిలో
భద్రంగా రహస్యాలు కాపాడుతూనే ఉండేను
ఎవరి చేతిలోనో ఆయుధంకన్నా; మనిషికి
పుష్పగుచ్ఛం ఉండాలనీ, అంతా నిశ్శబ్దంగా జరిగేను

సైనుకులకు ప్రియం రణ రంగం
కవులకు బహు ఇష్టం కవిత్వం!
ఎవరు మెచ్చినా, మెచ్చక పోయినా తన పనిలో
కాల రేఖ! ఎవరికెట్లా పరిణమించేదీ తెలియదు

మృత్యువు వెనకనే ఉంటుందని తెలుసు అందరికీ
మనుషుల ఇష్టానికి వదలితే మృత్యువు తల వంచినట్లే
విరిసిన పద్మ వదనం ఒక వైపు నుండి
తెలియని ఆలాపన ఒక వైపు నుండి

దరిద్రుని తలపై ఆపై మేఘ శకలం
తూగాడవచ్చు, క్రింద ఎగసే జ్వాలలతో
రెండు అవసరమైనవి కోరిక ఆకలి బ్రతుకులో
ఎవరి తొందరలో పనిలో వారు
పరచిన ఎడారి ఖండమై మనిషి బ్రతికేనా?
మనిషిలో ఒక సమయం అందని ఆలోచన

కాలగతిలో కవిని నేతను దేశికుని మరచేదెవరు?
మనిషిలో మనసు జాడలేని మాట నిజం కాకూడదు
మనిషిలో కోరిక తానొక ఆయుధ మవడం
ఏది జరిగినా జరగకపోయినా మనిషికి బాధలేదు

# 27. శిథిలాల నుండి

శిథిలాలలో చరిత్ర చీకటి శాఖలుగా విస్తరించి
మనిషి మనషికీ రాత్రి కథను చెబుతుంది వేరుగా
పూల గుత్తిలా అందిస్తుంది అక్షర రూపాన్ని
చరిత్ర అంతా మధ్య మధ్య అందని సమాచారంతో

చెట్టుకు వ్రేలాడే పూల గుత్తిలా ఉన్నది
అంతలో నిశ్శబ్దంగా స్వర్ణ బింబమవుతుంది
భయాల మధ్య నిశ్శబ్దంగా బ్రతికేరు
ధైర్యం తోడుగా శబ్దాన్ని వహిస్తుంది
సమస్యలను ఒలిచి రహస్యం చూపే
మనిషిలో ఉపజ్ఞచే నైతిక బల సంపద

పైకి చూస్తే పగలు స్వర్ణ నాణెంలా రవి
క్రింద చూస్తే రాత్రి రజత నాణెంలా శశి
చుక్కలు సరేసరి అందకపోయినా పనికి రావచ్చు
దేనికీ పనికి రానివి మనిషిలో తప్పుకునే ఊహలు

సంక్షుబ్ధంలో మనిషి ఒంటరి అయినా
నిశ్శబ్దం కన్నా శబ్దంతో బ్రతకాలనీ
చిన్న తనం నుండి అలవాటయింది
శుష్క ప్రపంచమైనా విప్పితే జలమేఘం

మనిషిలో వేష భాషలతో ఆకృతులెన్నో
అన్నిటికి ఒక్కొక వస్తువు, ఎన్ని విషయ సూచికలతోనో
రాత్రి రాక తప్పదు వెన్నెల మల్లెల పందిరి కోరేను
సూర్యచంద్రులెప్పటి వారే రోజూ చూచే వారే
మనసు కోరుతుంది జీవితాన నవ్యత పెరిగే అంతస్తులతో

ఉన్న మనుషులే మారి కొత్త వారిగా కనిపించేరు
జీవిత మంటే నాటకమని చెప్పవలసి వస్తుంది

తప్తమైన ఆలోచన వాన చినుకులకై
ఎదురు చూడడం వెనక సమాజం
తిండికి బట్టకు కరువు తీరి కాలం
అగ్ని పథం వీడి జలద రథం పూనేను

# 28. మనో నిలయం

మనో నిలయం తలుపులు తెరవబడీ
ఇందులో ఏముందో ఎవరికి పూర్తిగ తెలియదు
జననం నుండి తనలో ఉన్నవీ
ఆపై తన ఇష్టంపై చేరేవీ ఎన్నెన్నో

ఎవరిది వారి వారి ప్రత్యేకం
ప్రాణులు మనుషులు సంస్కృతిలో, అన్నిటిలో భిన్నం
మరొక ప్రపంచాన్ని తలపించేను
తాము కోరనివీ కోరేవీ సహజమైనవీ

క్లిష్టత కవకాశం లేదు, అంతా సర్వసామాన్యం
సులభంగా జీవన చక్ర పంక్తి తిరిగేను
ఇదొక అలంకార సుందరంగా తీర్చబడవచ్చు
ప్రయోజనంలో ముఖ్యమైన అవసరం కావచ్చు

మనో నిలయం ఎరగని వ్యక్తి ఉండేనా?
ఉన్నా తగిన శ్రద్ధకు నోచుకోక పోవచ్చు
భూమి నుండి దివికి ఆలోచన మాలలుగా
అల్లుకొన్న బ్రతుకులు విశేష స్థానం పొందేను

ఇదొక క్రొత్త ప్రపంచం ఎందరికో తెలియనిదీ
వస్తువులో విషయాలెన్నో కవితలో అన్ని ! ఎన్నో

ఒకరొకరిలో ఒక్కొక్క విధంలో తమకే విచిత్రం
మానవ వికాస చరిత్ర పట్టక పోవచ్చు

ఏ చిన్న పని అయినా! కోష్ఠ చలనం
లేంది! ఉత్సాహ ప్రమాణం కిందికి జారేను
రుతువు వెనకనే మరో రుతువు
దారి తప్పకుండా యథా స్థితిని దాటే మార్పుతో

వినోద విలాస విచిత్ర వికాస విభాతాలు
మనో విధాలు ! ప్రకటిత మయ్యేను
ఎపుడైనా ఎచటయినా పరిస్థితిని బట్టి
ఎవరికి పట్టకపోయినా కవికి మాత్రం! ఆవశ్యం

# 29. మార్కెట్‌లో కొనేది కాదు

రుతువు వెనకనే రుతువు మరొకటి
పూర్వపు కనుమరుగయ్యేను రాకతో జలదం
తాపం వెనుకనే శమనం స్వచ్ఛతను కోరుతూ
మార్పు మనో నిలయానికి శోభను చేకూర్చేను

పూర్ణిమా చంద్ర బింబ తలంపై
రాత్రులు పచారు చేయాలని కోరిక
బ్రతుకులో కలలోనే ఇది తీరుతుంది
కార్య సాధనలో నిరంతర యత్నంలో మనిషి

అపుడపుడు సమస్యకు సత్వర పరిష్కారం కోరే
ఉరిత్రాడు కోసం వెదకేరా? దొరకేనా?
అది ఎదురుగ వ్రేలాడుతూ కనిపించేనా?
ఈ కనిపించడం భ్రమలో వాస్తవ దృశ్యం చెదరేను

ఏ ప్రశ్నకయినా జవాబు చెప్పేది మనిషే
ఏ జవాబు కయినా సిద్ధం కావలసింది మనిషే
ఇరువురూ ఒకే నమూనా కాదు, కాలేరు కూడా
సమాజ వేదికపై ఇరువురూ వేరు వేరు పాత్రలలో
మనో నిలయాన్ని బోనుగా చూచే వారూ లేకపోలేదు
నేరానికి శిక్ష కారాగారం భయదమై విపదలో
ఉదార కరుణ రాగంతో శాంతం స్టాండ్ బైలో
సమాజ బంధుతను నిలిపే అనూహ్యాలు

ఏ తరం తనది కాదు, ఏ కాలం వశం కాదు
ప్రజాస్వామ్యం యంత్రం కాదు, జీవన సత్ ప్రేరణం

సమరానికి ముందు మేధ మాట్లాడుతుంది
సమరం తరువాత హృదయం మాట్లాడుతుంది
మనిషికి చరిత్రతో పని, చరిత్రకు ప్రజలతో పనీ
రణ దృశ్యం తొలగాక ఎవరి దారిన వారు సూక్తులతో

బాధ ఆర్తి పీడన హింసను చిమ్మే వాతావరణంలో
మనో నిలయాన్ని ధ్వంసం చేసే వీరులూ ఉన్నారు

మార్కెట్‌లో కొనే వస్తువు కాదు “శాంతి” మనోభవం
ఎవరో ఇచ్చేది కాదు, త్యాగ ఫలం అసలు కాదు కృషి ఫలం

# 30. తత్కాలంలో

అగ్ని కదలి పక్కనున్న వస్తువుల్ని అంటుకుంటుంది
జ్వాలా చలనంలో మంచి చెడు విచక్షణ లేనిది
మనిషిలో కోపం తన వరకే పరిమితమైంది
అనలం తీగెలా బ్రతుకుల్ని అల్లుకొనే వీలు లేకపోలేదు

ఎవరిపైన అకారణంగా తన ప్రతాపం చూపదు
అవసరాల కొద్దీ అణకువ లోనే దీని వర్తనం
కోపం నుండి ఎగసేను స్ఫులింగాల కలహంలో
ఎంత దూర మయినా పయనిస్తాయి రణ సమయంలో

పై నుండి జల బిందువు క్రిందికి దిగుతుంది, ఆగదు
జలదం వానలతో భూమిని రసమయం చేస్తుంది నిలవదు
దీని పైన మిగిలిన శ్రమ మనిషికి చెందిందే
కదలుతూ గాలి వాతావరణాన్ని శుభ్రం చేస్తుంది
విరామ మెరుగని స్థితిలో ధూళిని కడిగేస్తుంది
ప్రకృతి నుండి ప్రేమ అనుభవానికి రావడం విశేషం

అన్నిటికీ ఆధారమైన భూమి ఎన్నింటికో మూలమైంది
ప్రకృతి మాత్రం సంపదను ప్రజలకు అర్పిస్తుంది
ప్రయోజనంతో పాటు సమస్యలు కూడా ఎదురయ్యేను
అపుడపుడు భూకంపం తుపాను అసహనం కోటికెక్కుతుంది
పంచ భూతాలు ముందుగా వికాస చరిత్రకు సహకరించేను
కాలం గడుస్తుంది ఆగదు సమాజ హిత మనోహరంగా

ఐదు భూతాలను తన వశం చేసుకోజూచే ఆలోచనలతో
మనిషి ఉనికి తోనే పరస్పర సంబంధం ఎన్నిటితోనో
మధ్య మధ్య మనిషి పొందే ఓటమి అయితే
మానవ ప్రగతికి క్షతి ఏర్పడడం సహజం, ఒక పాఠం

అక్షర పద ఘటితమైన కవిత్వం భిన్న భిన్నం
మనిషికి వరమమయిన మాట చిర భాగ్యం

సమస్యను విజ్ఞాన ప్రదంగా తీరుస్తుంది అక్షరం
కారణ గుణ బలాన్ని పరిశీలన మొనరిస్తుంది

గగన యాన విమాన రూపానికి వలసిన
రెక్కలు లేని చింత! తొలగేను తత్కాలంలో

# 31. స్వేచ్ఛతో వికాసం

ఎక్కడి వారక్కడ నిర్భయంగా నిశ్చలంగా స్వగతంలో
నవ్వేవారు నవ్వేరు, విజయాలంకరణం పొందేరు
ఏడ్చేవారు ఏడ్చేరు, ఓటమి అయినా సర్దుకునేరు
వెలిగేవారు వెలిగేరు, చీకటి ముక్కపై చూపు నిలిపేరు

ఆరేవారు ఆరేరు బలమైన తుపాను గాలికి వంగి
ఎగిరే వారు ఎగిరేరు శక్తి కొలది ఆశాంచలాలలో
ఎవరి పనులలో వారు తల ఎత్తే తీరిక లేకుండా
పగలును రాత్రిని సరిచేసుకుంటూ తమకు అనుకూలంగా

ముచ్చట్లలో మునుగుతూ, మౌనంలో పైకి తేలుతూ
ఒకరి పనిలో మరొకరి జోక్యం అవసరం లేకపోయినా
మాటలతో చేతలతో జరుగుతుంది వ్యవహారం ఘనంగా
సమాజ చలనంలో జీవన యానం తప్పనిసరి అయింది

ఎవరికి ఖాళీగా ఉంది? అంతా ఏదో పనిలోనే
జలధి గట్టున నిలిచి అలల్ని లెక్కపెట్టడమే కావచ్చు
ఇంత వరకు తెలియని చుక్కల లెక్కలు చూపడమే కావచ్చు
ఏదయినా కాలం గడవడమే, నిలవదు పని పనియే

దొరతనం కావచ్చు, దొంగతనం కావచ్చు
దోషం నేరం కావచ్చు సహాయ శ్రేయాలు కావచ్చు
ఈ మధ్యన హత్యలు ఆత్మహత్యల గ్రాఫ్ పెరిగి
దండలు దండలుగా ఎదురుగ ప్రశ్నలు వేలాడేను

ఎండలు ఉద్రేక పరిస్తే వానలు ఉల్లాస పరచేను
ఏ రోజు ! సమస్య లేని సమాజ సందర్భం లేదు
అస్తితను కాపాడుతూ వ్యక్తితను నిలుపుకుంటూ
తనకు చెందని ఘర్షణలో చిక్కుకొని నలిగేను అణగేను

మాట నెగ్గలేని, చేత కదల లేదని, ఉద్రేకం విజృంభించి
హింసకు పాల్పడేరు, ఆత్మహత్యకు దిగేరు అనాలోచితంగా

సృజన విలయ రూపాలలో శీర్ణ జీర్ణ వాలకాలు
ముచ్చటగా తీర్చబడీ, తోటవలె సమ సమాజం
ఒక దానికి బదులు మరొకటి సంకేతానికి వీలులేదు
లోన నియతం, బయట స్వేచ్ఛతో, మనోమయం మనోజ్ఞం జీవితం

# 32. తనలో ఇముడ్చు కొనీ

సమాజ దృశ్యం నుండి పరిచితులో అపరిచితులో
ఎవరూ ఎవరినీ విడదీయలేరు, అనుబంధం చేరవచ్చు
ప్రత్యక్షమో పరోక్షమో పాత్ర నిర్వహించవలసిందే
ఇది చరిత్ర రూపానికి పుష్టిని చేకూర్చేను

గాయం అయ్యేనని భయంతో ప్రవేశించేవారు
ఆట లేమి ఆడతారు? యుద్ధమేమి చేస్తారు
ధూళినెట్లా సహిస్తారు, ధ్వను లెట్లా వరిస్తారు
ప్రతి పక్షం ఎదుట ఎవరు నిలిచేరు? ఎత్తుల కెత్తులుగా

ఆలోచనలో భూగోళ భ్రమణం బాగానే ఉంటుంది
అనుభవంలో జీవన చలనంలో తెలుస్తుంది భ్రమావరణం
వాస్తవమూ కల్పన మనిషిలో జోడుగా జంటగా కలసి మెలసి
ఎంతటి బ్రతుకులనైనా ఎంత దూరమైనా నడిపేరు

అసంపూర్ణ కథలో ముక్కల్ని ఒకచోట చేర్చి
అమరికలో శిల్ప శోభ చూపి ప్రదర్శనలో నిలిపేరు
పుస్తకం వెనక కవర్ పేజిపై తన ప్రకటనలు
ఎవరికి కావాలి? ఎవరు స్వాగతిస్తారు? డబ్బుకా? కీర్తికా?

జీవితాన్ని సమాజాన్ని ప్రపంచాన్ని మనోలోకాన్ని
ఎవరు నిర్వచించేరు, ఎవరి ఆలోచనలకు లొంగేను
కాలం గడచే కొద్దీ రూపంలో మార్పు! రాక తప్పదు
అన్ని కాలాల్లో అన్ని విషయాలలో పనికి వచ్చే ప్రమాణమేది?

ఎవరి అనుభవంలో దేని కన్వయిస్తుందో తెలియదు
అలాగే కవిత నవత సమత ఎప్పటి కపుడు కోణాలు మారేను
తనదనే సరికి ఎక్కడ లేని బలం చేకూరుతుంది
తనది కాదనే సరికి ఎంతకైన క్రిందికి దిగిపోతుంది

మనిషి కొన్ని సందర్భాల్లో విగ్రహంలా నిశ్చలంగా
మంచి చెడు స్వార్థం వ్యర్థం విజయం ఓటమి భేదం తెలియకుండా
దీని కన్న అంధ కార బంధువు నయమనిపించవచ్చు

నిప్పుకణం చూస్తే సిగరెట్ వెలిగించాలనే కోరిక
అవని నభం మైదానం జనకళతో ప్రపంచం వలె
కవిత! తనలో ఇముడ్చుకుంటుంది నవత మమత భవితలను

# 33. అందరికీ కావలసింది

నీడకు అస్తిత! వస్తువు స్థితి తోనే
మనిషికి ప్రాణంతో ఆహార వ్యవహారాలతో

మనిషి దృష్టి చీకటిని తొలగ జేయ లేదు
రవి కిరణ ప్రసారంతో చీకటిని రూపు మాపుతుంది
చంద్ర కాంతి చీకటిని అదుపు చేస్తుంది
రాత్రి వేళ హ్లాదకరం వెన్నెలను చూస్తూ ఉండాలనీ

పూలు పండ్లతో ఎంత భాగ్యరాశి అయితేనేం
చెట్టు నీడ వస్తువుతో ముడిపడి మారని కారు నలుపు!

ప్రకృతిలో వస్తువు కవితలో మానవీకృతమై
జగత్తులో మానుష ప్రాధాన్యాన్ని తెలుపుతుంది
మనిషి నుండి శిల దాక చేతనతో అవసరం ప్రపంచం
ఎన్ని రంగులు వహించినా గగన శకలమనిపించదు

సమాజ గతిలో దేని కయినా
ముందు సూచిక కవితలో స్పందనం
కవిలో రవి చంద్రుల ప్రతిబింబాలు
ఎవరి కోసమో కాదు, తన కర్తవ్యంలోనే

కవికి తన కవిత ప్రియాతి ప్రియం
ఇతరుల కయితే అనుభవ తేజం
హృదయం కుసుమిస్తుంది ఆలోచన ప్రవహిస్తుంది
మదిలో విభవం వికాస శక్తిని పెంచేను

ఇది చెదరని నిజ రూపం శక్తిని చూపేను
ఇది బయట అక్షర నిలయంలో కవితా వాసం
చిరంజీవి కాలం! ఆయువు స్థితితో పనిలేదు
రవి చంద్రుల రాకకు స్వాగతంతో పనిలేదు

కనిపించని రూపంతో అనుభవ చలనంతో
చేతనతో పాటుగ మనసును ఉత్తేజ పరచేను
ఎప్పటికీ సరికొత్త అనుభవ సుందరమైంది
అన్నిటికి అతీతమైంది అందరికీ కావలసింది

# 34. భవితవైపే

ప్రజా స్వామ్యంలో రాజకీయ పక్షాల వలె
ఔను! కాదు ఇరువైపుల నుండి హెచ్చిన స్వరాలు
శబ్ద తరంగ కల్లోలాకృతి పొందేను చర్చావేదిక
గట్టు దాటి ఒక సమయం ముంపుకు గురి చేయవచ్చు

తెలియనిది తెలియాలనీ, చూడనిది చూడాలనీ
విననిది వినాలని అడుగులు ముందుకు సాగడమే జీవితం
వెనుక నుండి ఎవరూ ముందుకు నెట్ట నవసరం లేదు
తన లోని మనోరూపం ఎన్నో సూచనలు చేస్తుంది

ప్రేరణ గుణంతో సొగసుకు తగినదిగా
మనిషి విలువ పేరిగేను, ఆకర్షణ హెచ్చేను
అహంకారం ఉన్నదేదో! వ్యర్థం కాదు
అసలుకు అదనపు బలాన్ని కూర్చేను

అన్నీ సమయానికి సమకూడితేనే
పంట అయినా వంట అయినా యాన మయినా
భూమి తడి అయ్యేది మాత్రమైతే, దప్పిక తీరేనా?
చెరువులో నెరియలు ఆలాగే అయితే రోజులెలా గడచేను

ఇది వర్షం కాదు, వరద లేదు, దప్పిక తీరదు
ఎవరి దుఃఖాశ్రువులో జారే ననుకోవచ్చు
ఎవరి మోదాశ్రువులో అయ్యే సందర్భం లేదు
ఉరుములు మెరుపులు మాత్రం సూచన చేసేను

దుఃఖంలో అశ్రువులు బాధలో పిడుగులు
ఇది వర్షం కాదు, వరద లేదు చెరువు నిండదు
తృప్తి రేఖతో నీటి మట్టం భవితను చెబుతూంది
ప్రకృతి సహకరిస్తేనే, తిండికి అవకాశం, సంతోషం

కదలే పవనం వేగ మందుకొనీ
మనిషిలో ఉత్సాహం ఇనుమడింప చేస్తుంది
నీలి మబ్బుకు గతంతో పనిలేదు
వర్తమానం నుండి పయనం భవిత వైపే

# 35. శూన్యం నుడి

స్మృతిలో చిన్ననాటి అనుభవాల ఊయెలపై ఊగినట్లు
మనసులో నిలిచిన భావ జగం ఎప్పటిదో జ్ఞాపకాలలో
ప్రతి వస్తువు మనిషితో మాటలాడాలని నిరీక్షణం
ఎదకు హత్తు కోవాలని కదలే కొమ్మల చివరలు

ఎండిన చెట్టు వలె బిక్షువు ఇంటి ముందు దీనంగా
ఆరోజు ఇంకా దొరకని ఆహారం అలమటింపజేసేను
ఏది లేదో అవసరమో ఏకరవు పెట్టేను సుడిగాలి!
ఊరు నుండి ఊరు దేశ భవిత గురించి చింతనలో

అలముకొన్న నిశ్శబ్దం! ఎవరివో అరపులు చుట్టుకొనీ
ఉద్రేకంతో నడకలో వేగం తీవ్ర తీవ్ర మవుతూంది
మాట పాట గేయం పద్యం నాలుగు ముఖాల నుండి
స్వేచ్ఛా రూపానికి నాలుగు దారులలో తెరచిన తలుపులు

ఒకరి కొకరు దూరం కావచ్చు, గమ్యం తప్పవచ్చు
దృశ్యం వేరయి జీవన కోణాలు వేరు వేరు కావచ్చు
వెనక నుండి ఎందరివో వీడ్కోలు మాటలు
ముందు నుండి ఎవరివో స్వాగత వచనాలు
మనసును సందిగ్ధంలో పడవేసేను వాలకాలు
అగ్ని శిఖలు ఆరి శాంతి పతాకలు ఎగరాలని

చుట్టూ దేని కయిన సిద్ధంగా ఏదీ లేకుండా ఉండదు
వినిపించే గుండె లయతో హెచ్చిన మనిషి స్వరం
జడాన్ని ఉత్తేజిత మొనరిస్తూ వెళుతుంది
జనత నరాలలో కణ కణం రాగాన్ని ప్రసరిస్తుంది

దూకే శబ్దాల నుండి సాగే అర్థాలతో
సమాన ధర్మంతో వ్యక్తి శీలం బ్రతుకులో
మట్టి నుండి మనిషిని తేజానికి మార్చేను
ఈ సమయం మానవ మొక సుందర విజయం

పావురాయిని దువ్వి వదలిన చేతులు
రైఫిల్‌ను వహించి గురిలో కాలం గడపేనా?

అలలవలె క్షణాలు మనిషిని దాటించేను
వెలుగుల వలె అలలు మనసును ఆదుకునేను

# 36. జ్ఞాపకం

పయనంలో ఆధార తలం లేని విమాన గమనంలా
సృజన శక్తి కళా చేతనలో వేగ మందుకునేను
జన గణ ప్రయోజన తత్పరతలతో
మనోజ్ఞమైన మానుష స్పందనను తలపిస్తుంది

నేడు వాడిగా వేడిగా ఉన్న రవి కిరణం
రేపు పూల దండయై ఎద నలంకరించేను
ఏ కవి మనో నిలయం ఖాళీగా ఉండదు
ఎన్ని వస్తువుల చేత నయినా నిండి పోతుంది

నిరంకుశంపై హస్త క్షేపం నుండి
గన్ కల్చర్‌కు స్వస్తి పలికే శాసనం వరకు
ప్రపంచీకరణం నుండి కశ్మీర్ సమైక్యం వరకు
ఎక్కడెక్కడివో ఎప్పటెప్పటివో ఇప్పటికీ ముద్రలతో

కర్తవ్య నిష్ఠకు పాలనకు చిత్త రంజనంతో
ఎదపై వేలాడే స్వర్ణ పతాకతో
సూర్యుడు ! ప్రతి హృదయంలో ప్రతిఫలించేను
మలిన మంట వచ్చు, ధూళి సోకవచ్చు, రంగు మారవచ్చు

నిలయం ఆవరణం, క్షితిజం మూడు అంచెలలో
లౌకికం రాజనీతి విద్యా విజ్ఞానాలకు కట్టుబడి
సమత మమతతో కశ్మలానికి నిప్పటించేరా?
కొత్త జగంలో వెలుగుల సౌధానికి చేర్చేరా?

చిన్న నాటి చెట్టు నాతో పాటు ఎదుగుదలతో
జ్ఞాపకాల గుర్తులను వదలేను ప్రియంగా
ఎదకు హత్తుకొనీ అభినవతను రూపించేను
గాలికి ఊగుతూ, జీవితాన్ని మురిపించేను

ఏరోజు అదే పాత్ర! బిక్షువు చేతిలో
ఎండిన చెరువులా శూన్య ముఖంలో బాష్పకణం

కవితను స్పృశించాలని మాట్లాడాలని గాలి ! తారాడేను
మాటలతో కాలం గడుపుతూ, అడుగులు ముందుకు వేసేను

# 37. అదృశ్య బంధువు

అదృశ్య హస్తమేదో! వెనక నుండి
పని చేస్తూ ఉన్నట్లు అనిపిస్తుంది అపుడపుడూ
సుందరమైన క్షణాలను నాకై అమరుస్తూ
బుజాన చేయేసి నడుపుతూ ఉన్నట్లుగా

ఆప్తత ప్రకటిస్తుంది? అదృశ్యంగా అదృష్టం
దృశ్యంతో అనుబంధం నిలుపుతూనే అంతరంతో
అదృశ్య హస్త మేదొ వెనుక నుండి
చలికి వెచ్చని శాలువా కప్పుతుంది

తాపానికి చల్లని నీరు అందిస్తుంది
క్షితిజంలో కదలే నీడను
నీలి మబ్బుగ మారుస్తుంది
ఇందులో ఏ మాయ లేదు మర్మం లేదు

అంతా బట్ట బయలు పైన ఆకాశం!
పరచుకొనీ మనిషి తెలివి నాహ్వానిస్తుంది
కాళ్ళ క్రింద భూమి అణగి మణగి
అదృశ్య శక్తులకు చుట్టు నిలయాలయ్యేను

అదృశ్య ముఖాలేవో పంచభూతాలకై
తారట్లాడేను! పవన వాహనంపై
అటు నుంచి ఇటూ, ఇటు నుండి అటూ
మాటి మాటికి, దారిని క్రాస్ చేస్తూ పోయేను

సూర్యుడు ఆరిపోడని ధైర్యమెంతో
చంద్రుడు వాడిపోడని నమ్మక మెంతో
ఎంత తరిగినా మళ్ళీ పుంజు కునేను
తరాలు గడచినా మళ్ళీ యథాస్థితి

వెనకనే కనిపించని గతం! స్మృతిలో
వెనక్కి తిరిగి చూచే కోరిక అంతంత మాత్రమే

భయమెరగని దారులలో కవి పయనం
నిజ మెరిగిన సమస్యతో కవి స్పందనం
రెండూ, అంతరంగ భావనకు సన్నిహితం
దృశ్యమాన జగత్తులో కనిపించేది నేనే ! నేనే!
నాతో నను వీడని అదృశ్య బిందువు, ఎప్పటికీ
నాలో ఆశా రూపం జోడుగా చిర స్త్రీ తేజం

# 38. చరిత్ర ఫాలంపై

శిలలో యథాతథం మార్పు లేదు
మనిషి ప్రమేయంతోనే ఏదైనా
కాలాంతరాన ప్రకృతి ప్రభావాలచే
ఎండకు పగలవచ్చు వానకు రంగు మారవచ్చు

శిల్పం కావచ్చు సుత్తి దెబ్బలకు ఓర్చి
దైవం కావచ్చు తమ తమ నమ్మకాలపై
గృహ నిర్మాణంలో భాగం కావచ్చు
నిష్క్రియా రూపానికి చిహ్నం అవచ్చు

కఠిన భావనా వ్యాపారంలో ఏదైనా కావచ్చు
దరిద్ర రూపాన్ని ముందుకు తెచ్చి చూపొచ్చు
ఏమైనా అవుతుంది కఠిన భావజాలంలో
ఎవరికైన దేని కయిన వాడుకలో ఉండవచ్చు

పనికి మాలిన వస్తువు లేదు
మనిషి ప్రజ్ఞపై ఆధారపడింది
ప్రదర్శనలో వ్యతిరేకత చూపేందుకు
ఆఖరికి తన తల పగుల గొట్టు కోడానికీ

తరాలు గడిచినా పడి ఉంటుంది
మనిషి జోక్యంతోనే ఏమైనా అయ్యేది
సౌధానికి పునాది రాయిగా ఉపకరించవచ్చు
ఊరు పొలిమేరలలో దేవతగా వెలయవచ్చు

వాన కురుస్తుంది జోరుగా
ప్రతీకకు అభిషేకం జరిగినట్లుగా
ఎండలు మండుతాయి తీవ్రంగా
యజ్ఞ వేదిపై పక్కన అగ్నిని జ్వలిస్తూనే

ఒకచోట నీటికై ఎంత తవ్వినా
శూన్యమే ! మట్టితో పాటు రాళ్ళు !
జల హృదయానికి చోటు ఉండదు
నిరంకుశ నేతల రూపాలకు ప్రతీకలుగా

స్మృతి ఫలకం జ్ఞాపక చిహ్నం చరిత్ర ఫాలతలం
కాలం నుండి జవాబుకై ప్రశ్నా పత్రంలా కన్పించేను

# 39. తేలేది ఎప్పుడు?

ఎత్తైన ప్రదేశంలో తన కిష్టమైన విధంగా ఇల్లు
కోరేను మనిషి ఉన్నదానితో డిటోగా! మనసుకు తృప్తిగా
పల్లంలో కడితే వానలకు మునిగేనని భయం ! భయం
కల కంటూ మధ్యలో లేచిన మనిషి మనసులో భ్రమ

సాయం కాలమా? ప్రభాత కాలమా? సందిగ్ధ క్రమణంలో
మనిషిలో ఏదో ఒక కోరిక ఒకటి తర్వాత ఒకటి
కోరిక ఉన్నంత మాత్రాన వస్తువు చేతిలో చేరేనా?
మధువుకై వచ్చిన తేనె టీగ, చూచే మనిషిని కుడుతుంది

మధు బిందువుకై ఆశ పడితే ఎంతో ప్రియంగా
ఝుంకార స్వనాలతో వేగంగా వచ్చి ఉక్కిరి బిక్కిరి చేస్తుంది
ప్రతి మనిషి కెన్ని విధులో! తన కేనా సాధ్యం కానిది
ఆకలి తీర్చే భూమిపై నడవాలని ఉంటుంది, మర్యాదగా

కష్టాలలో బాధల్ని మరవ వలసి ఉంటుంది
మనసును తీసి పక్కకు పెడితే సాగదు
గుండెకు కాస్తైనా సంతోష స్పర్శ నీయవలసి ఉంటుంది
దుఃఖానికి కారణాన్ని, ఎంతో కొంత మాపవలసి ఉంది

సూర్యుని తేజం అగ్ని ధానికను తలపిస్తుంది
చంద్రుని హ్లాదం మల్లె చెండును చూపిస్తుంది
దివా రాత్రులు తన రెక్కలపై తిప్పే కాలం
ఒక్క నిద్రలో మాత్రం ! తనకు తెలియకుండగనే అన్నీ!

యుద్ధంలో ఆయుధాలు మారినట్లు ఒక దాని నొకటి
మీరేను ఉపయోగంలో తరువాత వచ్చే తరం
ఇవి ఎవరి మీద దేనికి అంటే సమాధానం మాత్రం
సమాజ చరిత్రలో మనిషి పాత్ర చెబుతుంది ఒకటొకటీ

అస్త్రం రైఫిల్ బాంబు బుల్లెట్ మరొకటి
అన్నీ మనిషి కోసం చేసినవి! మనిషిని బాధించేను
బయటకు వచ్చింది ప్రయోగ దశల నుండి శాస్త్రం పరిశోధన
వెనక్కి వెళ్ళదు! ఎప్పటికీ ఎవరి విజయమో తేలవలసీ వేచి!

# 40. రావలసి ఉంది

పౌరుల్ని తీర్చి దిద్దే సందర్భంలో సమాజంలో
అడిగే బాధ్యత ప్రజలది ప్రజాస్వామ్య స్పందనలో
తామెరిగిన దానిని చేయడం పాలకుల కర్తవ్యం
సామాన్యుడు అయితే! "నీ పాత్ర ఏమిటనీ," మౌనం పనికి రాదు

నచ్చని దానిని తరువయినా సరె! నరకడం సరి కాదు
నచ్చిన దానితో సమానం చేసే పాలనలో కళ ఉంది
ప్రజలంతా ఒకే మతి ప్రభతో నినదించరు, రాణించరు
ఎవరి స్థాయిలో వారికి కావలసింది చేరే విధ మవసరం

వ్యక్తి అస్తితను ముక్కలు చేసి, విమర్శకు దిగేరు
సమాజాన్ని ఖండ ఖండంగా చూచి, విరోధాల్ని పెంచేను
వీధులలో నినాదాలతో ఎదురయ్యే ప్రశ్నలు ఇప్పటివా?
ఎవరి స్వంతాలు కావు! సమూహశక్తివి! సమాజ రక్తివి

వ్యక్తిని సమాజ శక్తిగా తీర్చే పనిలో తల్లి తండ్రి గురువు
శక్తిని వ్యక్తి సమాహితంగా ఉంచే దయితే అది అంతరంగం
ఎంత అందమైనదైనా ప్రియమైన విరిసిన ఇంద్ర ధనుస్సు
ఎంత సమయమో నిలవదు ! సూచన లేకుండా పోతుంది

దృశ్య మాన సన్నివేశ చలనంలో ఏరోజూ
ప్రకృతిలో బ్రతుకులో జరిగే విచిత్రాలెన్నో?
ప్రతి బ్రతుకు రెండు అంచెలుగా సాగేను క్రమంగా
జీవితం అతీతం సమాజ దార్శనికాలతో

చిన్నదో పెద్దదో సామాన్యమో ఆడంబరమో
ఆకాశంలా విశాలమైన ఈ జీవన జగత్తు
మారే శిఖరాలతో స్వేచ్ఛా కవిత్వ రూపం
అలజడుల ముడులలో చిక్కుకొని రాజకీయం
సామాన్యుల బ్రతుకుల్ని సుడిగుండాలలో తిప్పేను
ఒత్తిడులలో నలిగి కనలి సమాజం చెదరేను

తరిగిపోయే ఆయువు, ఏ మార్కెట్‌లో దొరకేను?
ఎప్పటికప్పుడు కొనితెచ్చుకునేవి కాదు, నైతిక హృదయం

ఎంత సౌభాగ్యమొ! కమనీయమొ ఊహించుకునే ఆకృతి
ఈ సమాజం నిర్మలినంతో నిర్దోషంతో రావలసి ఉంది

# 41. దారిలో భయంతో

పండుగ వస్తుంది ! మనుషులలో కల్మషాన్ని కశ్మలాన్ని
ఉత్సవ కళతో శుభ్రపరచి తళుకు చూపి వెళ్ళి పోతుంది
ఎవరు ఎవరినీ పిలువ నక్కర లేదు అందరికీ స్వాగతం
ఆ రోజు బాధ్యత అందరిదీ, నిశ్చయంగా భాగ స్వాములే

భౌతికం నుండి మానసానికి భౌమం నుండి దివికి
ఇది అసాధారణమైన మానస యానం! అందరికీ
అంతో ఇంతో తత్త్వ ప్రకాశం బ్రతుకులో మనోజ్ఞం
ఈ రోజు ప్రశ్నలు లేవు, సమస్యల విషయ వర్ణనలే

కవితలో అక్షర పంక్తి తోరణ మాలలా
ఆర్ద్రమైన హృదయ నాద లయతో శబ్దం
అంతరంగ స్పందనతో సృజన రూపం

అడుగులు భూమిని అంటిన క్షణం నుండి
పయనం వీడే చివరి దాక ఒకే సూత్రం
ఎవరి రహస్య పేటి వారి వెంటనే అమూల్యాలతో
అవసరాల్ని బట్టి, ఏ వస్తువు విలువ దానిదే ఎంతైనా

రాత్రి చీకటిలో మెరపు తీగెయై
దారి చూపాలని ! రాత్రికి భయపడని వారు
ఎండిన భూమి చినుకులతో ఆర్ద్రం కావాలని
పీడిత జన గాథలు వినిపించని చోటికి

ప్రతి దిశ దగ్గరలో హరిణం నెమలి పావురం శుకం
దూరాన పులి, సింహం, ఏనుగు సర్పం, లేనిది
పూర్ణత చేకూరదు, జీవన వాస్తవం చేకూరదు
మనుషులు సరే! చూపులో ఎదురుపడే దరిద్రాకృతులు
గులాబి పుష్పం కోసం చేయి చాచితే
వ్రేళ్ళకు కంటకాల అనుభవం కలగవచ్చు

గోడకు తగిలించబడిన ఆయుధం మౌనంగా
దీనితో పని బడని సమయం! విరామ సుందరంగా
ఈర్ష్య ద్వేషం పగ ప్రతీకారం అందరిలో అంతో ఇంతో
దారిలో భయం ! ఆశను పాతాళానికి చేరుస్తుంది.

# 42. ఆలోచనలో అర్థం

మనిషి బాగు కెంత ప్రయాస పడేనో, ఒక భాగంలో
అంతకంత అణచి వేతకు హింసకు తలపడేను, మరో భాగంలో
మనిషి ననుసరించి నడచే మనిషికి సమస్యలో
యుద్ధానికి సరిపడ సామగ్రి అవసరం ఘర్షణలో

సమాజ గ్రంథంలో చివరి వాక్యమంటూ లేదు
మనుషులు రావచ్చు పోవచ్చు ఇష్టానుసారంగా

సూర్యచంద్రులు వంతులుగా తన చేతుల్లోకి రావాలని
ఆశతో మనిషి అగ్ని శిఖయై పైకి దూసేను
పైన కదలే మబ్బులలో చిక్కుకొని పోయేను
వెలుతురు వెన్నెలలో తన లక్ష్యం మరచేను

ప్రజాస్వామ్యంలో కోరికలెన్నో! మనిషి మనిషిలో
జీవన చక్రం తిరగడం ఒక క్షణం ఆగదు
కాల వాహనం నుండి ఏ స్టేషన్‌లోనో దిగేను
ప్రయాణికుల స్నేహ బంధం! ఎక్కడి దెక్కడో వేరయ్యేను

ఆయువుతో పాటు పెరుగుతుంది ఆలోచనా ప్రపంచం
దూర దూరం విస్తరిస్తుంది, వైవిధ్యం ఏర్పడుతుంది
వివేచనలో సమస్య నిర్ణయం అవతరిస్తుంది
స్వేచ్ఛ స్వతంత్రం ఇరువైపుల నుండి పూర్ణత కూర్చేను

ఏది ఒప్పు! ఏది తప్పు! తూకంలో వస్తువుల వలె
మనిషి కంటికి లభించవు, ఇది మనోమయం,
తాను కోరే ఎత్తులో శిఖరం ఆరోహణలో పెరిగేను
దీవి ననుసరించి తన యశోరూపం పైపైకి ఎదగాలని

మట్టిలో పడి ఉన్న విత్తనానికి పైకి రావాలని
ప్రపంచంలో భాగమై, బ్రతకాలని, నిలవాలని,
ఎదురు చూస్తూనే శాఖా కీర్ణమై ఆకర్షించేను
కవితలో శబ్దం ఆలోచనలో అర్థం అనుభవంలో భావం

విప్పారిన రేకులతో మహా పద్మం వలె ఆరాటంతో పోరాటం
పరిహరింప రానివై బ్రతుకులు జవాబుల సంకలనంగా మారేను
ఎవరి పుస్తకం వారిది! భిన్న భిన్నం వివిధ వ్యక్తిత్వాలతో
సమాజ స్థాయిని కాపాడే మహత్కార్యంలో నేటి ప్రజాస్వామ్యం

# 43. మార్పు పేరుతో కొత్తది

ఇంట్లో నుండి బయటికి అడుగు వేయగనే
చూపులో వస్తువులు హ్లాదంగా కనిపించాలని
ఇంతలో వేగంగా వచ్చే వాహనం
దుమ్ము తెరను వదలి వెళ్ళిపోతుంది

దుమ్ము లేచి అడ్డంగా కదలుతుంది మెల్లగా
ఈ దృశ్యం, వెళ్ళే పనికి అంతరాయ సూచనయా
వెళ్ళింది వాహనం! ఈనాడు బ్రతుకులో తప్పనిదీ
ఇది అనివార్యం అయ్యే పనికి అనుకూల ప్రతీకయా?

ఇలా అభిప్రాయాలెన్నో! భిన్న భిన్న ఆలోచనలతో
అనుకూలం 'వ్యతిరేకం' రెండూ పోటీలతో సమాజం
సందేహాలలో, సమాధానాలతో మనస్సు
తన పనిలో తాను ప్రత్యేకంగా, వర్తిస్తుంది

బ్రతుకులో రావడం నిలవడం పోవడం
కాలం ఆలోలంగా ఆగనిదీ ఆగలేనిదీ
గోడకో చేతికో అమరిన గడియారం
కాల చక్ర భ్రమణాన్ని మనసులో నిలిపేను
కాలం మాత్రం ! ఒక అడుగు ముందుకే

ఖైదులో ఉన్న వ్యక్తికి కాలం కదలినట్లు అనిపించదు
విడుదలయిన వారికి కాలం పరుగెత్తుతున్నట్లు ఉంటుంది
జైలు పాలు కాకపోయినా జైలువంటి స్థితిలో
దోషాన్ని మరొకరి బుజాలపైకి తోయబడేను

మనుషుల సందడిలో మనిషి, లౌకిక ప్రపంచంలో
ఏకాంతంలో ఒంటరి తనం కన్న, అంతర్ముఖంగా
అహంకార బీజం నుండి మొలకెత్తే మొక్కలకై
ఎదురు చూచే మనిషిలో ఎదుగుతుంది తోట!

శిల ముక్కలయినా తన బలం చూపుతుంది కఠినతలో
నది చీలినా పాయలుగా, ఆర్ద్రతను వదలదు
మనిషి ఎంతటి బాధల గాథలలోనూ నవ చేతనతో
ఉన్న దానికి బదులు కొత్తది కోరేను, మార్పు పేరుతో

# 44. వెలుతురు వచ్చే వైపు

తూర్పు వైపు చూస్తూ ఉంటే జాలిపడి కనికరించి
సూర్యుడు ఎపుడు బడితే అపుడు నిశీధి ఉదయించడు
ఉదయ రేఖలు వేళలోనే వచ్చేను తలపిస్తూ
తేజో బింబం ఏ దాడిమో కమలా ఫలమో టమాటోనో

ప్రకృతిలో వస్తువు బ్రతుకులోను స్ఫురిస్తుంది
బ్రతుకులో విషయం ప్రకృతిలోను తెలుస్తుంది
రెండిటి బహిరాకృతిలో సామ్యాలతో
కల్పనకు వాస్తవానికీ అనుబంధం కవితలో

ఆకాశమంత విశాలత కవితలో, అమేయం
నిశీధి చుక్కల వలె తప్పనివీ ఊహలు
పగలు తేజస్సు వలె దార్శనికం
ప్రకృతి సమాజం పరస్పర ప్రభావాలతో ఒకటిగా

ఉదయ సమయం గడిస్తే వర్తమానంలో
పునర్దర్శనం మళ్ళీ మరునాడే
మనిషి స్మృతిలో తేజో రూపం నిలుస్తుంది
బ్రతుకుల్ని బ్రతికిస్తూ పండిస్తూ ఉంటుంది

జీవితంలో చేతి కందే సానంద రూపం
మళ్ళీ ఆ రోజును చూడలేనివై ఘటనలు
మంచి చెడు సుఖం పీడన బాధ మోదం
సాయం కాలమయితే విషాద ముద్రలతో

మధ్యాహ్న మయితే చూడనీయని మండే సూర్యుడు
ఆవేళలలో తగిన విధంగా మనిషి జీవితం
మనసులో గుప్తంగా కోపం తాపం జ్వలిస్తూ
దీన్ని సరిదిద్దే మార్గాని కెన్ని ఉపదేశాలో

హిమ ధారా ధోరణి వేగాలకు దారులు ఎచటెచటో
రసాలోలమైన కవితలో జల గతి ఉపమిస్తుంది
ప్రకృతి వర్తనం రసమయ జీవితాన్ని కోరుతుంది
మనిషి బ్రతుకులో సుఖం దీనికి ప్రత్యామ్నాయంగా

## 45. ప్రాణం తీసే ఏదో ఒకటి

అనుగ్రహమొ ఆగ్రహమొ మౌనమొ! నిశ్శబ్దమొ
అక్షరాకృతి మనిషిలో నవ ప్రపంచం సృజిస్తుంది
చెట్టు నిలవడానికి మట్టిలో వేళ్ళ వలె
బ్రతుకు నిలవడానికి లోన మనో విధం

అద్దంలో సూర్యునో చంద్రునో తలపిస్తుంది
మనిషికి తగిన స్థాయి ప్రమాణం ఉండాలని
మనిషి ముఖం కనబడి పలకరిస్తే
ఆ సమయంలో చంద్రకళ చూపాలనీ
దీపం వెలగవచ్చు చెట్టు కొమ్మ చివురించ వచ్చు
రవి కిరణం దూయవచ్చు ఏదయినా విశేషం ! సాధ్యమే

మౌనం గుడి గోపురాన్ని తలపిస్తుంది
నిశ్శబ్దం సరోవరాన్ని బింబిస్తుంది
బొగ్గు ముక్క మసి బొమ్మ అంటించవచ్చు
నిప్పు కణం కణ కణలాడవచ్చు

వెనక నుండి కొండలు ధైర్యమిస్తాయి
నదులు వడి వడిగా గమ్యం చేరే తొందరలో
ప్రతి వ్యక్తిలో సమయ సమయం కొత్త ప్రపంచం
కల్పన నుండి వాస్తవానికి మరలే దృశ్యం

ఈనాడు విరివిగా వెలువడే కవిత్వం
మనిషి చూపు ఎదురుగా సమాజాన్ని అల్లుకొనీ
ఏమి జరిగినా మనిషి గవేషణం పరిమితం
అన్వేషణలో దొరికే అమూల్యం రహస్య మయం

ఇది బాంబులు మిసైల్స్ ఉపయోగించే
రణ భయ యుగం, కాస్త దూరంలో మానుషం
పెద్ద ఎత్తులో జరిగిన విధ్వంసంలో శిథిలాలపై
నడుస్తూ పరిశీలనలో మానవేతర రూపాలు

ఏ ఆయుధమయినా పోయే ప్రాణాన్ని తీపిగా చేయదు
ఏదీ లభించకపోతే ముష్టి ఘాతం, గొంతు నులమడం

# 46. నిరీక్షణం

ఉత్ ప్లవనానికి శరీరం రెక్కలు వహించ వలసి ఉంది
అలం క్రియా మాత్రం కాదు సజీవ స్పందన గుణంతో
రెక్కలు లేని స్థితికి నిర్వేదం లేదు, ప్రయత్నం జరిగేను
భావనా జగం గగనం అంచుల్ని స్పృశిస్తుంది

దీనికి మానుష యత్నం అంతా ఇంతా?
ఇపుడు యోజనలో విమానం చోటు చేసుకొంది
గగన యానానికి లోహ వాహనం కోరిక లభించింది
మనిషి మనోరూపం దేనినైన సాధించే శక్తి మయం

గుడి గంటలు మ్రోగేను అందరికీ శ్రవణ పేయమైంది
కొందరు ఆలకించవచ్చు కొందరు చెవి పెట్టకపోవచ్చు
కొందరు తమ పనిలో పట్టని విధంగా వర్తించేరు
శ్రమ జీవన ప్రవాహంలో తేలుతూ బయట పడుతూ

కళ్ళు మూత బడకుండానే కలలు కనేరు? కొందరు
ఆలోచనా ప్రపంచంలో భ్రమించేరు, తమ పనులలో
గగనం వైపు చేసే ఊహలు విశాలతర మయ్యేను
తెలసీ తెలియని లోకాల గురించి చింతన సాగేను

అవసరమా? కాదా? అన్న ప్రశ్నలకు వీలు లేదు
చలనంలో కొత్త విషయం కనుగొంటూ పోవడమే
ఆహారం వసనం ఆవాసం కొంత డబ్బు చేతిలో
కాస్త శుచి శుభ్రత కొంచెం అలంకారం కావాలసినవి

ఆపైన మనిషిలో భోగం భాగ్యం అధికారం
రక్షణ శిక్షణ సంపాదన సంపద అనుబంధం
దశ దిశలలో విజయానికి సన్నాహం
ఓటమి గెలుపుల రేఖలతో అనుభవ దృశ్యాలు

భ్రమ నుండి కోలు కొనే సరికి
ఒకరి కొకరు మనుషుల స్పందనలు

చరిత్ర ముఖంలో తెల్లని నల్లని రేఖలు
పచ్చని రేఖల కోసం నిరీక్షణం ప్రతీకలతో

# 47. నిర్భయత పరుస్తుంది

శబ్దమయ ప్రపంచంలో మౌనాకృతిలో కవిత
అక్షర మయమైంది నవ సంస్కృతి తేజంతో
ప్రశ్నలకు సమాధానాలు కనిపెడుతుంది
అంతరంగం తన నిర్ణయాన్ని హృదికి తెలియజేస్తుంది

సమాజాన్ని కనిపెడుతూ వ్యక్తిని గుర్తిస్తూ
బలవంతంగా పట్టుకొని వినిపించలే రెవరూ
ప్రతిదీ రహస్య పేటిలో భద్రపరచబడీ
అమూల్యాన్ని పరంపర కందచేస్తుంది

శుష్కమైన క్షణాలను రసమయం చేసేను కవిత
'రసాసార ప్రసారాలతో సృజన రూపం పొందేను
విప్లవ భావనలో అగ్ని కీల లెగసి చుట్టు ముట్టేను
శ్రమ తేజంతో అక్షరం శాంత భావ సంస్కృతి మయం

పైకెగరలేని భూమి నంటి ఉన్న మనిషి
తనకు తెలియని ప్రపంచాన్ని తెలుసుకునే ఉత్సుకతతో
కనుచూపు మేరలో అవకాశం అందినట్లే ఉంటుంది
కొందరికి పైన ఏదో లోకం ఉన్నదనే ఆలోచనలో

కవితలో ఉద్యమించే భావనా లోకం
నిజ జీవితం లోను తటస్థపడేను
ఇది మానవ వికాస చరిత్రలో భాగం
మనిషిని కేంద్రంగా చేసి నిజ రూపం చూపేను

స్టేషన్‌లను దాటుటూ పోయే రైలులా
మనస్సు దృశ్యం నుండి దృశ్యానికి పయనం
భూమిపై నడకకు హద్దులు లేవు
కల్పనకు మనసులో మితం లేదు

పొగ మంచు చీల్చుకొని పరుగెత్తుతుంది రైలు
నలువైపుల సమాజం ఎవరికి నచ్చింది వారు
కోరికలను బట్టి అనుభవంలో ఒకరి కొకరు తోడుగా
హృదిలో నిర్భయతను పరుస్తుంది శిఖరాలకు చేరుస్తోంది

# 48. కాలాన్ని అలంకరిస్తుంది

జీవితాని కెన్ని ముఖాలో విషయాలను బట్టి
కవితలో సమాజాని కెన్ని కోణాలో స్థలాన్ని బట్టి
కవితకు వ్యక్తితో సంఘంతో ఇరువైపుల అన్ని
ఇవి కలిసిన రూపం మనిషి ఊహలో కమనీయం

బావిలో నీరు అట్టడుగుకు చేరవచ్చు
చెరువులో నీరు నెరియలు చూపవచ్చు
నదిలో నీరు అలలు తరుగుదలతో ఎండేను
చెలమలు శుష్కించిన అరటి ఆకులయ్యేను

అక్షర జల కణ సంభృతమైన కవితకు
ఏ ఆపద లేదు శూన్యాకృతి మాట లేదు
స్వేచ్ఛా చరణంలో మానవ గుణ శోభతో
హృదిలో ఉజ్జీవన కళతో పాత ముఖం మాయం

మనిషిపై మనిషి నమ్మకం సుందర హ్లాద సమం
కవికి ఒంటరి తనం ప్రసక్తి అసలు లేదు
పద పద మొక విధం మనో విభవంతో
చుట్టూ సమూహ చేతనతో వర్తించేను

కవికి తోడుగా కవిత ఎప్పటికీ
మాటలో కాగితంపై ప్రపంచాన్ని చూపించేను
నవనవంపై ఎప్పటికీ ఆస్థ అందరికీ ఇష్టమైంది
అగ్ని కన్న పవిత్రం! జలం కన్న శుచివంతం

పద్యానికి క్షతి లేదు, గుండె లయను సరిచేస్తుంది
స్వేచ్ఛా కవితకు కాలం చెల్లదు ఆగదు ఆయువు పెంచుతుంది
ఇది ఉదయ సాయం సంధ్యల వలె మారుతూ
పద్యానికి సన్మిత్రంగా ఎంత దూరమైనా పయనిస్తుంది

సమాజం జీవితం రెండిటిని ఆశ్రయించి హృదిలో
ప్రేరణచే కవితలో దార్శనికం సమాజమూ ఒకటిగా

ఒడుదుడుకుల పయనంలో కవిత చేయి నందిస్తుంది
మట్టిని సస్యమయం చేసి వర్తమానాన్ని అలంకరిస్తుంది

# 49. తెలిసిన మనసులతో

కవిత నిత్య రసధునియై కవిలో సజీవంగా
నిరంతరం గమన పదంతో సరిస్తుంది
అందరికీ సేవ్యమానమై హెచ్చు తగ్గుల భేదం లేదు
భాష స్థలం చిన్న పెద్ద అంతరం లేనే లేదు

పోలికలో ముఖం ఒకటి కాకపోయినా
గుణాలలో కొన్ని ఒకటిగా తోచవచ్చు
ఆకు రాలుతుంది దాని స్థానంలో మరొకటి
విత్తు బయట పడుతుంది జీవన తరువవుతుంది

శబ్దం అర్థం భావం త్రిపథగ ఒకటై
ఆలోచనలో రూపం అనుభవంలో పరిమళం
బంగారం ఒకటే నగలెన్ని విధాలో
నాదం ఒకటే స్వరాలెన్ని తీరులో

'శాంతి' అవసరంపై బయటకెన్ని కబుర్లు చెప్పినా
లోన తిష్ఠవేసి విచిత్రతలో వైరం కలహం రణం
స్వచ్ఛతకు శుభ్రతకు మదిలో అవకాశాలెన్నో
కుసుమ సదృశంగా క్షణాలు పూయాలని కోరిక

రణ భావన ద్వార తోరణమై స్వాగతమిచ్చేనా?
చరిత్ర పుటలో చూపులో పడేది ఇదే, ముందుగా
ఎవరు మార్పు కోరినా, ఏది కావలె నన్నా
ఉన్న నగ బదులుగ కొత్తది కోరడమే, పొందడమే

అక్షర జ్ఞానమున్నంత వరకు పద్యానికి ఢోకాలేదు
కవిత! బిందువు వలె జారి కాసారమొ జలధియొ తలపిస్తుంది
ముఖం విరిసి సంస్కార పరిమళ వీచులు విసరుతుంది
కాలం గడచే కొద్దీ విజయాశయం, దృఢ తరమవుతుంది

ముఖ పీఠం నుండి రాజ్యమేలు తుంది
స్వేచ్ఛా జీవన పథంలో కవితకు పాత లేదు
ఎప్పటికీ అభినవ నవమే! ఈ లోకంలో అందరిదీ
సారభూతమైన మానుష తేజస్సుకు సంకేతం

తన వైపు చూచే అన్నిటకీ ఆశ్రయ నిలయం కవిత
తమలో చేతన రూపం! తెలిసిన మనసులతో, కవిలోకం

# 50. సమాజ చేతనలు

ఆలోచనా తివాచి పైన నడుస్తుంది కవిత
ఆపైన కాల వాహనంపై సుదీర్ఘ యానంలో
రవి కిరణం అందుకొనీ ఎంత దూరమయినా
ఊయెల కావచ్చు అశ్వం రథంపై వెహికిల్ విమానమో
మానవ వికాస ప్రపంచంలో ఏదైనా కావచ్చు ఎన్నో
నరుడే ముందుకు వచ్చి వహించే ప్రత్యేకం రావచ్చు

ఇది జ్ఞాపకాల నెన్నిటినో మనసుపై పొరలో దింపుతుంది
నిండుగా మౌనంగా ఒకపుడు ప్రవహించిన నదిలా
ఇరు గట్లను స్పృశిస్తుంది, ఈవైపున ఆ వైపున అభేదంగా
జలాల నందిస్తుంది, ప్రజలకు ఆర్ద్ర భావ గుణంతో

ఆ సమయం కవితలోకి దిగుతుంది ఆర్ద్ర భావ ఝరియై
గళం నుండి జారే స్వర కలనం తలపుకు వచ్చేను
ఉత్సాహం ఉల్లాసం ఉద్వేగం ముప్పిరి గొని
వ్యక్తిలో నూతన తేజాన్ని నింపుతుంది
అనుభవ శాలీనత పండిన ఫలం లా కవితలో
ఆహారానికే కాదు అవసరమైన విత్తనానికీ

ఉదయమైతే భయంలేదు, ఉండదనీ అందరి భావన
కాని! విప్లవ పద గమనంలో మొదటి కిరణం
చేతిలో తుపాకిగా మారవచ్చు రక్షణ క్రియలో
ప్రాణ హానికి వెలుతురు చీకటి విభజన రేఖ లేదు

ఊరు వదలి నగరం వీడి ఇపుడు అడవికి
అంకితమై ఉద్యమాలు వైప్లవులు యోధులు
ఆయుధ బలంతో బీభత్స రచనతో విజయం కోరేరు
తీవ్ర వాదం ఎరుపులో శాంతి పతాక తెలుపులో

చుట్టూ పచ్చదనంలో భాగ్యం దేని ప్రయోజనం దానిది
స్థాయి భేదాల విలువలతో తూగే బ్రతుకులు
ప్రతిఘటనలు ఉద్యమాల కన్న, “విప్లవం” ఇపుడు చెల్లే కరెన్సీ
మట్టి విగ్రహాలు కాదు, సమాజ చేతనలు మనుషులు

# 51. సమస్థితిలో

జీవితం కోరుతుంది అలంకారంలో వజ్రాల హారం
స్త్రీలయితే మరీ ఇష్టం! ఉపయోగ స్థాయిలో విలువలతో
ఒరపిడిలో రాపిడిలో బాధా వేదనలో కాలానికతీతమైన
స్పృహలో భావమయం శబ్దం కవిత! సృజన కళను కోరుతుంది

కళ్ళు తెరవడంతో లేచిన మనిషి మనసులో
తన జీవన సార్ధక గమ్యం హృదిని ఆవరిస్తుంది
జీవన సత్యం తత్త్వం నైజం ఒకచోట చేరతాయి
లౌకిక బంధంతో మనిషిని పరీక్షకు నిలుపుతాయి

సమయ సమయం కాలం! వ్యక్తిని పరీక్షకు నిలుపుతుంది
గేటు దాటి బయటికి వస్తే వ్యవహార జగత్తు వేరు
వేలు పట్టుకొని అంతటా తిప్పాలని పరిచయ గంధంతో
భూమికి గగనానికి ఉన్న ఎడం తగ్గేనని తెలిసిన వాస్తవం

ఉత్సాహం రెక్కలు విప్పి, ఉద్వేగం వేగం చూపేను
కిటికి నుండి చూచింది తలుపు తెరచి చూచిందీ
సామ్యం కన్నా భేదం ఎంతో దేని అవసరం దానిది
ఒకరికి పనికొచ్చే మనిషితో, పనికిరాని మనిషి ప్రక్కనే

స్వేచ్ఛలో వివిధతలకు పక్షాలకు వర్గాలలో చీలిక లెన్నో
సంఘంలో వ్యక్తిత్వం సార్థక మయ్యే ప్రతిష్ఠ, సామాన్యం కాదు
గతం కొందరిలో స్మృతి వనంగా పెంచబడేను
భవితకు ఆశారూపం ! వర్తమాన వేదిక అయ్యేను

కష్టాలకు బాధలకు సమాజంలో నమూనాలు ఉండవు
ఎవరి ప్రత్యేకత వారిది ఎవరి వ్యక్తిత్వం వారిది బ్రతుకులో
స్వయం శక్తితో జాతక చక్ర భ్రమణం ఎందరి అనుబంధాలతోనో
కాల చక్ర భ్రమణం నియతం మనిషికి అవసరం

మనిషి జీవితం స్వేచ్ఛలో సర్వ స్వతంత్రం
స్వర్ణ వజ్ర మయం ఆశా కవచం లేకపోతే
ఎన్ని ఆత్మహత్యలు మ్రోగేనో విషాద ఘంటికలలో
మనసును సమ స్థితిలో నిలుపుతుంది, ఆత్మ బంధం

# 52. ముందుకు సాగేను

మనో నిలయం కిటికి తెరచి చూస్తే
బయట ప్రపంచం పరిమిత దృశ్యాలతో
పైన కదలే మబ్బులు నా వద్దకు
వచ్చేనని అనిపించేను, ఆత్మీయంగా

బయట తలుపులు తెరచి ఉంచితే
లోనికి వచ్చేసే దెందరో? ఆప్తంగా
గగన సరసిలో మేఘం ! పయనానికి
నాకై సంసిద్ధంగా ఉన్నట్లు ఉంటుంది

అక్షరాలు ఏ రంగులలో వ్రాయబడినా
అంతర్యం అవగత మయ్యేదొక హృదయానికే
స్వార్థంలో చుట్టు ముట్టిన సదోష వాతావరణంలో
అందరి కళ్ళు కప్పి ఏదో విధంగా గెలవాలనీ

ఎదుట నున్న ముఖంపైన బీభత్స ముద్రలను దింపే
తన ముఖంలో వెలుతురు బింబం వెలగాలని

నోట మాట లెన్ని పలికినా
దివ్వెలెన్ని కళ్లలో వెలిగినా
ఏదో సాధించే పనిలో
మనిషి అంకిత భావంతో

మేఘ గర్జనలో జన హృదయం
అవసరాన్ని ఆలకిస్తే చాలు!
మానుష పరిమితులు తెలిస్తే చాలు
మెరపులో సూచన అవగతమవాలి

ఆశలు అమ్మబడవు! కొనబడవు
ఇది వ్యాపారం కాదు! వ్యవహారం కాదు

మరొకరి నుండి హరించే వస్తువు కాదు
తనదైన స్వయం సాధన తోనే లభించేను
అందిన ఆశయాన్ని పట్టుకొని పోయేను
తీగెలా అల్లుకొని మును ముందుకు సాగేను

## 53. తెగని అనుబంధం

నడుస్తూన్న క్షణాలు హఠాత్తుగా కుదుపుతో
ఒక నిరోధంతోనో విరోధంతోనో
జీవితం ఆగినట్లు అనిపిస్తుంది
చక్రం కింద నలిగిన పూవులా క్షణం
మళ్ళీ తేరు కోవడం ప్రశ్నార్థకమే
ఆ క్షణాలతో అనుబంధం తెగినట్లేనా?

అంతలో కొత్తది అనుభవానికి రావాలని
రాక తప్పదు, వస్తుంది, రావలసిందే, ఆగదు
కాలం కదలుతుంది, పరుగెత్తు తుంది
వెలుతురు రెక్కలపై ఉదయంతో మనసును తిప్పుతుంది

అన్నీ సరికొత్త అనుభవాలే, పాతవి తిరిగి రావు
ఇంతకు ముందు వచ్చినవి గతంలో చేరేను
పాతవి ఎక్కడో మట్టిలో కలలు కంటూ
స్వేచ్ఛా సంచారానికి కావలసిన ఆలోచనతో

చరిత్ర పునరావృతంకై మనిషి ఎదురు చూచేను
పరివర్తన దశకై సమాజం ఉద్వేగ పదమెత్తేను
పగటి తేజో రూపం అంతరంగాన్ని ఆవహిస్తుంది
రాత్రి వెన్నెల హృదయం మనోలోకం కోరుతుంది

మనిషిలో తెలిసో తెలియకో మరో మనిషి గుప్తంగా
ప్రతి మాటను ప్రతి చర్యను వివేచనకు గురి చేస్తూ

రవి కిరణంలా ఉత్ప్రేరణ ప్రసారంతో
నవ చేతనతో కొత్త యుగం వినిర్మిస్తూ
బ్రతుకులో వాస్తవాకృతి అమరినట్లు
కల్పనలకు చోటు లేని యథార్థ బింబం

రెక్కలపై కోరిక తీరే విమాన యానం
కవిత లోనే సాధ్యం! అణు ఘటితమైన రమణీయతతో
జీవన వాస్తవ చేతన ఫలితం అన్నట్లుగా
మార్కెట్ సంస్కృతికి అనువైనది అన్నట్లుగా

# 54. లోన - విగ్రహం

లోన నిలువెత్తు చేతన గుణ విగ్రహం
గాజు గదిలో నివాసం ఎప్పటికీ నిండుగా
లోన కెవరికినీ ప్రవేశం లేదు
తోడు మనిషికి కూడ అతీతమైంది

తప్తమైన బాష్ప కణం జలదమై
సేచనతో సమార్ద్ర మయితే తప్ప
అగ్ని తాండవంతో కాలం గడచేనా?
జలధారా సంగీతంతో సమయం జారేనా?

రణం శాంతి రెండు కొసలలో నున్న
ప్రాణ వాయువుపై ఆశతో మనిషి! జీవితాంతం
స్నేహం త్యాగం ప్రేమ కరుణ శాంతి పద పంక్తులతో
స్వచ్ఛంగా స్వేచ్ఛగా బ్రతకాలనే అందరికీ మనసులో

మారణ గుణ క్రియ లెన్ని విధాలో, ఆయుధాలన్ని తీరులు
తగాదా గలాటాతో ఉన్న స్థితిని ఇంకా అస్తవ్యస్తం చేసేను
బ్రతుకుల అమరికలలోను నిర్మాణాలను ధ్వంసం చేసేరు
పొంచి ఉన్న మృత్యువు ! ఓటమి పాలు కావచ్చు
వెనక్కి మరలి పోవడం విచిత్రమైన విషయం
మృత్యుంజయ భావనతో మనిషి ! గగన మెత్తు ఎదగాలనీ

పోరాటానికి ఆరాట పడే మనిషిలో జ్వాలా మయమై తరువు
నీరు అందిన పాదులో చుట్టుకొనీ సర్పం ఎవరి మిత్రం? అంటే
మనిషికి శత్రువుగా అందరికీ తెలిసిందే ప్రాణ భయంచే
ఆ మాట వినబడితే కర్ర తీసుకుని బయలుదేరేను మనిషి

భూమి పై పాము కలుగలలో దాగి
గగన తలంలో పక్షి దిశలలో ఎగురుతూ

రెండిటికీ వశం చేసుకోవాలనే మానవ యత్నం
ఉభయ దేవతలకూ మిత్రం మనిషిని మెత్తబడ జేసేను

చరించే ప్రాణవంతమయిన  ఆయుధాల వలె పాములు
భయ భావ ప్రమాదాలతో మనుషులలోనూ తిరుగుతూ

# 55. నావి కానివి

విషాద సమయంలో సానుభూతి ప్రకటన సందర్భం
మౌనం ఆవహించి హృదయం రాజ్యమేలు తుంది
కదలే గాలి మాట్లాడుతుంది శ్వాస క్రియతో
ఏ ఒకరిదో గళ స్వరం తప్పిన దారిని సూచిస్తుంది

కొండపై నుండి జారి లోయలో పడిన
వెహికల్‌లో మనిషి! సహాయం కోసం చూచేను
కిందికి తాడు వదలి చేయి అందించి అందుకునేరనీ
సంకల్పం ముఖ్యం ఉపకరణాల అవసరంగా అంచెలపై

ప్రతి బ్రతుకులో ఎందరి పనులలోనో ఎవరికెవరి సహాయమో
అంతవరకు ముఖం ఎరగని వాళ్ళు, సహాయ సంపద ఉన్న వాళ్ళు
తోడుగ ఒంటరి తనాన్ని పోగొట్టేరు మనిషిలో
వ్యక్తి నుండి సమాజ శక్తికి మార్చేరు సత్వరం

మస్తిష్కం సంచిలో స్మృతులు అందరికీ చెందినవై?
నీవు నేను అందరు భాగస్వాములు కావచ్చునేమొ
నా కోసం చీకటి పొంచి ఉండే మాట వాస్తవం
అనుకున్నవి అనుకోనివి నేరాలు దోషాలతో నిండీ

ఎవరి బాధలోనూ ఒక్క కన్నీటి చుక్క రాలని వ్యక్తి
కన్నులలో దీప శిఖలు వెలిగించుకుని గడపేను
హృదయానికి నచ్చింది పోగు చేయడంలోనే సమయం
చూస్తూ ఉండగనే ప్లాట్ ఫార్మ్‌పై నుండి తప్పిన రైలులా

ఇక నాకు మిగిలేది కళ్ళలో అగ్ని శకలమేనా
వదలిన బూది మాత్రం జేబులోనో సంచిలోనో
రాత్రి కల్లోల సముద్రం, తన ధ్వని తరంగం విసరుతుంది
పగలు ప్రశాంత జలనిధి హృదయమావరిస్తుంది

వెలుతురు నిష్క్రమణంలో మాటను మోసుకొచ్చి
ఇంటి ముందు వదలి వెళ్ళి పోతుంది పవనం

మరునాడు సంచి విప్పి చూస్తే అన్ని
యథాతథంగా, నావి కానివి, ఎవరెవరివో

# 56. ఇది నాదే - ఎవరిదీ కాదు

కాలం కలలు కనదు కఠోర వాస్తవాన్ని చూపిస్తుంది
తేలికైన అనుభవాన్ని సులభంగా దాటిస్తుంది
కవికి గతమూ వర్తమానం భవిష్యత్తు ఒకటే
సువర్ణ సూత్రంలో బంధించిన సుమమాలా రూపం

మనిషి అవసరాన్ని బట్టి కాలం విభజింపబడీ
ఎక్కడి కక్కడ దృశ్యమయంగా కదలే చూపులో
మనసుకు పని కల్పిస్తుంది, మనిషిని నడిపిస్తుంది
గుణాలకు మించిన దోషాలతో బరువుతో మందంగా

తలవంచుకో నవసరం లేకుండా మనిషి ఆకర్షణతో
చెక్కిన శిల్పం వలె నడత తీర్చ బడాలని, రసధునిలా ప్రవహించాలని
ఇది సాధ్యం అయ్యేది కాదని అందరికీ తెలుసు
అయినా చివరి శ్వాస దాక చెక్కుతూ కదలుతూ పోవలసిందే

మట్టిలో కలిస్తేనేం మళ్ళీ విత్తు నుండి చివురు తల ఎత్తేను
మొలక నుండి ఆకులతో సుమ ఫలాల్ని చేతి కందించేను
స్వార్థంతో కొండపై నుండి చూపులో తోసిన దృశ్యం
దీని కెదో బలమైన కారణం కావచ్చునేమొ ఇదొక బంధం

వాన జోరుగా పడుతుంది నీరుతో లోయ నిండి సమంగా
నీళ్ళలో చిక్కిన మనిషి అనుకోకుండా తేలి బయటపడేను
అడవిలో శబ్ద ప్రపంచం! ఎవరో ఆపదలో ఉన్నట్లుగా
ప్రకృతి మనిషి అతీతం ముప్పేటగ కలసిన జీవన కళతో

అంతలో కాస్త తగ్గు ముఖం పట్టిన ధ్వని
ఏదో సరదాగా ఆట ఆడుతూన్నట్లు ఉంది
గాలికి ఊగే చెట్టు కొమ్మలు భయపడుతూనే
మనిషికి భయం లేదని తన భరోసా ఇచ్చేను

స్మృతులతో గతాన్ని మోసుకొని వచ్చి మరో చోట వదలేను
అందరూ నాది కాదని తిరస్కరించిన మరుక్షణంలో సంచి
మరెవరో దారిన పోతూ ఆకలిలో "నాదే" అని చూపేను
వెను వెంటనే విప్పి చూస్తే, జారిపడిన కరెన్సీ నోట్ల కట్టల దృశ్యం

# 57. అమృత బంధం

ఆశలు ఉంటే చాలదు ఒక దాని తర్వాత మరొకటి
ప్రయోజనంలో జన హిత విపులత అవసరం
జ్ఞాపకాలు అలల వలె రసాకృతి పొందవచ్చు
అగ్ని శిఖల వలె రాత్రి దారి చూపవచ్చు

ఇవి కత్తుల కవాతులే కానక్కరలేదు
పూల బంతులు కావచ్చు లీలా క్రీడా రంగంలో

శిలల మధ్య నుండి కిందికి దిగే ప్రవాహం
ఎవరికి తగిన సంగీతం వారికి వినిపిస్తుంది
అది రణ ధ్వనియే కానక్కర లేదు
అది మనో వికాసంలో రస ధ్వని కావచ్చు

అడవిలో మానుష గాథ మొదలయింది
అచటి నుండి జన పదానికి తరలేను
ఊరు నుండి నగరానికి చేరుకునేను
తిరిగి ఇపుడు! ఆయుధంతో అడవికి వెళ్ళేను

పరివర్తన అనివార్యమై అందరు కోరేదీ
ఎదురు పడే ప్రశ్నలకు మనిషి కొక సమాధానం
కల్లోల మయమై! సర్వం బీభత్సం! సమాజ తలంపై
అరాజకం రాజకీయ కోణంలో హింస చెలగి
రాలే ఎండుటాకుల వలె నైతిక పతనం
కొత్త చివురులో ఆకు పూవు ఫలంకై నిరీక్షణం

బయటికి వచ్చి ఎదురుగ దృశ్యాన్ని చూస్తే
నీలి మబ్బు నా వద్దకు వచ్చే ననిపించేను
తలుపులు తెరచి ఉంచితే నిర్నిరోధంగా అవలీలగా
లోనికి  రావలసిన రాదలచిన మనుషులెందరెందరో

ఎవరి గమ్యం స్థానం వారికి పరిమితమై
ఎవరి పయనం సాధనం వారికి విశిష్టమై
ఇంతవరకు బాధల్ని వేదనల్ని దుఃఖాల్ని విషాదాల్ని
గడచిన సమాజం! నీదీ నాదీ అందరిదీ అమృత బంధం!

## 58. భిన్న భిన్నం - ఒకటే

ప్రతి వస్తువు మౌనంగానో సశబ్దం గానో
నది అయితే వేగంలో గల గల మనో
ఆకు లయితే చెట్ల గాలికి రెప రెప లాడుతూనో
మాటలయితే కలిసిన మనుషుల ముఖ వేదికపై

దిగ్వలయం కోణాలెన్నో అన్ని అభిమతాలు
మనిషి మనసు భ్రమరంలా చుట్టు తిరుగుతుంది
తుట్టెలో మధువులా కవిత! సంచిత మవుతుంది
దగ్గరకు వెళ్లేవారు వెళతారు, సాహసం చేస్తారు

కనబడిన వ్యక్తి ఫాల తలంపై వ్రాసింది
తెలుసు కోవాలని ! భాష కన్న ముందు వర్తనపైన
దృష్టి ప్రసారం! ఏ రోజు కవితకు సరిపడే విషయంతో
అంతరంగానికి కావలసిన చిత్ర వర్ణ సామగ్రితో

ఏ దేశం ఏ వ్యక్తి ఆ భాగం పై ప్రేమతో
బ్రతకాలనుకోవడం సహజం, అదృష్ట విశేషం!
హిమ శిఖరంలా పెరిగే ఆశా రూపం సమ్మతమే
మయూఖ స్పర్శకు ప్రవాహమై వరదల దాడికి ప్రమాదమై

ఒక సమస్యకు సమాధానాలెన్నో ప్రతి బిందువు నుండి
మనుషుల చుట్టూ రేఖా చిత్రాలెన్ని ఏర్పడేనో?
ఎన్ని రంగుల లోనో మనసును రంజిత మొనర్చేను
దీనితో సృష్టికి విపులత తో జీవన వ్యూహం పెరిగేను

ఈ తరం ఆ నమూనా మనిషి అని లేదు
ఈ స్థాయి ఆ స్థాయిలో వ్యక్తి అని లేదు
ఈ కవి ఆ కవి అని భేద భావనలు లేవు
మూలం ఒకటే అందరిదీ! మానుష చేతనతో

శబ్దం మౌనాన్ని ఛేదిస్తుంది స్వర లహరులతో
అర్థం భావాన్ని ప్రసరిస్తుంది శాంతి రేఖలతో
భావం లక్ష్యాన్ని తలపిస్తుంది ప్రజల కవసరంతో
హృదయం అన్నిటిని తన పిడికిలిలో నిలుపుతుంది

స్వేచ్ఛా కవిత్వం - 123

# అదృష్టం

మాదిరాజు రంగారావు



2022

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

**123 SWECCHA KAVITHVAM**

**ADRUSHTAM**

**అదృష్టం**

by

Prof. Maadiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Year of Publication 2022

*Presented to*
*my daughter*
*Smt. Haritha Devulapalli, M.A. Lit.*
*USA Detroit*
*with best wishes*
*on her Birth Day*

# పీఠిక

"అదృష్టం" చూడనిది, కంటికి కనబడనిది ఎందరినో ఆశ పెడుతుంది. స్వేచ్ఛా కవిత్వంలో 123వ కృతి, ప్రచురిత మయింది. వర్తమాన కాలంలో సామాజిక రాజకీయ నైతిక స్థితిగతులపై దృష్టి కోణాల కలయికతో రూపొందింది. ఎందరో కవులు తమదైన ప్రత్యేకతల్ని ఆవిష్కరిస్తూ రచనలు చేస్తున్నారు. ఇది సహజం కూడ. ఎన్నో విధాలుగా ఎంతో విపులతతో కవి మనో రూపాన్ని ప్రతిఫలించేవిగాను తీర్చబడుతున్నాయి. కవులు అగ్ని శిఖలుగానో, కాంతి ఖడ్గాలుగానో, హిమ శిఖరాలుగానో వర్తిస్తున్నారు.

ఈ రచన ప్రజాస్వామ్య సామ్యవాద దార్శనిక భావాలతో ప్రకాశిస్తుంది. ప్రక్రియ పేరు స్వేచ్ఛా కవిత్వం. ఇది అరవై ఏండ్ల క్రితం పేర్కోబడింది. అన్ని పేర్లను చర్చించి గుణం చేత దీనిని గ్రహించడం జరిగింది. అప్పటి నుండి ఇప్పటి వరకు దీనిని కొనసగించడం జరుగుతూంది. ముందు కూడా ఈ విధంగానే ఉంటుంది. మార్చవలసిన అవసరం లేదు. కవుల విషయంలోనే కాక పాఠకుల స్థితులలోనూ కవిత్వం గురించి డివిజన్‌లు బాగా ఏర్పడినాయి. చిన్న చిన్న రాజ్యాల పోరాటాల్ని తలపిస్తుంఇ.

ఇందులో వస్తువు సామాజికం. దీనికి తోడుగా రాజకీయ నైతిక పూర్ణతను చేకూర్చే మార్గం అవలంబింపబడింది. అదనంగా మానవ మనస్తత్వ విషయాలు అక్కడక్కడ ప్రసక్తమైనాయి. అభివ్యక్తి విషయంలో విపులత కాకుండా సంక్షిప్తతకు అవకాశ మివ్వబడింది. అసలు కవిత్వానికిదే ఆకర్షణ రూపం అదృష్ట రక్తియే.

గుప్తత అలంకార శాస్త్రంలోని వ్యంగ్యము – ధ్వని మార్గాన్ని అనుసరించింది. ఇది Suggestion కు దగ్గరగా వస్తుంది. ఆధునిక కవిత్వంలో ఎప్పటివలెనే అనివార్యాలయిన ప్రతిబింబాలు, ప్రతీకలు (Images & Symbols) భావ(Thought) ప్రసార పద్ధతులు అవలంబించడం జరిగింది. ప్రయోజనంలో ఆకాంక్ష విశ్వజనీనమైంది. సర్వజన హితకరమైంది. ఇది ఈనాటి అవసరం కూడా.

కృతిలో కొత్తదనం కోసం ప్రయత్నం జరిగింది. అదృష్టం సత్వరం దృష్టమవుతుందనీ రుచిరతతో ఆస్వాదనీయ మవుతుందని, శోభాకరంగా నిలబడుతుందనీ చెప్పవచ్చు. "అదృష్టం" కేంద్రంగా ఎన్నో విషయాలు ప్రసక్తమైనాయి. ఇదొక విధంగా మినీ జగత్తును తలపిస్తుంది. భావ ప్రసార దార్శనికం మనసను ఆవహిస్తుంది.

**– మాదిరాజు రంగారావు**

# అదృష్టం

## 1. అదృష్ట పథం

సృజన విభవంతో భూమి ఎప్పటికీ తరం నుండి తరం
సృజన చేతనతో కవిత ఎప్పటికీ సహజ చలనంతో
వాస్తవానికీ కల్పనకూ దూరం ! అంతా ఇంతానా?
చూపు కందనంతగా మధ్యలో ఎన్ని అంతరాయాలో

సహ జీవన సహభావన సహరాగంతో హృది
భూమితో సంబంధం విడదీసే ప్రశ్న లేదు
జీవన గమనంలో ఒక అంచున నిప్పు రవ్వ నృత్యం
దీనికి సమాంతరంగా మంచు బొమ్మల క్రీడా విశేషం

శ్రమ జీవన క్రియా చరణంతో పాటు
ఉత్సాహం ఉల్లాసం ఉత్తేజం సమాజంలో
విద్యా విజ్ఞాన కళా వికాస జగత్తులో
అదృష్టం కలిసి రావడమన్న మాట వినబడుతుంది

మనిషిపై మనిషి ఆశ వమ్ము కాకూడదనే
"మనసు సాక్షి"పై నమ్మకం ఉండాలిసిందే

అణువు నుండి భూగోళం పర్యంతం
ఇపుడయితే వాస్తవ తలంపై బ్రతుకులు

దాహం వేసి దగ్గరలో నున్న బావి చేరితే
దాహం తీరే యత్నానికి బదులుగ మనుషులు
బావి లోతు చుట్ట కొలత కట్టడంపై దృష్టితో
ఆలోచనలో పరిశీలనతో కాలం గడచేను

అక్కడి బావి అవసరం గురించి అవసరాల పరిశోధన
ఎంతో కొంత ముందుకు సాగడం జరుగుతుంది జిజ్ఞాసలో

దప్పిక తీరే అవకాశం లభించకపోతే
ప్రాణానికి ముప్పు, అందరికీ తెలిసిన విషయం

కొంచెం దూరంలోనో దగ్గరగానో
మహా నదియో చెరువో ఉండవచ్చు
నీరు పుష్కలంగా పంట తిష్ఠ వేస్తుంది
దాహం తీరే మార్గం కవి నుండి కవితలో

ప్రబోధాలు సూక్తులు తళతళలాడే మరీచికలు
ఏది ఎపుడు అందేదీ పొందేదీ తెలియనిది అదృష్టం

## 2. ఆశల ఆటలు

కోరింది ముందుగ అందలేదని పరితాపం సహజం
దారి తప్పి నడచి నడచి సముద్ర మెదురవు తుంది
అవనిపై మంచి నీరుకు కొరత లేదు
అది సమయానికి పొందడమే ! కష్టం కావచ్చు

దోసిలిలో నీరుకై అడవిలో అన్వేషణం
జీవన భాగ్యం కై దూర దూరం తరలేరు
కంటి నుండి నీటి బిందువు సులభం కావచ్చు
కాని త్రాగే దోసిలి నీరు దొరకడం మహా భాగ్యం

సంపదలో సంపాదనకై భాగంగా సత్వరం
ఆశల ఆటలలో మనస్సు అదృష్టం వైపు చూచేను
భవితలో జీవన భాగ్యంకై ఎంత దూరమైన వెళ్ళేను
ఏది కోరేదీ పొందేదీ అరచేతిలో ఆశలు మరీచికలయ్యేను
ప్రబోధాలు సూక్తులు గాలిలో బెలూన్లవలె తిరిగేను
తిరిగినంత సేపు తిరిగి భూమిపైకి వస్తూ పగిలేను తొలగేను

మనో జగత్తులో నిశా సమాన స్థితి
జీవితాన అపుడపుడు తటస్థ పడేను
తత్కాలంలో అంతరంగ గగనంలో వివేక బింబం నుండి
ప్రకాశ రూప మవసరమవుతుంది బయట వెలుగు ఉన్నా

ఘన తమో రూపం తొలగడానికి కొందరికి
చుక్కలెన్ని పైన మెరుస్తున్నా ఒక్క రవి కిరణం చాలు
అయినా ఇంకా అక్కడక్కడ చీకటి తునకలు మిగిలీ
చూచే కన్ను కప్పి ఏ మూలనొ నిలిచేను మౌనంగా

క్షితిజం వలె పరచబడిన మనసు
దేని నయిన వహిస్తుంది సహిస్తుంది
ఇది ఎన్నిటికో  నిలయమయిన ఆయతనం
అందరికీ స్వాగత చిహ్నం అనురాగ తోరణం

స్మృతి నిలయ మయితే ఎన్నటికో జ్ఞప్తికి తెస్తుంది
ఇవి ఎన్నిటినో భద్ర పరచబడిన శాలా రూపం
భాష దేశం చరిత్ర సంస్కృతి నాల్గు దిశలలో నుండి
రసమయం, కవితయై పలుకుతుంది, కాలాన్ని వెలిగిస్తుంది

# 3. ఆరోహణలో కవిత

పరిచయ మయినా కాకపోయినా అడిగినా అడగక పోయినా
ఇష్టంగా సాదర దృశ్యం నిర్మిత మవుతుంది క్షణాలలో సమాజంలో
పలుతావుల కలయికలో కొత్తగ పవమాన వాహనంపై
పయనం ! దూర దూరం రోజులతో పనిలేదు ! కాలంతోనే

పుష్పక విమానంలా చోటుకు కొదవలేదు
మనిషి బయోడేటాతో పనిలేదు, హృదయం తోనే
అడవి జలధి కొండలు దాటాలనీ కోరిక
అవతల ఏముందో తెలుసుకోవడంకై ఆరాటం!

కెరటాలపై అడుగులు వేసేందుకు భయం
జలాలపై ఏ పడవో, గగనంలో ఏ విహగమొ
ఆధునికానికి ప్రతినిధులుగా మనిషి గర్వపడేట్లుగా
అనుమానం నుండి మనసు ముక్తమై స్వేచ్ఛలో స్వతంత్రంగా

మనసులోని కోరిక చివురుతో పుష్పం ముఖమెత్తాలనీ
మొనలు తేలిన కంటకాలకు సుదూరంగా వర్తించాలనీ
సమాజ సంస్కృతిలో వ్యక్తుల వికాస గతిలో
ఆరోహణలో కవిత వాస్తవ తలంపై జీవన కేంద్రమై

ఒక దిశ నుండి ప్రగతి తేజో ముఖంతో మవతరించేను
వెనువెనుకనే దూరంలో కనిపించి కనిపించని దృశ్యాలెప్పటివో
శిలాయుగం నుండి అణుతరం దాక ముందు చూపుతో
మనిషిని గర్వపడగ చేసే వికాస దృశ్యమయం ఆల్బం

ప్రజా స్వామ్య తంత్రంలో మానవ హృదయ స్పందనం
మనిషి గొంతు పెకలని స్థితి చేకూర రాదు,
మూగయై తన పాత్రను మరవడం శోచనీయం
ఆధునికం అవశ్యమైంది భవితను చేరువ చేస్తుంది

ప్రసార మాధ్యమంలో కవి మాటలు అందరికీ చేరతాయి
ఏ హేతువు చూపి ఎవరినీ నిరాకరించదు కాదనదు
కృత్రిమతను తొడుక్కోకుండా అదొక కవచం లా
ప్రజా స్వామ్య దృష్టి కోణం చెదరకుండా తొలగకుండా

పద్యాన్ని చెట్టు కొమ్మకు వ్రేలాడ తీయాలనుకుంటే
అదిపై కెగిరి ముక్తమై అతీతాన్ని ఆవరిస్తుంది
దీని ప్రభావ సుందరంగా సమాజ చేతనతో కవిత
కేతనమై నిలుస్తుంది స్వేచ్ఛా కవితను ప్రతిబింబిస్తుంది

## 4. తెలియనిదే ఎక్కువ

ఈ సంధ్యా నిశీథి కోలాహలం నగరం సెంటర్‌లో
నిప్పంటిన శాంత వనం నుండి హాహాకారాలతో
కాలాన్ని ఎరుపుతో తీర్చి దిద్దే దహన కాండ ! జ్వలనం
నేతల పాలనకూ రక్షకుల నిపుణతకూ చిహ్నంగా లేదు

బూది నీలి ఎరుపు పొరలతో తగలబడే స్థితిలో
విషాద దృశ్యంలో మరో వస్తువు కనిపించడం లేదు
మరునాడు వార్తల్లో ఉదయం పత్రికలలోనే కనిపించేది
జరిగిన నిజం, ఎవరి బుజాలనాశ్రయించిందీ తేలుతుంది

కలహంలో ఘర్షణలో దూసిన కత్తుల తళతళలు
అంతలోన స్నేహంలో పూలదండను తలపించేనా?
అంతలోకే తారుమారై శాంతికి పట్టం గట్టే
చతురత కనిపిస్తుంది ముఖాలకు వేసిన కొత్త రంగుతో

ఎత్తులు పై ఎత్తులతో రాజ్యాలు కుప్పకూలవచ్చు
సగం కాలిన ముఖాలతో ఉదయ దృశ్యం! మానవాన్ని కోరుతూంది

గ్రీష్మంలో తాపానికి సలసల వేడెక్కే జలధిలా
సమాజ వాతావరణం చెప్పేదొకటి, చూచేది వేరులా ఉంది
విధ్వంసం వినాశనం వ్యతిరేకం చర్యలు ప్రతిచర్యలు
అనివార్యాలయి ఒక సందర్భంలో ఉపకారం కోరేను

ఇరుపక్షాలలో మోదం ఖేదం చివరకు తాత్వికం అవుతుంది
విజయంతో చరిత్రలో ఘట్టాలనేకం
తాత్వికం జీవితం రెండూ కలిసే దిచటే
ఆయువులో మనిషికి లభించేది అనుభవించడమే
మలినం అంటని దొకటే, చేసిన మంచికి యశోరూపం
సృజనలో సమన్వయానికే మానసికంగా ప్రాధాన్యం

చీకటి రాళ్ళ కుప్ప కాదు రాత్రి
ఏ ముక్కకది స్వతంత్రం కావచ్చు ఉపయోగంలో
పరం పరాగతంగా వచ్చే అదృశ్య రూపం గతం
కాలవసినవి, పోయినవి రహస్య పేటిలో భద్రంగా

వెనుక లేని చూపుకు కనిపించని నిజాలెన్నో
తెలిసిందనుకొనే దాని కన్న తెలియనిదే ఎంతో ఎక్కువ

# 5. ఇష్టమైంది

భూమి తలంపై పయనంలో పోనుపోను ముందుకు
తన కిష్టమైన వాహనంపై లక్ష్యంగా ప్రేయో రూపం
తన కిష్ట మయిన యాత్రా రూపం సుందర వాస్తవం
ఎక్కడో సముద్రం ఎదురు పడేను పట్టరాని ఆశ్చర్యంగా

బహుదూరంలో ఉంది ఇంత వరకు అపరిచితంగా
దాని పొడవు లోతు వెడల్పు వేగం తెలియవు
కడు దగ్గరగా ఉంది స్నేహసుందరంగా లోన భయదంగా
ప్రియం భయం చేతన జడమూ వ్యతిరేకాలు కలిసినవీ
ఇది జీవన సంకేతంగా, ఆదర్శంగా మనిషిలో

మనిషి గొంతు పెకలి పదాలొకటొకటి కవితలో
మరో జగతికి సంకేతమైతేనే వికాస భావ రూపం
క్రింద నుండి పైకి ఆరోహణలో బహు కఠినంగా
పై నుండి క్రిందికి అవరోహణలో కడు సులభంగా

సభ్యత సంస్కారం చదువు వివేకంతో మనుషులు
పీఠం పై నుండి మానవ గీతకు ఆకృతి నిచ్చేరు

ఆకాశం మేఘం జీవితం పయోనిధి మనిషి చెట్టు
సమీచీన బంధంతో ఉన్నంత వరకు వీడని ప్రభావాలతో

చేతనమూ జడమూ కవితలు సుందరమైన యోజనతో
సహయోగంతో చర్చకు అవకాశం దొరుకుతుంది

సంక్లిష్ట సమాజంలో ప్రశ్నల నెదర్కొనే మనిషి
ప్రతి ప్రశ్నకు సమాధానంగా చివరకు మనిషినే చూపేను

పని చేసేదీ చేయించేది చివరకు ఫలితం పొందేదీ
ఎక్కడున్నా మనిషే అందుకే అందరికీ అన్నీ ప్రధానం

మనిషిని గాయ పరచే వస్తువు లెన్నో?
పొందే బాధ మాత్రం ఒకే విధం
ఆ వెచ్చని బిందువు నుండి పయోధి దాక
దీని ప్రభావం మాత్రం బ్రతుకులో పలు రీతులు

నేరం శిక్ష నుండి పశ్చాత్తాపం క్షమ దాక !
మనసుపై ఎన్ని విధాలో వివిధ స్థాయిలలో

# 6. రచనలో దార్శనికం

జీవన గమనంలో స్వేచ్ఛలో ఆటంకాలెన్నో
స్థలం నుండి స్థలానికి ఆగమనం నిర్గమనంలో
మెరపులతో ఉత్తేజం పిడుగులతో ఉత్ప్రేరణం
ఆలోచన అనుభవం రెండు దిశల మధ్య నడత

కొత్త వస్తువుపై చూపు పడిన పిల్లలు
కోరిక తీరనపుడు ఏడుపు మొదలెట్టేరు
సృజన ప్రసారంలో సమన్వయానికే ప్రాధాన్యం
అవరోధాలకు విరోధాలకు అస్తితలకు తావులేదు

హృదయ భాషతో కవిత విశ్వమయత పొందేను
మాట్లాడే భాష ఏదయితేనేం? మనసు నుండి మనసుకు స్పందనతో
హృదయ సహృదయతతో కాని నిర్ణయం జరగదు
స్థానికం నుండి ప్రపంచ స్థాయికి అవకాశం ఎదగజేస్తుంది

ఒక సమయం వస్తుంది ఎదురు కాక తప్పదు
కను కొసల నుండి బాష్ప కణం
నిప్పును రాల్చేనో? పూవును జార్చేనో
రెండూ జీవన గమనంలో సంభవమయ్యేవే!

అనుభవం అనుభూతి ప్రకాశ రూపాలలో
ఇది కవితకే చెల్లుతుంది స్పందన గుణంతో

ఒక విధం కవితను పూర్తిగ నిరాకరించేరు కొందరు
ఒక విధం కవితను గుండెకు హత్తుకునేరు కొందరు

అక్షర పంక్తిలో దిగిన చేతనా చేతన ప్రపంచం
భౌతిక మానస స్థాయిల్లో అందరినీ ఆకర్షించేను

కవితలో లోతు తెలియడమే కాదు, చివరలూ తెలియాలి
ఉల్లాల తరంగాల వేగంతో హృదయం, సహభావం పొందాలి
పోటీ పడి గట్టును దాటడం ఒక మహా యత్నం
సమాజంలో కలవడం బ్రతకడం జరుగుతుంది
కుంచిత భయ ముద్రలతో ధైర్యం పుంజుకొనేను
కృతిలో నవతకు జనామోదంతో పట్టాభిషేకం

ప్రతిభతో పాటు నైతికం ఆంతరమై లోపాలు సరిదిద్దేను
రచనలో దార్శనికం లక్ష్యం కవి వ్యక్తిత్వంతో స్వతంత్రం

# 7. భయ డోలపై

ముఖ్యంగా కలలు రాని నిద్ర శాంతంగా
అయితే మనసుకు మరీ మంచిది
శాంతాన్ని వరించిన స్థితిలో వర్తమాన సమాజం
ఎగసే అలలు అణగిన సముద్రాన్ని తలపిస్తుంది

చీకటి అడుగులు స్ఫురింప చేస్తాయి
ఇది హ్లాద కరం జీవ రూపానికి సుఖకరం
వెన్నెల ప్రశ్నకు సమాధానం తెలుపుతుంది
సూచనలు ప్రబోధాలు చేస్తూ పరిష్కరిస్తుంది

మెలకువలో ప్రకాశరూపం
మనిషిలో నిర్ణయ శక్తిని ప్రసాదిస్తుంది
వెన్నెలలో ప్రసన్నమైన మనోరూపం
ప్రశ్నలకు సమాధానాలు సమస్యలకు పరిష్కారాలు

చల్లని వాతావరణంలో అందజేస్తుంది నిశ్శబ్దంగా
ప్రాణ భయంతో మనిషి ఎన్ని భద్రతల రక్షణలలోనో
చీకటి భయం కొండ వలె ఉంది మనసులో
దీపం వెలుగు స్పర్శతో కరగి మాయమవుతున్త్రంది

తొట్ట తొలి దశలో మనిషి మనిషి నెదుర్కొనే
ఉపకరణం ప్రయోగం విసరబడే ముష్ఠి ఘాతం
దానితో పాటుగా విసరబడే శిలా శకలాలు
ఇప్పటికీ రాజకీయ సభలపై మూకల దాడులు
ఏ పక్షమయినా సులభతనే కోరి ఎన్నుకునేరు
రాళ్ళు కర్రలు చివరకు అగిపుల్ల గీయడం

స్థానిక కలహాల ప్రణాళికలో ఉపయోగించేవి
అదృష్టంపై భారం వేసేవి తమ విజయ కాంక్షతో

ఇరు పక్షాలలో వేల ఏండ్ల రణ చరిత్రలలో
అశాంతిని కోరే ఘనులెవ్వరు?కనిపించరు
శాంతిని కోరని మాన్యులెవరు? ఉండరు
అంతా వీరులే ప్రజాస్వామ్య సమాజ వర్తనలో నేతలు

లేచింది మొదలు ఇది కలయా అనిపించేవి భయాలోల డోలపై
ఊగేరు, సామాన్యులు అలజడులలో ప్రమాదాలలో తప్పుకొనీ

## 8. శిలలలో శిల్పాలు

మనిషి మొదటి రక్షణ కవచం శరీరం
జీవితంలో మొట్ట మొదటి గాయం తగిలేది దీనికే
క్రమంగా అవసరాల్ని బట్టి ఇతర సాధనాలు చేరేను
కలహాల నుండి పోరాటం వరకు మధ్య పొందే గాయాలెన్నో

శిలా చరిత్రలోను గాయపరచే మొట్టమొదటి సాధనం
రాతి పలకలు శాసనాలుగా ఉపదేశాలుగా సూచనలు
సమాచార రూపాలుగా గొప్ప పాత్ర నిర్వహించాయి
భవనాల పునాది రాళ్ళ నుండి విగ్రహాల వరకూ

అగ్నికి ఆహుతి కానిది బొగ్గై అనలకణం కాదు
నీటిలో కరగదు గాలికి కొట్టుకపోదు
తన ఉనికిని కోల్పోని జడ శక్తితో
కఠిన మైన వివిధ భంగిమల్లో ప్రతిమలుగా

వివిధ భంగిమల్లో శిల్పం ఆకర్షణతో
చూచే మనసును కరగించేను. ఆహ్లాద పరచేను
మానవ జీవన వర్తనల్ని భద్రపరచే ఆకరం
మనిషుల కళా దృష్టిని ప్రకటించే సాధనాలు

కాలాంతరాన మానవ సంస్కృతికి ప్రతినిధులై
స్థిరపరచేందుకెంతో ఉపకరించిన మనోజ్ఞాలు
చరిత్ర పరిశోధనలో ఉపకరించిన పాత్ర
సహకరించిన సమాచారం ఒక స్మృతి విశేషం

శిలాకృతులు మౌనంగా ఉంటాయి, మాట్లాడవు
మనిషి హృదయాన్ని మాటలాడిస్తాయి
శిథిలాల నుండిన అందిన శిలా సాధనాలు
గతాన్ని జ్ఞాపకం చేయడమేకాక అభిమానం పెంచేను

లౌకిక జీవనంతో పాటు శిల్ప సమూహాలలో
దైవ దర్శనం కనులకు జరిగినట్లే ఉంటుంది
అందని చరిత్ర చేతికందినట్లు అలరిస్తూ
ఆలోచనలను విశాల తరం చేసేను

చరిత్రలో సంస్కృతి శిలలో బంధింపబడేను
మనిషి కళా హృదయం విశ్వమయమయ్యేను

# 9. ఆర్ద్ర హృదయంతో

మృత్యువు పాలనలో చిక్కుకున్న రణ క్షేత్రం
మనిషిలో అమరాన్ని యశో రూపంలో నిలిపేను
కొందరికి భయదమయినా నియంత నెదుర్కొనే
శక్తిని జాతికి దేశానికి చూపేను జన హితంలో

ఏ పనికయినా ముందు భుక్తి అవసరం
మనసును ఆయత్తపరచి బలాన్ని చేకూర్చేను
ప్రాణ రక్షణలో స్వార్ధ చింతనకు వీలు లేదు
కంటికి కనిపించని మృత్యువు వెనకనే ఉంటుంది

ఓటమికి కారణం మరొకరిపై వేయడం నిలపడం
గెలుపులో నయితే తన  నిపుణత నెత్తి చూపడం

దివానిశల గమనాగమనాలకు ఎవరి ఇష్టంతో పనిలేదు
గెలుపు ! ఓటమి! కార్యకారణ పర్యవసానం
స్వార్థానికి పెద్ద పీటతోనే రోజు వ్యవహారం
జన రక్షణ భద్రత బాధ్యత పాలనా యంత్రానిదే

ప్రజాస్వామ్య హృదయంతో స్పందించే కాలం
చుట్టూ కమ్మిన విధ్వంస చర్యలు అగ్నులై సాగి
బూది అవకుండా ముందుగ జల సేచన అవసరం
తనలో అమృత శక్తిపై విశ్వాసం తప్పనిసరి

ప్రతి పని వెనక ప్రణాళికలో దార్శనికం
మనిషి శక్తి ప్రకటనకు వ్యూహ రచన చేస్తుంది
ప్రకృతిలో అన్నిటినీ చోటు ఎడారికీ ముళ్ళకూ కూడా
చేతనలో నిర్మాణ విలయ చర్యలు ఎప్పటికీ జరుగుతూ
సృజన ప్రపంచం పక్షం కవి మొగ్గు చూపేను
విలయ సమూహాల కారణగుణాన్ని మన్నించేను

పలు రంగుల దృశ్యాలతో కాలం కవితలో
కవిలో సృజన చేతన బయటపడే తపనతో

అడవిలో చెట్ల సందుల నుండి ఒడుపుగా
నడచే మనుషులు జ్వాలా రూపాలు ఇపుడు
మంచు పొర క్రమ్మిన పుష్పాల్లా కదలేరు! ఉదయం
సాయంకాలానికి తమ స్వప్నం వాస్తవమయ్యే ఆశతో

# 10. తలుపులు తెరవబడీ

అందరికీ స్వాగత తోరణంతో
కవిలో అక్షర నిలయం, భావ జగం
ఆహ్వానంలో ఉన్న మరో స్పందన హృదయం
వినడానికి సిద్ధంగా చదివేందుకు ఇష్టంగా

పనికి రాని మనిషి కాని వస్తువు కాని ఏదీ లేదు
ప్రశ్న ఏమిటంటే? ఈ పయనం ఎక్కడికి? ఎందుకు?
ఎవరికేది అవసరం ఎంతవరకు? దేని కనీ
వీటితో ఎందరి గుండెల్లో రైళ్ళు పరుగెత్తేదీ తెలియదు

వ్యక్తికి తాను చేసే పని ప్రియమయి నపుడు
తన హృదయం మేధ విలువలు ముఖ్యమవుతాయి
ఉత్సాహం ఉన్మేషం ఉపకృతితో సర్వం మనోజ్ఞం
ఇష్టం లేనపుడు యంత్ర సమం ! నిరాశలో భ్రమ!

ఇవతలి నుండి అవతలి తీరం చేరాలని కోరిక
ప్రపంచాన్ని చూడాలని, ఏమేమి ఉందో ? ఏమేమి లేదో?
మనుషులొకటే ప్రకృతి ప్రవృత్తి ప్రకారాలు వర్తనలో వేరు వేరు
సూక్తులు నీతులు ఉపదేశాలు ! మనిషిని జాగ్రత్త పరచేను

ఏ పరిచయం లేకపోయినా లోలోని సూత్రం మానవం
బంధిస్తుంది, స్వేచ్ఛను విశాల తరమొనరించే విషయం

చిన్నదో పెద్దదో ! దేశం తనదన్న భావనా రూపం
బంధువులు ఇల్లు పనులు అవసరాలు అందరికీ ఒకటే

అవసరాల్ని బట్టి ఒక కోరిక విలువ ప్రాణం కావచ్చు
ప్రేమ కావచ్చు ఇది ఎపుడో బయట పడవచ్చు
మతం రాజకీయం నైతికం ఆర్థికం నాలుగు
కలిసిన ఉపయోగంతో మనుషుల జీవితాలు

ఈ స్థితిలో చేత నయింది, “మోసం” ఒకటే కాకూడదు
ముందుగ తెలియక పోయినా ఎవరె ఆటలో ‘జోకర్’ కావాలనే

రేపు ఎవరిలో ఎవరెవరు పోరాడేదీ తెలియదు
రేపు ఎవరితో ఎవరి స్నేహం పెరిగేదీ తెలియదు
తనకు తెలియనిదేదయినా కానీ చొరవతో పోవడమే
దీనికి కవితా నిలయం ఒకటే తలుపులు తెరవబడీ

# 11. మనిషి ఒంటరి కాదు

ప్రతి పౌరుడు తనకు ప్రియమైంది దేశ చరిత్ర
సాధించిన స్వేచ్ఛా రూపానికి ప్రతినిధియై వెలిగేను
కెరట మెంత ఎత్తు ఎగసినా దూరం కదలినా
భూమిని తాకవలసిందే, అనుభవ సుందర గతిలో

ఇంకా తెల్లవారక ముందే, చివరి జామున
పక్షుల కలకల రవం, మనిషిని మేల్కొల్పేను
కాసేపట్లో పై కెగర నున్న పక్షులు మనిషిలో
వారి వారి కర్తవ్య పాలనను గుర్తుకు తెచ్చేను

ఇతరులతో కలిసి కొత్తవి తెలుసుకోవడం
నినాదాలతో సమూహాలను నడిపించడం
బాధ్యతలో కవుల నేతల భాగం ! తప్పనివి
సరియైన పాలన జరిగేదీ లేంది చూడడం జన కర్తవ్యం

ఎవరెవరో ఎపుడెపుడో కలిసి ఏదో ఒకటి
చెవిన వేస్తూంటే చేతిలో పెడుతూంటే బలం పెరిగేను
ఆత్మ గౌరవాన్ని కాపాడు కోవడ మొక ఎత్తు
తన పని జరగడ మొక ఎత్తు చుట్టు ఎన్ని ఒత్తిడులో

సాధారణ ప్రజలలో తృప్తి అభిమానం విశ్వాసం
కవులలో ఆచరణం ! ఆలోచనతో ఒక వెలుతురు పార్శ్వం
త్యాగ ధనం పంచుతూ ఉదార గుణం పెరుగుతూ
ఉండకోరే పెద్దలు రాజ్య పీఠాలనాక్రమింప జూచేరు

కొందరు చీకటిని భద్రతకు స్థానంగా తలచేరు
రాళ్ళకు చీకటియే క్షేమం కరమని తోచేను
వెలతురులో నయితే ఎవరి కంటనో పడి ముక్కలు కావచ్చు
కొందరికి వెలుతురు మాట ఒక సూచన హెచ్చరిక అవచ్చు

ఆలోచన లెన్నివిధాలో చేయవలసిన పనులన్ని విధాలు
కవితలన్ని కోణాలలో ఎవరికి వారు స్వేచ్ఛగా
కాల భ్రమణంలో ఒకటై మనిషి మనిషిలో దిశా వలయం
ఆయువు ఉన్నంతవరకు ఎవరి పయనం ఆగదు

పరిచయ గంధంతో స్నేహ వశం వ్యక్తి జీవితం
ప్రత్యక్ష పరోక్ష సంబంధాలతో ఏ మనిషి ఒంటరి కాదు

## 12. మనసు నుండి మనసుకు

మనసు నుండి మరో మనసుకు వంతెన
గాఢమైన చింతనతో ఏర్పడే దార్ఢ్యనికంతో

చీకటి వస్తుంది, భయ భయంగా మెల్లగా
తన పాత్రను ప్రదర్శించి వెళిపోతుంది
చీకటి లోనే భద్రత కొందరి అనుభవంలో
చీకటిలో గడిపేందుకు ఇష్టపడే వారు ఎందరో

వెలుతురులో నయితే అందరి కంట బడి
ఏమైనా జరగవచ్చు అనుకోని దుర్ఘటనో ప్రమాదమో
ఇది జీవన గతిలో ఎన్నిటికో సంకేతం
తన ఉనికిని కాపాడు కొనే చర్యలలో ప్రతి ఒకరూ

వెలుతురు చీకటి రెండిటిలో ప్రమాదాలు తప్పవు
శంకించే మనిషిలో నిద్ర ఒకటే క్షేమం కరమనిస్తుంది
ఎవరేది అయ్యేది? ఎవరికెవరి సహయోగం లభించేది
తెలియని సందేహ స్థితులలో సమాజం! సంధిగ్ధంలో

దేని కోసం? తెలియడం? ఏ విలువల కోసం
నైతిక మనస్కతలు ఏ శిక్ష కయిన సిద్ధపడేరా?
మనిషి నుండి ఉత్తమత మానవతలు సుస్థితికై
ఎపుడు బయట పడేను? ఎవరికి లాభించేను?

దుస్తులు మార్చినంత మాత్రాన పేరు ఊరు
పనులు యశస్సు జీవన కథను మార్చేనా?

అగ్ని నుండి పైకెగసిన మానవత సుతప్త స్వర్ణమై
ఆభరణమై సమాజ సంస్కృతిని నిలిపేనా? చాటేనా?

సోపాన క్రమంలో ఆరోహణలో మనసులు
భౌతికాన్ని మించిన అతీతంపై దృష్టితో పయనం

మనసు నుండి మనసుకు చేరే ఉద్దేశంతో
ముందుగ యత్నం, ఒక సుందర వాస్తవాన్ని చూపేను

ఇది కంటికి కనిపించే వంతెన కాదు
అనుభవ స్పందనలో బింబించే రవియో? శశియొ ?
జీవితాల్ని నడిపించేవి మనిషి మనిషిలో
నేటి సమాజాన్ని తీర్చి దిద్దేది? ప్రతి విషయంలో

# 13. చేతనతో అచేతనం

చలన సమాజంలో మధ్య మధ్య నిలిచి
గమనం ఎరగని శిలా శకలాలు
కవితలోను చేతన జడ జగత్తుకు ప్రవేశం
విపులత వికసన విజయం అంచులలో తిప్పుతుంది

చలన సమాజంలో నిశ్చల రూపాలు శిలలు
మనిషి సహాయం లేకుండా ఎక్కడికి పోతాయి

అమాయక ముఖాలతో చెక్కబడినవి దారిలో
మనుషుల చేతుల్లో సార్థకతను భజించేను

తాపానికి చలికి వానకు తట్టుకొనే రూపాలలు
మనిషిలో నిలబడే దృఢతను జ్ఞప్తికి తెస్తాయి
బ్రతుకులో ఉత్తమ స్థాయిలో ఆలోచన జరుగుతుంది
సంఘంలో మనిషి శక్తి పొలం నుండి యంత్రం వరకు

తన దోషం లేకుండా బాధలకు గురి అయిన మనిషి
సుఖ సంతోషాలతో ఉత్సాహ లహరి నందుకోవచ్చు
రేపు జరిగేది తెలియకపోయినా మనస్సు సులభంగా
శ్రమ జీవన నేపథ్యంలో పరివర్తన మందుకునేను

హక్కులు బాధ్యతలు రాజ్యాంగంలో స్పష్టంగా
వ్యక్తిని ప్రజాస్వామ్య శక్తిగ నిలబెట్టేను
సారభూతమైన అనుభవ విజయం
సమాజ పరమవుతుంది వ్యక్తికి దీప్తి నిచ్చేను

మనిషికి మనిషికి మానసిక బంధుత కూర్చే
వంతెన ! కనిపించని కాలం చూపే ప్రగతి కేతనం

వంతెనపై బాల్య మిత్రం కనిపిస్తే గుప్పిట్లో గతం
పండుగ రోజు ఇంటి ముందు శుభ్రం చేసి
ముగ్గులేసి మామిడి తోరణం కట్టినట్లు దృశ్యం!
కాలఖండం శ్రేయో ముఖమెత్తినట్లు ఉంటుంది

పిడుగుకు బాధ ఎంత కలిగేనో
చినుకుకు మోద మంత పొంగేను

ప్రకృతితో జీవన సంబంధం ఎప్పటిదో! ఇప్పటికీ
దశలు దశలుగా ఏదో సందర్భం పునరుద్భవమయ్యేను

# 14. సృజన ముఖంతో

స్మృతి పరిమళం ఒక లిప్తలో చకితంగా
మానసికంగా బాధల మెరపుల్ని మరపిస్తుంది
ఎవరి కాల ఖండంలోను, ఏదీ వ్యర్థం కాదు
ప్రత్యక్షంగానో పరోక్షంగానో అన్నీ లాభించేవే

ప్రతి పండగ ఏదో ఒక తీరులో అర్పితమై
బ్రతుకును కళాత్మకంగా తీర్చి దిద్దుతుంది
రూపం వర్ణం నిర్దిష్టమైన ఉపయోగంలో
దార్శనికానికి ప్రతి నిధియై బయటికి వస్తుంది

అధికారంకై ఆరాటంలో విలువలు తరుగుతూ మారుతూ
నమ్మకాలు వమ్మై బూది నుండి పచ్చదనం ఆశించేరు
దార్శనికం ఆదర్శం ఎపుడే వీధిన పడేదీ తెలియదు
శిలా శకలంతో పాటు ఎదురుగ లాఠీ చేతిలో కదలిస్తుంది

చూపు చివరి కొక్కానికి వేలాడే ఆకాశం
తన స్వర్గ సంపదపై ఆశలు పెంచుతుంది
ఎంత బ్రతికినా చివరకు మట్టేకదా అని
భూమిపై విరక్తి దివిపై ప్రబలే కోరికతో

మనిషిలో మార్పు సహజతకు బదులు కృత్రిమం
చోటు నుండి కీర్తి కిరీటాలతో ఇంద్ర ధనుసుతో రణాలపై
వ్యక్తి కొక దృష్టి ! వాదం! విశ్వాసపథం! ఎవరి మతం వారిది
తమ నిజ రూపంపై కన్న విగ్రహ శిల్పంపై మోజు

కల్పనకు చివరి హద్దు ఆలోచనలో ఉందో? లేదో? కానీ
పదునెక్కిన కత్తివలె తళతళలాడుతూ? ఎక్కడికక్కడ
కలహ ప్రియత సమర ప్రీతి ఉన్నంతవరకు మదిలో
శిల నుండి అస్త్రం వరకు అవసరం మేర ఆయుధాలు వెనకనే

జీవన యానంలో మరొకరి చేయి అందని వారెవరు?
ఆరోహణలో స్వప్నం పై ఆశ భవనంపైకి చేర్చేరు

యుద్ధమెపుడు చేయాలిసి వస్తుందో తెలియకపోయినా
ముందుగ కలహ వాతావరణంలో విలయ సూచన ఉంటుంది
ఆకాశం మౌనంగా ఉన్నా భూమి మాట్లాడుతుంది
భూమి మనిషితో మాట్లాడుతుంది రోజూ
పైరు పంట వికాస ముఖంతో సంఘం

# 15. పౌర బలం

ప్రతి పౌరుడు ఏదో ఒక దిశలో పయనం తథ్యం
తన వృత్తి లోను ప్రవృత్తి చేత మనో వేదికపై నిలిచేను
దేని కెంత సాధన మవసరమో దీక్షా సమం స్థితులలో
అంతలోనె లోక తంత్రంతో సమాజ బంధం పెరిగేను

ఒక కవి ఒక నేత ఒక దశలోని సమాధాన పత్రాలు
దశ దశ కొక పాత్రలో సమాజ గమనం సాగేను
భిన్నమైన నవ దార్శనికంతో ఉద్యమమొ విప్లవమొ పథాలలో
నినాద పంక్తులతో జలధి తరంగాలను మించేను ముంచేను

ఈ ప్రయాస సముద్ర జలాల్ని చేరేందుకే కాదు
సంకల్ప బలంతో ప్రయత్న బుద్ధితో అంకిత భావంతో

ఏ కవితకైన నాటకానికీ నవలకు సరిపడ వస్తువులు
దొరకేను సమాజానికి ఉపయోగంతో ఆధునికం చేరేను

వ్యక్తి నుండి వ్యక్తిని దృష్టి భేదం అంతో ఇంతో తప్పదు
సమష్టిగా సమాజ శక్తికి జన వేదికగా మారేను

ఇప్పటి వరకు అనల కణాల చేత అలంకృతమై
కాలం వివిధ వర్ణ కుసుమ సంకలనంగా మారేను

సత్యం ధర్మం న్యాయం నీతి మనో వైజ్ఞానికాలు
అంతరంగ ప్రకాశం అన్నీ సందేహా స్పదాలే
ఉదయం మొదలు కలలుకనే ఘడియవరకు
ఆకలి పూలదండయై ఎవరినెపుడు అలరించేను

నదిలో ప్రవహించే స్వేచ్ఛ తీరాల మధ్య స్వతంత్రం
ఒంపులలో నుండి మలకలు తిరుగుతూ సమార్ధంగా

ప్రజల ఆకలి తీరేందుకు శిశిరం తొలగేందుకు
స్వేచ్ఛకు స్వతంత్రాన్ని సంపాదించడం కన్న
ఆకలి దాహం తీరడం సమస్య అవుతూంది
నాలుగు దారులు కలిసిన చోట సమాజ ప్రయోజనం

పని అయిన క్షణం నుండి త్యాగ ఫల మందించే
చరిత్ర పుటల నుండి సారభూతమైన విగ్రహం
ఇది ఏ వస్తువుతోనైనా నిర్మాణ రూపం పొందవచ్చు
మట్టి స్వర్ణం గాజు ప్లాస్టిక్ గ్లాస్ మరొకటి వారివారి అభిరుచులతో

## 16. మోదమంత పొంగేను

చారిత్రక నేపథ్యంలో రాజకీయమో సామాజికమో
ఆధ్యాత్మికమో ప్రభంజనం వీస్తుంది బలంగా నిశితంగా
గుడిసె నుండి మేడ దాక ఆశ్రయించిన బ్రతుకులు
స్థాయి భేదాలు నివాసాలు బీభత్సకాండ నావిష్కరించేను

చెదరడమొ! కదలడమొ! విలయదృశ్యాలు ఒకటొకటీ
చిన్న పెద్ద నావల్ని ప్రభావాల్ని ఆలోచనా జలధిలోకి దింపేను
జల విలోలమై భూమి తలం కళ్ళు మూసినట్లై
ఒకరు బావి అంచులు మరచేరు నడకలో
ఒకరు చెరువు కట్ట తెగినట్లై తడబడేరు
ఒకరు నదిలో కొట్టుక పోయేరు కనబడకుండా

ఇంత వారి నుండి అంత వారి దాక
శ్రేణులెన్ని విధాలో అన్ని తీరుల అవసరాలకై
నిరీక్షణం ! దారులు మూతబడీ హఠాత్తుగా
తలలు తేలుతూ నీటిలో పయనం సాగేను

పిన్నల నుండి పెద్దల వరకు బాధలు వేదన ఒకటే
కొన్ని బోదెలతో కొన్ని కొమ్మలు విసరుతూ చెట్లు
అవునన కుండా కాదనకుండా కొందరు
వీడని బంధుతతో హేలా దృశ్యం చూపేను

కఠిన పవన శాసన శబ్దానికి తోడుగ జలల సేచనలు
ప్రాణానికవసరమైనవి పుష్కలంగా మరో జగం చూపేను
అణువు నుండి ప్రతి వస్తువు తమలో
ఉన్న శక్తిని కూడ దీసుకొని నిలబడేను

కదలిక వీడని మేఘం శిలవలె నిలచేనా?
చీకటిలో మనిషి దీప రూపమై నడిచేనా?

ఎక్కడికక్కడ శుష్కీ భూతమై మాట్లాడలేని భూమి
ఎంత కాలం చరిత్రను రాతి పలకపై నిలుపుతుంది

ఆర్ద్రమైన జీవన రూపాన్ని నిలపడం ప్రకృతిలో జరిగేనా?
ఆప్తమైన మానవ తేజాన్ని, నవ సమాజం చూపేనా?

అందరికీ ఇష్టమైంది ఎవరికినీ నష్టం లేనది
మనిషిని మనిషిగ బ్రతికే అవకాశం ఇచ్చేది ప్రజాస్వామ్యం

# 17. దారిని గుర్తు చేస్తూ

ప్రతి బ్రతుకు తన గుడిసె తన మేడ చింతనలో
పెను గాలికి ఊగుతూ నివాసాలు భయ రేఖలతో
గుండె ఒకటే స్పందన శీలంతో నిరంతరం
మనుజులు వేరు వేరు బుద్ధులు సరె చెప్పనవసరం లేదు

సూక్ష్మమై నిశితమైన చర్యలతో అనుచర్యలు ప్రతిచర్యలు
వ్యతిరేకాలు నాల్గు దిశా స్తంభాల చుట్టూ తిరిగే
మనిషి ఆలోచనా గంధంతో అనుభవ బంధంతో
తరాల సమాజాన్ని పరంపరలో భాగం చేసేను

దరిద్రాన్ని మసి చేయాలని కాకపోతే బొగ్గులు
నిప్పుకు పనికి వచ్చేను, కణకణలాడుతూ ఎప్పటికీ
ఆకలిని ఎడారిగా పరచబడి కదలేరా? మైదానం వైపు
క్రింది నుండి ప్రేయో రూపం పూల తీగవలె పాకుతూ

అగ్గిపుల్ల ఒంటరిగా ఏమైనా చేస్తుంది ఎంతకయినా తెగిస్తుంది
సిగరెట్ వెలిగించడం నుండి దహన కాండ వరకు మంచికీ చెడుకూ
చెక్కు చెదరని రాతి శిలవలె కాలం ఆకారం
లయ తప్పని జలధి, భూమి నంటుకొని ఎప్పటికీ

లయ తప్పని అలలను జీవన గతికి ఆదర్శం చేసుకొనీ
మనిషి ఈ రోజు ఉండవచ్చు రేపు లేకపోవచ్చు

సమాజంలో సామాజిక విపత్తులెన్నొ తరచుగ
బాష్ప బిందువు నుండి అగ్ని శిఖలు జారేను
ఇంతవరకు పత్రికలు ! వార్తలలో కవితలతో
ప్రసార మాధ్యమాలలో, మునుముందూ దృశ్యాలతో

పరితాపం పరిఖేదం చెరొక వైపు నుండి
కవుల అనుభూతిలో ఎప్పటికపుడు కొత్తే ముఖాలతో

ఉద్వేగం ఉద్రేకం ఉత్తేజంతో ఉద్యమాలలో వివేచనతో
శత్రుతల్ని వదలి మిత్రతను కోరేను ప్రజాస్వామ్యం

జిజీవిషతో పోయి బ్రతుకులో జిగేష తప్పనిదీ
వర్తమానం తలుపులు మనిషికై ఎప్పటికీ తెరవబడీ

పైలోకం హద్దులు పూర్తిగ చెరపి వేయబడీ
ఆత్మగౌరవం ఎన్నికల పరిమితుల్ని దాటి గుర్తు చేస్తూ

## 18. క్షణాల అలలపై

జలధిలో అలలు ముందుకు నడుస్తాయి గాలి నందుకొనీ
క్షణాలు ముందుకు పరుగిడుతాయి రవికిరణాన్ని అందుకొనీ
ఏ మనిషీ తన వరకే పరిమితం కాదు బ్రతుకులో
తనను దాటి జన గణ సంబంధంతో విపులమై

దేశాన్ని ఆవహించేను తీగెలా విశ్వాన్ని అలంకరించేను
సమస్య లేంది ప్రశ్నకు ఆధార బల మెక్కడిది?
దీనితో ఇది ప్రజలందరిదైన సంపదగా నిలిచేను
దారి పొడవునా ఈ భూమిపై దిశల నుండి
వీటి నభిమానిస్తూ గౌరవిస్తూ పోవడమే పని

పూల దండ లెదురు కావు తను చేసే పని శిఖరంపై
విశ్వమయమై పతాక ఎగురుతూ కనిపించాలనే కష్టంలో
ఉద్యమ జ్వాలా తోరణ పంక్తులు వేలాడేను

ఉద్యమంలో వేదికపై ప్రశ్నల్ని ఎదుర్కొవడమే పని
ఇది ప్రగతి పథంలో నడచే మతి ప్రభకు సదర్శనం
మహా కవి మహానేత మహా మనస్వి మహాజేత
చిరకాలం నిలిచేను సమాజ పీఠంపై యశోరూపాలతో

వెలుగుల ప్రేరణతో తరం నుండి తరం నవ చేతనతో
ఎవరి కిష్టమైన రంగు రుచి దుస్తులు మాట, వారికి ప్రియం
వీటి మధ్య సహభావం స్నేహం సమాజానికి అవసరం
ఇది ప్రజాస్వామ్య విజయానికి వలసిన దార్శనిక హృదయం

ఒక సగం వెలుగుతో చీకటి తుడిచి పెట్టుకపోయేనా?
మరునాడు మళ్ళీ చుక్కల నవ్వులతో సిద్ధమవుతుంది
మరచిన వెలుగుల దారిని జ్ఞాపకం చేస్తుంది
హృదయ శిఖరం నుండి మానుష తేజాన్ని వదలుతుంది

రోజులు గడుస్తాయి సశబ్దంగా సహేతుకంగా
లెక్కపెట్టే కరెన్సి నోట్ల రెపరెపల ధ్వనులతో

ఇది మానవ స్పందనతో ఒకటై
ఏ రోజున కారోజు సరికొత్త ముఖంతో
ఎన్ని దారులు తిప్పుతుందో అంతరంగ ప్రకాశంలో
కళ్ళు చూడకలిగేది మాత్రం మొలకెత్తిన విత్తనం

## 19. ఆగని వేదన

నగరంలో నాలుగు వీధుల మధ్య
నిలు వెత్తు విగ్రహం, దీనికి తాను
కాస్త దూరంలో నయినా నిలపబడాలని
నిర్మాణంలో ఏ వస్తువు అయినా ఒకటే

మనిషిలో కోరిక బలంగా ఎదుగుతూ
తన ఇంటి ముందు పెరిగే చెట్టుకు సమమవుతూంది
భూమి తలంపై మనిషి నడక సంకల్ప సహజం
భూమిలోన వేళ్ళతో చెట్టు చిర నివాసంగా

ప్రకృతిలో వికాస విస్తరణ ప్రయోజనాలు శ్రేయాలు
సమాజంలో దీనికి సమాంతరాలెన్నో! బ్రతుకులో
అడవిలో దేని కది విడివిడిగా గుర్తింపు ఉన్నది
వేటికవి స్నేహ సుందరమైన విలువలతో బ్రతికేను

ప్రతి చెట్టు మనిషి మనిషి పట్ల ఉదార చరితతో
ఏ సమయమైన ఉపకార గుణం చూపిస్తుంది
ఉత్సాహం నింపుతుంది ఉత్తేజం కలిగిస్తుంది
అడవిలో ఎడారి, పొరలలో నూనె గనులు దాగీ

మహాకాల సోపానాలపై తరం నుండి తరం
మహానీయుల సారభూతమైన శక్తికి చిహ్నం విగ్రహం

కాస్త దగ్గరలో ఆలయ శిఖరం కనిపిస్తుంది
దీనికి దీటుగ వ్యాపారం వ్యవహారం తప్పనివి

కాలానికి కట్టుబడిన విలువలతో సమాజం
ఆలయంలో విగ్రహం రెండు స్థానాల మధ్యలో
అటు లౌకికం ఇటు తాత్త్వికం చెరొక వైపు
మనిషి బ్రతుకు కేంద్రంగా వివిధ మనో రూపాలతో

వీటిలో దేనికీ మనిషిని మించే శక్తి లేదు
మనిషిలో దేనికీ చోటులేని శూన్యం లేదు, ఉండదు
వీధిలో నడిచే మనిషిలోను అదే హృదయం పురాభవం
ఇది ఎవరి వశమయ్యేది కాదు, సర్వ స్వతంత్రం

సమాజంతో పాటు ప్రకృతి! సమస్యను గుర్తు చేస్తూ
ఏది ఆలస్యమయినా సజీవ రేఖలలో సంవేదన ఆగదు!

# 20. సర్ప భయం

ఈ సమాజ భవనం ఆవరణంలోకి ప్రవేశించాక
భౌతికమైన స్వయం వ్యక్తిత్వ పథంతో మానసం రూపొందేను
జమిలిగ ప్రజాస్వామ్య దార్శనికం లక్ష్య సాధనంలో
ఎన్నిటి సహభావం సహచలనంతోనో జీవిత రూపం

ఇరువైపుల నుండి సృజన విలయ స్థితులు
నిర్మాణాన్ని చేపట్టే ప్రగతిలో ఒకటి
శిథిలాలను తొలగించే పనిలో ఒకటి
వృత్తి ప్రవృత్తుల కదలికలో కలసి పోయిన గమ్యం

జీవన సంపదపై రాగ రంజిత మయ్యేను
తరం నుండి తరానికి ప్రమాణాలు పెరిగేను
చక్ర భ్రమణం పరివర్తనలో వేగంకై ఎదురు చూస్తూ
రెండు కళ్ళు మినీ సూర్య ప్రతి బింబాలయ్యేనా?

దారులలో పై కెగసే అగ్నులు ! మధ్య మధ్య
జల సేచన సంరంభంతో ఉత్సాహంగా
సంఘంలో సచేతన గాథల రూపాలనెత్తేను
జీవన వాస్తవంలో విభవం కీర్తి తరంగాలపై తేలేను

విప్లవాలకై ఉద్యమ చరణాలపై రాజకీయం తీరులు
మండే కట్టెలపై చల్లే శాంతి జలంతో బొగ్గె బూద్దె నిలిచేను
దారిలో చల్లిన నాణేల వలె గగనంలో చుక్కలు
వీటికై ఆరాటపడే ఆశాపరులు రాత్రులు చేతులు చాచి

ఆర్తిలో క్షోభలో చిక్కువడిన ముడుతలతో ముడులతో
సమాజ వర్గాలలో విభేదాలు ! వైరుధ్యాలు! సమూహాలు

ఇనుప కమ్మలచే నిర్మితమైన నమ్మకాలు ! నినాదాలు
బెయిలుపై ఆలోచనతో మౌన ముఖాలలో సుడిగుండాలు
నేరంచే శిక్షపడే అవకాశాలున్న దశ దశలలో
ఎవరికి వారు సర్దుకొని అడవి నాశ్రయించేరు

దుస్తుల్ని మార్చి తిరుగలగా తొడుగు కొనీ
సరికొత్త డిజైనులతో ఉద్యమ కారులు నేతలు
మాటలెన్ని వదలినా రాయో బాణమో తూటానో
పగలు రాత్రి చీకటి పాము భయం లోన లేకపోలేదు

# 21. కవితలో నిర్ణయం

అదృష్ట మనేది ఎన్నిటినో అన్వయ పరచే బంగరు నాణెం
సులభంగా దొరికేది కాదు ఎన్నటికీ కనబడేది కాదు
అనుభవంలో స్నేహం పెంచే మనుషుల బాధ్యతను మరపించేను
అనుకోకుండా గుప్తంగా ఉన్నది హఠాత్తుగా బయటపడేను

మనిషి బ్రతుకులో వెళ్ళే దారులెన్నో
దిశ దిశలో ఆశా నిర్మాణాల వరుసలతో
అనుకోనిది హఠాత్తుగా చేతిలో పడుతుంది
పయనంలో మనసును పైపై కెగర జేసేను

ఎక్కడనో దారిలో అనల పటం కనిపించక పోదు
అంతలో మంచు బొమ్మలతో దృశ్యం ప్రత్యక్షం
ఇది తన కంటికి హ్లాదంగా
ఇది తన ఊహకు మోదంగా

గర్భాలయం నుండి అవనికి చేరాక శిశువు
నివాసంలో వయసు పైబడి ఆపై దివి కల్పనలో
ఏ కోరిక? అర్హత? పయనమెంత దూరం
ఏ విలువలు? ప్రశ్నల జోలికి పోయే దెవ్వరు

ఒకరి మదిలో నిజం బూది క్రమ్మిన నిప్పు కణం
అదే మరోకరిలోన మంచు పొరలో పుష్ప ముఖం
చినుకులతో మొలకెత్తే మట్టిపెళ్ళ చేతులలో
అదృష్టానికి మూలమైన భౌతికంలో సృజన రూపం

గుప్తంగా ఎవరికి తెలియని స్థితిలో అంతరంగం
అందరిలో దాగి చుట్టు జరిగేది తెలియకుండా
బాధల మధ్య నున్న బ్రతుకును వీడేదెవ్వరు?
మెరపుతో పిడుగు పడేనని మబ్బును నిరసించేరా?

నదికి జలధి అలలతో కలసిపోవాలని ఉండదు
ఇరువైపుల పచ్చని భాగ్యరాశిని సృజించాలనే
దేని కది తన ప్రత్యేకతను నిలపుకోవాలనే ఉంటుంది
కలసి రావడం దేనికి? మనిషి తెలివికా? దురాశకా?
జరిగేది ఆగదు కార్యకారణ సంబంధంతో స్వార్థంలో
ఆలోచన వివేచన నిర్ణయం జరిగేదొక కవితలోనే

# 22. దేని ప్రత్యేకత దానిదే

వెలుతురు చీకటి రెండిటిలో ఏది ముందుగ ప్రవేశం?
ఏ మనుషులు ముందుగ, ఎక్కడి నుండి నిష్క్రమణంలో

స్థల భేదాలతో కాల ఖండాలు
రెండు సమాంతరంగానా?
అంటే సరిపోయేనా? ప్రస్తుతానికి
విషయం వేరు వేరు గానా? ఒకటేనా?

ఒక దాని నొకటి ఆక్రమించాలని రెండూ
జన జీవన గతుల లోను తప్పని జీవితాలలో
ఆరోహణ అవరోహణలు ఉండే ఒక మోస్తరులో
సందిగ్ధత సంక్లిష్టత అదృష్టాని కవకాశ మిచ్చేను

మహా భారతంలో మహావీరుడు దేవదత్తుడు భీష్ముడు
బాణ విద్యా ప్రయోగ నిపుణతలో మహా శిఖరం
అయితేనేం? రణంలో ఓటమి పొందిన పక్షంలో వాడే
శ్రీకృష్ణుడెంత వాడయినా ప్రభు పీఠం వహించ లేదు

ఒకరికి అదృష్టం వరిస్తే ఇంకొకరికి దురదృష్టం లభించేను
ఒకరికి అంగీకారం ఎందరికో నిరాకరణంలో గ్రహణం
ఏది సమంజసం? ఏది ఒప్పు! ఏది తప్పు! ఏది గెలుపు
స్పష్టంగా చెప్పగల సూటి మాట! ఎక్కడ దొరకుతుంది

స్వచ్ఛమైన చేతనతో అంతరంగ స్ఫూర్తి నెవరు పొందేరు
ఇది మానుషానికి దేహానికి మధ్య స్ఫాటికం లాంటి తెర
తప్తమైన హృదయం నుండి ఎగసి జారే బాష్ప కణంలో
మండే అగ్ని చిత్రం, కనిపించే దెందరికి? అది ఎంతవరకు?

ఆశయ సిద్ధిలో తృప్తి రేఖ చేరితే చాలనిపిస్తుందా?
పదవులు సంపదలు భోగం విభవం, ఎవరి కథలోనో అదృష్టం

రేపటి ఉత్సవానికి ఈ రోజు సిద్ధం చేసుకునేరు
ప్రయత్న పరంపరలో ఇది అతీతాన్ని ఆశ్రయించేను

ఒక చోటు నుండి మరో చోటుకు కదలలేని శిలలుకొన్ని
శిల్పంచే విశ్వాసంతో గౌరవ స్థానంలో అదృష్టం జారి

ఆర్థికం రాజకీయం సామాజికం వైయక్తికంతో
అద్దంలో ముఖాలవలె దేని ప్రత్యేకత దానిదే

# 23. జన వర్తనంతో

జీవితంలో వ్యక్తి బ్రతుక్కి అమూల్యం అదృష్టం
ఆ ఒకరికి చెందిందీ ముందుగ తెలియనిది
ఏ బ్రతుకు పుటక నుండి చివరి దాక
పర్వత శ్రేణి కాదు, కర్కశ రూపం నిలవదు

పూల తీగె పాకుతుంది ఆసరాగ హత్తుకొనీ
మౌనంలో శాంతం పరచుకొని బ్రతుకుతుంది
ప్రతి రుతువును తట్టుకొని నిలుస్తుంది గభీరంగా
ఉన్నతిలో గగనం వైపున చూచే అశయంతో
వివిధ వస్తు చయం చూపే ఉదార చరితతో
మనిషికి తనలో దాగిన శక్తిని తెలుపుతుంది

శిలలో కఠినత నీటిలో ఆర్ద్రత గాలిలో ప్రాణితం
వెలుగులో చేతనతో అంతరంగ స్పందన గుణం
సృజనలో శక్తి కలనం అదృష్ట విశేషం
అందరికీ సులభంగా సాధ్యం కానిది అమోఘం

అదృష్టానికి నోచుకున్న జాతకులు
'గెలుపు' అక్షరాల అట్ట ముక్కతో మెడలో తిరిగేరా?
వీధులలో సన్మానాలతో అందరి దృష్టి పడాలనీ
తన కల నిజమైనందుకు సంతోషం పొందేరు

అదృష్టం వరించడానికి కారణాలు
పూవుల్లా ముందుకు పరుగెత్తుక వచ్చేను
కాలఖండానికి ప్రతినిధిగా అలంకరించేను
ఒక్కొక్క పూవొక రకానికి ప్రాధాన్యం వహించేను

అదృష్టం కలసి వస్తే ఎగిరి వచ్చి ఎదురు పడిన
అనల కణం గులాబి పూవై, ఎద చేరుతుంది

ఆలోచనలో సుందరత అనుభవంలో పరిమళత
అమృత ఘడియకు ఎక్కడలేని స్థానం లభిస్తుంది

వెలుతురు మనిషిని వదలదు ఎక్కడికి పోతుంది?
కవి చేతికి సుళువుగ అందిందనిపిస్తుంది, భద్రంగా
ఇతరుల కైతే బహు కష్టం మీద సమీపిస్తుంది
తన దాకా రానిది ఏమయితేనేం? ఎవరికీ పట్టదు

# 24. జననం

ఒక సమయం ఒక మాటకు పాటకు కవితకు
అనువుగ ఉంటుంది రవి రశ్మిలా మనసు నావహిస్తుంది
అగ్గి పుల్ల గీసినంత సులువు కాదు కవిత వ్రాయడం
అవసరాన్ని బట్టి వెనక ముందు ఆలోచన ముఖ్యమవుతుంది

ఆఘాతాల విఘాతాల ప్రఘాతాల సంచయ మీ మనస్సు
ఆహ్లాదాల ప్రసన్నతల ప్రహ్లాదాల కలనం కావాలనీ
ఇది సామాన్యం కాదు విశేష వర్తనలో మనో మయం
శాంతి పథంలో ప్రమోద గుణ వర్తనతోనే ప్రజలలో

ఎన్ని ప్రేమ కరుణ సహన శాంతి ఉదారతల
వాక్యాల్ని చరిత్రలో సుమ మాలలుగా తీర్చినా
హృదయాలను రసమయ తీర్థాలుగ మార్చదలచినా
ఘర్షణ కలహం యుద్ధం అల్పంకాని ఆచరణంలోనే

ఇతి హాస కథలలో ఎప్పటి నుండో మెట్లు మెట్లుగా
నియంతల పాలకుల పీడనలు పరాభవాలు
గాయాలతో సామాన్యుల హాహాకారాలు
బాధలలో పై తరగతి వారి రొదలు, మూల్గులు

రణ చక్రంపై ఒకరొకరు "శాంతి" శబ్దంతో
కలిసి తిరుగుతూ వీరులు, ఇప్పటికీ మిగిలిన పనికై

గాయాల శాలలో చేరిన వారు లేకపోలేదు
ఇవి మునుముందు చరిత్రలో చోటు పొందవచ్చు
ఇరు పక్షాలలో విజయం ఎవరిదని? ఎవరు చెప్పగలరు
తప్పులోదా గుప్తంగా ఉన్న ప్రతీకార బలంతో

అనుకోని అదృష్టం తనకు కలిసి వచ్చేదాకా
ఆగేరా? ఎక్కడ? ఏ చర్యల ఫలితంగా, ప్రజాస్వామ్యంలోనా?

స్థానిక సమస్యపై రణ భావన తప్పనిదై
పైకి వెళ్ళే కొద్దీ దేశం ప్రపంచం విశ్వ భావనా రూపం

వ్యవహార జగత్తులో లౌకిక వర్తనం
సన్మానం సంతాపం ఏదో ఒకటి రణ ఫలితం

యుద్ధం తరువాత ఎవరి దారి వారిది
తరాల కివ్వాలసిన సందేశం "సహనం శాంతి"యే

## 25. ఆప్తంగా

సూర్య ప్రకాశంతో అద్దిన మానవ మనోజ్ఞ తేజం
పంజరంలో పావురం వలె స్వేచ్ఛా రూపం
ఏ రోజు పునర్నవంగా సురుచిరంగా వెలిగిపోతుంది
భూమికి పై ఎత్తులో జీవితమంతా గడచేను తృప్తిగా

పగలు బయట గగనంలోను చెట్లపైన
రాత్రి గూడులో తన నిలయంలో
ఏ వేటకాడో! ఏ నియంతో ! ఏ తప్పిన గురియో
ఏ తప్పని బోయవాడో ! బయట కలత పరచేరు

భద్రత ప్రధానంగా ప్రాణ రక్షణ చణంగా
మనిషి చేతిలో చిక్కి పంజరంలో పడవచ్చు
ఆరు రుతువులలోను మనిషి భయభయంగా
ఎంతో సాహసంతో ఆశామయంగా తప్పించుకోవచ్చు

అన్నిటిలో మనిషికి ప్రియమైనవి కొన్ని
మృగాలు జంతువులలో ఎన్ని విధాల గుణాలో
అన్నిటిని మించి మనిషి తనలో బుద్ధి బలంతో
పావురాయి స్వేచ్ఛ మనిషికి సమన్వయం చూపేను

అది చిలకయితే, అదృష్టం బయటికి తీసేనా?
సమాజ చింతనలో నియంతలా చూపే దుస్థితి పాలనలో
ప్రజాస్వామ్యం వేషంలో ఇప్పటికీ అదే సాగేనా?
ప్రతి మనిషి జీవితంలో ప్రజాస్వామ్య సంకేతమై నిలిచేను

చెట్టు పక్షి మనిషి త్రికం సృజన ప్రపంచంలో
అనుబంధం ప్రయోజనంతో సహభావంతో మెరిసేను

అపుడపుడు ప్రజాస్వామ్యం ఎదరు పడేను గాయాలతో
సమస్యల కోలాహలంలో కలహ మనో రూపాలలో
విభేదాలు విరోధాలు బాధలు హత్యలు పీడనలు హింస
సమాజ సముద్రం గట్లు దూకిన ప్రమాదంలో మనుషులు

అరాజకం బీభత్సం ఫలితంగా రెక్కలతో ఎగిరేను పక్షి
ఎదురుగా అద్దంలో అనుభవంలో ప్రజాస్వామ్య హృదయం
వర్తమాన దృశ్యంలో క్షోభాకుల సముద్రం వలె సమాజం
**పైనుండి వర్షా మేఘం చినుకులతో భూమిని హత్తుకొని ఆప్తంగా**

# 26. ప్రకృతి శక్తిని అధిగమించి

భూమి నుండి గగనానికి మహా దర్పణం వలె
నాల్గు దిశలు చుట్టూ ఆవరించి ఎత్తుగా
కను చూపుకు కనిపించని దూరంలో కాలం
వస్తూ పోయే దారులతో అల్లుకున్న సమాజం

క్షణం నుండి మరు క్షణానికి మారే
జీవన దృశ్యాలతో మనిషి మనిషికీ భేదిస్తూ
సామాన్యుల ఆలోచనల కనుగుణమైన
ఆచరణలు కూడగట్టుకొనీ ప్రకృతితో

కాలం గడుస్తూనే ఉంటుంది ఆగదు
ఉదయ దివా సాయం నిశా దశల్ని క్రమిస్తుంది
రెక్కలు లేని మనిషి ఎగర జాలని ఉత్సాహంతో
తగిన వాహనాన్ని కోరేను యంత్రంలో దర్శించేను

దాహం ఆకలి తీరే బ్రతుకు తెరువుతో మొదలయి
సుఖ సంపద అధికారం భోగాలను వరించేను

ఎండనో వాననో మంచునో పూలనో దుస్తులుగా దాల్చి
కాలం మనిషికి కళాత్మక సుందరతను చూపేను
పెద్ద మనిషి తరహాలో ఉదయం బయలుదేరేను
చిన్న పిల్లల వలె గాలులు చుట్టూ చేరేను

జన చలన క్రియా కలాపాలతో నీతులతో
శేషం పూరించే మానుష యత్నం జరిగేను

రెక్కలు లేని మనిషిలో పైకెగిరే కోరిక
మనిషి జీవితంలో ఆ కొరతను తీర్చాలని
పరిశోధనా ఫలితంలో యంత్రం తన వశమయ్యేను
మరో కోణంలో సమాజ పురోగమనం వెలసేను

తనలో లేని దానిని గురించి మనిషి
మస్తిష్కాన్ని పరిశోధనా శాలగ తీర్చేను
ఆలోచనలకు యంత్రాన్ని సన్నిహితం చేసేను
ప్రకృతి శక్తి నధిగమించి విజయం వశమయ్యేను

# 27. మేళనం

తరం నుండి తరానికి మహా కాల గమనంలో
మార్పులు తప్పనివీ అవసరమైనవి ప్రేరణ నిచ్చేవి
కొందరికి ఆగని ప్రవాహ రూపమై తోచేను
కొందరికి కదలని మహా పర్వత పంక్తియై నిలిచేను

హృదయం భిన్న భిన్న స్థితులతో అవస్థలతో
ఒక్కొక్కరిలో ఒక్కొక విధం వస్తువు
సంస్పందనలు వేరు వేరు అస్తితలతో
సామరస్య భావనతోనే పూర్ణ సమాజం

బ్రతుకులో అనుకున్న గమ్యం చేరే పనిలో
ప్రతి ఒకరు తమ వంతు కృషిలో చేరేరు
ఇంటి ఎదుట మృదులతతో రంగు పూలు
ఇంటి బయట దూరాన అణుఘటితమైన శిలలు

జడానికి చేతన కలిసి సృజన జగంతో
భౌతిక రూపంలో శరీరం మానసం రెండిటితో
అంతరంగ తేజంతో లోన ఆలోచన వేరు
ఉనికిలో భేదాలెన్నో కలిసిన నవ సమాజంలో

గాలి ఉబలాట పడుతుంది ఎక్కడా ఆగదు
దిశ దిశలో వార్తల్ని అందజేయడానికి వేగంగా
ఎంత దూరం అయినా ఒంటరిగా సాగుతుంది
శుభ్రమయిన స్వచ్ఛమైన ఆలోచన కవకాశంతో

స్నేహం శాంతం సుఖము భాగ్యం సంతోషంతో
మనిషిని ఆదర్శంగా తీర్చేందుకు సన్నాహం కవితలో
శిలలు వేచి ఉంటాయి శిల్ప శాలకై
భూమి నుండి దివికి వంతెన మరో దృక్పథంతో
విజ్ఞాన కేతనాలు నిలయాలు శాలలు అంతటా
దేశ దేశాలలో మానస తేజాలు నవ జీవన బింబాలతో

జడమూ చేతన కలిసిన అపూర్వ రూపాలతో
అభినవ సమాజం సుందర పరిమళ పూలవనం

విషాదంలో బాష్పకణం అనల కణం రాల్చవచ్చు
ప్రజాస్వామ్యంలో జడమూ చేతన భౌతిక మానస మేళనంతో

## 28. ఎప్పటికీ ఉండే ప్రశ్న

చీకటి సముద్రం అడుగు ముందుకు వేయనీయదు
దీప సహాయంతో ఎక్కడి వారక్కడే కాస్త అటు ఇటూ
ఇంటి ముందు దీపం అయితే మిని రవిబింబం
ఆ దారిన పోయే వారికీ వెసులు బాటుగా వెలుగులు

ఉదయ మవుతుంది సూర్యుని హృదయ వశమవుతుంది
వెలుతురు విజయంతో మనిషికి ధైర్యం వస్తుంది
అంతగ మురిసే నిజ రూపం ఇంకా బయట పడలేదు
అక్కడక్కడ వస్తువు నీడలతో చీకటి ప్రభావం

ఎవరి ఓటమి? ఎవరి విజయం పూట పూటకీ ప్రశ్న
కాల గతిలో రెండిటికీ అవకాశం దొరికేను
గగనంలో కదలే నీలి మబ్బులు నిరంతరం
చీకటి ముక్కల్ని తన నీడల రూపంలో తలచేను

ఏదో ఒక నీడ భూమి తలంపై వస్తువులతో
మనిషిలో పని అలసట తీరుస్తుంది చల్లగా
శాంతికి మరో పార్శ్వం తృప్తిని అద్దుతుంది
వేరు వేరు విజయ గతులలో వెలుతురు చీకటి రెండూ

మనిషి అనుభవంలో రాసులుగా వెలుతురు చీకటి నుండి
పయనంలో సుఖాల కష్టాల జీవన గాథలు
శిశువు నుండి వృద్ధత వరకు చెట్టులా నదిలా
జీవితాలు ఒక్కొక విధం రుచిమంతం ఉపయోగంలో

ఉదారతతో మనిషి మనసు త్యాగ పూర్ణం అయ్యేను
ప్రజలలో ఆకర్షణ రూపం విగ్రహమై నిలచేను

చీకటి శేషం నీడల వలగా తోచవచ్చు
మెరపు తీగెలా స్వప్నం బరువు లేనిది ఎప్పటికీ

స్వగతం కథలో స్మృతి పరిమళం వహిస్తుంది
ఆయువు స్వర ఝరియై కాలంతో ప్రవహిస్తుంది

ఉత్తేజం శరీరాన్ని, చైతన్యం మానసాన్ని
అందరికీ వర్తించే కవితలు కాలానికి అతీతంగా

చీకటి స్పర్శ ఎరగని వాస్తవం మనిషి అంతరంగంలో
అస్తితలో వికాస ప్రకాశాలను నిలుపుతుంది ఆలోచనలతో

# 29. ఏదైనా

మనిషి మనసు దార్శనికంతో పునర్భవం పొందుతుంది
ప్రజాస్వామ్య సామ్యవాద ప్రగతి శక్తి ముందుకు నడిపిస్తుంది
పాలకులు అధికారులు నిరంకుశ పాత్రలు నిర్వహిచడం అసంగతం
తాపంలో వేదనలో చెట్ల నీడలలో చేరేరు మనుషులు సుఖంకై

పూలకై పండ్లకై ఆరాట పడేరు స్వార్థ పరులెందరో
ఎవరి పనులలో వారు వేరువేరుగా శ్రమాపనోదనలలో
సమాజ ఘోష ఎవరికి పడుతుంది?
ఒక ఆర్ద్రమైన మనో రూపాలకు తప్ప

రాజకీయ తంత్రంలో చిక్కుకున్న నాయకులు
స్నేహ ప్రేమ కరుణతో చిత్త శుద్ధిలో కన్న
వైరం పై ఏమైనా తమ గెలుపు పై ఆలోచనలు
స్వర్ణ పంజరాలలో సిద్ధంగా రాత్రింబవళ్ళు

ఎవరిని గురించి ఎవరు ఎట్లా ఆలోచించేదీ తెలియదు
కాలం కంతలకు గంతలు కట్టి రోజులు గడిపేరు
గడ్డ కట్టిన కాలం కరగేనని తెలిసి రావడం లేదు
కరగితేనే సమాజంలో అందరికీ దాహం తీరేను
రవి కిరణం చొర రాని చీకటి నిలయంలో
ఇంట్లో వెలిగే దీపానికి తానే సృష్టికర్త నసీ

ఒక్కొక్క అనుభవం ఒక్కొక్క శిలా నిద్రను లేపుతుంది
గాయాలకు పని ఉన్నట్లు లేదు, ఎప్పటికీ రణం శాంతి మాటలే

గాలికి పూల పరిమళంతో పైపైకి వెళ్ళాలనీ
ఇపుడు దేశం ఉన్న స్థితి కల్లోల సుడిగుండాలతో
ఇది శాశ్వతంగా అంతరించేది కానే కాదు
అపుడపుడు మిత్రుల్లా బంధువుల్లా ఏర్పడుతుంది

మెడలో పూలదండతో తిరగాలని ఉన్నా, ఒక నాటికి
శత్రువు మోసంచే నిప్పు రవ్వల దండ కావచ్చు
కోర్కెలు అనల కణాలు కావచ్చు నిప్పు పూలు అవచ్చు
ఏదయినా సదాశకూ దురాశకూ భేదం తెలిస్తే మంచిది

# 30. దృష్టం

స్వేచ్ఛ కోసం తపనలో త్యాగ మూర్తులు కొందరే
జ్వలన్మూర్తుల వెలుగులో విశ్వ భవితకు శ్రీకారం
గళం నుండి నినాద పంక్తులొకటొకటీ అమరమై
కోష్ఠ రాగం స్వనిస్తూ ప్రాణమయమై గాలిలో

వర్తమాన గతిలో కంటికి కనబడనిది “అదృష్టం”
కంటికి కనబడేది హేతువుకు నిలిచేది వాస్తవం
దర్శన స్పృహతో శక్తులు కలిగిన సంకల్ప గుణంతో
ప్రపంచ మంత వెలసింది నిలిచింది అదృష్టం స్థిరంగా

వివిధ రూపాలలో శాఖోపశాఖలుగా విస్తరణ పొందేను
అన్నీ ఆయా స్థానాలలో గౌరవ మర్యాదలు పొందేను
భవిత గురించి సూచనలు కొన్ని కొన్ని హెచ్చరికలు కొన్ని
వివరణలు కొన్ని వివేచనలు కొన్ని శాస్త్ర వేదిక నలకంరించేను

జీవన చలనానికి కాలం గమనానికి సంబంధం దృఢమై
మనిషిలో మనో వికాస శక్తులు, ప్రకటిత మయ్యేను
జీవన పరిస్థితుల పరిశీలన ఆలోచనలో ఆయువు
పాటించే విలువలతో ఉన్నతితో రమణీయం అదృష్టం

గతం గురించి తగినంత పనిలేక పోయినా
వర్తమానంలో బ్రతుకుతూ ఇష్టంగా ఉన్నా
భవితపై ఆధార పడింది ప్రశ్నల కవకాశంలో
ఉదయ బింబంలా ‘అదృష్టం’ ఎవరిని వరించేనో? తెలియదు

ఏ నేరం ప్రసక్తి లేదు ఏ దోష భయం స్పర్శ లేదు
ఎక్కువ తక్కువ స్థాయి భేదాలు లేకపోలేదు
మెరుపులా సూటిగా బయటికి వస్తుంది ఆత్మీయంగా
సూర్యుని తలపిస్తుంది చంద్రుని మరపిస్తుంది మనిషిని నిలుపుతుంది

అరచేతులలో రేఖల దారులలో
ఇప్పటి వరకూ తిరిగిన మనోరూపం
వ్రేలికి ఉంగరంలో మెరిసే వజ్రం లానో
పాపట తీర్చిన అపూర్వ రత్నంలానో

గ్రహ సంచారాన్ని బట్టి తిరిగి తిరిగి జీవన పయనంలో
కల్మషం లేని సృజన జగత్తులో అదృష్ట మొక పుణ్యభాక్

స్వేచ్ఛా కవిత్వం - 124

# మేల్కొన్న కవిత


మాదిరాజు రంగారావు





**2023**

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

# 124 SWECCHA KAVITHVAM

# MELKONNA KAVITHA

# మేల్కొన్న కవిత

by

Prof. Maadiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Year of Publication 2023

*Presented to*
*my son*
*Dr. Santhosh Kumar*
*on*
*his Birth Day*
*with best wishes*

# పీఠిక

ఈ కృతి "మేల్కొన్న కవిత" రాత్రి ముగింపుతో రవి కిరణ ప్రసార దృశ్యంతో దృష్టికి వస్తుంది. సమాజం ప్రకృతి ఇరు పక్షాలతో మనో వికాసం విహరిస్తుంది. ఇది మనిషి – భూమి – జీవితం – కల్పన రేఖలతో వాస్తవ చిత్రణల్ని గమనించవచ్చు. వ్యక్తిలో ఆలోచనా ప్రపంచానికి ప్రతిబింబంగా వెలువడింది.

జలదం సృజనకు ముఖ్య కారణమయింది. జలజం సుందరతకు, సుగంధానికి ప్రతీకగా నిర్వహింపబడింది. పైనుండి జలదం క్రింద జలజం రెండింటిని జీవితంలో విశాలమైన ప్రాతిపదికపై అవసరమైనవి, ఉన్నతికీ వికాసానికి తోడ్పడేవిగా భావితమైనవి.

లౌకిక జీవన కోణాలలోని, విశేషతల్ని భవితపై ఆశావహమైన ఆలోచనతో పాటు విస్మరింపరాని వర్తమానంపై అభిలాష, విశ్వాసం, శ్రద్ధ స్పష్టంగా కనిపిస్తుంది. ఇందులో సాధ్యమైనంతవరకు క్లిష్టతకవకాశం లేని ప్రసన్నమైన అభివ్యక్తిని కలిగింది.

రచనలో వస్తువు వ్యక్తుల జీవితం సమాజ వర్తనం ఆధారతలంగా ఉంది. ఇదే దీని వెనుక నుండి తాత్వికమైన భూమిక. ఇక ఆవిష్కారంలో కళాత్మకత సుగమమైన రచనతో ఆకర్షిస్తుంది. అటు పద్యం ఇటు గేయం కాని స్థితి స్వేచ్ఛా సంచరణం. ఊపిరులకు ఆయువు నిస్తుంది.

దేనికది సహనం శాంతి తృప్తి ఆనందంతో సంపన్నమయింది. ఇందులో ఆధునిక యుగంలో విమర్శకులు ఆమోదించిన భావరూపాలు (Images) ప్రతీకలు (Symbols) ఉప చేతన (Sub conscious) లో కదలే ధ్వని (Suggestion) సూచకమైన అభివ్యక్తితో చైతన్య స్రవంతి (Stream of consciousness) తో పాటు దార్శనికంలో ప్రజాస్వామ్య సామ్యవాద దార్శనిక పథంలో కవితాత్మ తీర్చబడింది. బహు ముఖీనమయిన విశాల ప్రాతిపదికపై అవతరించింది. ఆధునిక తెలుగు కవిత్వంలో దీని స్థానం ప్రజాస్వామ్య సామ్యవాద దార్శనిక నేపథ్యంలో చూడవలసి ఉంటుంది. సామాజిక, కళాత్మక, మనస్తత్వ, తాత్త్విక ఛాయలతో విశ్లేషణ కందుతూంది.

కవి మాటలు చేతనలో దీని ఆవిష్కారం ప్రత్యేకతను కలిగింది విశేషతను భావింప చేస్తుంది. దైనందిన జీవితంలోని అనుభవ దృశ్యాలు సామాజిక రాజకీయ మనస్సు కోణాలతలో చిత్రణం కనిపిస్తుంది.

ఇందులో 1) జలద మదితో 2) జలజ హృదయంతో 3) కళాత్మకమైన 4) క్రియాశక్తి ప్రసారంతో ఆశాపూర్ణమైంది. సహృదయులకు సుస్వాగతం.

**– మాదిరాజు రంగారావు**

# మేల్కొన్న కవిత

## 1. మిగిలే కర్తవ్యం

ఆత్మ బలం ఒకటే చాలదు అస్తిత నిర్మాణానికి
ప్రతిభకు లౌకికంతో పాటుగ సామాజికం ముఖ్యం

తన వరకు నాల్గు మెతుకులు రిజర్వులో ఉంచేరా
ఉన్న రోజులు టేబిల్ ముందు కెవరూ ప్రత్యక్షం అవలేదా?

తనకు తగిన వేవో ఇష్టమైన వేవొ అయినా
సమాజ సంస్పృహ లేనిది బ్రతుకులు వ్యర్థం
మనేది ఏదయినా మానవ మేధతోనే ప్రగతి యానం
జీవన శాఖలపై లగ్నమై హృదిలో అభిలాష
ఎదుట పడే సంఘటనలు రాజకీయాలో మరొకటొ
తుఫానులో బీభత్స ముద్రల స్థితులతో సమాజం
సర్వం తలక్రిందులయిన వినాశన దృశ్యాలు
కారణ మేదైనా గురి అయ్యేదీ, సరి చేసేది మనుషులే

సృజన విలయ గతులతో ప్రకృతితో సమాజం
విషమ వికల స్థితులను దారిన పెట్టేది సమాజమే
ఎవరిది పై చేయి ప్రశ్నకు జవాబుగా
మానవ మస్తిష్కం ప్రయోగ శాలగ మారేను

చింతనలో కాలం గడిపేది కాదు, ప్రేమ
పయనంలో దూరమెంతైనా అనుభవ సమ్మతమే
తుపాను గాలికి ఎగిరి పైకి అదృశ్యం కాదు
కొలతలతో ఏ మైలు రాయి వద్ద నిలిచిపోదు

దారి పొడవునా హృదయ తంత్రీ నాదం
మధురంగా ఆ ఒకరికి మాత్రమే వినబడేను
దీని పర్యవసానం ప్రభావం ప్రజ లందరిపై
బ్రతుకులు లెక్క ప్రకారం అనుభవ చక్రంపై తిరగవు

ఒకే దారి ఒకే తోడు ఒకే దృష్టి ఒకే లక్ష్యంగా
ప్రజలందరిలో ఒకే అభిమత గుణం వెలగదు
పోటీ మనస్తత్వ రేఖలపై ఎవరికి వారు
తమదైన ప్రపంచంలోనే! ఏమైనా కాకపోయినా

గట్టుకు చేరడమొకటే ఇపుడు మిగిలే కర్తవ్యం
కాలంతో సమాంతరంగా, పయనంలో జీవన వాస్తవం

## 2. ఎదురు చూస్తూ

నడకలో అడుగు తీసి మరో అడుగు ముద్రలు
దారిలో వరసగా దేని మోస్తరు దానిదే, మార్పులతో
నడతలో ఊహననుసరించి చర్యలు గుణశీలంతో
ఏ రెండు ఒకటి కావు అందులకే బ్రతుకులు భిన్నం

గమ్యం ఒకటే అయినా ప్రజాస్వామ్య లక్ష్యంలో అభేదంగా
ఎవరి నడతలో రూపొందే వ్యక్తిత్వం వారి స్వంతం
ఇది మిత్ర గణానికి సహచర సమూహానికి బహు ఇష్టం
అనుకరణానికి తావులేదు, వివేచనకు వీలు కావచ్చు

రాత్రి అవుతూనే గగన భిక్షా పాత్రలో
దిశల నుండి విసరిన నాణేలు ఆశకు తగినవి
వాటి నందు కోడానికి భ్రమలో ఆశావహులు
మనుషులు పైకెగిరేరా! అవి క్రిందికి జారేనా?

మెరపు ఒలికితే సంతోషం, పిడుగు పడితే భయం
వాన కురిస్తే ఆనందం పంట చేతికొస్తే భాగ్యం
కాల చక్రం తిరుగుతుంది అనుభవానికి దీప్తినిస్తూ
ఇంత మోదం ఎంత ఖేదం అంతలాభం ఇంత నష్టం

లెక్కలలో పడి మనుషుల జీవితాలు
అడవిలో దారి తప్పే విధంగా మారేను

ఎన్నిటి చిత్ర విచిత్ర కలయికలతోనో జీవితాలు
కాలం గడచిన మీదట ఎపుడో వివేచనం
చరిత్ర శిథిలాలలో వాస్తవ రేఖలతో మనిషికై
ఎంత ఖర్చు అయినా వెనుదీయని అభిలాషతో

తరం నుండి తరానికి మారే ఆశా రూపాలలో
పాతవి కొంత కొత్తవి కొంత కలిసిన బ్రతుకుల బొమ్మలు
అనుభవమెంత విలువైందో చెప్పడానికి మాటలు చాలవు

ఆరోహణలో శిఖరం నుండి కిందికి చూస్తే
చీకటిలో కుంచితమైన లోయ నిరాశా శకలం
దరిద్రుని చేతిలో చెల్లని కరెన్సీ నోటులా వీడనిదీ
నీటి చుక్కకై నోరు తెరచీ
వెలుగు రేఖకై ఎదురుచూస్తూ

# 3. విజయ దశలు

ఇవతలి తీరం నుండి జలధిలోకి దూకి
అవతలి తీరం తేలి ఆ నేలపైన నడవాలని
ఎప్పటి మాటో! ఇప్పటిదా? లోన పరచుకొనీ
దూరం లోతు విశాలతలు తెలుసుకోవాలని
తన వశం చేసుకోవాలని, లోన అణగిన ఆకాంక్ష!
సరిగ్గా బ్రతుకులోను ఈ అనుభవమే ప్రకటితమవుతుంది

ఈ భూమిపై ఖాళి జాగా లేకపోలేదు
అయినా గగనంపై దృష్టి పడడం మానవ సహజం
ఎవరికి అందేను? ఎవరు చేరేరు? వికాస విశేషంలో

శైశవం నుండి వృద్ధాప్యం వరకు చింతనలో
ప్రయత్నాలెన్నో! వివిధ దశలలో మదిలో
కాలి నడక నుండి విమాన యానం దాకా

ఉదయంతో సూర్య రశ్మి నందుకొనీ
రాత్రి రాకతో వెన్నెలపై అభిలాషతో
ఇది జీవన రూపానికి విచిత్ర నేపథ్యం

ఏ రోజూ కనిపించే దృశ్యంలో మార్పులతో
ఆరోజున ఏదో పని సాధించిన తృప్తి,
ఆశను నిలిపేను నడతను తీర్చేను వికాస స్పందనం

యానంలో దారిని ఎన్నుకునేదీ, లక్ష్యం చేరేదీ
తనలో రూపొందే స్వతంత్రమైన వికాస ఫలమే
సమాజ శ్రేయంపై కోరిక సుందరమైన వాస్తవం

ఇది కల కాదు కల్పన కాదు యధార్థం, అవును
కఠిన స్థితుల నెదుర్కొనేందుకు సూటిగా
ఒకరిని మరొకరు క్రాస్ చేస్తూ పోవడమే చేసేది

తీవ్రమైన ఆకాంక్ష ఉద్యమాన్ని వేగవంతమొనరించేను
విషమ స్థితుల నుండి తన అస్తితతో కవి ఒంటరిగా నైనా
నిలబడేను నిటారుగా ఎప్పటికీ, కవితలో నిజరూపంలో

శబ్ద నిలయం నుండి అర్థ దిశలదాకా
స్వేచ్ఛ దొరకినంత మాత్రాన అనుకునేది లభించేనా?
దీని కెన్ని విజయ దశలవసరమో? ప్రేరణలెన్ని కావాలో

## 4. ఆకలి తీరుస్తూ

అలజడో శాంతమో ఏ మార్గమొ ఉద్యమ చరిత్రలో
షరీక్ అవుతూ తమలో భయాన్ని ఎదురుగా ఉన్న
చెట్టు కొమ్మపై విసరి వేసేరు, ధైర్యంతో కదలేరు
తమ హృదిలో త్యాగ తరువును నాటేరు పెంచేరు
కొందరిలో జ్వాలా సంరంభం సమాజంలో శక్తుల
పరి పోషణతో, అదృశ్య శక్తుల సహాయ రక్షణలో

దశల నెదగజేస్తూ క్షేమ సమాచారాల్ని నిలిపేరు
లౌకికం నుండి మానసికానికి సంతృప్తి రేఖపై
గెలిచిన రుచి తెలిసేది చివరకే, ఎంత కాలమైనా
ఎన్ని రూపాంతరాలు పొందినా ఓపికతో
చతురమైన నిపుణత చూపినా పథకంలో
మనిషి మనిషే ఎప్పటికీ! దోషం, పొరపాటులతో

సూర్యుడు నిజ విభాత ప్రభను చూపితే
చంద్రుడు తన వికాస కథను తెలిపేను
ప్రజలలో రాజకీయ స్పృహను బింబించేను
ఏకాంతానికి తరలజేస్తుంది అనుభవం
పుట్టుకతో పరివారంలో చేరేను వ్యక్తి
ఎదుగుతూ సమాజ యానంలో కలిసేను

సన్మతిచేత మోదమో! ఖేదమో లాభమో నష్టమో
ప్రవాహమో సుమ మాలయో అగ్ని శిఖయో ఖడ్గమో
చీకటి బోర్డుపై చుక్కల అక్షరాలలో ప్రకటనలు
మరునాడు పత్రికలలో రహస్య వార్తా ప్రకాశం
స్వేచ్ఛా పథంలో జన శ్రేయంపై మనసుతో
ప్రతి జీవన శకలం చీకటి తునకతో, రవి కిరణంకై

ఉపయోగం కళాత్మకం కలిసి ప్రయోజనంలో
కవిత! వర్తమాన స్థితి చిత్ర శిల్ప సమ రూపం
అలలతో ఆర్ద్ర పరుస్తూ చల్లని చేతులు చాచీ
మనసులో ప్రవహించేను నది ఇరు గట్లను ఒరసీ
పచ్చని మైదానంతో ఆకలి తీరుస్తూ దూరదూరం
తన ఆమర శక్తిని చూపేను, భూమి నలంకరించేను

# 5. జల పాత్రగ

మానవ మస్తకాన్ని తలపిస్తుంది గగనం గుండ్రంలో
దిశ దిశల నావరించి, చూపులో ఒకటైనది
మల్లె మొగ్గల తొలకరి చినుకులతో పిడుగుల ఆర్భాటం
ఈ లోకాని కతీతమైంది నమ్మకాల చలామణిలో
నిశ్చల గగన తలం అంతటినీ వహించేనా?
తెలియని దానిపై ఎందరికో అచంచల విశ్వాసం

జలదం వస్తుంది భూమిపై మెరపు చూపుతో
పరిశీలన జరిగాకనే ఉదార వర్తన చలనం
ఆర్ద్ర తలంకై వేచి ఉన్న భూమి సత్వరంగా మౌనంగా
కొత్త సృజనకై ప్రకృతిపైకి చల్లని చేతులు చాచేను
ఎప్పటిదో సుదూరమైన బంధుత మబ్బులతో
ఇప్పటికీ చెదరని సకాల బంధంతో ఆత్మీయం

కాలానికి వైభవ కళను చూపేను
మనుషులలో ధైర్య బీజం నాటేను
దరిద్ర తాండవంతో చెదరిన ముఖాలను
పూల చెండ్లలాగ భాగ్యవశం చేసేను
పల్లంలో క్రుంగిన నేలను జల పాత్రగ మార్చేను
యాచన ఎరగని భూమిని రస భర మొనరించేను

పవనం వీస్తుంది వాతావరణం శుభ్రంగా మారేను
భేదం లేని చర్యలలో సమభావనతో ఆశారూపం
ఫలితంతో సుదీర్ఘ పయనం విశ్వమయ మయ్యేను
ప్రాణం విషయంలో జగతిని క్షేమంగా నిలిపేను
మనో భూమికలో కల్మష హరణ కారణమైంది
లౌకి కాన ప్రసన్నతకు ఉగ్రతకు ప్రతీక అయ్యేను

జ్ఞాని అయినా దోషి అయినా వీరుడయినా భీరువయినా
స్నేహమయినా వైరమయినా మొక్కలోను మనిషిలోను
రవి కిరణం ఉష్ణస్పర్శ అరణిలోవలె కవితలో
బయట జ్వలనంలో అగ్ని దైనందిన ఉపయోగంలో
లోన కోపం కలహం ద్వేషం శత్రుతలో అగ్ని కళతో
బొగ్గు నుండి కొత్తగ ఘర్షణ కవ కాశంతో నిప్పుగా

# 6. స్పందన స్వరం

అణచ బడని స్వేచ్ఛా స్వరం మనిషి నుండి
సూక్ష్మమైన సహేతుక భావ చలన రక్తితో
అవకాశం దొరకినపుడు సమాజ పరమయ్యేను
ఈ దిశలో వ్యక్తి సమాజ శక్తిగ రూపొందేను
బాధలో ఉన్న వారిని వేదనలో కవిత కళాత్మకం
మానసికంగా సానుభూతి చర్య ఉపశమింపజేసేను

అనుభవ సంపదతో పుస్తకం వలె మనసులో ఆలోచన
అందులో ఉన్నది తెలిసేది కూడ ఆ వ్యక్తికి మాత్రమే
సన్మతితో ఆచరణంతో బ్రతికినంత వరకూ
సూక్తికి దేశం వర్గం అర్హతలతో పని లేదు
ఈ స్వేచ్ఛా స్వరానికే భేదం లేదు ఈ సుకృతి
మనుషుల ఆయువు వర్తన ప్రక్రియల సంకలనం

లౌకికం తాత్వికం ఇరువైపుల నుండి పూర్ణత కూర్చేను
విషయం నుండి సమస్యతో ప్రశ్నకు జవాబులతో గడచేను
ఇచట మంత్ర దండం లేదు, ఎవరి వద్దనూ
సత్వరం ఫలితం పొందదానికి శ్రమయే కర్తవ్యం
చక్ర భ్రమణంతో మనిషి కీలకమై
క్లిష్టమైన స్థితి నుండి గట్టెక్కడమే జరగాలిసింది

ఉగ్రవాద ముద్రలు ఏదో ఒక రూపంలో తప్పనివి
ఎరుపు నలుపు రేఖలతో సంక్లిష్ట సమాజంలో
తీవ్ర స్థాయిలో జరిగే చర్యలు మారణ సూచనలు
కట్టను దాటలేని కెరటాలవలె సమూహాలు దూరంగా
సాయం సంధ్యారుణ దృశ్యం క్రియలో విషాదం
క్షోభాకృతి జలధిలో ముక్కలయ్యే భయ శబ్దం

నవత సమత సహన శాంత రూపాలు దూరంగా
నిల్చొని సమస్య పరిష్కార నిరీక్షణలో ఎప్పటినుండో
ఎంత కాలమయినా సరే, జన హిత లక్ష్యంతో దార్శనికం
కలల వరుసలో అలరించే భాగం అవకూడదు
"నేతి బీర కాయలో నేయి"లా స్ఫురించకూడదు ఏ దశలో
ప్రజాస్వామ్య హృదయం విషాద స్వరాన్ని వినిపించకూడదు

# 7. శక్తి యుక్తితో

మౌన శిఖరం ముఖం నుండి శబ్ద తరంగాలోలమై
కవిత! కిందికి దిగుతూ పాయలుగా ఏమైనా అవచ్చు
జీవన గతిలో ఏ రూపం పొందేదీ అందరికీ తెలియని యధార్థం
అగ్ని రూప మెత్తవచ్చు జలధుని కావచ్చు కుసుమ పంక్తి అవచ్చు
అడవిలో నయితేనేం మరోచోటికి పయనం మజిలీ మజిలీ దాకా
ఒక్కొక జంతువో మృగమొ, ఇక భయమెక్కడిది? మనో భూమికలో

తోడుగ ఉంటుంది కవిత, ఎక్కడికయినా ఎపుడైనా
మాటనూ పాటనూ నిరాటంకంగా విలీనం చేసుకునేను
అవి నను విడువలేవు నేను వాటిని మరవలేను
ఎక్కడో శిలలా పడి ఉండే కన్న నిశ్శబ్దంగా అచలంగా
అడవిలోని కాలినడక అనుభవ ప్రదమై మనిషికి
ప్రాణులతో కలసి మెలగడం, దూరమైనట్లు కాదు

నీలో బలానికి తోడుగ సహచరుల నిపుణత పనిచేసేను
దేహ బలం బుద్ధి వెలుగు జడచేతన మూలాలతో
జంటగానే నాలో కొత్త జగతికి దారులు తీసేను
ఎవరికి వారు సరికొత్తగ సమాజ నిర్మాణాలతో

ఎవరెపుడు వచ్చేదీ భూమిపైకి ఎవరెపుడు పోయేదీ భూమి నుండి
ప్రధానం కాదు, మరీ ముఖ్యమైంది ఎవరెంత వెలగ బెట్టిందీ కావాలి

పూజ లందుకొనే మూర్తులెన్నో ప్రపంచంలో
కళా బంధువులై దేవతలై మనే దెన్నో
గుండ్రంగా తిరిగే కాల చక్రాన్ని అనుసరించి
జీవితాల వ్యవహారం క్రమంలో మనిషి చేతిలో

తరం నుండి తరానికి సుగమమై సుభద్రమై
సులభమైన పరివర్తనలో సుహితంగా సమాజం

రాత్రులు ధైర్యం ఇచ్చేందుకు పైనుండి తళతళల
చుక్కలు ! భూమిపై దీపాల వెలుతురులతో మాట్లాడేను
రాత్రి వేళ సంఘటితమైన చీకటి ఒకటిగా
ఉదయ కిరణం రాకతో వీడ్కోలు పొందేను

ఇది చివరిది కాదు, ఇంకెన్నో ముందు వచ్చేవి
అన్నిటినీ ఎదుర్కొనే శక్తి యుక్తి మనుషులలో

# 8. స్వార్థంతో

పరచబడిన భూమిలో ఒక ముక్క పీఠమై
పూర్వపు స్థానంలో అదే విధంగా నేతలు పదిలంగా
మల్లె తీగె అల్లుకొనీ, గగన మంత విశాలంగా
పందిరి యశసు క్రింద పరిమళ స్పర్శతో
ఏ వాదానికి చెందిన వారయినా పలు మార్పులలో
బ్రతుకులో పాతుకున్న స్వార్థంతో ఎత్తులకు దిగేరు

నైరంకుశ చర్యలతో ప్రభుతను ఆశించేరు
ఆశామయం నుండి తమ అనల బలం చూపేరు
నినాదాలతో ఆందోళనలో శబ్దం – పిడుగులు విసరేను
పూర్వం నుండి వచ్చే నమ్మకాలను భద్రపరచే యత్నంలో
"ప్రజల క్షేమం కోసం" అంటూ అడుగులు వెనక్కి వేయ చేసేరు
చెల్లా చెదరైన సమాజాన్ని ఆపై సరిచేయ చూచేరు

నైతిక వర్తనలో దీర్ఘ కాల ప్రయోజనాన్ని మరచేరు
ఉద్యమ చరిత్రను పలు గాయాలతో అలంకరించేరు
నింగిలోని నెలవంక నుండి సూర్య బింబం దాకా
సమాజంలో మసక బారిన బింబాలను చూపేరు
ఆట బొమ్మలవలె నాయకుల చేతులలో ఆడేరు
నేపథ్యం తెలియని అమాయకులు, సామాన్యులు

వెనుక నుండి అలజడికి ప్రేరణ కర్తలు కార్యశూర్యులుగా
నాయకులుగా సమాజంలో చెలామణి కావడమొక విచిత్రం
సమస్యలు జటిలమై పెరిగి మెడకు చుట్టుకునేను
వసంతాన్ని దహించే అగ్ని గీతం వినిపించేను
కవితలో ఒకటొకటి నిర్భయంగా ముందుకు వచ్చేను
అంతలో కొన్ని ఎక్కడివి అక్కడ మాయమై మరపించేను

జలదాన్ని మ్రింగే చండ తాపంతో కాలం వర్తిస్తుంది
వింతను చూస్తూ ఏ శాసనమేమీ చేయలేకపోతూంది
ఎండకు భయపడి బయటకు విజ్ఞులు శాంతి సదనంలో
కాలాన్ని నిందిస్తూ చెట్టు నీడన చేరేరు కొందరు గొణుగుతూ
గుండె ఎండి పోయి లయ తప్పిన ఆర్ద్ర రూపాలతో
బావి చెరువు నదులు ఏరులు వెలుగులారిన సమాజంలో

# 9. విత్తు చెట్టై

ఉదయం విప్పారే మహా పద్మంలా చౌరస్తా
రేకుల వలె మనుషులు మానవ వికాస చలనంతో
మహా కాల లిప్తల తోరణం ఎదురుగ స్వాగత ముఖంతో
ఆలోచనలో సృజన క్రియకు ప్రేరణయై ఆ సమయం

పగలు రాత్రి భేదం లేకుండా వ్యక్తి మనో యానం
మధ్య మధ్య నిద్రా విరామ స్థితులకు వీలుగా

జీవితమంటేనే వాస్తవానికి సుఖమూ ఆనందంతో
నిరాశలో మండే బాధలు దిశ దిశ నుండీ
ఒక స్థితిలో స్నేహం ఇంకొక స్థితిలో వైరం
కళ్ళు తెరచి బహు జాగ్రతలోను పైబడేను ఆపదలు
ప్రమాద ఘడియలు ఎవరికీ చెప్పి వచ్చేవి కాదు
కష్ట దశలు సరేసరి జీవిత గమనంలో భయదాలై

పద పదాన అనుమానం అవరోధం సంశయం అనిశ్చితం
కాల ప్రవాహంలో అలలపై తేలుతూ వడివడిగా
ఒడ్డుకు చేరే కోరిక ప్రగతితో మనిషిలో బలంగా
మధ్యలో మునగ వచ్చు సుడిగుండంలో చిక్కుకోవచ్చు
స్వేచ్ఛలో ప్రవాహ గతికి చివరలు లేవు! సముద్రమే
సముద్ర మనగానే జీవిత గమ్యం మనస్సులో మెదలుతుంది

విత్తు నుండి మొలకెత్తిన మొక్కలో సృజన ముఖం
పచ్చని ఆకులా కవితలో సృజన కళ ప్రకటిస్తుంది

ఇది ఆ చెట్టు భవితను తీర్చేది
కవితలో సృజన శక్తిని సూచించేను
సాయం సంధ్యా సమయం నుండి రాత్రి
వేదనా స్వర సంకలనం వినాలని ఉండదు

పూచిన పూవు దేనికి పనికి వస్తుంది
స్వీయమైన అలంకారానికా? దైవానికి అర్పణకా?
లోనుండి ఆజ్ఞ దేనికి వచ్చేను? నప్పేను?
ఎదురుగా ప్రతి దిశలో ఉండే దారులెన్నో
పోయే దారి ఒకటే వచ్చే దారి వేరు కావచ్చు
విత్తు పెద్ద చెట్టై ఫలవంతం కావడం సృజన విశేషం

## 10. స్వేచ్ఛలో భేదాలు లేవు

దేశం గౌరవాన్నీ మనుషుల బంధుతలనూ చూపేను
ప్రతీకయై అభిమాన ధనంతో జీవించేను పతాక
దీని నీడన ప్రతి హృదయం సేద తీరుతుంది
దీని గాలిని పీల్చుకొని బ్రతుకులు నడచేను

ఆలయానికి బయలుదేరి ఒకరు
దారి తప్పి హోటలు చేరుకునేరు
మరొకరు హాస్పిటల్ ప్రవేశించేరు
ఇంకొకరు పార్క్‌కు వెళ్ళేరు

కోవిడ్ అనుమానమో రాజకీయ కలహమో
ఏదైనా కానీ అంతా అస్తవ్యస్తం సమాజంలో
నీడలో మార్పు మానసికంగా తెలిసీ తెలియకుండా
రెండు వేళ్ళ సందున సూచికలా సిగరెట్ బదులు
పెన్ను చేరింది ఎపుడు కళ్ళు కప్పో
కవితకు పట్టాభిషేకం, నవతకు జనతేజం

రాత్రి కలలు కన్న కళ్ళు నాలో
పగలు కళ్ళు తెరచి ఎట్టెదురుగా
యధార్థ దృశ్యాలు వాస్తవ పథ చలనంలో
రంగుల డ్రెస్‌లలో మానవ జీవన రూపాలు

వాస్తవ గాథలతో ఒకటొకటి
మనో నిలయంలో ఖాళీ జాగాలను
ఆవహింప చూచేను ఎంతో ప్రియంగా
కవుల కెంత పనో, సృజన కవకాశంతో

పగలయినా చీకటి మూలల్ని కొని వరించి
రాజ్య మేల చూచేరు ఎందరో అనల మతులు

దేశానికి స్వతంత్రం వచ్చింది! చేతిలో పతాక సాక్షిగా
స్వేచ్ఛలో ప్రాణ స్పందనం రాగ రంజితంగా
సౌభాగ్య సమాజంకై ఆరాటమంతా ఇంతా కాదు
చిన్నచిన్న చీకటి తునకలు నియతమైన బల్బులతో
పలచని వెలుతురులో జెండా రెపరెపలకు మురిసేను
స్వేచ్ఛలో వెలుతురు చీకటి బంధాలకు భేదం లేదు

# 11. పతాక సాక్షిగా

ప్రతి పౌరుడు తన దేశం పతాక రూపాంతరం
ప్రతి హృదయం రెప రెపలాడే పతాక సమం
స్వతంత్ర భావనతో క్రియాచరణ పదంతో
ఆయువు కాలం స్వేచ్ఛను కోరేను సాధించేను
వ్యక్తి స్థాయిలో సమూహ సందర్భంలో సమస్యలపై
బడుగుల గురించి కర్తవ్యం పాలనా వ్యవహర్తలదే

పలు విధాలుగా ప్రాణుల చలనం గమనం స్పందనలు
ఎవరు ఎవరికీ నేర్ప నవసరం లేదు; జీవితాంతం
ఇవి సహజాతాలు ఆయా జాతుల జీవ వశంతో
వివేచనతో ప్రజాస్వామ్య వ్యవస్థను బట్టి దీప్తంగా
బ్రతుకులు ఎపుడో ఒకపుడు నియతం కావచ్చు కూడా
నిబంధనలకు గురి కావచ్చు మేరలలో స్వేచ్ఛ నిలవొచ్చు

ప్రేమ హింస సహనం జన హితం స్వార్థం
ఇవి ఎందరిలోనో అంతో ఇంతో గుప్తంగా ఉండేవే
దప్పికలో నీరు ఆకలిలో ఆహారం మేను వాల్చే ఆవాసం
సాధారణమైనవి మౌలికాలు తప్పనివీ ఎవరికయినా
ఇప్పటికీ ఇంకా ఇళ్ళముందు దీన జనం పేదలు
సమభావం సమన్యాయం కోరుతూ నిలిచిన హీనులు

అమలులో ఉన్న ప్రజాస్వామ్య వ్యవస్థలో పనికివచ్చే
బాగ్‌లో ఏ విలువలు దాచేరు, ఏ విజయం సాధించేరు

చెట్లు మాట్లాడతాయి గాలితో నిరంతరం
నదుల తరగలు మాట్లాడతాయి గట్టుతో ఎప్పటికీ
మనిషితో మనిషి మాట్లాడేను తన అవసరాలతో
బ్రతుకు బరువులో జరిగిందీ ఒరిగిందీ ఏమదీ

ఇళ్ళ ముందు వీధులలో కూడలిలో ఒంటిరిగా
ఎందరో ఘనులు తీర్చిన ప్రజాస్వామ్య దృశ్యంలో
చేయి చాచి తిరుగుతూ కనుల ఎదుట కలలా
పగలు చెట్లతో రాత్రి వెన్నెలతో చుక్కలతో గడిపేరు
కష్టాల కడలిని కన్నులలో నిలుపుకొనీ చుక్కలు రాలుతూ
తన దేశం ప్రజలు పతాక రూపం ఒకటే సాక్షిగా

# 12. అశాంతి, చిత్రం

పయనం లేని బ్రతుకు లేదు
తన కిష్టమైన లక్ష్యం దిశ గమ్యం మార్గం
కోరింది అందకపోతే ! మరొక టేదో ఎచటో
ఆ మరొకటి మరో విధంగా స్థిర పరచవచ్చు
ఇవి తనలో దాగిన శక్తిని ప్రకటించవచ్చు
తెలియని వెన్నో హృదయానికి తెలియవచ్చు

దయా లహరులతో ప్రగతి చరిత్రతో
మును ముందునకే నది పయనం సూటిగా
తన కిరువైపుల భూముల్ని సమార్ద్రం చేస్తూంది
పచ్చదనంతో సుందరతను చేకూరుస్తుంది
సమాజానికి కృషి ఫలాల నందించేను
వ్యక్తిలో భాగ్యవంతమైన భవితకు హామీయై

దాహం వేస్తే చెలమ బావి చెరువు నదిని చేరాలిసిందే
అంత ఎత్తులోని మనిషి ఇంతగ తలవంచవలసిందే
వాన చినుకులు శీతపవనం ఎండతాపం వసంత శోభ
కవితకు నేపథ్య సూచికలై మార్పులతో కొత్తగా
ప్రతీకలు! పాత్రల నిర్వహణ శిల్పాలను పొందేను
బ్రతుకులో వివిధతల దృశ్య ప్రపంచం అమరేను

అవసరాలకు పనికి వచ్చే తోడుగా
మతి విలసనంతోకొత్త జీవన స్థితులకు చేరేను
ప్రకృతి భావనతో కవితకు మానవ హృదయంతో
దున్నిన క్షేత్రంతో బీజం వలె అక్షరం నిశ్చయంగా
యంత్ర రూపాన్ని బలాన్నీ ఇముడ్చుకొనీ తనలో
నేడు వలె రేపు ఆశా దృశ్యంలో భాగం అయ్యేను

కన్నీరులో ఒడ్డుకు చేరే పడవను గుర్తించవచ్చు
బాష్ప బిందువులో సూర్య బింబం వ్రేలాడుతూ
అశ్రువులో చంద్ర బింబం పరచుకొన్న వెన్నెలతో
కోరిక! నిప్పు కణం పై పొరలో అశాంతి చిత్రంతో
ఆశలంతరించవు ప్రాణమున్నంత వరకూ ఉండేవి
రెపరెప రెక్కలాడిస్తూనో వడివడిగా అగుగులేస్తునో

# 13. గతానికి డిటో కాదు

ఇది గతానికి డిటో కాదు, వీటో లేదు
పురా కాలంలోని బాకి చెల్లింపు కాదు,
దశ దశలో మార్పుతో మజిలి వేరవుతుంది
కవి కవిలో వేరు వేరు వ్యక్తిత్వ నిర్మాణాలు
మిగిలిన పాత కాలం ప్రశ్నలతో కొత్తవి చేరేను
సమాజ గమన వేగాన్ని బట్టి జవాబు లేర్పడేను

కవితను కాప్సల్‌గా తీర్చబడి సమాచారంతో
మును ముందు చరిత్రకు పనికివచ్చే అంశాలెన్నో
వాడిపోని పద్మ దళాలవలె ఉపకరించేను
మనిషిలో విలువల అంచనాకు పనికి వచ్చేను
ఎన్ని జాగ్రతలు తీసుకున్నా యధార్థం మాయమయ్యేను
శిథిలాలలో అన్వేషణం తవ్వకాలతో ఇప్పటికీ జరిగేను

లక్ష్యం విలువలతో ఒకటే కావచ్చు! అప్పుడైనా ఇప్పుడైనా
అందరికీ చెందినవీ నచ్చినవీ విశ్వమయంగా
మహానదిలా ప్రవహిస్తూ ఉంటాయి సజీవంగా
సంస్కృతిలో మానవ విభవ కారణ మనోజ్ఞాలు
ఒంటరిగా ఉన్నట్లు అనిపిస్తుంది మనోరూపం
కవితకు సమాజ సంబంధం, భూమితో మేఘంలా

కవిత కెన్ని ముఖాలో దిశలెన్ని విధాలో
ఒక్కొక్క కవిలో జీవన గుణ సందర్భాన్ని బట్టి
ఉన్న ముఖాల మధ్య నాయకమణియై
కవితలో ఒకటి సరసిలో చంద్రబింబం వలె
మిగతావి ఎన్నో వెయిటింగ్ లిస్ట్‌లో గడపేను
అక్షర సంయోజనతో పదాల సహయోగంతో

కవిత పట్ల తాదాత్మ్యంతో ఉత్సాహం ఇనుమడిస్తుంది
ముడుచుకున్న మనసును విప్పారగ చేస్తుంది
పరిమళ ప్రసార రూపాలతో వెయిటింగ్ లిస్ట్‌లో
జడతను ఎరగదు చేతనతోనే సర్వంసహపై

కష్టాన్ని పక్కకు జరిపి సుఖ మూలం నిలవాలనీ
తిరిగే కాల చక్రంపై కవిత, మధ్యలో దిగేది లేదు

# 14. మనో మయమై

కవిత లెన్ని ముఖాలయిన ఉండవచ్చు
కొన్ని ప్రదర్శనలో ప్రకాశ రూపంతో అలరేను
మిగతావి ! చంద్రుని చుట్టు చుక్కలవలె చేరేను
ముడుచుకున్న మనసును ఉదయానికి విప్పారగ చేసేను

ప్రకృతి సహజం రెండూ వేరు వేరుగా
రాజకీయం సమాజం కలిసి ఒకటిగా

ముఖాల మధ్య నుండి తన ముఖం కనిపించాలని
ఇతరుల ముఖాలచే ఆవరింపబడరాదని
అక్షర సంయోజనంతో పదపద సహయోగంతో
కాలాన్ని శాసించేను కవిత, దాని మంచికే
కవిత పట్ల అనురక్తి తాదాత్మ్యం కవికి సహజం
దీని నుండి ఉత్సాహ మినుమడించి కార్యశూరులయ్యేరు

పలచని ధూళి పొర అలంకరించిన అద్దంలో
మసక మసకగా ప్రతిఫలన ముఖాలు
ఎవరి కయిన ఒకే విధం వెలుతురును బట్టి మార్పులతో
ఇంట్లో పొగతో సాగే సనసన్నని నీలి పాయలు బ్రతుకులో
ఇవి తప్పనివీ మనో ముకురంపై వేరువేరుగా
యశో రూపానికి భిన్నమై ఎంతవారికయినా

ముఖ ద్వారానికి వేలాడే చిరు గాలికి కదలే
పలు రంగుల కాగితాల పూల మాలలు
కుండిక నుండి బొన్సాయిదాక కళాత్మకతతో
ఎంత మరచినా వదలని ప్రకృతి ప్రభావ రూపం
మనో మందిరానికి శోభాకర సూచనలు
అయతే, జీవన వర్తనలో, అసహజతకు గుర్తులు

కవితలెన్ని ముఖాలతోనో ఉండవచ్చు విశ్వ వేదిపై
ప్రతి కవిలో విశాల సమాజ బంధుతలు తప్పదు
ప్రతి కవికీ విశ్వప్రేమ అక్షర హృదయం సహజం
కవుల మధ్య ఒక కవి అద్దంలో మిని రవిబింబం
తిరిగే కాల చక్రంపై కవిత తిరుగుతుంది ఉత్సాహంగా
జడత నెరగని కాలం ! చేతనతో మనో మయం

# 15. ధ్వని చిత్రం

జీవన ప్రవాహం ఒక వైపున అగ్ని శిఖలు
అసహనం కోపం మారణ గుణ వర్తన రూపాలు
మరొక వైపున ఉదారత క్షమ సహనం శాంతి
ఎన్నుకొనే స్వేచ్ఛ కవిదే; కవిత సర్వ స్వతంత్రం

సమాజంలో జీవితాలు ! దేని అస్తిత దానిదే
స్నేహ సుందరమైన శాంత వాతావరణం కోరేను

ఇంటి ఆవరణంలో రకరకాల పూలు
బ్రతుకులో ఎన్నిటికో ప్రతీకలుగా నిలిచి
పరిమళంతో, రూపంతో ఎన్నిటినో జ్ఞాపకం చేసేను
పూలతో సంస్కృతి సంపదను తెలియగ చేసేను

తాను బ్రతుకుతున్న పరిసరాలు అందరికీ
తన వ్యక్తిత్వంలో భాగమై ప్రత్యేకత చూపేను

స్టేషన్‌లో రైలు ప్లాట్ ఫార్మ్ పై వచ్చే తొందర సమయం
వడివడిగా నడకలు పరుగులతో జన కోలాహలం
ఈ చివర నుండి ఆ చివర వరకు జలధి అలల హడావిడిలా
కాస్త దూరలో సముద్రం నిరంతరం ప్రచండ ఘోషతో
అక్కడ ఉన్న మనిషిలో ఉదగ్రమైన జలగీతంలా
ఇది సంగీత స్వరకలనమో! రణ శబ్ద ప్రకటనమో అన్నట్లుగా

కవులకు బహు ఇష్టమైంది, కాసేపు నిల్చుని నడుస్తూ వినేరు
సామాన్యులకు భయ ముద్రలో ముఖాలు ముడుచుకొని
ఒక్కొక్క సముద్రం ఒక్కొక విధమయిన మహా రవంతో
మంద్ర మధ్య తీవ్ర స్థాయిలలో, ఒక చోట చేరిస్తే
కచేరి అవుతుంది, అన్నిటికీ గుర్తింపు వస్తుంది
స్వర సంకలనంలో లయ మేళనంతో అపూర్వ ధ్వని చిత్రమేర్పడేను

ఆకాశమంతా పరచుకొన్న వెచ్చని నిశితమైన శబ్దం
జలధి కనే కలలో ఒక చోట రాశీ భూతమై
ఎన్ని విధాలుగానో మరొకరికి హ్లాదకరమవుతుంది
నీలి మబ్బులుగా మారిన వాతావరణం నుండి
జనులకు ప్రియమైన వర్షా సందేశం వినిపిస్తుంది
ఇది ఎప్పటికీ జరిగేను, అవసరంలో చేతన గుణ విజయంతో

# 16. రోజు రోజుకీ

రోజు రావడమంటే అందరికీ కనులకు విందుగా
మూసిన తలుపులు తెరవడ మన్నమాట
కొత్త తలపులతో మనిషి అడుగులు
గేటు దాటి బయటికి కదలడ మన్నమాట
కొత్త గాలి కొత్త వెలుగుతో తెరచిన కిటికీ నుండి
స్వర్ణ క్షితిజంలో మారిన కొత్త దృశ్యం అనుభవంలో

చీకటి గోడల్ని కూల్చి మటు మాయం చేయడం
పెద్ద పని కాదు, గీసిన ఒక్క అగ్గిపుల్ల వెలుగులో
మనో జగత్తులో జడమూ చేతనతో కొండలు ప్రవాహాలు
అక్కడక్కడ చీకటి రేఖలతో బొమ్మలవలె మనుషులు
ప్రతి మనసులో ఏదో ఒక కుసుమం తప్పకుండా
వేరు వేరుగా రకరకాల ఆకర్షణ గుణాలతో

పలు విధాల రూపాలతో అందరిలో మనోలోకం
తోటను తలపించే మానవీయ సంపదతో
వయసు పైబడే కొద్దీ ఆలోచనలో
పశ్చాత్తాపం నుండి పరీక్షకు నిలపబడేను
ఎవరు నమ్మినా నమ్మక పోయినా మనిషికీ దైవానికీ
అనుబంధం ఎప్పటిదో ? ఇప్పటికీ మనోజ్ఞంగా

నీడకు అస్తిత వెలుతురులోనే ఒక వైపున
బ్రతుకున పూర్ణత పగలు సూర్య కిరణ ప్రసారంతోనే
హృదిలో స్వచ్ఛత శుభ్రతతో మతి విభవం తోచేను
ఏ క్షణాని కాక్షణం పుష్పంలా సుందర పరిమళ యశసుతో
భయ ముద్రలు తొలగుతూ మనిషిలో చేతన సంస్పందనం
ఆటంకాలెన్నైనా ఒకటొకటీ దాటుతూ గడచేను జీవితం

ఆత్మ నిర్భరత ఎంత దూరమైనా నడవ జేస్తుంది
రాతి యుగం నుండి అణు యుగం వరకూ
ఒక ప్రయోజన సోపాన క్రమంలోనే వికాస చరిత్ర
నీడ రంగు మారదు! మనిషి ఊహ ఆగదు వెలుతురు మాయదు

మనిషి పైన ఆశలతో యంత్ర ప్రమేయంతో
ప్రోత్సాహక అనుబంధం, రోజు రోజుకీ పెరిగేను

# 17. మర్యాదలతో

వ్యక్తిలో మరో ఆకృతి విశేషం అతీతమంత రంగం
బయటకు రాని బయట పడని గాజు కేస్‌లో
మనసుకు ఆత్మకు మధ్య స్థాయిలో ఆరని ప్రకాశ రూపం
లోన ఉన్న కనిపించని సాక్షీభూతమైన చేతన వికసనం
సంకల్పం ఆచరణం రెండిటిపై దృష్టితో మనోజ్ఞంగా
సమాజంలో శ్రేణులకు తగిన విధంగా సమన్వయంతో

కాల చక్ర భ్రమణం ముందు తలవంచని వారెవరు?
భౌతిక క్షతి కతీతంగా బుల్లెట్ ప్రూఫ్ డ్రెస్‌లో
వాస్తవం కల్పన ఆచరణం అతీతం నాలుగు చక్రాల వాహనంపై
మనుషుల జీవితాలు సమాజ చలనంతో ముడివడీ
అంతరంగ మంటూ ఒకటి ఉందని తెలియని వారెందరో
దీని ప్రాధాన్యంతోనే బ్రతుకులో విలువలే ర్పడేదీ

తెరపై నీడల బొమ్మలు మనసును భ్రమలో తిప్పేను
విరామంలో అంతరంగం చేసే సమీక్ష జరుగుతుంది
పూవు పై ప్రేమ మనిషి మనసును పూల తోటగ మార్చేను
చెట్టుపై అభిమానం బ్రతుకులో ఫలాకృతిని చూపేను
క్రింది నుండి పైదాక ప్రతి విషయంలో పోటీ ప్రజలలో
సమాజాన్ని కొంత ఉత్సాహంతో నింపేను శీలంతో తీర్చేను

ప్రజాస్వామ్య వేదికలు సమస్యలను పరిష్కరించేందుకే సహన శాంత
సమత భావ మర్యాదలు అవసరమైనవి

మహాకాల గమనంలో క్షణాలు అనల కణాలు కాక
ఎప్పటి కపుడు విప్పారిన పూల వలె హ్లాదాన్ని పొందాలనీ
మిత్రత శత్రుత ఎల్ల కాలం ఉండేవి కావు ప్రజ్ఞా బలం ముందు
బతుకులో సులభంగా మరపున బడేను, మానవీయం మానవత

అనివార్యమయిన చీకటిని శాలువలా కప్పుకొనీ
జరిగే సన్మానం తలచి, తృప్తి పడేరు అల్పులు
రాత్రిని వీడని వారు వెన్నెలపై మోజుతో
భయం లేని ప్రియ దృశ్యంలో గడిపేరు
దూరం నుండి కెరటాలతో జలధి పూలతోటలా
బ్రతుకులో రక్తిని నిలిపేను, శక్తిని ప్రకటించేను

# 18. ప్రాచీనం కావచ్చు

అది పట్టు వస్త్రమే కావచ్చు! ప్రాచీనం అయి ఉండవచ్చు
అక్కడక్కడ చినుగులతో మాసికలతో కుట్లతో ఉండవచ్చు
గౌరవానికి అర్థంగా ఆత్మకు శాంతంగా ఉండవచ్చు
తన జీవితంతో మరొకటి స్వచ్ఛమైంది శుభ్రమైంది ఎన్నుకోవచ్చు
కాలం చెల్లినవి పనికిమాలినవి సంబంధం సాగించే రెందరో
ఇప్పటికే ఉపయోగకరం కానిది, ఆప్తంగా తప్పనిదిగ చూడబడేను

జీర్ణమైన శీర్ణమైన తమ అనుబంధం ఇంకా చిరకాలం సాగాలనీ
బ్రతికినంత కాలమేకాక ఆ తరువాత దాని భద్రత కాపాడాలనీ
జీవన గమ్యాన్ని బట్టి సమాజంలో మార్పులు గుర్తించక తప్పదు
దీనికి మనిషి ఎంత ఎత్తు ఎదిగినా శిఖరత ఒకనాటితో ఆగేది కాదు
వర్తమాన కాల తలాన్ని మరచేరు, ఎప్పటిదో ఆధారం గాలివాటుగా
ఉన్న స్థితికి సరిపోయే ముందుకు నడిపించే మార్పును మరచేరు

పచ్చని పైరులా పరచుకొని కనిపించాలనీ పెంపొందాలనీ
ఎర్రని అగ్నిలా దహన గుణంతో మనసును మెరపించాలనీ
ఎవరి ఇష్టం వారిది, పరులకు హాని జరగకుండా వరంగా
నగరం మస్తిష్కంపై నీలి మబ్బులు ఛాయలు పరచాలనీ
మెరపు తీగెలను గగన మంత పరచాలనీ
స్వేచ్ఛకు ప్రతీక అయినవి నిలుస్తాయి వెలుగుతూ
మార్పు ముఖ్యం ప్రగతికెంతో అవసరమైంది ఎప్పుడైనా
పలకలేని బండలు శిల్పాలై ఆకర్షణతో నిలవాలనీ

లేనిది ఉన్నదిగా ఎంతకాలం భ్రమింపజేసేరు
ఎండల ఉద్రగత వాన చినుకులతో అలంకృతం కావాలనీ
పాత సుస్థితిని మన్నించడమొక ఎత్తు
అవి సుఖానికీ భిన్నంగా వాడుకలో ఉండడమొక తీరు
మార్పుకు ప్రాధాన్యంతో ప్రగతి క్రమం భవితను తీర్చేను
కొత్తదనంతో మార్పు ఉత్సాహ మయంచేసేను

రుతువుల మార్పు కాల గమనంలో సహజం
సామాజిక చింతనలో దీని ప్రమేయమెంతో దాచబడీ
అబద్ధాన్ని ఎంతకాలం కల్పనలో దాచేసి
క్షేమం అనీ భద్రత అనీ చిరకాలం బోనులో

గుడ్డి నమ్మకాలను తొలగచేసే ఆలోచనతో
కవిత ముందు వరసలో ప్రముఖంగా నిలిచేను

బాధల్ని అలంకారాలుగా ఎన్నడం ఒక విషయం
కష్టాలలో బ్రతుకులు గానుగలా తిరగం ఒక ఎత్తు
మనుషుల్ని విషమ స్థితుల్లో జడత ఆవహించడం
ఎవరికీ ఇష్టం కాదు, మానస వికాసానికి అవరోధం

వాహనంలో వేగం తొందరగా గమ్యం చేరాలని
అతివేగం అనవధానత నిద్రలేమి కునుకుతో ప్రమాదాలు

# 19. నిశీధి స్వరం

రాత్రి వేళ పాట మోదమో ఖేదమో నిషేదం లేదు
అది తన ప్రసార రేఖను తప్పనిదై గాలిలో
జీవితాన అనుభవ ప్రకారాల ప్రపంచమొకటే
సమయం సంఘటనల ప్రభావాలు వేరుకావచ్చు

వెలుతురులో తలుపులు తెరవబడినట్లు
చీకటిలో తలుపులు మూయబడి ఉండేను

ఉదయం జారిన బాష్ప బిందువులో అనల చిత్రం
వేదనలో రేఖల మధ్య మంచు చారలు మెరసేను
శోక తప్త హృదయంతో జలదం కదలుతుంది
ఆయా చోట్ల కవితలో అన్నిటికీ ప్రవేశం అవసరం
ఎవరి పనిలో వారు క్రిందినుండి పైస్థాయి వరకు
శ్రమ జీవన సంకేతాలతో సర్వం విశ్వమయ మయ్యేను

కఠినత క్రూరత సంకుచితం అధికారం ప్రేమ హింస
నిశితమైన మారణ చర్యలు ఇవి ప్రాధమికాలు
నిజం నిప్పు కాదు, ఎన్ని ప్రతీకలుగానో భాసించేను
సమాజంలో ఈ విషయంపై మాట్లాడని వారు లేరు
స్వార్ధం ఓడదు, ఎప్పటికపుడు దృక్పథం మారేను
తన అభిమానం తాకట్టు పెట్టవలసి రావచ్చు

అనుక్షణం రూపం రంగు రుచి గమ్యం మారవచ్చు
ఎప్పటికపుడు బ్రతుకులో, ఏది నిజం ప్రశ్న కలుగుతుంది

శక్తి కన్న యుక్తికి బలం జాస్తి వ్యవహారంలో
ఇచట వెలుతురు మతికి స్థానం లేనట్లు ఉంటుంది
మోదమో ఖేదమో కీలకం! మనిషిలోనే ఉంటుంది
ఏకాంతం సామూహికం ఎవరైన ఎందరైనా కానీ

స్వతంత్రమైన జీవితం స్వేచ్ఛలో పయనించేను
వీధిలో నకిలీ నిజం, నిర్భయంగా నిరాటంకంగా

రాత్రి నభిలషిస్తూ చీకటిని కోరే వారెందరో?
ఇది నిద్రకు మంచి ఉపాయమనీ వీలైందనీ

వెలుగులో నుండి చీకటిలోకి విరామం కోసమా?
ఏదో అవాలని కోరి, ఇంకొకటి అయ్యేరు కొందరు
పగలు నుండి రాత్రికి అవసర యానమే అవుతుంది
ఒక దాని వెనుక మరొకటి రెండూ తప్పని భాగాలై

## 20. చీకటి మాటలు

రాజకీయ సమావేశ వేదికపై హాజరయిన నేతల వలె
తళ తళలాడే వెలుగుల సంరంభంలో చుక్కలు
రాత్రి వేళ చీకటి మాటలు వినిపిస్తాయి
ఎక్కడెక్కడివో మధ్యలో కలుసుకొని ఆకట్టుకుంటాయి

కొందరికి రాత్రి ఆగమనం జాడలతోనే నిదుర పట్టేను
పగలంతా పనిచేసిన శ్రమ జీవుల కనురెప్పలు వాలడమే

వీధిన కుక్కల అరపులు కొందరి నిద్రను భంగించేను
ఆ రోజున శ్రమ విలువలపై చర్చలు అందరిలో
నిద్రాభంగంతో పాటుగ దొంగల భయభావం
తూగాడే మనష్యులెందరో సమాజ చక్రాల కింద
నలిగిన బ్రతుకులతో సామాన్యుల మూల్గులు సన్నగా
తెలవారితేనే తెలిసేది, నిశీధి జరిగిన విషాద ఘటనలు

పగలంతా రాజకీయ ప్రసారాలతో గడచే వారికి
ఆరోజున వ్యవహారాలపైన ఫలితాలపైన ఊహాగానాలు
రాత్రి ఆకతాయిల చర్యలపై చర్చలు పగలంతా ఉండేవే
రోజూ ఉన్నదే; షరా మామూలే, ఎవరి వర్షన్ వారిది
చిన్ననాటి మిత్రం కనబడితే దారిలో హఠాత్తుగా
లోని స్నేహ వల్లి పూలను చూపేను రాల్చేను

ఎవరి ప్రయత్నం వారు చేయడం మానవ లక్షణం
తెలిసి తెచ్చుకున్న ముళ్ళ బాధ భరించడం ఒక విచిత్రం
మధురమైన జ్ఞాపకాలు మనసు తెరపైకి వచ్చేను
తనలో ప్రేమకు కావలసిన సహన కళను బోధించేను
ఒకరి తెలివి స్వంతమైనా, అందరికీ ఉపయోగపడేను
ప్రయోజనంలోనే మంచి చెడులను క్రాస్ చేసేరు

భూమితో ఘన సంబంధంతో కాలినడక యానం
అందరికీ ప్రియం మనసుకు రెక్కల నమర్చి పైకెగర చూచేరు

కష్టడిలో ఇనుప సంకెలతో నేరంలో ఖైదీ వలె
బయటికి వచ్చేందుకు ప్రయత్నాలెన్నో గుప్తంగా

హేతువుకు నిలవని చర్యలు అపాయ కరం కావచ్చు
కొందరికి మోదాన్ని ఇస్తే, కొందరికి బాధను పంచేను

# 21. వెన్నెలకై చీకటి

అనుకోనిది హఠాత్తుగా ఘన శబ్ద తీవ్రతకు
ఫలితం ఏమోకాని దేని పైన నైనా దుష్ప్రభావమే

దీని నెదుర్కొనే బలమైన వేళ్ళతో వృక్షం ఆపైన శిలలు
కొమ్మలు ఊగినా మూలాలు భద్రంగా స్థిరంగా
ఏ క్షతి లేకుండా మరు క్షణం చిన్న మార్పుతో ప్రశాంత స్థితిలో
మనిషి మనసు మాత్రం భయ విలోలం కంపితం

ఒక ప్రశ్నకు ఎదురు ప్రశ్నతో ఎదుర్కో చూచేరు కొందరు
ఫలితం ఏమోకాని తమ చతురత కనబరచేరు
సందిగ్ధంలో భ్రమించేరు ఇతరులను భ్రమింపచేసేరు
చెట్టుకు పూచిన పూలు పండ్లు అలంకారమా?
తనకేమో కాని అందరికి ఉపయోగం ఎంతో
ప్రతి వస్తువు అందరిదీ, వారి వారి అవసరాల మేరలలో

సమభావం సమన్యాయంతో శ్రమ చేతన గతిలో
విలువలపై దృష్టితో సమాజం సుందరతను పొందేను
ప్రతి మనిషిలో ఏదో చెట్టు నది గిరి ప్రాణికి చోటు
బింబ ప్రతిబింబ భావ చలనంలో జీవిత వాస్తవం

దిశల వైపు చేతులు చాచి ఆశామయంగా
అవని పై అడుగులతో మానవ నిజ యానం
తుపాన్ వస్తుంది ఎపుడో ఎడారిలో ముందస్తు భయాలతో
పెనుగాలికి అతల కుతలమై బీభత్స దృశ్యం మిగిలేను
నిద్రలో కలల వలె నైన సమస్యలను సరిదిద్ద వలసి ఉంటుంది
ఎన్నో ప్రశ్నలకు జవాబుగా పూల మాల మెడలో పడేనా?
ఎన్నిటికో సమాధానంగా బాకు ఎదను గాయపరచేనా?

ఆర్త రవంలో అనల గీతం సుళ్ళు తిరుగుతూ
విషాద చిత్రాలతో పంక్తులు పంక్తులుగా కవితలో
ఎవరి కెవరు సన్మానించేరో? అవమానించేరో? ఎందులకో
తెలియని అమాయకం! అంతా ఒక తమాషా, ఎవరి అభిరుచి వారిది

బాధా కరమైన స్థితిలో పలు గాయాలతో పగలు నిష్క్రమిస్తుందిరాత్రి
వస్తుంది అక్కడక్కడ వెలుగులతో, తడబడుతూ వెన్నెలకై చీకటి

# 22. నడకో వాహనమో

గాలి గోపురంలా మౌనం పలువురిని ఆకర్షించేను
ఇది దేనికీ సమాధానం కాదు ! కావలసింది క్రియ

ఎద్దుల బండిపై శిథిలమైన పాత వస్తువుల స్థానంలో
ఆచరణ శీలంతో అవసర నవ నిర్మాణం జరగక తప్పదు
గాలి ఆగదు! ముసు ముందుకు పోయేను దూసుకొనీ
మనిషిలో ఆలోచన ఆగదు, కొత్తది చేరేను

తుపాను భయం వీడి వ్యక్తిలో సమూహాలలో
జీవన రక్తి పెరిగేను, సమూహ శక్తి వెలిగేను

ఎవరు కోరేది వారికి తగిన వేళలో చేరాలని
మెజార్టి బలంతో నైతికం! మూడు పూలు ఆరు కాయలతో పొందాలని

కాలం దేశం మనుషులు జడమూ చేతన లోకం
ఏదో ఒక లోపంతో కొరతతో కొట్టు మిట్టాడేను మనిషి

శీతకాలం కోష్ణతకై పరితపించేను
ఎండకాలం జలబిందువుకై అల్లలనాడేను
వానకాలం వరదలు ముంపులతో ఘోష పడేను
వసంత కాలమొకటే తక్కువ ఆశలతో వచ్చేను

ఉదార సుందరతలకు తృప్తి రేఖల నందిస్తూ
నాదమయం చేసి ధ్వనిని, శబ్దాన్ని కవితగ మార్చేను

ఏదో ఒక దోషంతో తరుగై దీన హీన దశలతో
కాలం దేశం సంఘం బ్రతుకులు వ్యక్తులు తమ యత్నాలలో

ఒకటి లభిస్తే తీరితే దాని స్థానంలో మరొకటి
సృష్టిలో మనిషికి పూర్ణత లోపించే అవకాశాలతో
సాయం సంధ్య నుండి ఉదయ సంధ్య వరకు నిరోధాలు
ఒడ్డు నుండి ఒడ్డుకు చేరాలిసిన చీకటి దుర్గమాలు వలె

ఆశా రూపాలకు అనుభవ రమణీయాలు ప్రతీకలు
మనుషుల మనసుల నుండి విడుదలయి నటనలు చూపేను
మట్టితో రాతి వెండి స్వర్ణ పాత్రలు వివిధ తరగతులలో
రాత్రులు నల్లని తెల్లని సమయ సమయ సందర్భాలలో

పూర్ణత నిచ్చే కోరికలో బ్రతుకులతో వ్యవహారాలలో
ఏదయినా బ్రతుకులు ఆగవు, నడకో వాహనమో

## 23. ఇంకా మిగిలే ఉంది

పుట్టగనే శిశువు మర బొమ్మలా నడిచేనా?
కళ్ళు తెరచేను ప్రపంచం చూడాలని ఉబలాటం
ప్రపంచాన్ని ఆలోచనలోకి దింపేను, రమ్యంగా తోచేను
వర్తమాన మెంత రమణీయమో నిర్వచనానికి అందదు
జీవ రూపమెంత? ప్రియమో ఏ విలువలు పనికి రావు
ఈ ఉదయ క్షణంలో అందమైన కాలం కల్పనలకు వీలు లేదు

తక్కువగ చూచే మట్టి నుండి క్రియా శక్తి చేత
ఆశా రూపాలెన్నో భాగ్యాకృతులను పొందేను
ఈ భాగ్యం ఏదేని కావచ్చు వ్యాపకాలలో
అధికారం వ్యాపారం వ్యవహారం విద్య విజయం
మట్టినుండి పచ్చదనం నాల్గు చినుకులతో
మనిషిచే సమార్జమయ్యేను రెండు మాటలతో

ఎడారిలో 'ఒయాసిస్‌లా, సరసిలో కమలంలా
ప్రేమ ఎవరో ఒకరిపైన ఉంటే సరిపోదు
మనిషిలో వెచ్చని అనల తీగె పైకి కదలుతూ
పక్కనే సన్నని జలధార సరిస్తూ ఉండడం అవసరం
అసంతృప్తి హఠాత్తుగా ఏ మూల నుండో దూకుతుంది
ఉద్యమ చరణాలు విప్లవ యానంగా మారవచ్చు

చక్రం తిప్పుతూ ఎవరిపైనో ప్రయోగంలో
అరల మధ్య వేలు చిక్కుక పోయేనా?
విజయాశయ ఖడ్గాలయి ఒకరిపై మరొకరు
దూరం నుండి మరొకరు ఆయుధం వహించి
తప్పించుకొనే ప్రాణభయం ఉరిత్రాడుగ మారేనా?
ఉరిత్రాడు తెగి! హఠాత్తుగ నేలపైన పడేనా?

కవితకు పాత లేదు ఎప్పటికీ కొత్తగనే
మనో మయమై చేతనతో ఉదయ ప్రకాశం వలె
రోజు కొక డ్రెస్‌తో జీవితం ఎదురు పడేను ఎందరిదో
పలు రంగుల కలయికతో అందంగా దేనికదే సాటిగా

రాయాలకున్నది ఇంకా మిగిలే ఉంది! మదిలో
చేరాలనుకున్నది గమ్యం ! మిగిలే ఉంది కథలో

# 24. హృదయ వేదికపై

ఇంట్లో నుండి బయటికి అడుగు పడగానే
బయటి గేటు దాటానో లేదో, కారు హారన్
రోడ్ పై పరిచయం లేని ముఖం ఆకర్షకమై
నా వైపు అతడూ అతని వైపు నేను చూస్తూ
ఈ లోగ పరిచయ మున్న మనిషి "హాయ్" అంటూ !
ఇరువురు నాలో వేరు వేరు బింబాలను నింపేరు

నిశ్శబ్దం నుండి వీధి అపుడే తేరుకుంటూంది
ఇరువురికీ తమ తమ కథలను విప్పాలనీ చెప్పాలనీ
కానీ! ఉదయం కోలాహలంతో ఎవరికీ తీరిక లేదు
తీరిక వేళలు దొరికేది ఒక సాయం సంధ్యలోనే
ఎంత మంది కనిపించినా! ఎవరి ప్రపంచం వారిది
కథలో భాగాలను కోట్ చేయకుండా ఎవరు చెబుతారు

ఎవరికి వారు తమకు తగిన బరువుల్ని
ఎన్ను కోవడంతో ఆరోజు పని మొదలవుతుంది
జీవిత క్షేత్రాల్లో ఎక్కడ చూచినా పోటీలే
రోజు రోజుకీ నేతల నిర్ణయాలు మారేను

రాత్రి తాను కన్న కలను వినిపిస్తుంది ఒక చెట్టు
దారిన పోయే గాలికి ఏదో వినిపిస్తుంది ప్రతి పూవు

"శాంతిని కాపాడే విధి నిర్వహణంలో ప్రభుత్వం
ఇతరుల జోక్యం లేక, ఏ రోజూ నడవదు
ఎవరికి వారు మరొకరికి చెప్పాలని ఉంటుంది
చీకటి గదిలో గుప్తంగా ఉన్న వస్తువుల్లా తలచేరు
ఒకటొకటీ బయట పడేందుకు సిద్ధంగా
భూమి గగనం నిశ్శబ్దంగా, మనిషి మాత్రం హడావిడిగా

చెప్పాలనుకున్నది ఎప్పటికీ ఇంకా మిగిలే ఉంటుంది
ఇంకెన్నో విజయాలు మిగిలే ఉన్నాయి జరిగిన సమరంలో

కవితలో కలసి పోయే ప్రతి ఒకరూ సహృదయులు
కవితతో విభేదించే ప్రతి ఒకరు విమర్శకులు
విరామ సమయంలో గోడకు వేలాడే ఆయుధంతో
కవిత ప్రజల హృదయ వేదికపై నిలవాలనీ, ఫ్లవర్‌వేజ్‌లా

# 25. వేరు వేరు ఇన్నింగ్స్‌లో

రణ రంగంలో వీర విహారంలో గాయం లేకుండా
బయట పడిన వీరుల ప్రశంసలో పాలు పంచుకోవలసింది
అశ్వం కూడా ! నడకలో దాట్లతో చిత్రగతులతో
క్లిష్ట సమయాలలో క్షేమంగా రక్షణ కుపకరించేను

మనిషిలో పూర్ణిమ, శుక్లంలో తరుగులతో బహుళంలో
కాలంలో పక్షాలు జీవన సారూప్యం సాధర్మ్యం చూపేను
వెన్నెల హ్లాదం ఎండల తాపం అన్ని కలిసి విశ్వమయమై
అన్నిటికీ కీలకమైన పాత్రలో మానవం, విస్తృత లక్ష్యంతో

శుక్లంలో తెరచిన వెన్నెల తలుపులు
బహుళంలో మూసిన వెన్నెల తలుపులు
చీకటి నిద్రలో నిశ్శబ్దంగా అణగి మణగి
అన్నీ మానుష జీవన సంకేతాలతో నిండి

పగలు సింహాసన పీఠంపై కాలం
విస్ఫారిన ఆదిత్య హృదయ శక్తితో
శిశువు నుండి వృద్ధు వరకు
అందరిలో ఒక్కొక ప్రపంచం చూపట్టేను

మనిషి చూపు ఒకటే! చూపు కెదురుగా
అంటించిన చిచ్చు బుడ్డి నుండి వెలుగులు
రవ్వల రవ్వలుగా మతిలో జయ భావనతో
అందరికీ సందేశం ఉపదేశం ఆదేశం ఒకటే

రాత్రులు ఒక దీపంతో సరిపోదు
స్థలం స్థలానికీ కావాలి వేరు వేరుగా
ఎవరి మతి ప్రభతో వారు ఎవరి బాటలో వారు
అన్వయ గుణంలో వేరు వేరు లక్ష్యాలతో
మాటలో దూర దూరం వెలుగులతో మనుషులు
ఇది ఎవరికీ పంచ బడేది కాదు, వ్యక్తిలో స్వంతం

కాలమేదయినా వ్యవహార క్షేత్ర పరిమితులలో
బ్రతుకుల ఎక్కువ తక్కువలు కొలవడానికి
తూకపు రాళ్లు లేవు, మానస కొలమానంతోనే
శైశవం బాల్యం వృద్ధాప్యం ఇన్నింగ్స్ వేరువేరుగా

# 26. వేషం బహుకొత్తగా

ఒక ఇన్నింగ్స్‌తో ఈ ఆట సమాప్తి కాదు
ఏ దశలో జరిగేది పోస్ట్ పోన్ అవదు
అనూహ్యామో విపరీతమో ఆటంక మయితే తప్ప
అదీ! ఎక్స్‌పర్ట్‌లు నిరీక్షించి పరీక్షించి నిర్ణయిస్తేనే
అన్నీ సజావుగా సాగితేనే ఆట సాగే అవకాశం
ఇది జీవిత వాస్తవానికి అన్వయించే సందర్భం

ఒక దోషం ఒక లోపం సరిచేసే లోపల బ్రతుకులో
మరొకటి ఎదురై పరీక్షకు గురి చేయవచ్చు
అవనిపై ఇనుప పట్టాలపైనొ, గగనాన పవన పథంలోనో
జల తలంపైనొ నేలపై రహదారో ! అన్నీ కావలసినవే

అన్నిటినీ తన వశం చేసుకొన్న మనిషిలో
స్వప్నం సాకారమై మనిషిని వాస్తవ శిఖరంపై నిలిపేను

భువిలో యధార్ధ ఖండం దివిలో స్వప్న శకలం
రెండిటినీ బుజాలపై కావడిలో సమానంగా
శిలలు ఎండలకు అగ్ని శిఖలయితే
వెన్న ముద్దలు ప్రవాహ రూపం వహించేను

అతీత చేతనపై ఇంకా దృష్టి పడవలసి ఉంది
ఇది వ్యక్తిలో వికాస కళతో స్వీయ పూర్ణమయింది

జీవితంలో తన దృక్ దిశాలోక మయింది
వ్యక్తి – సమాజం బంధంతో జరగవలసినదెంతో
దరిద్రం కొండలవలె కఠినమై అట్లాగే ఉంది
శుష్కత ఎక్కడికక్కడ ఎడారి శకలాలను తలపించేను

న్యాయం ముళ్ళ కంచెలు అటో ఇటో జరుపబడేను
ధర్మం చెట్టు నీడలా ఏ వైపునయిన తిరగవచ్చు
సత్యం ఎన్ని పొరల తెరల వెనకనో? రిహార్సల్స్‌లో
మనిషి పడేపాట్లు రేపు పడే ఓట్లు ఒకటైపోయేను
ప్రశ్నల తోరణంతో ఉగాది అడుగు పెట్టేను
ఆరు రుచుల పచ్చడితో స్వర్ణకలశం ఆకర్షణ
మేధ ఒక్కొక్క చోట తాకట్టుగనో అమ్మకానికో
కాల పురుషుని వేషం బహు కొత్తగా ఉన్న స్థితికి తగీ

# 27. త్రివర్ణ శోభాకరాలు

వేదికపై అగ్ని బదులు ప్రకాశాన్ని కోరేరు ప్రజలు
అతీతం పై దృష్టి కన్న సామాన్యుల అవసరాల్ని చూపేరు
ఎంత ఎత్తు ఎగిరినా పక్షి ఆకాశం ఇంకా పైపైకి
మనిషిలో ఆశల్ని పెంచి శూన్యంలో వదలేను

మనిషిలో సమన్వయంతో ప్రయత్న గుణంలో
ఎప్పటి కయినా ప్రయోజనం కలగక పోయేనా? అని

ప్రాణ భయం పయనానికి అడ్డుగ నిలచినా కొందరు
అతీతమయిన సన్నని వెలుతురు దారి చూపేననే

మనిషిలో జీవ భూతమయిన చేతన సార్ధకంగా
గుణ శీలంతో విరిసిన మానవ పూర్ణ తేజం
దర్శన మయ్యే దాకా యానం సాగ వలసిందే
అవిచ్ఛినంగా 'నేను-నీవు' అందరితో నవ సమాజంకై

జడత ఒకరి కోరికపై నిలచేది కాదు
చేతన ఎవరి ఆజ్ఞపై కదలేది కాదు

జలధి అలలు ముందుకు సాగి తీరాన ఇసుకపై
పాద ముద్రలను చెరపి వేస్తూ మరలేను
గట్టు పైన పచ్చని చెట్లను స్పృశించి విస్తరించేను
గలగలమని హృదయం విప్పి మాటలాడేను

ప్రకృతి నుండి మనిషి నేర్వదగింది
ఇంతనా? అంతనా ? ఎంతో? ఎప్పటికీ
గాలి పటానికి స్వేచ్ఛ ఉన్నా దాని నెగురవేసే
దూకించే ఆడించే నైపుణి గల చేతులవసరం
కవితకు ప్రేరణం సమాజ చలన రూపం అయినా
ఆశయ సాధనలో నవ జీవన యత్రాలను తలపిస్తుంది

మండే అనలం నుండి భగభగలో రాగం వినిపిస్తుంది
ఇది బాధలో వేదనా శకల మవుతుంది మనసులో
కురిసే మేఘం నుండి జలజలలో రాగం వినిపిస్తుంది
ఇది రసాకృతులను క్రిందికి దింపుతుంది

కవితలో ప్రకృతి వ్యక్తి సమాజం కలిసిన
మానవ శక్తి పతాక త్రివర్ణ శోభాకరాలు

# 28. కవితలో జలదం/జలజం

గగనంలో కనిపించే జలదం సరసిలోన చూచే జలజం
రెండూ దివి నుండి భువిలో జీవన చలనంలో ప్రతీకలు
దాహం తీర్చే ప్రాణాధారం అయినదొకటీ
హ్లాదం కూర్చే ఆలోచన కింపయిన దొకటీ

తాగే నీరు ఇచ్చే జలదం, కళా మయం జలజం
రూపం సుందరతలతో పరిమళ సంస్కరణలతో

వీటికి తోడుగ మనిషి ముఖానికి మాట ఒక ఆకర్షణ
ఎప్పటికీ చేతలకు దీప్తి నిచ్చే అమూల్యమైన వరం

ఏ రాజకీయ వ్యవహారం, బండ రాయి కాకూడదు
సముద్ర మెంతటిదయినా మనిషి దాహం తీర్చలేదు

ఎన్ని ప్రజ్ఞలున్నా! ఎన్ని రెక్కలు అతికించుకున్నా మనిషి
హ్లాదనీయం చంద్రబింబం హృదయాన్ని స్పృశించలేదు

జ్ఞాపకాలు పాతవయినా మనో వేదికపై చేరతాయి
ఆరు బయట వెన్నెలలో రాత్రులు కవుల సమావేశం
శ్రోత లెందరు వచ్చినా పైన చుక్కలు లేంది శోభలేదు
ఆసీనులై ఎప్పటికీ చూచేరు వినేరు తళతళల ప్రశంసలతో
జలద హృదయం అభినవ కమలం రూపానికి కళకూ గుర్తులు
నవతకు కొలమానం అపూర్వం, స్థాయిలో భవితకు ప్రామిజ్

రాత్రి వేళ ఎప్పటివలె బిక్షువులు తమ స్థానాలలో
వీధి మూలన తమ నీడను కప్పుకొని నిద్రలో

పాలకుల మతులలో గడ్డకట్టిన నీటి పాయలు
పగుల గొట్టి, సరిచేయడమొక జన ఘనకార్యం
దీనికి ఉత్తేజంతో క్రియలో ఆచరణ శీల మవసరం
పరిష్కారం కాని సమస్య, పోరాటానికి దారి తీసేను

శ్రమకు మారే ఏ భేదం తెలియదు, అంతా ఒకటే
కర్షకులు కార్మికులు సామాన్యులు పనిమంతులు
ఆకలి తీర్చే సంపద పెంచే శ్రమ చేతన రూపాలు
వెన్నెల ఆలోచనా బింబం నుండి పగలుకు సహోదరి
జలదం జలజం రూపం కళలతో వ్యక్తిలో చిర వాస్తవం
ఇది సమాజ శ్రేయానికి దారితీసే అమూల్యమైన ఆదర్శం

# 29. మానవతను విరిచేరా?

ఒక చోటు నుండి మరో చోటుకు పగలు తిరిగి తిరిగి
సాయం కాలానికి పచ్చని చల్లని తరువుపై గూడుకు
చేరుతుంది, విశ్రమ స్వర కలనంతో అలవాటుగ
ఏరోజూ మనిషిని పోలిన జీవన శైలిని తలపించేను
స్మృతులకు సంస్కృతి పదంలో చేరే అర్హత అవసరం
దీని చేతనే కొన్ని మాత్రమే తలపుకు వస్తాయి నిలుస్తాయి

ఫాల తలంపై శ్రమ కేతన మెగురుతుంది
గాలికి రెపరెపలాడే జీవన లహరులతో
రాత్రులు తనకై ఇంట్లో ఎదురు చూచే పరివారం
తొలి మాపున వైయుక్తిక రాజకీయ సామాజికమైన
ముచ్చట్లకు వేదికయై ఆ సమయం ! తీరుబడిగా
ఒక విధంగా విరామ దశ కల్పనలకు తలుపులు తెరచేను

గతం లోని జ్ఞాపకాలు భవిత పైని ఆశలు
వర్తమాన జీవన మానస బంధంతో వాస్తవాలు
అందరికీ చెందినవీ శ్రమ జీవన ఘటనల
రాపిడిలో ఒరపిడిలో రాటు తేలిన మనసులు
మరుసటి రోజున ఉదయం నవనవంగా తోచేను
నిన్నటి చరిత్రను తలచే తీరిక ఎక్కడిది ? కోరిక ఉన్నా!

చీకటి వస్తుందని అందరికీ తెలిసిన విషయమే
అయినా మనసులో భయం! దాటరాని పెనుకొండలా
వెలుగుకై దీపం సిద్ధం చేసుకొని ఉన్నా బ్రతుకునకు
దీని సహాయం కొంత వరకే, బయట అనుమానమే

చీకటిలో గుండెపై బరువు నిలిచినట్లు ఉంటుంది
ఏ దొంగో ! ఏ పామో ఎదుట శూన్యంలో భయ రూపాలతో

ఎదురుగ సృజన లోకం పూవు ఫలం కవిత మరెన్నో
వెన్నెలలో దృశ్యం మనసును హ్లాదంతో తేలిక పరచేను

వ్యక్తిలో ప్రతి భావ రూపం విజయానికి తోడ్పడేను, అవసరంలో
సమాజంలో ప్రతి ఘటన ప్రకృతిలో వస్తువుతో సంప్రదించేను
క్షితిజంలో ఆలోచనా దృశ్యాలొకటొకటీ అస్తమయ వేళల
భయాక్రాంతమై మనస్సు అడుగులు వెనక్కి పడేనా? మానవతను విరిచేరా?

# 30. అంతా ఒకే

బయటి ప్రపంచాన్ని వీక్షిస్తూ పరవశతలో తనను మరచి
ఒక చోట మహా శిలను చూచి శక్తిని తలపోస్తూ ఆలోచనలో
పర్వతమై పోవాలని ఆఖరికి శిల్పమై బ్రతకాలని
ఒకచోట జలాశయం చూచి తాపంలో
ఆర్ద్రతకు మెచ్చుకుంటూ మహా నదియై సాగాలని
సుమ ఫలాలను చూచి తరువయి నిలచి పోవాలని

వెన్నెలలో హ్లాదంతో పైని చంద్ర బింబమై వెలగాలని
ఇంటికి మరలి లోనికి వెళ్ళగనే అన్ని మరపున బడేను
తానొక్కడే తన రూపం భద్రంగా, కిటికి నుండి చూస్తే
ఎక్కడి వస్తువులక్కడే తన రూపమదే ఆల్ రైట్
అన్ని భద్రంగా దేని స్థానంలో అది సంతోషంగా
చుక్కలెన్నో ఎన్నిసార్లో లెక్కపెట్టుకోవడం జరిగేను

తానొక ఆయుధమై చర్యకు దిగే కన్నా ఎప్పటికీ
అది తన అదుపులో ఉండడమే నయమనిపిస్తుంది
ప్రయోజనంలో సులభంగా నిర్వహణంలో సుగమంగా
బాధ్యత మరొకరిపై తాను మాత్రం ముక్తమయ్యేను
వెలుతురులో సూటిదనం సుందరతలు విజయానికి దగ్గరగా
చీకటిలో మాయకు మర్మానికి వీలుగ! అనుమానంలో

బయటికి కనిపించని గాయం
లోన మచ్చగా మిగులుతుంది
పూర్వ ఘటనను జ్ఞాపకం చేస్తుంది
మాటలు కావచ్చు చర్యలు కావచ్చు
శిలలు తాము ఉన్నచోటునే బలంగా
నదులు అలల బలంతో మరో చోటుకు

సిద్ధాంతాలు ఆదర్శాలు బుజాలపై శాలువాల్లా వేలాడుతూ
ఎంత దూరం వెళ్ళినా, కావలసింది దూర దూరం జరిగేను
పెరిగే ధరలతో వస్తువులు, వసించే భూమి నుండి
తినే ఆహారంతో కొద్దిపాటు సామాన్యాల వరకూ
తుపానులో కుంభవృష్టి అవసరాలను మీరి ఆపైన
ఎండలలో చండ శిఖలు అగ్నికి బంధువులై పోయేరా?

# 31. అమృత ఘడియ

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన – పొందిన అమృత ఘడియ
అర్ధరాత్రి శాంతమైన రాజకీయ స్థితిలో సుందరంగా
మరు నాడు ఉదయ పాద ముద్రలతో కొత్త చరిత్రకు
శ్రీకారం మొదలు చీకటిలో వెలుగు చిత్ర ప్రసారాలతో

ప్రజాస్వామ్య బంధువులందరికీ సంతోష వార్తా విభవం
చేతిలో ఆశల మూటతో హృదయంలో పరిష్కార పదం

చీకటి మూటలో ఏముందో? ఉదయం కిరణం విప్పేను
వెలుతురు స్పర్శతో చరిత్ర పుటలో చేరిన శాంతి దీప్తితో
ఆ సమయం మేల్కొని ఉన్న ప్రతి ఒక్కరిలో రవి బింబం వేచి
భళ్ళున తెల్లవార గానే శూన్యాన్ని సంపన్నం చేసేను కాలం

ఏ మార్పు! ఎందరిలో ఏ మేరకు ! ఏ విధంగా ?
మానవ పయనంలో, పాలనలో భాగస్వామ్యంతో ప్రజలు

పూలతో హత్తిన గాయాలు, బాధకు బదులుగా
స్వతంత్రమైన భావ జాలంతో వసంత శోభను కూర్చేను
పాలకులకు పాలితులతో నేరుగ సంబంధం శ్రేయమై
జడాకృతుల నుండి చైతన్య రూపాలకు పరివర్తనం

కర్తవ్యంలో పెరిగిన బాధ్యతతో చక్కని అనుభవం
పౌరుల ముఖాన కుసుమ గుచ్ఛంపై ఆకర్షణ వెలిగేను

వికాస రూపానికి సుగమ పథ మంటూ లేదు
శ్రమ జీవన లోకంలో కీర్తి శిఖరం ! మనిషే

వెలిగే మనిషి వెనక నీడ చల్లని నీడకు నిలయమై
నిన్నటిదే అయినా దృష్టి భేదంలో మార్పు వరణీయం
స్వేచ్ఛగా తోడుగా నడచే మనుషుల నడతలో
క్రితం రోజు లేని సుగంధంతో, ఈ రోజున కిర్మీరం

ఏ కొద్ది మంది సుఖము క్షేమం ప్రధానం కాదు
ఏ తరగతి లోని ప్రజలకో పట్టం కట్టడం కాదు
రాజ శబ్దం కనుమరుగై సింహాసనాలు కిరీటాలు
వేదికపై నుండి దొరలేను, చీకటి లోయలోకి

కెరట మెంత ఎత్తు ఎగసినా, గట్టు దాట నీయని రాజ్యాంగం
రాజ్యాంగ వ్యవస్థల యశోరూపాల స్వచ్ఛతయే, జన సంకల్పం

# 32. నిర్భయంగా హ్లాదంగా

జలధి మధ్యలో నావ ఆపద జరిగితే దురదృష్టం అవును!
బ్రతికి బయట పడితేనో ! అదృష్టం, ఇవి రెండూ తప్పవు
మరొకరు కార్యకళా శీలురు ఊహ చేయలేని వారూ ఉన్నారు!
తమ తమ పనులలో మగ్నమై కాలాన్ని శాసించేవారూ ఉన్నారు

ఇంత పెద్ద జలాకృతికి చెలియలి కట్ట చెట్లతో రాళ్ళతో సన్నగాఅలల
దూకుడు ఉధృతిని కట్టడి చేసేరు ఒడుపుగా మట్టితో

అసలు జీవితమే అంత! నేర్పుగ నడిపే పుష్పక విమానం
లోనుండి వచ్చేవారు, లోపలికి వెళ్లేవారు రాకపోకలతో

లోన ఉన్న బడబాగ్ని సంగతి ఎవరికి తెలుసు ?
బయటి చల్లదనం మాత్రమే అనుభవంలో చేరేను
నిరంతరం చలనంలో ఉండే కడలి మౌనం వహించే ప్రశ్నలేదు
మంచు శిలలు మౌనంలో ప్రవాహానికే మొగ్గు చూపేను

మనిషికి ఎటువెళ్ళినా నలు వైపుల సముద్రాలు!
పరచిన ఆశారూపంలో సృజన కారణ మేఘ బృందంతో
భూమిపై మనిషి ! జీవశక్తితో ప్రతిభతో అన్నీ తన వశం కోరేను
ఇది పొందే సంకల్పంతో ప్రయత్నంలో పొందేను అనుభవ ఫలాలు

కడలి పాట పాడుతుంది చిరుగాలి తరగలపై
పెనుఘోషతో అపుడపుడూ బీభత్సదృశ్యం చూపిస్తుంది

అలజడి లేకుండా భౌతిక మానస స్థాయిలలో
సమాజ చరిత్ర లేదు, మనుషుల అస్తితలు లేవు

అలల వలె కదలికలతో మనుషుల బ్రతుకులు
నింగి వైపు చూచేను, ఉపాయంకై ప్రజ్ఞా బలంతో
మోసం దొంగతనం ఏవీ నేరం కాకపోయేను సామాన్యాలై
ఇవి తెలివితో నిపుణత క్రిందనే ఇపుడు జమ అయ్యేను

సముద్ర తీరం వెళితే జల దృశ్యం చూచేందుకు
చకితంగా మెరపు తీగెతో ఎదురుగ ఒడ్డున
జలాల అంచున 'సింహం' పైకి దూక బోయేదిగా
చక్కని ఫోటోను చేతి కందించేను, నిర్భయంగా

కాసేపు విరామంతో దిశల వైపు చూస్తే కాస్త దూరాన
అందంగా గంతులేస్తూ తిరిగే జింకల గుంపు, గుండెకు హ్లాదంగా

# 33. ఏదయినా కావచ్చు

జగత్తులో దేనికీ పనికి రాని మనుషులున్నారా?
కావలసిన వస్తువులున్నాయా? మనిషిలో నిరీక్షణం

ఉదయ కిరణంతో ఎదురుగా ఎందరో ఎన్నో?
మనుషులతో వస్తువు లెన్నో! అవసరానికి ప్రత్యక్షం
ఏదో ఒకటి బదులుగ ప్రత్యామ్నాయ మవసరమయ్యేను
జీవన చలనంలో సమాజ వ్యవహారాలలో "డబ్బు" పాత్ర అమేయం

ఉపయోగానికి వచ్చే ఉదార వర్తనలో మనిషి వస్తువు
అవసర భూమికలో ! ఉపకృతి కవకాశాలెక్కువగా
స్వార్థ చింతనలేని సందర్భాలెన్నో మనిషిలో గుప్తంగా
బయట పడని దల్లా, విజయ భావనతో అంకిత హృదయం

శ్రమ చక్రం అరలపై చుట్టూ తిరిగేను మనుషులు
ఉదయం నుండి సాయం వరకు జీవన గమనంలో

పనికి తగిన వివిధ స్థాయిలలో భేదాలలో తరగతులెన్నో
వ్యక్తి నుండి సమాజం వరకు, పాతది మార్చేరు కొత్తగా తీర్చేరు

శూన్యంలో మొదలైన శ్రమ జీవనం విలువలు
చెలమల నుండి ప్రవాహ రూపంలో సరించేను

పచ్చని ఆలోచనలో తెల్లని అనుభవంతో
సమాంతర పయనంలో సమన్యాయం కోరేరు

ప్రతి ఒక్కరు స్వార్థం బుజాలపైన సవారీకి తలపడేరు
తమ నీతిని నిజాయితీని నిలయ స్తంభాలుగ వాడుకునేరు

కాలానికొక సుందర శ్రమ ఫలంగా తలచేరు
ప్రతి ఒక్కరినీ అందల మెక్కించలేని స్వేచ్ఛ ఎదురుగా

దొరికిన వాహనమో కాలి నడకో పయనం సాగించేరు
మదిలో కోరిక శుభ్రమైన గాలికి బాగా తెలుస్తుంది

కవితలో అంచనా తప్పదనే అందరి విశ్వాసం
ఊహ నుండి వాస్తవానికి పయనింపజేసేను

చీకటిలో ఆశయానికి మలగని అక్షర దీపం
వెలిగి తేనే అంకిత భావంతో విజయ రూపం

ఆశయంలో ఆశలు తలపై తిరగవచ్చు గుండ్రంగా
పైనుండి దీవెనలు రావచ్చు పిడుగులు పడవచ్చు! శూన్యం కావచ్చు

# 34. పవన వాహనంపై

ప్రతి శబ్దంలో ఒక్కొక్క భావ పరిమళం
తనలో విలీన పరచుకొనేను, కవిలో కవిత
మనో వాహనంపై కవితాయానం సమాజ చలనంతో
పరచుకొన్న విషయ చయం జన మతితో

ఉదయం కిరణం నుండి రాత్రి బల్బు వెలుగు వరకు
మనిషిలో అంతవరకు చేరిన సంస్కృతి శిఖరాలతో

భావన ప్రాణమయం బ్రతుకుతుంది అక్షరాకృతిలో
గాలి లేంది కదలిక లేదు స్పందన లేదు,
భూమిపై నిశ్శబ్దం పరచబడి ఉండవచ్చు
అణువణువు ఒదిగి ఒదిగి రస గుళికయై శబ్దం
భవితపై ఆశా రూపం చెదరిపోకుండా భద్రంగా
గతానికి చెల్లు చీటీ లేదు, అవసరం మేరకే ఉపయోగంలో

అక్షర ప్రపంచం ప్రత్యేకంగా కవిచే విశిష్టంగా వెడలేను
సరికొత్త భావ చలనానుభవం ఏ ఒకరికో కాదు, అందరికీ
ఎన్ని మార్పులపైనో జరగుతుంది చేతిలో ఆయుధం
మనిషిగా మారడం! మదిలో ఊహ "ఏదిశలో సాగేదీ!"
రవి కిరణాలకు అడ్డు వచ్చే మబ్బులు మంచు తెరలు
కవి ప్రతిభలో తేజం, కవితలో వరమై పనిచేసేను

ప్రతి వ్యక్తి నుండి ప్రశ్నలన్నిటికీ సమాధానాలు లభించేనా?
పొందనివే ఎక్కువ, భుజాలపై శాలువాలా వేలాడుతూ

భాషా భేదాల నతిక్రమించి బ్రతుకుతుంది హృదయ వశమై
అక్షర చలనంలో మనిషి అవతరణం చీకటిలో దారిని చూపేను
హృదయం తీగెలపై స్వర ధుని నవ రసమయమై ప్రవహించేను
ఇదొక నిర్మల ప్రపంచం స్వార్థం ఎరగని అంకితభావ రమణీయం

మౌనంగా ఉన్న అక్షర రూపాలకు వాగ్విభవమిస్తూ
ఎక్కడెక్కడికో పద పంక్తులు మానసిక తలంపై
సుశిక్షిత పౌరుల వలె పచ్చదనాన్ని అభిలషించేను
శాంత వనంగా మార్చేను, సుమ ఫలాలు కెదురు చూచేను
మరొకరి ముఖం నుండి మాటలు అలల వలె తరలేను
గతంలో అస్తిత, పరంపరలో భాగమై, సంస్కృతి చేతనతో

## 35. అర్ధరాత్రి స్వతంత్ర దీప్తి

ఈ నిశీధి అర్ధరాత్రి దేశం చీలిన సందర్భం
ముక్కలు వేరయి స్వతంత్రమైన సర్వసత్తాకం
పలు రంగుల దారాలతో అల్లిన ఆకృతి
తరాల సంస్కృతి ప్రభతో స్వేచ్ఛా విజయం
శకలాలు సకలమై రూపానికి పూర్ణతలో వాస్తవ ఫలితం
శాంతి చక్ర భ్రమణంలో ఉత్తమ సమాజ దశ పర్యవసానం

మనిషిలో మానవం జీవ శక్తితో ప్రవహిస్తేనే
గమ్యంలో స్థానం చేరేది? అణువణువూ చేతనతో
రాజ్యాంగం మదిలో పథ నిర్దేశం చేసేను
జీవితాన సుస్థితిని పౌర హక్కులు కాపాడేను
జన శ్రేయో దాయకమైన ప్రజాస్వామ్య సామ్యవాదం
భారత చరిత్రలో భవితను నవ్యతతో తీర్చేను

అయితే తమ స్వార్ధానికో ఇష్టానికో అనుగుణంగా
రాజ్యాంగ వ్యవస్థల్ని తలక్రిందులుచేసే అఖండులు
ఏదో కారణంగా అర్ధరాత్రి విలువల్ని మార్చేసే నేతలు
రాజకీయాలను వ్యాపార సరళిగా తీర్చి దిద్దే ధోరణులు

నినాదాలకు తోడుగా విసరబడే రాళ్ళు
కఠిన హృదయ శకలాలను తలపించేను

ఎవరి పైన కక్ష ! అవతలి పక్షం వారు కూడ
మానవులే, హృదయ స్పందనం మరుగున పడింది అంతే
మానవతను మరచేరా! శిల్పాకృతుల్ని పొందేరా?
గాయంలో బాధకు ముందో, వెనకో సామాన్యుల వేదన
కలహం సమస్యను చిక్కు పడ జేస్తే
గాయం తోడై అగ్ని శిఖగ మార్చేను

విశ్వంలో సంతృప్తి రేఖ కనిపించేనా? లేదు
నిర్మాణంలో హృదయ తంత్రి "శాంతి" స్వరం పలికేను
లోన తోటలో పూల మొక్కలు కనిపించాలనీ
అవి పూలను పూసి మానవతను పరిమళించాలనీ
ఆయుధాలు మొలకెత్తే అశాంతికి సూచన కాకూడదు
భద్రతకో ! రక్షణకో! తోరణాని కిరువైపుల నిలిచేనా?
ముందు వెనుకలలో భేదం అఖాతంతో అదృశ్యమై
ప్రతి వస్తువుతో పనికి ఉపయోగంలో జనత భవితతో

# 36. విశ్వ బంధువై

నేను కవిని! పుష్పాలతో, కవిత! గాయాలను వహిస్తుంది
సూర్య కిరణ తేజస్సుతో జల ధునులను సరిస్తుంది
పవన వీచి ప్రాణిని స్పృశిస్తుంది, ఆయువుతో కదలిస్తుంది
సమయ సమయానికి మేఘ శకలం నింగి ఉనికి చాటేను
పుట్టుకను ఒక శాప మను కునేవారు లేకపోలేదు
బ్రతుకును దౌర్భాగ్యంగా తలచే వారు కోకొల్లలుగా

మనిషిలో దాగిన నిజశక్తులు తెలిసేది కవిత లోనే
తనకు తెలిసీ తెలియక చుట్టుకున్న బాధలతో
విశ్లేషణలో బయట పడేను రహస్యా లొకటొకటి
ప్రతి సంఘటన వెనక కారణ మొక వాస్తవ గతితో
హితకర ప్రకాశంతో కనిపించే సూర్యుని
హృదయంతో స్వేచ్ఛా కవిత ఒక కన్ను వేసి ఉంటుంది

శ్రమ పథంలో ఒదుగుతుంది ఆకాశం
జీవన రూపంలో నిండుతుంది భూభాగం

కాలి నడకలో యానం సాగినంత మేర
ప్రకృతిలో ఒక భాగమైన ఆలోచనలతో
నిలయం చేరగనే స్థిరతను కోరేను మనుషులతో
వాహన మయితే అది తన వశ మనిపించేను

ఈ కవితలో ప్రకృతిలో ప్రాణులెన్నిటితోనో
గుణంలో సామ్యం వర్తనలో విధం ఒకటిగ తోచేను
జగత్తులో వస్తువుల ప్రతి ఫలనంతో విశిష్టమై
మరో అక్షర జగతికి కారణమయ్యేను కొత్తగా

సమాజం ప్రకృతి ఏ వ్యక్తిని ఒంటరిగా ఉండనీయవు
ఎప్పటికీ తోడుగ నిలిచేను, పెంపుకు తోడ్పడేను

ఒక్కొక్క ప్రాణితో ఒక్కొకరికి మానవ సంబంధం
ఒక్కొక మనిషితో ప్రేమో స్నేహమో ఇష్టమో రాజకీయమో!
ఇవి జీవన జగతికి గభీరతను చూపేను మనుషులతో
ఇవి సృజనలో కవితకు విపులత వివిధత చేకూర్చేను

ఆధునిక జీవితంలో వస్తువులెన్నో మనిషి మనో బలంతో
అందరికి చెందినవై కాలానికతీతంగా నిలిచేను విశ్వబంధువై

స్వేచ్ఛా కవిత్వం - 124 II

# మేల్కొన్న కవిత

## రెండో భాగం

మాదిరాజు రంగారావు



2023

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

# 124 SWECCHA KAVITHVAM

## MELKONNA KAVITHA

**Part - II**

## మేల్కొన్న కవిత

**రెండో భాగం**

by

Prof. Maadiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Year of Publication 2023

*Presented to*
*my son*
*Dr. Santhosh Kumar*
*on*
*his Birth Day*
*with best wishes*

# అంతర్వీషయం

ఈ కృతి "మేల్కొన్న కవిత" రాత్రి ముగింపుతో రవి కిరణ ప్రసార దృశ్యంతో దృష్టికి వస్తుంది. సమాజం ప్రకృతి ఇరు పక్షాలతో మనో వికాసం విహరిస్తుంది. ఇది మనిషి – భూమి – జీవితం – కల్పన రేఖలతో వాస్తవ చిత్రణల్ని గమనించవచ్చు. వ్యక్తిలో ఆలోచనా ప్రపంచానికి ప్రతిబింబంగా వెలువడింది. ఇది రెండో భాగం.

జలదం సృజనకు ముఖ్య కారణమయింది. జలజం సుందరతకు, సుగంధానికి ప్రతీకగా నిర్వహింపబడింది. పైనుండి జలదం క్రింద జలజం రెండింటిని జీవితంలో విశాలమైన ప్రాతిపదికపై అవసరమైనవి, ఉన్నతికీ వికాసానికి తోడ్పడేవిగా భావితమైనవి.

లౌకిక జీవన కోణాలలోని, విశేషతల్ని భవితపై ఆశావహమైన ఆలోచనతో పాటు విస్మరింపరాని వర్తమానంపై అభిలాష, విశ్వాసం, శ్రద్ధ స్పష్టంగా కనిపిస్తుంది. ఇందులో సాధ్యమైనంతవరకు క్లిష్టతకవకాశం లేని ప్రసన్నమైన అభివ్యక్తిని కలిగింది.

రచనలో వస్తువు వ్యక్తుల జీవితం సమాజ వర్తనం ఆధారతలంగా ఉంది. ఇదే దీని వెనుక నుండి తాత్వికమైన భూమిక. ఇక ఆవిష్కారంలో కళాత్మకత సుగమమైన రచనతో ఆకర్షిస్తుంది. అటు పద్యం, గేయం, వచనం కాని స్థితిలో స్వేచ్ఛా సంచరణం. ఊపిరులకు ఆయువు నిస్తుంది. తన ప్రత్యేకతను కలిగింది. సృజనలో కవిత్వానికి అవసరమైన అంశాల్ని కలిగింది. కవిత్వ భాషను కలిగింది. ఇది స్వేచ్ఛా కవిత్వం.

దేనికది సహనం శాంతి తృప్తి ఆనందంతో సంపన్నమయింది. ఇందులో ఆధునిక యుగంలో విమర్శకులు ఆమోదించిన భావరూపాలు (Images) ప్రతీకలు (Symbols) ఉప చేతన (Sub-conscious) లో కదలే ధ్వని (Suggestion) సూచకమైన అభివ్యక్తితో చైతన్య స్రవంతి (Stream of consciousness) తో పాటు దార్శనికంలో ప్రజాస్వామ్య భావజాల పథంలో కవితాత్మ రూపం తీర్చబడింది. బహు ముఖీనమయిన విస్తృత ప్రాతిపదికపై అవతరించింది. ఆధునిక తెలుగు కవిత్వంలో దీని స్థానం ప్రజాస్వామ్య సామ్యవాద దార్శనిక నేపథ్యంలో చూడవలసి ఉంటుంది. సామాజిక, కళాత్మక, మనస్తత్వ, తాత్త్విక ఛాయలతో విశ్లేషణ కందుతూంది.

కవి మాటలు చేతనలో దీని ఆవిష్కారం ప్రత్యేకతను కలిగింది. విశేషతను భావింప చేస్తుంది. దైనందిన జీవితంలోని అనుభవ దృశ్యాలు సామాజిక రాజకీయ మనస్త్వ కోణాలలో చిత్రణం కనిపిస్తుంది. అనుభవ ముద్రలో తన విశేషతను ప్రకటిస్తుంది.

ఇందులో 1) జలద మదితో 2) జలజ హృదయంతో 3) కళాత్మకమైన 4) క్రియాశక్తి ప్రసారంతో ఆశాపూర్ణమైంది. సహృదయులకు సుస్వాగతం.

*ఇది సమాజ స్పందన చింతన కళతో, మానవీయమైన చేతన బింబం నవం"*
*సమభావనతో విశాలతను భిన్నతలను, పొందిన వాస్తవ దృశ్యం ! స్వేచ్ఛా రూపం"*

**– మాదిరాజు రంగారావు**

# మేల్కొన్న కవిత ( రెండో భాగం)

## II. 1. స్నేహ రాగం

స్నేహం తొలగిన సందర్భంలో మది నిప్పులు చెరగేను
కలహం ఆగిన సమయంలో హృదయం మల్లెలు విరిసేను
విషాద దృశ్యం చూచిన పరిసరాలు చీకటి క్రమ్మేను
యుద్ధంలో విజయంతో కోరే దేవరయినా, భాగ్యరాశి!

కడలి కెరటాల హార్మనీ మెట్లపై ధ్వని సారం
వినేవారికి బహు ఇష్టమైన వాద్యం వినిపించేను
ఇది వారి వారి మనో విభవ ప్రభావం తోనే
వారి జీవన ప్రపంచం వారిది! కళామయమై

మిత్రత్వం ముగిసి ఏర్పడే లోయ దాటరానిదై
అనిశ్చిత స్థితిలో చీకటి సందు చేసుకొనీ
దూకవచ్చు మింగవచ్చు అడ్రసు లేకుండా
మనుషుల వివేక జగత్తును కప్పి వేయవచ్చు

వైరంలో ఎవరు మొదట బాణం విడిచిందీ
గుప్తంగా ఎవరు మొదట ఎత్తుకు దింపిందీ
సహనం క్షమ శాంతి కరుణలన్నిటినీ వదలేసి
సన్యాసిగ కనిపించేను మనిషి ఎట్టెదురుగా

ఎవరి కెవరి సమ్మతితో పనిలేదు
స్వార్థంలో పీఠం గగనాకారంలొ తలపై
భేదంతో కలహం తీవ్రంలో ఉద్యమ పదం
రణంలో ఏమైనా జరగవచ్చు పై చేయికై

ఇది వ్యక్తుల పరిమితులు దాటవచ్చు
దేశాల నతిక్రమించి చీల వచ్చు ప్రపంచం

నేతల మనసులు రణ భావనతో పొంగవచ్చు
విశ్వం మెడలో అనల కణాల హారంమెరసేనా?
జన జీవన రూపం ధూమంతో చిత్రితమయ్యేనా?
మబ్బుల బదులుగ గగనంలో మృగతృష్ణలు కదలేనా?

విభేదాల నుండి మృత్యు చిత్ర రేఖలు తోచేనా?
బ్రతుకులో మనుషుల కోరిక! ప్రేమ కరుణతోనే సాధ్యం!
పగలు సూర్యుడు రాత్రి చంద్రుడు తమ వెలుగులతో
మనుషుల బ్రతుకుల నేలాలని చూచేరు! ప్రతీకలై జీవితమంతా

# II. 2. నిప్పుల మూటతో

కోపాన్ని అనలంగా మార్చే వీరులూ ఉన్నారు
వీరాన్ని విలయంగా తీర్చే యోధులూ ఉన్నారు

ఉదయం తొలి రవి కిరణం వలెనో
రాత్రులు తెరచిన బయటి కిటికినుండి
ఇంటి ముందు వీధి దీప కాంతి వలెనో
పారాచూట్‌లా దిగుతుంది కవిత! ఆలోచనలో

ఒక్కొక మారు సమయానికి కనిపించదు
చూచి చూచి అలికిడియై మెరపుతీగెలా
వెనుకకు తిరిగి చూస్తేనొ అక్కడే! చిరునవ్వుతో
అనుభవ ముద్రలో స్పందన హృదయంలో

అనుమానాలు సందేహాలు నిందలు ప్రశంసలు
పురస్కారాలు తిరస్కారాలు అపేక్షలు ఉపేక్షలు
ఏవేవో ఎన్నిటినో తప్పుకుంటూ దాటుతూ
వస్తుంది! భగ్నమైన దగ్ధమైన జీవన శకలమా?

అప్పటికీ వేచి ఉన్న కల! నిరీక్షణలో
రాబోయే లోపలనే! కవిత అడుగు పడేను
అడుగులు సాగుతూనే పరిమళ భావనలో
కను రెప్పలు వాలే స్థితిలో నాలో ఒకటై

అన్నిటికీ ఓర్పు ఎన్నిటిలోనో నేర్పు
ఉంటేనే తీర్పులో సమ న్యాయం జరిగేదీ

వర్తమాన పీఠంపై ఆశ ప్రతి కవికీ సహజం
యశస్సు భాగ్యం రెండు రెక్కలపై భూమినుండి
గగనానికి సుందరయానం చేసేను కవి
మట్టిని ఆదరించేను నింగిని గౌరవించేను

ఉదయం తలుపు తెరచి బయటికి వస్తే
బారెడు పొద్దు ఎక్కిందో లేదో
వీధులలో మనుషులు! బ్రతుకు తెరువులో
తారాడుతూ ఎవరికి వారు ఒంటరిగా
కొందరు పోరాడుతూ నినాద పంక్తులతో
ఆకలి నిప్పుల మూటతో పీడితులు ఎడారి శకలాలు

# II. 3. ఎప్పుడయినా ఎక్కడయినా

ఒక ఉత్ ప్లవనం మినహా అన్నిట ప్లస్‌లో అవకాశంతో
ఉన్న మనిషి పైకెగిరే రెక్కలు లేని లోపం ! దోషం కాదు
విమాన పయనంలో కోరిక అంచులు తాకేను
మతి విభవంలో వివేకం స్పందనతో హృదయ వశమై

స్వతంత్రంతో స్వేచ్ఛను పొందిన వ్యక్తి ప్రజాస్వామ్యంలో
ఎన్నిటికో ఇతరులపై, ఆధార పడవలసి రావచ్చు బ్రతుకులో

వ్యక్తి నుండి పరివారంలో ఒకరై ముద్దు ముద్దుగా
ఆపైన దీనిననుసరించి గుంపు నుండి సమాజంలో
సృష్టిలో ఎన్నిటి వస్తువుల ప్రతి బింబాలతోనో మందిలో
తనలో జీవ శక్తిచే మేధతో అంతఃకరణం నిశ్చలంగా

వీటిని కాపాడుకొనే విజ్ఞతలోపించి నేడు
దొషంతో మనిషి తన అస్తిత చెదరేను

అందరికీ తెలిసినదే ఎన్నో సమస్యల విషయాలు
తెలియని వారివలె వర్తించేరు ఎందరో స్వార్థంలో

సమాజ శ్రేయంకై బ్రతుకుల విలువలకై
ఎందరెన్ని ప్రయత్నాలో! ఒకటొకటీ వ్యర్థమై
ఎంత పరిచయమున్నా స్నేహమైన ప్రియమయినా
ఒకరిలో మరొకరికి తెలియని రహస్యాలెన్నొ

నిక్షేపంగా భద్రంగా తన జీవన పేటిలో
ఒకటొకటీ బయట పడేను అక్షర ట్రెజరీ నుండి

కవిత దీనికి భిన్నం కాదు, ఎంతోకొంత ప్రభావ రేఖలతో
కనిపించే మనిషి ముఖంలో మెరపు తీగె! చూపేను
ఏదో రహస్యం చెప్పబోయి ఆగినట్లుగ ఉంటుంది
ఎవరి అనుభవ సంపద వారిస్వంతం! అమూల్యం! పరిగుప్తం

పేదలైన ప్రజలు తాము అనాథలమనేది ఒక బాధ్యతగా
ఎవరికి తెలియాలి! ప్రజాస్వామ్యంలో పాలకులకా? విజ్ఞులకా?

తోటలో పూవుల వలె ఒకరికన్న మరొకరు విశిష్టంగా
మరో ప్రపంచం కొత్తది! ప్రతీకమయం! ఎట్టెదురుగా
ఒక పూవు అనుభవ మనిషిలో సరికొత్తగా
ఒక మనిషి ఆలోచన అవనికి పరిమితమై

జ్యోతిష చక్రంలో ఎన్ని బ్రతుకులో భద్రంగా
విశ్లేషణ పరిశీలనతో నిరీక్షణలో నిర్ణయం ! అంతరంగమే

# II. 4. వర్తమాన తలంపై

శిశిరం తన తలపై పూవు శోభ పొందాలని
చీకటి తన నొసటన జ్యోతి రేఖ వెలయాలని
సమయం సందర్భంతోనే దేని ఉపయోగమయినా
వెలుగు మాట లేని విషయంతో ఎవరికి ప్రయోజనం

కుసుమం బహు సున్నితం నవ వధువులా సుకుమారం
శిలా ప్రతిమ ఘనిష్ఠం అయినా సుమ సుమర్చితం

చెట్టు గుట్ట ఎదురెదురుగ విశాల మైదానంలో
ఎవరి నెవరు ముందు పలకరించాలని! సమస్య
గాలి మాత్రం బుజం తట్టి మాటలాడి ప్రియంగా
తన దారిన వెళ్లిపోతుంది వెనక్కి తిరిగి చూడకుండా

రవి కిరణంలా కవి ఆలోచన మేల్కొన్న కవితలో
ఎన్ని వస్తువులతోనో సంబంధం! అనివార్యాలయి

పూవును ప్రేమించినట్లు అనలకణాన్ని మన్నించేరు
రెండూ పూజలకు బ్రతుకునకు తమ దృష్టిలో అనితరాలు
మొదటి వరసలోనిది మనిషి శక్తికి తోడుగా
ప్రజల అనుభవ సంపదలో విడదీయరాని భాగమై

ఇవి స్థాయిని పెంచేవి సంస్కృతి చిహ్నాలయి నిలిచేను
ప్రతి బ్రతుకులో ఉత్సాహం ఉన్మేషంతో నడవ చేసేను

శిలను సయితం సమార్ద్ర పరుస్తూ పోయేను ప్రవాహం
ఎవరికీ దారి తప్పదు! పయనం మునుముందునకే

కవితలో ఆర్ద్రత తాపంలో వాన చినుకులు వలె
కళాత్మకతకు కుసుమం! ప్రయోజనానికి అనలం!
ఇరు కొసల మధ్య బ్రతుకులో నిరంతరంగా
సృజన విలయ మేళనంతో! ప్రతీకలై నిలిచేను

కవితలో సృజన కళ వసంత యశసును నిలుపుతుంది
ప్రవాహం తీరాన నడుస్తూ పోయే! వ్యక్తిలో
ఆలోచనకూ అనుభవానికీ మధ్య రుచిరమై
రసమయం మనసు కందేను వర్తమాన తలంపై

గతం కనిపించదు అయితే రిజర్వులో ఉన్నది
తెలియని కల్పనలో భవిత ! అనిశ్చయం

# II. 5. వినవలసిందే

వెలుగులు చేతన గుణ రూపాలు విజయానికి
అభిమానం ఉత్క్రమణం ఉత్సాహం ఉద్వేజం
బ్రతుకులో అనుక్షణం చేతన కవసరమవుతుంది
అభిలాష అభిరుచి ఇనుమడింపచేస్తుంది ప్రగతిలో

మాటలు గారడిలో తత్కాలం మెప్పించడం సులభం
దీని లక్ష్య మందరికీ తెలిసిందే! సమాజ చలనంలో

వస్తు సమితి నుండి శూన్యానికి చేరుస్తుంది
చీకటి శిఖరానికి నడిపిస్తుంది సస్నేహంగా
అక్కడి నుండి లోయలోకి సరాసరి చేరడం
లోకయాత్రలో మధ్య మధ్య పైకి వస్తూ జరిగేను

శిఖరం చేరిన సంతోషం కలగడం సహజం
ఎక్కడి వారచటే శిలాకృతి నయమనిపిస్తుంది

శాసనం పునాది మైలు రాయి విగ్రహం శిల్పం
కాలం గడచేందు కవకాశాలెన్నో! చుట్టూ
ఆయువు బలంతో చీకటి దూరం జరిగేను
వెలుగు లేని రాత్రి చీకటి ప్రభుతను నెరపేను
ఉదయ కరిణంతోనే విముక్తి! స్వేచ్ఛా జగంలోకి
వెలుతురు లెన్ని విధాలో మనో రూపాలన్ని విధాలు

దుస్తంత్రం కౌటిల్యం తీరు లెన్నో! చీకటులన్ని విధాలు
రంగులు గుర్తించేది చూపు! వెలుతురు లోనే!
విషాదం నుండి సంతోషానికి పయనం వెలుగుబాటలో
వెలుతురులో రవి హృవయం సుందర ప్రకాశ వాస్తవం

భూమిపై నడచే చంద్ర బింబ హృదయాలు లేకపోలేదు
జలధిలో పడవలా గగనంలో మేఘంలా హ్లాదంగా

మనుషు లెక్కడి వారక్కడే శిలాకృతులు నయమనిపించేను
రాత్రులు విషా ఛాయల నుండి తొలగేను రవి హృదయం
వెన్నెలతో చంద్ర బింబం ప్రసన్న గుణంతో మెరసేను
ఇవి తమ అదృష్ట బింబంగా తలచే వారు లేకపోలేదు

ప్రకృతి వైపు ఆకర్షణ ఇనుమడింప చేసేను
తత్కాలంలోనయితే చీకటి మాట వినవలసిందే

# II. 6. జాతకంలో

పూర్ణిమ వస్తుంది ! చుట్టపు చూపుగా
చూపులోని వెలుగు నిర్మల గుణ కళతో
మదిలో ప్రకాశ రూపం ఆలోచన మార్చేను
ఊయలపై మనసుకు కొంతసేపు ఊపేను

ఆలోచన ఆకాశ రూపాన్ని ఆవరించేను
సమాజ బంధువు చంద్రబింబం తన దారిన పోయేను

మనిషి అడుగులు నిలవ్వ కదలిక లోనే
భూమితో బంధం! ఒక మనోజ్ఞ వాస్తవం
కదలికలలో గమనంలో బ్రతుకులు దృశ్యంలో
జీవన రుచిలో లక్ష్యం సాధించే మతి విభవం

మనిషికి తన బ్రతుకు గురించి తెలిసిన విషయమే
ఎవరి అర్థం వారికి ప్రియం! అది ఏ విధమయినా

తమకేదో చేయాలని తమకేదో కావాలని
ఆశల మొలకలు చుట్టూ, కథలో కొత్త ప్రపంచం

తమతో పరివారం బంధుగణం పరిచయ సమూహాలు
ప్రాంతం దేశం విశ్వంతో దశదిశలు చుట్టుకొని ప్రజలు
ఎవరిపైనో దేని పైనో పిడుగు పడుతుంది
విచక్షణ కవకాశం లేనిది, నిర్ణయానికి వీలులేనిది

చీకటి ముఖమయినా వెలుగును కోరుతుంది
జీవన నదికి చీకటి ప్రసక్తి లేదు, చలన రూపమే

మనిషిలో నీటి ప్రవాహమయినా వెలుతురు ప్రసారమయినా
కత్తి వేటుకు ముక్కలు కాదు, తమంతట చీలవలసిందే

మంచి ఆశ మృత్యువు ఎరగదు అది చిరంజీవి
ఆగమనంతో స్థిరపడేను, మదిలో సద్భావ తరువై

సమస్యల తోరణంతో ఉద్యమానికి స్వాగతం
వర్షం సమస్యతో, జలదంకై ఎదురు చూచేరు

అవసరంలో కొత్త పంటకై ఎదురు చూచేరు
రాబోయే భవితకై ప్రణాళికలు వేసేరు
ఎవరికి వారు స్వేచ్ఛలో పరిమితుల వలయంలో
జాతకంలో చక్ర రేఖను క్షుణ్ణంగా పరిశీలిస్తూ

# II. 7. అర్థం ఆకాశ మంత

అన్నిటికీ పైన అంతరాత్మ సాక్షిగా
ఏ వ్యక్తి కెపుడు అవసరమయ్యేనో, తెలియదు
మనసుకు ఉజ్వలతను చేకూర్చేను ఆలోచన
మార్పులతో కొత్త కూర్పులతో అవసరమయ్యేను

తీరిక ఉండాలికాని, అవసరమనుకోవాలి కాని
సంస్మృతులలొకటొకటీ కదలిలో లహరుల వలె

సరసిలో చంద్రబింబం! సత్సంకల్పానికి చిహ్నం
చిరకాలపు బంధువు వెన్నెలతో సాదర రూపం
మనో వేదనకూ బాధలకూ హ్లాదకళల నద్దుతూ
ఎవరి వ్యధలు మరొకరెవరు పంచుకో గలరు?

జలధిలో సూర్యబింబం! తన ఉజ్వల ముఖం
చూడాలని, ఎవరికి ఆనందం కలిగేనో తెలియాలని

మొదటి కిరణం వెంట ప్రకాశంలా మేఘం నుండి మెరపులా
పుష్పంలో పరిమళం, తోడుగ సహచరి లా
సాక్షిగా ఉన్న అంతరంగం ఆకర్షణ రూపం,
ఏ వ్యక్తిలో! దృష్టి పడక పోవడం విచిత్రం

కవుల మనోరూపం ! విశేష స్థితిలో విభవంతో
ప్రియంగా నొసట వెలిగే జ్యోతిని కోరుతుంది చీకటి !

వర్తమాన సజీవ దృశ్యాలతో ఇదీ అక్షర నిలయం
అందరికీ స్వాగత చరణాలతో ఆనంద ముఖంతో
అందరికీ చెందినది రసభర ఘన బంధంతో
జీవితాన రుతువుల ప్రభావాన్ని వీడని సంచయం

మనసు తెరపై బింబించే అక్షర చిత్ర జగం
భేదాలను పక్కకు పెట్టి సూత్రాకృతిలో కవిత !

రాయికి తాను చినుకులకు చిగురించాలనీ
తనలోని సృజన మూలాన్ని ప్రకటించాలనీ
మోడుకు జలస్పర్శలో ఆకులతో గొడుగుకావాలనీ
కట్టెకు కొరవిగనై దహనకాండ చూపాలనీ
ఎవరెవరికెన్ని ఆశలో! అన్నిటినీ సాదించాలనీ
అన్ని ఒక చోట చేరితే సృష్టికి అర్థం ఆకాశమంత!

# II. 8. విరామ దశలో

ఒంటరిగా మొదలైన జీవితం అన్నిటికీ చోటుతో
సమూహం సమాజం అంచులు దాటుతూ పోయేను
ఎడారికి భయపడి మైదానంలో నిలిచిపోయేరా?
ప్రవాహాల్ని దాటలేక ఒడ్డున ఉండి పోయేరా?

అన్నిటిలో భాగస్వామ్యంతో మానుష విజయం
ఏ ఒకరిది కాదు కవిత, అందరిదీ ఉత్సాహ బలంతో

ఉత్సాహ శక్తిని వరించిన యత్నాలెన్నో
రాజ్యం నుండి బోజ్యం అవసరాల వరకు
కృషి ఫలం నుండి విజ్ఞాన శ్రేయం వరకు
వివిధ శ్రేణుల్లో కవితకు ప్రేరణలయ్యేను

ఎడారిని చూస్తే కలలు కనే మనస్సు
సస్య శ్యామల వనానికి ప్రణాళిక వేసేను

జల బిందువు కరువై స్పందన హృయంతో
రసాసార సుమ పరీమళాలతో స్వాగత మివ్వాలనీ
వర్ణనం వివరణం ఉపదేశం ఆదేశం ఉత్తేజం
ఆలోచనలో అనుభవ ప్రత్యేకతలతో కవిత

శూన్యాన్ని ప్రదర్శించే అవసరం వచ్చేనా?
ఎంతో వస్తు సంపదతో రాదనే సృజన కళతో

వృత్తులు పరంపరలో బ్రతికేవి! బ్రతికించేవి
తన ముందు జీవితంలో అనుకోకుండా
నాగలి కొడవలి వాహన యంత్రం అజేయంగా
సున్నకు అంకె చేరి విలువలు పెరిగేను

తుపానుకు అదరదు విప్లవానికి బెదరదు
సాగే ఉండే విధంగా తన ఉనికిని చాటేను

స్వేచ్ఛలో స్వతంత్రం! ఎవరి వ్యక్తిత్వం వారిది
అక్షర కవచంతో కవిత! వ్యక్తి హక్కు వినియోగం
సమాజ వికాస చరిత్రలో ఏ రోజూ వార్తలలో
పరిభ్రమిస్తూ దారులు వేరై సమస్యలతో
లక్ష్యం చేరే కోరిక పోస్టుపోన్ అయ్యేను
ఇంటికి విరామ దశలో ఆశాపూర్ణ హృదయంతో

# II. 9. మస్తిష్కం సంగతి

ప్రజ చేతనయే కవి ఆయువు నిండీ
అక్షర యోగంతో నాలో భౌతికం
ఇది మానవీయ భావనకు దూరం కాదు
ఇది సమాజ చింతనతో కళా మయం

గాయం అవుతుంది, మండుతుంది మదిలో
ప్రాణి వ్యక్తి సమాజం ఒక వరసలో వచ్చేను

రోజు తరువాత రోజు రావలసిందే భిన్నంగా
బుజాలపై కట్టెల మోపులా బరువులతో
ఇది అదనుగా వినీల గగనంలా చీకటి
మస్తిష్కంపై దిగాలని తలచేను, దిశల నుండి

రవి శశి వెన్నెల మిత్ర బలం ఉన్నది దేనికి?
మనిషికి మనిషి తోడు కాక మరెవరీ సమయంలో

పొంచి ఉన్న చీకటి ముక్కలు పక్షులను తలపించేను
ఎవరి జీవన పథం గమ్యం వారికి పరిమితం
అగ్ని కణం కాల్చేనని దూరం పెట్టేరా?
మబ్బు పిడుగు వదలేనని బహిష్కరించేరా?
తక్కువ నష్టంతో సమస్య తీరాలని చూచేరు
ఒక విజయంతో బ్రతుకులు ఊయెలపై ఊగాలనీ

పయనానికి గమ్యమేది లక్ష్యమెక్కడ? అంటే
వచ్చేదా? పైదా? ఆపైదారి మురిపించేనా? మరపించేనా?

సమయం శిఖరంపై నుండి ఏదో అదృశ్య హస్తం
మనిషిపై నమ్మకం అటూ ఇటూ జరుగుతూనే ఉంటుంది

“నిజం” నిర్ణయానికి క్షణం చాలు! చిత్తశుద్ధి ఉండాలి కాని
అభిలాషతో అభిమానం ఉండాలనికాని సమున్మేషంతో

క్షణక్షణం సుఖకరం అణువణువు స్వర్గ శకలం
కాళ్ళ మునివేళ్ళతో దిశాంచతాలను స్పృశించాలనీ
చూపులతో ఆకాశ నిలయాన్ని చుట్టి రావాలనీ
మస్తిష్కం సంగతి? భూగోళ భ్రమణం తెలిపేనా?

## II.10. దశదశలో

ఎక్కడెక్కడో తెగిపోయి విడిపోయే మబ్బుల్ని
గాలి కలుపుతుంది ఉపయోగంలోకి తెస్తుంది
వాన చినుకులతో సృజన లోని అందం ఇనుమడిస్తుంది
దాహం ఆకలి తీరే ఆశతో ప్రయోజనం సిద్ధిస్తుంది

ఇదే విధం! తాపం నుండి ఆర్ద్రానికి రసభరమై
కొత్తవైన మాట స్వరం బాట గమ్యంతో దార్శనికం

ఎక్కడుంది స్వర్గం ఎవరూ లేని పోని చోటులోనా?
సృజన కోరుతుంది భూమి! సుఖం కోరుతుంది బ్రతుకు

కలసివస్తే కాలం! తళతళ లాడుతుంది మనిషి ముఖం
మనిషి ప్రజ్ఞకు, శ్రమకు పతాకగా చేతనతో జయరూపం
అపుడపుడు తనకు తెలియకుండా మనసు మారవచ్చు
అపుడపుడు తనకు తెలిసినదే మది గతి తప్పవచ్చు

నడవడం వెలగడం తలచడంలో క్రియా మనోజ్ఞం
మనిషి వేసే అడుగులను బట్టి స్వర్గం అందబోవచ్చు

నిర్మాణ పరంపరలో ఇంకా పడి ఉన్నవి ఎప్పటివో శిథిలాలు
కష్టాలలో నష్టాలలో అపుడపుడు విషాదస్వరం వినిపించేను
కార్యజాల వ్యూహంలో మనసుకు తగిలే దెబ్బలెన్నొ
ఎవరి చేతనో విసరబడిన రాళ్ళకు మచ్చలైన గాయా లెన్నో

ఎవరికెవరు సానుభూతి చూపేది లేదు, పరి గుప్తంగా
    అందరూ ఏదో ఒక విధంగా ఉపాయాలలో బంధితులే

కనురెప్పలు వాలితే ఎవరి మనోజగం వారివరకు
కనురెప్పలు తెరిస్తే ఎదుట కఠోర వాస్తవ జీవితం
కాంతి మాసి శాంతి లేని బాధా దృశ్యాలు
మనో మూల గుణంతో విశ్వ భావనలో భాగాలు

వర్తమానం మరపున బడితే గతం లేదు, భవిత లేదు
బ్రతుకులు చీకటి శిలలై ఏ లోయలోనొ? జలధిలోనొ!

శాంతి శరణం భావనతో ఒకరు జీవించేరు
మార్పుపై చింతనకు కట్టుబడి ఒకరు నినదించేరు
సామాన్యమైన వేరు వేరు స్థాయిలలో కొందరు నడిపించేరు
భౌతిక క్షేత్రం నుండి ఉత్క్రమణం కోరెదెవరు?
దశదశలో చివరకు మిగిలేది! నిందల పాలయ్యే చరిత్రయేనా?

# II. 11. దేనికది

ఈ భూమిపైకి వచ్చిన వారంతా జీవికలో
అంతో ఇంతో ఎంతో లోన బిక్షువుల విభవం
శూన్యమతులు ఉండరు అందరు సామాన్యుల అభ్యర్థనలతో
ఎవ్వరైన చిన్నవి పెద్దవి అవసరాలలో తృప్తిగా బ్రతికేరు

రెక్కలు లేక పోయినా గాలి పటంలా
ఎవరి చేతలలోనో పైపైన విహరించాలనీ
రెక్కలున్న వాటికన్నా భద్రంగా సంతసంగా మిన్నగా
చూచే వారికి క్రింది నుండి పైపైకి ఆకర్షణగా

రాత్రివేళ చీకటికి భయ పడుతూ ఉత్సుకతతో
తల ఎత్తి పైకి చూస్తే గగనంలో మెరసే చుక్కలు
కవితలో అక్షరాల వలె ఏ రహస్యం తెలిసేనో
ఇక మిగిలింది పద సంయోజనతో ప్రకటనయే

మనసులోని బాధ కదలలేని కొండను తలపించేను
ఎదదలోని కరుణ కదలిపోవు రస నిర్ఘరి చూపేను
ప్రకృతిలోని వివిధ వస్తు విషయ ఘటనలతో
మనుషుల జీవితాన సంఘటన లెన్నో ! మదిలో తిరిగేను

శబ్దం వెనకనే నిశ్శబ్దం కాచుకొనీ ఉంటుంది
మేఘం అంచునే జలకణ జాలంతో రావాలనీ
బ్రతుకులో కొన్ని వాటికవి సాటిగా స్వతంత్రంగా
గాలి నెవరు ఆపగలరు? కాల గతుల నెవరు నిలపగలరు?

ఉద్రేకం క్రోధంలో గ్రీష్మ తాండవ దర్శనం
రసధుని భావనతో ప్రాణం నిలిపే వర్ష జలం
ప్రసన్నమైన కళతో శుభ్ర శుచి మనోజ్ఞం
జారే ఆకులవలె రాలే ఆశలతో శైశిర పరి దీనం

హిమాసార పటాంచల సరణలలో హేమంతం
పరిమళ సుమ సుందర హృదయ వశం వసంతం
రుతు చక్ర భ్రమణం! జీవన గతిలో వేరు వేరుగా
మనుజుల భావ స్థానాలలో జ్యోతిష ఫల సంకలనం

ప్రాచీనమయినా భవిష్యత్తు అయినా వర్తమాన ప్రగతికి
సూచన అయి ప్రేరణ అయి! ఇరువైపుల నుండీ, పూర్ణత కూర్చేవే

# II. 12. ఎవరికి వారు

అనుకుంటారు కానీ ఎవరికి వారు శుభ్రమనీ
తన హృదయం మంచు శిల్పశాల అనీ
కాస్త వెచ్చదనానికి కరగి కదలేనని సెల యేరై
సాగినంత మేర దయామయ మయ్యేనని స్వచ్ఛంగా

పార్కులో క్లబ్బులో మిత్ర గణంలో బయటికి వచ్చేను
ఇది ఏదో రహస్య పేటి తెరవబడే స్వగతం

విత్తు పూవు ఫలం దేనికది అంతిమం సమగ్రం
ఒకటొకటీ విస్తరణంలో భిన్నమై దేనికది విశిష్టం
దేనికది ఎక్కడికక్కడ పూర్ణతచే అయ్యేను ప్రత్యేకం
కవి దృష్టికి జీవితం నడవలేని మహా తరువుని తలపిస్తూంది

మనిషి మనో రూపం ఒక అనివార్య ప్రపంచం
విచిత్రమేమీ లేదు, అంతా లోకంలో ఉన్నదే
అనుభవంలో అందరికీ ఏదో ఒకటి తటస్థ పడేవే
మనిషి కోసం మనిషి భద్రత రక్షణ విపరీత స్థితులలో

అంతా మంచిలే నట్లే అనుభవ జగత్తులోవి
మనో లోకం లోను యధాతథంగా చేరేను
పుట్టలోంచి తల ఎత్తే సర్పం! పూజలందు కోవచ్చు
భయభ్రాంతం చేయవచ్చు, కాటు వేయవచ్చు

ఉపకృతి అపకృతి శాంతి హింస పాలన పీడనతో
స్వతంత్ర రూపానికి స్వేచ్ఛా గమనానికి భంజకం కావచ్చు

ఆఘాత విఘాతాలలో కలహం సమరంలో
ఆపద ఎప్పటి కపుడు జాగరూకతను కోరుతూ
రోజు తన బరువును కొంత మరో రోజు
బుజాలపై వదలి వెళ్ళేతో భవితకు బాధ్యతతో

రానున్న కాలంపై ఎంత ! నమ్మకమో? మనిషిలో
సమాజ శక్తులపై ఎంత బాధ్యతయో మనసులో

తరతరాల సంపద నిలయంగా బ్రతికే కవితలో
కవి మనో నిలయంలోని వెన్నో! ఆకర్షించేను
జీవన వాస్తవమెంత విశాలతరమైందీ
మానస జగత్తు ఎంతగ ఎవరు? సంస్కృతి పొందిందీ

# II. 13. మ్యూజికల్ చెయిర్

ఆరు రుతువుల అంశాలొకచోట చేరినట్లు ముచ్చటగా
కవిత! స్వేచ్ఛా రూపం ఆయా కాలాల గుణ సంపదతో
ఇంత పెద్ద సృష్టి ఇంత పెద్ద ప్రకృతితో సమాజ విభవం
ఒక అనుభవ సంకలనం! మానవ విజయాలతో జగత్తులో

నిశ్శబ్దం ! ఎక్కడి దక్కడ ముక్కలు ముక్కలుగా
దీన్ని కళాత్మకంగా తీర్చాలని ఎందరి యత్నాలో
ఎవరికేమాత్రం సంబంధం లేకపోతే ఆ శబ్దం గాలికే
అది విననిది నిశ్శబ్దం కిందనే లెక్క, అనుపయోగంలో

ప్రతి వస్తువు ప్రాణి మనిషి దేని కదే మిని ప్రపంచంలో
అన్నీ ఏదో ఒక దానితో కలుస్తూ విడిపోతూ మారేను
సమయ సమయం ససందర్భంగా మనో రూపం
మనిషిలో గుణాత్మకమైన పరివర్తన తెచ్చేను

మందం వేగం తీవ్రం భయదం మోదం కలిగించే
శబ్దంలో భేదాలెన్నో ! అన్నీ గగనంలో ఒదిగి పోయేను
శాంతి కళతో శబ్దం అర్థవంతమయ్యేను ఉపయోగంలో
మాటలో పాటలో భావన అక్షర గతమై నిలిచేను

అంతర్జాలంలో శబ్దం సముద్రాలు దాటుతుంది అవలీలగా
కొండలపై పై నుండి సాగుతుంది ఎంతో తేలికగా
ప్రాణానికి ఆధారమైన గాలికి ఆధిపత్యం లభిస్తుంది
మాటలతో శబ్దం సార్ధకమవుతుంది, గగన వాణి పథంలో

చేయి ఉన్నది పదును కత్తి పట్టుకొని
గాయపరచడానికి కాదు బెదరింపుకు కాదు
కావలసినవి నిర్భయంగా పొందడానికి
మనిషికి తోడుగా ఉండేందుకు మాత్రమే

మేధావులు నిపుణులు అభిలాషులు మొదలుకొని
కర్షకులు కార్మికులు వృత్తుల వారు సాధారణులు
బ్రతుకులో అగ్రభాగం సాధించడానికి నిపుణంగా
పోటీలో నెగ్గేందుకు చెందిందీ మ్యూజికల్ చేర్

కవితల కెవరికీ వస్తువు కొరత లేదు
సృజన దరిద్రం మాత్రం ఎక్కడబడితే అక్కడ

# II.14.

దేశంలో పౌరులతో ప్రజలు ఒకటిగ తోచేను మనసుకు
ఒకటి ఉన్నతిలో ఇంకొకటి విపులతలో ఇరు పీఠాలపై
మనిషిలో కల్పన ! వాస్తవ మవాలని కోరిక మదిలో సహజం
నిరంతరం అన్వేషణ పరిశీలన ఆశయ విజయం క్రమంలో

దేశమెంత ఉన్నతమో! మనసుకు మాత్రమే అందుతుంది
ఆకాశ మెంత దూరమో యత్నంలోనే తెలిసేది
ప్రతి పౌరుడు తన అవసరాలు బాధ్యతలతో
తలపై నిప్పుల కుంపటి, ఎదపై గులాబి పుష్పంతో

ఉదయ కిరణం రాత్రిని మరపిస్తుంది తన పనిలో
రాత్రి చీకటిలో పగలును జ్ఞాపక మొనరిస్తుంది
వెన్నెల రాత్రి మనసును రంజితమొనరిస్తుంది
నిద్రా జలధిలో కల! ఒకటే! పైకి తేలేను

ఈ దేశం ఉన్నతిని హిమ శిఖరంతో పోల్చేరు
స్వచ్ఛమైన శుభ్రమైన జలాలతో పరిసరాలు
చల్లని వాతావరణంతో శాంతి లభించేననీ
ఆర్తి హరించేననీ లోని దప్పిక తీరేననీ నమ్మకం

జలనిధిని ఈదుతూ ఈదుతూనే బ్రతుకంతా
తీరం చేరే అవకాశం చేతి కందబోతూ
హఠాత్తుగా తానే ఒక పడవై పోయేనా?
స్వేచ్ఛా గగనంలో ఎగురుతూ ఎగురుతూనే
క్రిందికి చేరే ఆలోచనలో మెరపులలో
చకితంగా, తానే విమానమై పోయేనా?

ఈ దేశం హృదయంలో మహానదిని తలచేరు
సహనానికి కరుణకు శాంతి నిలయమని ఎంచేరు

ఈ అనుభవ సుందరత ఎవరికి లభిస్తుంది?
కవికీ దర్శన హృదయంగల ఋషికి తప్ప
ఆహారం వ్యవహారం దుస్తులు మాటలు వర్తనతో
మానవ చేతనలో సంస్కృతి శిఖరాల దర్శనం

రావలసిన పరివర్తనలను బింబిచే సృజన చేతనలో
మొట్టమొదటి తాంబూలం ప్రతిభకు పట్టం కవితదే!

# II.15. ఉదార శ్రేయం

ఒక మాటతో చివురయి ఒక పాటతో పూవై
ఒక కవితతో పూల మాలో; గుచ్ఛమో
అనుభవంలో ప్రతి కవిలో ఒక పూల తోట
మెలకువ నుండి నిద్రకు నిద్రలో కలలకు అవకాశం

ఒక మాటలో నిప్పు కణం పాటలో దీపశిఖ
ఒక కవితలో కిరణమొ బింబమొ అనూహ్యంగా
అనుభవ గతిలో ప్రతి కవిలో ఒక వికాస రూపం
జడమూ ప్రాణం చేతనలతో వివిధ స్థాయిలలో

ప్రతి ఒకరికి మరొకరితో స్నేహం ఏర్పాడాలనే ఉంటుంది
ప్రేమ ప్రకాశించాలనీ కరుణ ప్రసరించాలనీ, మనసులో
ఆటంకాలెన్నో! అఘాతాలెన్నో అనుమానా స్పదాలెన్నో
నమ్మకాలు వమ్మైపోయేను, అనుబంధాలు తెగిపోయేను

అనుకోనివి జీవితంలో లోక తంత్రాలతో చుట్టుకొనీ
మనసు తీగెకు పూల బదులు ముళ్ళతో నిప్పులతో వెలసేను
తన చేతి నుండి అవకాశం జారిపోయేను, రాలిపోయేను
స్వార్థంలో అస్తవ్యస్తమై శత్రు పథంలో ప్రతీకార పర్వం

ఎవరితోనో ఆపద కలిగే భయం! అక్కరలేదు
కాని మనసు ఆందోళనలో ఊగుతుంది! ఆకాశంలో
కూలే ధైర్య శిఖరం ముక్కలు! మీద పడకుండా
గాయ పరచకుండా చూచుకుంటే చాలు

రారానీ! కోపం తాపం గగనం నుండి దిగనీ
పోపోనీ! పడమర తలుపులు తెరవబడీ చీకటి లోకి
రారానీ సహనం శాంతం హృదయం వికసించనీ
పోపోనీ శిశిరం గ్రీష్మం! రారానీ ఉదారగుణ శ్రేయం

పయనానికి మొదలు ఉంది, అంతం మాత్రం దొరకదు
దీనికి గుడ్‌బై చెప్పి మరోలోక యాత్రకై సన్నాహాలు జరిగేను
ఇక్కడనే ఇప్పటి నుండి సంభారం సిద్ధం చేసుకునేరు
మరో లోకం ఉన్నదో లేదో కానీ! మనుషులు సంశయ సంగ్రామంలో

అనుమానం వైరంతో దూకే మనసుకు స్వాగతంతో పనిలేదు
అభిమానంతో నమ్మకం నిండిన మనసుకు మనుషులందరితో పని

# II.16.

సమాజంలో ప్రతి వ్యక్తి జెండర్ వివక్ష మరచిన హృదయంలో
జీవన రూపంతో, తన జీవిత గ్రంథం రూపొందాలని
ఆ రోజున పుట శూన్యంగా ఉండాలని, ఎవరూ కోరరు!

సమాజ హిత పద సంబంధంతో అందరిదీ అవుతుంది
ఏదయినా ఎవరికి వారి వారి స్వంత విషయమయినా
ఎవరూ ఎవరి ఊహలతో తీర్చిన పాంథులు కారు

విశ్వభావనా తలంపై చూపులు పరచేరు
ఎవరు ఎవరి చేతులలో ఆడే బొమ్మలు కారు
అనల స్వరం వినిపించగానే భగభగ మంటలతో
జలద స్వరం వినిపించాలనీ జలజల చినుకులతో

ఎడారి ముక్కనో చీకటి తునకనో అంటించినట్లు
ఒకటి రెండు అయినా మొక్కలు లేని ఆవరణం
ప్రజాస్వామ్య దార్శనికంలో ఇరువైపుల సమభావం
భిన్నతలను సమన్వయ పరచే వికాస రూపమవసరం

చల్లిన పూల వలె గగనంలో చుక్కలు
ఉంటేనే ! శోభాకృతి ! రాత్రివేళ చీకటిలో
దేని కది అమరి కాలానికి సుందరతలు నప్పేను
లౌకిక తంత్రంలో సమస్యల చిక్కు ముడుల స్థితిలో
మౌనం వహించడం, కుదరని చెల్లని పనిలో భాగం
ఈమాత్రానికి సమాజ చలనం ఆగదు వ్యక్తుల గమ్యం చెదరదు

ప్రాణమున్నంతవరకు మనసులో కల్పన తప్పదు
జ్ఞాపకాల నుండి జారిపోయే వెన్నో! తెలియదు
ప్రతి రాయి! శిల్పాకృతి పొందలేదు
ప్రతి కవిత ! వర్షా మేఘమవలేదు
ప్రతి రోజు పండుగ కళ నీయదు
ప్రతి మనస్సు పూవును మరపించలేదు

మాట పాట కవిత చీకటిని మరపించే సాధనాలు
శుభ్ర పరచి హృదిని ఉదయ రశ్మికి సిద్ధంగా
ఉంచడమొక విశేషమైన పనియే మనిషికి
మానవ సంస్కృతిని జ్ఞాపకం చేసేను, పూర్ణతలో

# II.17. అభాగ్యం

ఎడారిలో నడచి నడచి మైదానం చేరి మనిషి
తిరుగు పయనంలో కనిపించని అడుగు జాడలు మాయం
గాలి వీచి చెదర జేసి రూపాన్ని పైకెగర గొట్టెనా?
పాంథుల అడుగులతో చిందర వందర అయి పోయేనా?
గుర్తు పట్టరాని స్థితికి చేరేనా? పోయినంత మేరసేనా?

గాలి వీస్తుంది పరిమళాన్ని పంచుతుంది
వెలుతురు దిగుతుంది సమతతో వర్తిస్తుంది
ప్రతి రంగును విడమరచి స్పష్టంగాచూపుతుంది
గగనంలో నిశ్శబ్దంగా మౌనం వహిస్తుంది
అంతరంగ సాక్షిగా జరిగే ఘటనలపై
సమీక్ష నెవరు కోరుతారు? తెలిసే దెవరికి? ఎంతగ?

ఉన్న పరిస్థితులలో వివేకంతో ధైర్య బీజంతో
కాలాన్ని అధిగమిస్తూ బ్రతుకులు సాగడమే
నిప్పుల ముందు వెచ్చగ చలికాలం గడచేను
గ్రీష్మంలో చల్లని నిలయం ఆశ్రయమయ్యేను
ఎవరి పనులలో వారు! సామాన్యుల నుండి
పెద్దల వరకు మార్పుల నెదుర్కొనేరు, తీరులలో

సమాజంలో పలు స్థాయిలలో ప్రజలు!
రతువుల తీవ్రతల్ని ఎదుర్కొనేరు
ఒక సమయం ప్రజా స్వామ్యం! పరీక్షలో
దార్శనిక శక్తి నెదుర్కోవలసి వస్తుంది
కష్టం నష్టం ఉపయోగం భాగ్యం
వ్యక్తుల బాగోగులు మనుషుల చేతుల లోనే

కవి సన్మానంలో ఎవరికి వారు
పూలదండ శాలువా! తెచ్చుకునేరా?
సంచిలో గుప్తంగా! విషయ రహస్యం
తెలిసేందుకు చీకటిలో ఒక మెరపు చాలు!

# II. 18. ఆశా స్వాగతం

స్వార్థం ద్వేషం క్రౌర్యం శత్రుతలు దృఢంగా
నాలుగు స్తంభాల ఆటతో రోజు కలహ వేదిపై
సహనం శాంతి తృప్తి సంతోషం
నాల్గు దిశలు పరచిన ప్రజాస్వామ్య స్నేహ పథంలో
కవి హృదయం దేనినీ నిరాకరించదు
అన్నిటినీ స్వీకరిస్తుంది, యధాతథంగా

ఆశ లేని వ్యక్తులెక్కడ? ఇది ఎప్పటికీ ఉండేది
మనిషి నుండి మనిషి తన గెలుపుకు నమ్మకాన్ని కోరేను
నిరాశ చెందే సందర్భాలెన్నో! ప్రతి బ్రతుకులో
మనిషి లోని అంతశ్శక్తిని మటుమాయం చేసేను

చీకటి రాకూడదనుకుంటే సరిపోతుందా
మనిషి వశంలో అన్నీ ఉంటాయను నమ్మేరా?

విరామ సందర్భంలో ఎదురుగ దోషాల తోరణం
తమ కోరిక పూర్వపు పనులకు చెందినదై వరసగా
మనస్సులో పొరల నుండి సమయానికి పైకి వచ్చేను
కష్టాలు నష్టాలు తొలగాలని అతీతాన్ని కోరేరా?
ప్రవహించే కాలం తీరాన నిలబడి
దప్పికలో తనకై ! అది ఆగాలని చూచేరా

నేరం ఎవరిది? తేల్చి చెప్పగల రెవ్వరు?
సృష్టికి అంతం లేదు, మొదలు ఎవరికీ తెలియదు
ఏ ఒకరికి తన ఆగమనం నిష్క్రమణం తెలియదు
తెలియని తనమే ఎక్కువ, ఈ జీవన చలనంలో
బ్రతుకు కార్యశాలగా మలచుకొనే అభిలాష
పొలం తోట యంత్ర శాలగా తీర్చే ఉత్సాహం

దప్పిక ఆకలి తీరే, ఆయువు సౌఖ్యం భాగ్యం పొందాలనీ
ఈహలు ఊహలు మదిని చుట్టు ముట్టిన నాటిది
నిజం ఆరదు, తొలగదు, పూర్తిగ ఎవరికి తెలియదు
కాలం గడచే కొద్దీ దోషాక్రాంతమై మరుగన పడేను

బయటికి వచ్చి గగనం వైపు చూస్తే ధైర్యం వస్తుంది
భూమిపై అడుగు వేస్తే ఆశ పూలు పూచి స్వాగతిస్తుంది

# II.19. వెలిగే దీపమయి

ఇంటి ముందు నిల్చొని రాత్రి చీకటిని చూస్తే
మహా పర్వతం శ్రేణులతో బృహత్కాయ మెదురుగా
ఈ చివర నుండి ఆ చివర వరకు వ్యాప్తమై
గాలితో ఆహ్వానం పంపుతుంది చల్లగా ఆర్ద్రంగా
అయితే నేను నడచేది వెలిగే దీపమయి తేనె
అసాధ్యమనుకున్నది, సాధ్యమయ్యే అవకాశం లేకపోలేదు

అట్టహాసం అక్కరలేంది ఒక కాలి నడకకే
చిన్నతనం నుండి అలవాటుతో అలవోకగా
సాధ్యమైన పనికి పూనుకోవడం వికాసావసరం
ఇది నాలో బయటికి ప్రసరించే ప్రకాశ రూపం
ఇది ప్రతిభకు ఉత్సాహ శక్తిని ప్రసాదించేను
అడుగు జాడల్ని సమాజ చరిత్రలో భాగం చేసేను.

ఉచితం పేరుతో అమృతంగా ఏదైనా పొందవచ్చు
ఇది దొరకదని తెలుసు అయినా యత్నం జరిగేను
మధ్య మధ్య తత్కాలంలో కాఫీ టీ చేతికందుతుంది
పూర్ణ చంద్రుని  పోలిన ఐస్‌క్రీం ముఖ బింబంతో
వెలుగై మనసు ముందుకు కదలుతూ ఉంటే
చీకటి మౌనంగా వెనక్కి జరుగుతుంది

వెనువెనుకన ఎవరయినా రావచ్చు ఫోకస్‌లో
ఇచట స్వప్నం వాస్తవమయినట్లున్న ఒక విచిత్రం
వెలుగు దారిని జల ప్రవాహ మనుకునే వారూ ఉన్నారు
నీటిలో కరగి పోనిది కలిసిపోనిదీ, చీకటి రూపం

జననంలో సంక్రమించిన చేతన రూపాలెన్నో అతీతాలు
మాట పాట కవితలై వర్తమాన సోపానాలపై నడుస్తూ

ఇది ఎవరు బడితే వారు దీపం అయ్యే అవకాశం లేదు
మౌనాన్ని శబ్ద మయం చేస్తుంది దార్శనికం
దార్శనికంలో వెలుగు బాట అర్థవంతమవుతుంది
గమ్యానికి చీకటి తొలగి వెలుతురు ఆవేశిస్తుంది
మొట్టమొదటి రవి కిరణం స్పృశించేనో లేదొ
భళ్ళున తెల్లవారి మనిషి మనో రూపమంత రంగవశమయ్యేను
క్షమలో నేరం శుభ్రమై తృప్తి రేఖతో శాంతి
మూడు పూలతో ఉరితాడు పుష్పమాల అయ్యేను.

## II. 20. ఈనాటి దృశ్యం

'నిజాని'కి ఇజాల్ని చేర్చి పలు వాదాలను జోడించేరు
తమకు నచ్చినదీ అనుకూలమైనదీ దృష్టి కోణంలో
అధికారం తమ వశమై సాగాలని నేతలు ఒకరొకరు
ప్రజాస్వామ్య సామ్యవాద వాహనాన్ని నడిపే ఉత్సుకతతో
రోజుల రాకపోకలు అనివార్యాలుగ మారే జీవన దృశ్యాలతో
మౌనం పనికిరాదు సాక్షీభూతమైన రవి బింబం చాటు కారాదు

మధ్య యుగాల సంస్కృతి ఇప్పటికీ కొనసాగుతూనే
జడతను పూర్తిగ వీడని జనతలో అనాసక్తి శూన్యం
ఆకలి దాహం పలు విధాల బాధలతో సాధారణ ప్రజలు
భిన్న మయిన పాలనకు నిదర్శనంగా నిలిచేరు అగ్నులయి
రాజకీయ శక్తుల ప్రమేయాలతో రంగంలోకి దిగేరు కొందరు
ఎవరికి వారు తమ తమ శక్తుల ప్రకటనలతో గడిపేరు

నిర్మాణానికయినా విధ్వంసానికయినా విభేదాలతో
పక్కా ప్రణాళికలతో కార్యాచరణ శీలమవసరం
గాలి మాటలతో ఉద్యమ ప్రభలు సాగవు
దేశ వికాస చరిత్ర! ఒక నిరంతర ప్రవాహ సమం
నిజాన్ని నిప్పుని ఎవరు దాచగలరు? చంపగలరు?అమాయకంగా
మాయం చేయవచ్చు కనబడకుండ ఏదేని కప్పబడవచ్చు

మౌఢ్యంలో సుఖమూ సంతోషమూ పూల రేకులు
విప్పారని స్థితిని స్పందన హృదిని జాలి పడ చేసేను
ఏమీ చేయలేని స్థితిలో నిశ్శబ్దాన్ని వరించేను
బాధలు చుట్టిన కవితల్ని కవి సహృదయులపై విసరేను

ఎవరి యానం వారిది! ఎవరిదీ అనంతం కాదు
ఎప్పటికప్పుడు ఖండితమై అనుభవం దేనికది విడిపోయేను

జననంలో మొదలైన జీవితం, కొన్ని హద్దులలో
దేనికది స్వతంత్రంగా వలయాకారంలో పరిమితులలో
పాత అనుభవాలు ! స్మృతి శాలలో చేరేను సూటిగా
కొత్తవి ప్రతి ముఖంలో, పొద్దు పొడుపు రశ్మి కళతో

దేశం పతాక గాలిలో రెపరెపలాడుతూ ఎగురుతుంది
దీని నీడలో దేశ ప్రజలు! చల్లని ఆశల నిజ హృదయంతో

# II. 21. లోతు నుండి ఎత్తుకు

లోయ లోతును తొంగిచూస్తే ఏదో భయం
పాతాళం గురించి ఆలోచన తిష్ఠ వేస్తుంది
లోతు బావి పెద్ద చెరువు మహానది విశాల జలధి
చూపులో ఉత్సుకత మనసులో అలజడి ఆశ్చర్యం
గిరి శిఖరం పైకి తల ఎత్తి చూస్తే ఏదో ధైర్యం
ఈ రెండిటి మధ్య భూమి తలం మానవంతో

మనిషి చరిత్ర గెలుపు ఓటములతో పోటీ పడుతుంది
భాగ్యంతో పాటు దరిద్రాన్ని మోయవలసి వస్తుంది
పూలతోనో నెత్రు చుక్కల తోనో! మట్టిపై
అలంకార శోభతోనో అభిమాన ధనంతోనో
ఎప్పటికీ ఒకే రుతువు కాలాన్ని ఏలదు
ఎప్పటికీ ఒకే దశ బ్రతుకులో నిలవదు

ఒకరి గురించి మరొకరికి తెలియక పోవచ్చు
ఏదయినా చేసే పనియే చెబుతుంది, సగం పైగా
జాగ్రత్త చర్యలతో తలుపులు మూయబడీ
కిటికి రెక్కలు తెరవక తప్పదు, గాలి వెలుతురుకై
మనిషి అలికిడి వినబడితేచాలు! అనుబంధంతో
ఆశారూపం ఉత్సాహంతో నృత్యం చేసేను

మధ్య మధ్య బంధుమిత్ర గణం పని బడిన రూపాలు
ఎంత అవసరమో కొత్త పరిచయాలంతే ముఖ్యం
కవితలో మానవత! ఎక్కడి కక్కడ పూర్ణమనిపిస్తుంది
ఏమి జరిగినా! అగ్ని పూజనీయం! మానుష శక్తి రేఖయై
ప్రతి బ్రతుకులో భాగ్య బింబంకై
నేతలతో పాటుగ కవులు నిలిచేరు

అందరు తమ కథ పాతదో కొత్తదో వినిపించాలనీ
ఎవరికి వారు, ఇక మరొకరి కథను వినేదెవ్వరు?

ఒక కవియే! ఓపికగా కావాలని అభిలాషతో
ఏ దుశ్చర్యకు సమాధానం కాదు ప్రతీకారం కానేకాదు
మరో మనిషి పరిచయం కొత్తగ మరీ మరీ అవసరం
జీవితం క్రమంగా నూయి నుండి జలధి స్థాయి చేరేను

# II.22. కవిత రుచిరమై

ఏ కవి అయినా ఏ స్థాయికి చెందినా
అభినవమై మనో జగం సృజన భూమిగా
ప్రతిభకు కవితలో సమాజ చలనంతో
అస్తితలో వ్యక్తిత ప్రతిఫలించేను, సూచనగా
స్పందన నుండి వివేచన దాక సమాహితమై
శబ్ద శక్తి మేల్కొనేను, సన్మతితో ఉన్నతిలో
సన్నుతులను పొందేను, చివరి మాట సహృదయులదే

ప్రజాస్వామ్య భావనతో స్వేచ్ఛా కవిత్వం
కుత్తుక పై నుండి కత్తిని దూరం చేసేను
ఆ ఆయుధాన్ని రాత్రులు పని చేసే
రక్షక భటులకు చేరుతుంది, కాపలాలో

భయభావం దూరం చేసే స్థితి కల్పితమై
దార్శనిక విశేష గుణం బాసటగా నిలిచేను
ప్రకాశమాన ప్రభావాన్ని బహువిధాల పెంచేను
ప్రయోజన దిశలకు సుదీర్ఘ విపులత ఏర్పడేను

చుక్కలలో కోరిక రాత్రులు నిర్మానుష్యంలో
క్రిందికి దిగి! విహరించాలని జనపద వీధులలో
ఇక! మనుషులు సరెసరి! నిద్రలో మనసున
గగనంలో కెగిరి చరించేరు ! ఆశా చిహ్నాలుగా

శ్రమ జీవి ఒకరే ఆశా చక్రం తిరిగేను
పగలు రాత్రి చుక్కలు మనుషులు భేదం లేకుండా
ఎవరి కలవారి స్వంతం! తమ వరకే పరిమితం
వాస్తవ మందరు చూచే! విప్పారిన రహస్యం

వ్యక్తి సమాజం తన దేశం ప్రపంచం
నాల్గు దిశల మధ్య! మనిషి జీవితం

తామరాకు పై జల బిందువు కాదు, హిమ ఫలకం
శిల్పంగా మారే తొందరలో కరిగి నీరై కోష్ఠానికి
జీవన ధునియై మట్టికి సృజన భూమిగ మార్చేను
ప్రేమ కరుణ సమత రుచిర స్వరం వినిపించేను

స్వేచ్ఛా కవిత్వం - 125

# ఆగని పయనం

మాదిరాజు రంగారావు



**2023**

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

**125 SWECCHA KAVITHVAM**

**AAGANI PAYANAM**

**ఆగని పయనం**

by

Prof. Maadiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Year of Publication 2023

*Presented to*
*my son*
*Dr. Santhosh Kumar*
*with*
*Hearty Blessings*

## పీఠిక

# అంతర్వివేచనం

స్వేచ్ఛా కవిత్వం పరంపరలో "ఆగని పయనం" ప్రజాస్వామ్య దార్శనికతను సరికొత్త భావనా రూపానిన మానవ విజయ కాంక్షను ఉత్తమ సమాజాన్ని సుస్థితిని ప్రేరేపించే వాతావరణాన్ని కాంక్షిస్తుంది. ఇది ఆగని యానం. జీవన కళతో సుఖము సంతోషం భాగ్యం శ్రేయంతో కూడింది. ఈ కారణంగా ఆశావాహమైన (Positive) దృక్పథం మనసునాకర్షిస్తుంది.

ఈ ఆలోచన ప్రపంచానికి సరి అయింది ఉన్న వాటిలో మేలైందీ, ప్రయోజన గుణంతో విశ్లేషణకందుతుంది. వ్యక్తిస్థాయి నుండి సమాజ తత్పరత వరకూ ఆయా వికాస దశలలోని వివేషతల్ని ప్రత్యేకతల్ని అందిపుచ్చుకున్నది. వీటిపై ఆశా ప్రసార రేఖలతో కవితలు దర్శనమిస్తాయి.

ఆధునిక యుగంలో నవ్యవతకు కోరే కవులు పాఠకులు మనసులో మెదలుతారు. కళాత్మకమైన స్పందన రేఖలతో ఆపూర్ణమయింది. ఈ బృహత్కృతి తనదయిన అర్థమయిన స్థానాన్ని పొందుతుందనే నా అభిప్రాయం. కవిలో తన చుట్టూ ఉన్న వాతావరణాన్ని అనుభవాల నుండి కవితలో ప్రసార రూపాన్ని పొందింది. దీన్ని మనస్తత్వశాస్త్రం కోణాల్లో పరిశీలించవలసి ఉంటుంది. ఈ దివలో కవి జీవన రేఖలతో ఏర్పడిన వ్యక్తిత్వం కవిత్వానికి చెందినంతవరకు చాలా అమూల్యమైంది. ఇందులో సమాజ శాస్త్రం, మనస్తత్వ శాస్త్రం, సాహిత్య శాస్త్రం వీటి కలయిక చేత విశేషత సిద్ధించింది. ఇకపోతే మరో దిశో నిజ జీవన స్థితి గతులు వాస్తవికత సమాజంలో పోకడలు రావలసిన తీరులు ప్రసక్తమైనాయి.

సమ్రాట్ రూపానికి సంకేతమయిన ఈ బృహత్కృతి తగిన విధంగా సరి అయిన ఆలోచనా తంత్రుల్ని మీటే విమర్శన కళ అవసరం. దీనికి వివేచన ముఖ్యం.

**"ఈ దేశంనా జీవన వాసం**

**ఈ విశ్వంనా ఉదార హృదయం"**

**– మాదిరాజు రంగారావు**

# ఆగని పయనం

## 1. అవకాశం సుమ గుచ్ఛంలా

శాంతి ప్రియత సమర బంధుత ప్రతి మనిషిలో
సమయ సమయ మంతో ఇంతో హెచ్చు తగ్గులతో
బుజాలపై చిత్ర పటాలు నిలుపుకొని
ఆయా పార్టీల ఆశయ సాధనలో ఊరేగే దృశ్యం

నేతల ప్రేరణలో ఎపుడేది జరిగేది తెలయదు
తిరిగే స్వార్థం చక్రంపై ఏ స్థానం వీడేనో?
గమ్యం మారవచ్చు, ఆశ్రయం వేరు కావచ్చు
ఇది స్వేచ్ఛలో రాజకీయ తంత్రంలో వ్యూహ రచన

కొమ్మ నుండి కొమ్మకు చెట్టు నుండి చెట్టుకు
అడవి నుండి ఊరుకు బొగ్గు నుండి అగ్నికి
చెలమ చెరువు దాటి నది జలధికి చేరి
ఏ గాలి ఆప్తమో? ఏ నీరు ప్రాప్తమో ?

ఎప్పుడు ఏ ఒడ్డున చేరేనో? ఏ గమ్యం దొరకేనొ!
తెలియని సందేహ భ్రమణంలో కొంతకాలం గడచేను
కోరిక తీరే యత్నంలో శ్రమ జీవన కథా ఘట్టాలు
ఓటములు ! పతనాలు తప్పనివి! ఏ వైపున అయితేనేం?

తన మతి ప్రతిభతో విషమ స్థితిని సరిచేసి
ఏ సమస్యనయినా ఎదుర్కొనే నిజ శక్తి
ధగ ధగ లాడుతూ ముందుకు నడచేను
అనలాన్ని ప్రయోజన చలనంలోకి తెచ్చేను

పీఠంపై మోజు! సులభంగా చేతికి చిక్కే
ఉపాయంలో స్వార్థంతో మార్గం తప్పేను
ఎవరి నెవరు వీడేదీ కలిసేదీ తెలియదు
చివరి క్షణం వరకు తెలియని రహస్యం

నిజంలోని నిష్ఠురత అందరికీ తెలిసిన ప్రమాదం
మాటలు చేతలు వేరు వేరు దిశలు కాక ఒకటై లక్ష్యంలో
జేబులో భద్రంగా వివిధ పాత్రల మనుషుల సమాచారం
చేసే పనిలో ప్రత్యేకత విశేషతను గుర్తింపచేసేను

పట్టాలు తప్పిన రైలును దారిన పెట్టే మనస్సుకు
దొరకిన అవకాశానికి పుష్ప గుచ్ఛంలా ! ఉదయ చేతనం!

## 2. ఉన్నది మారాలనీ

వెన్నెలలో మంచుకొండ తళతళలాడుతుంది
కళాకృతిని పొందుతుంది మనసును హ్లాద పరుస్తుంది
మనుషులలో మానసాన్ని సత్త్వం లోకి మారుస్తుంది
ఆలోచనా ముఖం మారుతుంది! ఇది సామాన్యం కాదు
మాట కోసం గగనం దిశల చెవుల విప్పారి!
ఇంతలో పిడుగుపాటు శబ్దం! భయదరేఖ గీస్తూ

నా చెవి పక్కగా దూసుకొని పోతుంది, హఠాత్తుగా
చెవులు మూసుకుంటే, వినబడనిదికాదు; స్థాయిపైది
అంతలో మెరపు తీగె; కళ్ళుమూయ చేస్తుంది
క్షణంలో కనులు తెరవ బడీ! యథా తథంగా

బయట చీకటి కొండలా ఆరోహణ నాశిస్తూ
మనిషి నుండి! వెలుగు నుండి టార్చ్‌లైటొ ! మరొకటొ

మనిషి నుండి వెలుగు రేఖకై ఎదురు చూచేను చీకటి
క్రాస్‌రోడ్ జంక్షన్‌లో చిక్కుకుంది బయట పడాలని
ఒక దాని కొకటి క్రాస్ చేసి ముందుకు వెళ్ళాలనీ
అనుకూలం ప్రతికూలం రెండూ సమాంతరంగా

ప్రతి కల్పనలో ఆలోచన వెనక జీవితం తప్పనిసరిగా
రేఖా చిత్రం వలె ఉన్నది! కవితలో బయట పడుతుంది

బాగా పెరిగిన ఉత్సాహం ఉద్యమంలోకి దింపుతుంది
ఉద్యమంలో నిశిత క్రూర కటుత హనన దారుణ రేఖలు
ఆదర్శ చక్రంతో ముడిపడి విప్లవ రూపం పొందేను
ఎంతసేపు రౌద్రం ? సాగ తీతలో చల్లబడక తప్పదు
రవి కిరణం తోనే చీకటి కరిగి నీరై ప్రవహించడం
ప్రకృతి సహజమైంది, కవితలో ప్రతీకయై ఉత్ప్రేరకమైంది

పయనంలో కావలసింది అగ్నికాదు వెలుతురు స్నేహం
కవితకు కావలసింది! ఊహల తంత్రులపై విద్యుత్ సంగీతం

ప్రవాహ చలనంలో విద్యుదనలం గుప్తంగా
జీవన గమనంలో ప్రకాశమాన పద పంక్తి
ఇది మనో జగాన్ని సుమఫలం చేస్తుంది
ఉన్నది మారుతుంది, కొత్తది చేరుతుంది

# 3. పయనించి పయనించి

పయనించి పయనింది అడవులు నదులు దాటి
పరీక్షకు గురి అయి అలలపై పయనించేను
జలనిధి తీరం చేరి అనుకొనో అనుకోకనో
మనిషి మనో రూపం కెరటమై తీరం చేరేను
ఏదో జలశక్తి భూమిపైకి విసరినట్లు తోస్తుంది
ఈ నేల నుండి గగనం చేరాలని ఉత్సాహం సహజం

ఇది కల్పన కాదు స్వప్నం కానే కాదు మానసం
బ్రతుకులో పునర్జీవన యత్న రూపం కొత్తగా
రాళ్ళదారిన నడుస్తూ శిల్పమై నిలవాలనీ స్థిరంగా
అవనిపైన సుందర వనంలో చెట్టుగ బ్రతకాలనీ కొమ్మలతో
ఎన్ని అనుకున్నా ఒకటి తర్వాత మరొకటి
ఏదీ కాదు, మనిషిమనిషే ప్రాణుల మధ్య పుణ్యభాక్

ఈహలో అవతరించిన రూపం చకితంగా
వాస్తవాన విజయ రూపం దాల్చేనా?
అక్షర జగత్తులో సాధ్యమైంది
ఊహలో రూపం ప్రతీకయై నిలవొచ్చు
మౌనంగా ఉండదు జలధి, ఉండలేదు
ఇది సమాజ ప్రతిబింబమై ఆకర్షించేను

గగనం వర్షా స్వర పంక్తులు వినాలనీ
ఒక మృత్యు స్వరం తప్ప అన్నిటికీ నిలయం
జీవన యధార్థ దృశ్యాలకు నిలయమైంది
ప్రకృతి దేని కయిన ప్రాతినిధ్యం వహిస్తుంది
మనిషిలో మేధతో హృదయం ఆప్తంగా
ఎన్నిటినో నిజం చేస్తుంది! మరో జగత్తు

రోజంతా పండగలా గడవడం జరగదు
ఎపుడో ఏడాదికి వచ్చేది మాత్రమే సంతోషంగా

జల బిందువులెన్ని కలిస్తే సముద్రం?
ఇది దాహం తీర్చేది కాదు
ఎన్ని బిందువులనో పైనుండి వదలే
మేఘాల్ని ప్రసాదిస్తుంది, భూమికి తరలిస్తుంది

పొలం తోట ఊరు నగరం అన్నీ సమానం
వీటిపై ఆధిపత్యానికి మానవ యత్నం
కాలం గడచే కొద్దీ బలబడుతూ
మనిషి శక్తి ఇప్పటికీ యుక్తితో ఎన్నో సంభవాలై

పై నుండి జారే జలబిందువు, మల్లెమొగ్గలా
మనిషిలో అంతశ్చేతనకు నవ రూపాన్ని ఇచ్చేను

## 4. ఎంత కష్టమైనా

మనిషి దేశం మరొకటి అద్భుతం మహనీయం
కాని పరిచయంతో ఏమి తెలుస్తుంది
తనదైన లోతు పొడవు వెడల్పు ఎత్తుతో
తనలోని విలువలనే పదంతో పైకి కనిపించనివీ

జీవిత మంతా పరిశోధనలో పరిశీలనలో గడపినా
చివరి సమీక్షలో ఇంకా ఎంతో ఉంటూ
తెలియాలిసిన సంగతులే కాక!
రహస్యంగా ఉంచిన వాస్తవాలు

చిత్రంగా! మనుషులలో చీకటి కన్న
వెలుతురును గుర్తించడం! సులభం కాదు
ఎంత కష్టమైనా ఇది! జన హితాని కవసరం
ఇంకా వెలుతురులో కనబడే వస్తువులు లెన్నో
తెలిసిన వనుకున్నవి, తెలియని వనుకోనివి
మనిషుల్ని అమాయకంలో ముంచి పైకి తీసేవీ

భౌతికం నుండి ఆ వెనుకో ఆ పైనో ఉన్న
మానసానికి యత్నం ! పెద్ద సమస్య
సంక్లిష్ట స్థితిలో వెడలే ఆశ లెన్నో!
దార్శనిక తేజంతో దారు లెన్నో!

బాల్యంనుండి ఏదో ఒక మాస్క్‌కు అలవాటు పడిన
వాలకం! పెద్దయిన కొద్దీ వివిధ పాత్రలు వహిస్తూ
ముఖంలో ఉబికే వెలుగు! కళ్ళలో వెలిగే చూపు
శాసించ గల శక్తులు! మౌనంలో నిశ్శబ్దంగా

పెద్దరికం పెరిగే కొద్దీ వ్యక్తి నుండి సంఘానికి
సంఘం నుండి వ్యక్తికి బరువులు మోసేను హోదా

సంక్లిష్టంగా మారే బ్రతుకులో బాధ్యతలు పెరిగేను
తనలో ఎంతటి అనుభవం పైనో! కొత్త జగం రూపొందేను

సాయం సంధ్యా కాంతి రేఖల వలె విషాద ముద్రలలో
మనుషుల ఆలోచనలో మలుపులు తిరిగే ఊహలు
అందరికన్నా ముందుగ లక్ష్యం ఛేదించాలని
ఎంతటి కష్టమైనా సాధించాలనీ మదిలో

## 5. తుపానును దూకించే వారే

మనిషి గళస్వరాన్ని బట్టి
మాట లోని తీరును బట్టి
గుర్తు పట్ట వచ్చు సులభంగా
అనిశ్చయం అనుమానం! మనసులో

రాజకీయ మంటే మార్పు కంతలో లోనయ్యేది
ఎప్పటికపుడు అస్తితలో ఊగుతూ
పాలన తల క్రిందులయి ఎవరి ఇష్టం వారిదై
స్వేచ్ఛను దురుపయోగంలో ఎంతకైనా తెగించేరు

సమాజ మంటే ఎప్పటిదో పరంపరలో
భాగమైంది, పెద్ద పీట నాశించేను
ఆరోహణపై చూపులు నిలిపేరు
కాలంతో నడవాలని తొందరలో వేగం
ఉన్నత స్థాయి నందు కోవాలని
ఎవరో కొందరికి పరిమితం నుండి అందరికీ

పాత గాయాలపై చర్చలను వదలేసి
కొత్తవి చేరకుండా జాగ్రత్త పడడం
మనిషిపై మనిషి పెత్తనం తొలగాలని
స్వేచ్ఛలో మానవతకు పట్టం కట్టాలని
చీకటి ముక్కలు రేఖలు రేఖలుగా నయి
దేని కది స్వతంత్రంగా బ్రతకాలని

స్నేహం ఇరు తీరాల మధ్య
వంతెనయై జన శ్రేయం కోరేను
నేత అంటే సమీకృత జన సమూహాన్ని
నడిపే వ్యక్తి, సమాజ శక్తికి బల కారణం
విధ్వంసంలో కాలం! కదలలేని స్థితిలో
ప్రగతి మనో రూపం నుండి చేతన కోరేను

పరిచయమైన మనిషి వెనుక
పరిచయం కాని చరిత్ర ఎంతో
గుణ విభజన చేసే వారెవ్వరు?

ఎందరైన మహానుభావులు! విద్యుత్‌తంత్రులుమీటి
రాజకీయ సంగీతం వినిపించేవారే ! ప్రత్యేకంగా
విలయ రాగంతో పెనుతుపాను దూకించేవారే

# 6. ఎవరి విజయం

మహా తరువు జీవిత రూపానికి ప్రతీకయై నిలిచేను
తనలో ప్రయోజన విస్తృతికి అవకాశం ప్రకటించేను
బొన్సాయ్ అయితే వేరులకు సరిపడే
కుండీలో మట్టి చాలు, చివురు ముఖం విప్పారేను

ఎదిగే వృక్షం జీవిత వాస్తవానికి సంకేతం
వివిధ సందర్భాలలో ! సమాజంతో ఎందరినో తలపించేను
మనిషిలో ఆదర్శ రూపాన్ని అవతరింప జేసేను
ఇంకా పెరిగేందు కవకాశం ! ఎంతో మిగిలి పోయేను

సమాజం - ప్రకృతి రెండూ వేరు వేరు కావు విభాగాలు
మనుషులపై తరువుల ప్రభావం! అమేయం ఎప్పటికీ
నిర్మలపైన మనసుతో చర్చలు గడవడం అవసరం
సుఖకరమైన బ్రతుకులో చర్యలు పూనడం ప్రధానం

పైన మబ్బుల వలె జలనిధిలో తరగల వలె
భూమిపై మనుషులు కలుస్తూ విడిపోతూ

ఆధునికంలో కవితకు వస్తువు కొరత లేదు
చుట్టూ విషయ సంపద పుష్కలంగా సమస్యలతో
స్వీయ ప్రతిభ మేల్కొనేను, తనదైన దృష్టి కోణంతో
ఉచ్చ నీచ దీన హీన, శత్రు మిత్ర రణం శాంతి జాడలతో

ఏది అందినా ఆహార్య కావచ్చు ఆలోచన మారొచ్చు
జ్వలిస్తూ సరిస్తూ అక్షర పంక్తులు కోకొల్లలు
వీటి నిర్వహణం కవి మనసుకు క్రీడాలోలం
అనుకున్నంతలో జీవితాల విలువల్ని పెంచేను

రాజకీయ స్పర్శలేంది, సమాజ స్పృహలేంది
బ్రతుకులు లేవు రచనలు ఉప్పులేనివే

మబ్బుల వలె కలిసేరు కవులు విశ్వవేదికపై రచనలు
చెట్ల ఆకుల వలె దూర దూరం రాలిపోయేను

సమాజ సమస్యలన్ని తమవే అన్నట్లుగా కవులు
చరిత్రకు తాము కారణ మన్నట్లుగా ఒకరొకరు
ఈ విజయం ఎవరిది? తెలియని సామాన్యలదా?
తెలిసిన మతి మంతులదా? నేతలదా? స్వార్థపరులదా?

# 7. క్షణాల నుండి

క్షణాల నుండి రోజులు ఏండ్లు గడచే
వ్యక్తి జీవితంలో భద్రమైన అనుభవ సంపద
ఒకటే మిగులుతుంది, మనిషి సమాజం స్మృతిలో మిగిలేను
కాలాంతరాన కొన్ని చెదరి కొన్ని పోయి కొన్ని ముక్కలై

వీటిని, సరిచేసే పరిశోధనతో తృప్తి పడేరు ఆశావాహులు
అన్వేషణలో అమూల్యాలు దొరికితే! ధన్యం, అదృష్టం
దోషం మలినం జటిలం కుటిలం క్లిష్టతలో
మంచి చెడు కోపం సహనం శాంతితో మిశ్రమం

ఉన్న వాటి లోనో పొందిన చేరిన వాటిలోవా
ఎన్ను కోవడమొ మనుషులు చేసే, గొప్ప పని
అనుకూలంతో వ్యతిరేకం భరించక తప్పనిది
సంశ్లిష్ట సంచయాలతో నడుస్తుంది జీవితం
ఎవరిదీ ఎక్కడా ఆగే ప్రశ్న లేదు, ఉన్నదేదో?
ఎవరూ అడగని ప్రశ్నలకు తన మదిలో మాటలతో జవాబులు

కష్టంలో బరువు లెక్కువయితే గాలులు వహిస్తాయి
బ్రతుకులో బాధ్యతను మరచి పోకపోవడం విశేషం
మానుష ధర్మానికి ప్రాధాన్యం జ్ఞాపక సరణిలో
తళతళ మెరుస్తూ ఆకర్షించేను, స్వచ్ఛంగా సూటిగా

ఉన్నా లేకున్నా, మరో తరానికి అందించే విలువైనవి
మనిషి జీవితంలో ఉంటాయి గుణవంతాలు మౌనంగా
ఇవి స్వార్జితాలు కాలానికి ప్రత్యామ్నాయాలు అలంకారాలు
సమాజ సంస్కృతికి ఉజ్వలవికాస విభవాలను పెంచేనూ
భయం వదలి ధైర్యం నర్తించే మనసులో
ఆశాంచలాలలో మోదం ! పద్మంలా వికసించేను
మదిలో సుమ పరిమళ ప్రసారాలు చేరవచ్చు
బాగ్ నుండి ఆయుధం హఠాత్తుగ ముఖమెత్త వచ్చు

ఆలోచన వివేచనతో వివేకం ఆదరణంతో
ఎదురు పడే ప్రవాహాన్ని దాటించేను తీరం చేర్చేను
ఈత నుండి పడవ వంతెన విమానం యానంలో
వ్యక్తి వికాసానికీ సమాజ చేతనలో శక్తికి నిదర్శనం

# 8. ఇంద్ర ధనుసు తీగెలపై

నేత వలె కవి రాజకీయ చేతనతో సమాజ ప్రేరణతో
ఆయుధాన్ని వహించే విశేష సందర్భం! సహేతుకం కావచ్చు
వ్యక్తిలో సకారణ స్వేచ్ఛలో వాస్తవ గతిలో సంకల్పం ముఖ్యం
ఆయుధ సహితంగాను ప్రత్యేకత పొందవచ్చు ఉద్యమం

గాఢత విపులతతో అంకిత భావం గుణ రాశియై
విజయ పథంలో నిర్ణాయక పాత్రను పూనేను నిజ పథంలో

సమాజ చరిత్రలో మహా ప్రజల పాత్రలో కవి
అనల పథం తప్పక పోవచ్చు, నడకలో విచిత్రం
వివిధ నాద వివాదాలలో ఏ పార్టీకి ఆ పార్టీయే
దేని చరిత్ర దానిదే! కవి వ్యక్తిత్వం కూడ డిటోనే

తనలో గుణమూ దోషం నిరూపణతో నిర్ణయంతో
ఏ వైపు మొగ్గినా మనిషి హృదయ స్పందనమే ప్రమాణం

ఇది నవమానవం, కవితల నావహించి నిలిచేను
ఇది ఎవరికి తలవాల్చని ప్రకాశ గుణ శిఖరం
రణంలో చిందిన నెత్తురు చుక్కలతో గీసిన
రేఖల చిత్రాన్ని కళగా ఎవరు ఇష్ట పడతారు

ఎన్ని భావ ధారలతోనో సమన్వయం పొందేను
పరిమళం చల్లిన దృశ్యం! విజయ పవనంతోనే

కొరవి జ్వాలయొ ! రవి రశ్మియొ విద్యుత్ బల్బొ దీపమొ
వేరు వేరు వికాస దశల క్రమంలో దేనికది తనస్థాయిలో

గగనంలో విసిరిన ఇంద్ర ధనుసుకు కొన్ని క్షణాలైన
తంత్రులన్ని అమర్చి స్వర చిత్రం చూపాలనీ

కళా హృదయంలో స్వగతం ఎవరికి తెలుస్తుంది
తెలియకపోయినా అనుభవ మతి గుర్తు పట్టవచ్చు

మధ్యలో గాయ పడితే ఎక్కడికి వెళ్ళేరు
“నిజం” ఉదయ బింబంలా చేతి కందనిదీ

పుట్టుకతో స్వచ్ఛంగా స్వతంత్రంగా ఉన్న మనోబింబం
పెరిగే కొద్దీ గీతలు రాతలు గుర్తులు తుడుపులు
ఏవేవో! నిచ్చెనకూ వంతెనకూ విమానానికి అందని
ఎత్తులో !నెత్తురు చుక్కల రేఖలతో ముఖ చిత్రం!

# 9. సుందర వాస్తవమై

ఏ వైపునైన మంచిమాట కవిత సృజన శిఖరం
చదివాకనో వినిన తరువాతనో, ఒంటరిగానో
నిశ్శబ్దంలోనే అర్థం విశాలతను పొందుతుంది
కొత్త భావ జగతిలోకి సరాసరి దింపుతుంది సుఖంగా

అంతవరకు పరచబడిన ఉల్లోల కల్లోలం శమిస్తుంది
ఇది దేని ప్రభావ రూపమయినా అంతో ఇంతో తప్పదు

మానసికంగా ఒక కదలిక కోలాహలం ఒక ఊపు
పొందవలసి రావచ్చు వివిధ స్థాయి బేధాలతో
కవి సహజంగా పోసిన ప్రాణం తోనే బాధ్యతగా
అక్షరానికి ఆయువు, బ్రతికేందుకు అవకాశం

ఇది జలధిలో మునక వేసి పైకి లేచి
అలలపై ఈదుతూ తీరం చేరడం ముఖ్యం

సాహస కార్యానికి బాష్ప కణం జారవచ్చు
హ్లాద మయితే చంద్ర కళ రంజనంగా
మోదమయితే ఉదయ కళతో శాంతంగా
అతీతమైన అనుభవం ఇదొక శిఖర సమం

దీనికే సీనులు పరిమితులు లేనే లేవు
సహృదయు లందరు కవితా బంధువులే

గట్టు నుండి మైదానంలో వెళ్ళే దారిన
కవుల మాటలో, కవిత కళామయమై
అభ్యుదయ ప్రకాశమో! విప్లవ జ్వాలయో
స్వతంత్రమైన స్వేచ్ఛా సమన్వయ రమణీయం
ఆవిర్భావానికి ముందు కవితకు మనో వేదికపై
నిశ్శబ్దం పరచబడీ గగనాకృతిలో మౌనంగా నిలిచేను

గతంలో తగిలిన గాయాల గుర్తులు సమూహంగా
మరపున బడి ఇపుడు వాటికి బదులుగ హఠాత్తుగా
గులాబి మల్లె చేమంతి పారిజాతం ఒకటొకటీ
సమయ సమయ విరామాలతో క్షణాలు!
నాల్గు దిశల నుండి సమన్వయ భావనతో
కవిత విశ్వ శ్రేయమయినా వ్యక్తి వికాసమయినా

సమాజ చలన గమన శీలంతో
ఒక సుందర వాస్తవమై చరిత్రలో

# 10. స్వర్ణ పేటిక

శుభావహంగా గడచింది ఒక వత్సరం శుభకృత్
దీవి ననుసరించి వచ్చేను మేలుకు అందం చందం కూర్చే
శోభకృత్ భౌతిక మానస స్థాయిలలో ఆశామయం
ఒకటి తరువాత మరొకటి అరవై ఏడులు మనోజ్ఞంగా

తిరగే కాలచక్రంలో అరలొకటొకటీ వత్సరం పాటు
ఇది ఆగని యానం! సమాజ భవితకు గ్రీన్ సిగ్నల్

ఇంటి కెదురుగా చెట్టు నిండుగా పచ్చగా సుమఫల భరమై
ఆకర్షణయై ఇది! ఎకడమిక్ ఎక్సర్‌సైజ్‌లో భాగం
ప్రజలందరి మన్ననల్ని పొందిన సర్వజనుల పండుగ
కాల గమనంతో సమాజం జీవితం ముడపడిన అదృష్టం

వర్తమానం నుండి భవితకు దారి చూపే సూచిక
జ్యోతిష చక్ర భ్రమణంలో దాగిన అతీతాన్ని గుర్తించేను

అభిప్రాయ భేదాలు సమసి ఒకే వెలుతురు సందర్భం
కాలం నుండి బ్రతుకులోన బింబించే పరివర్తన విభవం
ఉన్నదానితో తృప్తితో కావలసిన దానిపై ఆశతో
రెండిటి మేళనంతో ఉత్సవ కళతో బ్రతుకులు
తనలో నవ నిలయం తలపులు తెరచిన స్వేచ్ఛా సమాజం
మతి ప్రభకు పట్టం కట్టేను జ్యోతిష నిర్దేశంలో భాగం

ఎవరి కెవరు అనుకూలురొ!ప్రతికూలురొ తెలియని స్థితిలో
రావలసిన ఫలితంపై ఫోకస్ ప్రసరణ మనివార్యం
ఇంతవరకు బహు వికాస దశలు గడచి
ఎందరి చేతనో ప్రకాశ స్థితులు వెలసి
ఈ రోజున కూడ భుక్తికై వీధులలో దరిద్రులు
గడవడం కష్టమైన జీవన బాధల బంధనం

చేరవలసిన గమ్యాలింకా మిగిలే ఉన్నాయి
పొందవలసిన ఆచరణ ఇంకా మిగిలే ఉంది

శూన్యమైన బానల వలె నింగిని చూపే ఇళ్ళు
అంజలి చేతులలో ఎగసి వచ్చి పడే దుమ్ము! కళ్ళలోను

చరిత్ర పుటలలో తల దూర్చాలని కనిపించాలిని కొందరు
జీర్ణమైన శీర్ణమైన పుటలలో అణగిమణిగి కొందరు

రాజ్యాంగం మాత్రం స్వర్ణ పేటిలో బహు భద్రంగా
సంఘంలో నయితే కట్టెచెక్క బొగ్గు ముక్క అనుభవంలో

# 11. ఎవరికి జ్ఞాపకం

శుభకృత్ నుండి శోభకృత్‌కు కాలం!
మానవ జీవన పయనానికి నిరంతరతను చూపేను
ఇదొక విధంగా అమరతకు చిహ్నం పరోక్షంగా
ప్రకృతితో పాటు మనిషి మనసును అభినవ మొనరిస్తుంది

నాలుగు దిశల నుండి దారులు చేరిన చోటు కూడలి
కేంద్ర స్థానం మయింది, సహజీవన సమ భావన
జన చలనంతో సమ్మర్దమైన ఉగాది! అలరిస్తుంది
యోగ క్షేమ సమాచార సంస్కృతి సంపద కళతో

సెంటర్‌లో కవుల సమ్మేళనం ప్రతి ఉగాది రోజున
ఒక అనుభవ విశేషం సాహిత్యానికి పెద్ద పీటగా
తిండికి బట్టకు ఉన్న వారు లేనివారు, అందరూ
ఇరువర్గాలకు వేదిక ! కార్నర్‌లో అందరికీ ప్రవేశం

విభేదాలు విభిన్నతలు ప్రతికూలం వ్యతిరేకం
మరచిన పండుగ రోజు మరునాటి నుండి డిటో కావచ్చు
ముఖంలో అనల తేజం గుండెలో హ్లాద రూపం
ఒకరొకరిలో హిమపాతం ఈ సమయం వసంత హేలతో

ఒక ప్రశ్నకు జవాబులెన్నో మనిషి మనిషి కొక విధం
అన్నిటి సమన్వయంతోనే ప్రజాస్వామ్యానికి విభవం

చేసేందుకు కోరే పని, ఆకలిలో కావలసిన ఆహారం
సమాజ చేతనతో రాజకీయ చలనం అనివార్యం
మనో నిలయం ముందు ద్వార పాలకుల వలె
ప్రతి వ్యక్తిలో సహనం క్షమ ఇరువైపుల సిద్ధంగా

శూన్యం కాదు అంతో ఇంతో విలువలతో మౌనంగా
“మంచి” అన్నది నీటిపాయ వెలుగు రేక కుసుమంలా

చరిత్ర పుటల్ని ఆక్రమించాలని మండే కోరిక
నేతలు పాలకులు ఆశాపరులు ! ఆధిపత్య బలంతో
చుట్టు ముట్టిన అనల కీలల నార్పేందుకు ధైర్యంగా
మానవతా జలదం హృదిలో ఎవరికైన అవసరం

వాగ్దానాలు శపథాలు శూన్యంలో కలిసి మాయమై
ఆచరణంలో సంగతి ఎవరికి జ్ఞాపకం ఉంటుంది

అనురాగం అనుబంధం సంబంధం ఆంతరికం
ఒకటొకటి కలిపి అంతో ఇంతో పూర్ణత కూర్చేను
పండుగ తరువాత పండుగ స్టేషన్‌లతో
ఇది ఆగని పయనం! వ్యక్తి నుండి ఈ సమాజం

# 12. వాస్తవ శిఖరంపై

ఇంటి ముందు ప్రహరి గోడ అడ్డంగా నిలబడీ
తన కథ ఏదో ముందుగ చెప్పాలని బయట
నిరీక్షణంలో ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ
శిశిరంలో పాలిపోతూ ప్రియమైన వసంతానికెదురు చూచేను

ఇంటిలోని కథలు వేరు ఎవరి కథ వారిదే విశేష తలంతో
మధ్య మధ్య కలిసే దారులున్నా ఎప్పటి అనుబంధంతోనో
దారులు! మానుష యాన రూప ప్రసార రేఖలతో
మానవీయ సంబంధం తీర్చిన అపూర్వ చరిత్రతతో

అడవి ఊరు నగర జీవన దృశ్య పరంపరలు
భౌతిక మానస వికాస విజయ వాస్తవ కల్పనలతో
కవిత ! పుష్పక విమానం కావచ్చు సబ్‌మెరిన్ అవచ్చు
పూర్ణ చంద్ర బింబం కావచ్చు! హృదంతరం నవం

ఒండరిగా బ్రతికేరా? ఎవరూ ఉండలేరు బ్రతుకంతా
పరివారంతో వెనుక నుండి వస్తూ పోయే జనచలనం

ఎదలో తాపం! ముఖంలో ధగధగ లాడుతుంది
దీని జ్వాలా రూపం ప్రేరణయై వెలుగుతుంది

పలు విధాల పూలవలె మనుషుల హృదయాలు
మేఘం రాకతో వర్షం సేచనతో భుమి నుండి సృజన

ద్వారం ముందు బయట వసంతం తారాడుతుంది
అందరికీ అనుభవ సుందరతను చేకూర్చేను

మేఘ వాహనంపైనొ, జలద ఛత్రంతోనో
పైన గగన సీమలో తిరగాలని, ఎందరికో

రవి ఉదయించే దిశ ఎప్పటికీ ఒకటే అయినా
సమ న్యాయంతో అన్ని దిశలలో కిరణ ప్రసారం

ఎంత పాత దయినా, కవి హృదయం స్వీకరిస్తుంది
పాతను మన్నిస్తూ కొత్తను పొందుతూ కవిత మారేను
చరిత్రకు సమగ్రత కూర్చడమే సన్నివేశ లక్ష్యం
మనిషిలో మనో పార్శ్వాలను గుర్తించడమే కావలసిందే

మనిషితో పాటు పెరిగే చెట్టు ఒక ఆకర్షణ
ఎన్నిటినో జ్ఞాపకం చేసేను, మరచేనని మనిషికి

మనసులో చేరిన వస్తువుల ఒత్తిడి నుండి
ముక్తమయ్యే సాధనం! కల్పనలో స్వప్నం! వాస్తవ శిఖరంపై

# 13. మానుష క్రియ

వస్తే సకాలంలో కాస్త అటూ ఇటూగా
మేఘాగమనం మనిషి దృష్టి నలకంరించేను
అకాలంలో హఠాత్తుగా రావడం క్వాచిత్కం
విషమ పరిస్థితులలో ఉపశమన మొనర్చేను

ప్రజల బ్రతుకులో కావలసినవన్నీ ఇప్పటికి ఉన్నవే
అంతా తెలిసిన కార్మిక కర్షక వృత్తికారుల జీవితాలే
పూర్వ పరిచయంతో అంతా తెలిసినదే
ప్రాణిని బ్రతికించే పంట కొత్తది, మిగతావి అవసరాలలో

ఫలితం చేతికి రాగానే మనిషిలో బాధ్యత మాయమయ్యేను
ఉదార దృష్టి స్థానంలో వ్యాపార బుద్ధి విస్తరించేను

ఎక్కువ ఉన్న వ్యక్తి ఆహార్యంకై ఎన్ని పాట్లు పడేనో
తక్కువ అయిన వ్యక్తి ఆహారంకై ఎంత ప్రయత్నమో

ఇది పిల్లల బొమ్మల నాటక ప్రదర్శనం కాదు
జీవన చలనంలో ఎత్తుకుపై ఎత్తులతో విజయం లక్ష్యంగా

బయటికి వస్తే ఉపాయాల మాయాజాలం
వేదికపై ఎపుడు ఉండేదీ వచ్చేదీ అంతా సందిగ్ధం
మనిషి మతిని అగ్ని సాక్షికి గురి చేసేను
సమాజ రూపాన్ని మార్చే కోణంలో ప్రతి ఒక్కరి దృష్టి

కారు కారుకూ శ్రమ చేతన మళ్ళీ మళ్ళీ తప్పనిదీ
దరిద్ర మెక్కడికి పోతుంది? పసి కడితే తిష్ట వేస్తే
ఎక్కడికీ పోదు మనుషుల వెనకనే నడుస్తుంది
ముఖ్యమైంది మరొకటి ఉంది పైకి కనిపించని మనోమయం

కణాలలో తీరని అవసరాల ఒత్తిడిలో నలిగి
హత్యలకు ఆత్మ హత్యలకు గురి అయ్యేరు
కలహ చర్యలు రణోత్సాహం కలిసిన తీవ్రత
మృత్యువును వదలి లోయ లోకి దూక చూసేను

సమాజ విశ్లేషణంతో పరిశీలన మొక అవసరం
సరి అయిన నిర్వహణ ప్రణాళికకు దారిని చూపేను

పోరాటం సంక్షోభం ఉద్యమం, విప్లవం పేర్లతో
ఇది ఆషామాషి వ్యవహారం కాదు, మానుష క్రియ
నీరు లేని మేఘంలా శిలల మధ్య సమావేశంలా
మనుషుల్ని ఎండమావులలో త్రిప్పేను భ్రమింప చేసేను

# 14. సృజన భాక్

రాలిన ఒక్కొక నెత్తురు చుక్క చిత్ర విచిత్రంగా
ఒక పూవై అలరిస్తుంది, పరిమళంతో అలంకరిస్తుంది
అప్పటి కప్పుడు లభించే త్యాగ ఫలంగా
యశోమయం! ఇంత కన్న కావలసిందేముంది?

యథార్థం తల క్రిందులవుతే, వ్యవహారం ఆదర్శం
కల్పనలు కావచ్చు స్వప్న చిత్రమవచ్చు! అనూహ్యంగా
నిజం ఎదుగుతూ పైపైకి పోతూంటే దివిపై దృష్టి పడేను
భూమిపై భ్రమిస్తూ ఉంటే, ఇంటి ముఖం పట్టించేను

ప్రతి మదిలో ఈ జీవితం ఒక కథగా అల్లుకునేను
కాల ప్రవాహాన్ని మనసు రూపాన్ని చూడాలని కోరిక
ఆరు రుతువుల ప్రభావాలతోనే సరిపోతుంది
పలు పాత్రల నటనతో సమయం వెళిపోతుంది

ప్రతి హృదిలో తమ కథ పదిలంగా ఎందరిలోనొ?
మరొకరిలో ఆసక్తి మాలగా తీర్చబడేను
భూమిపైన మనిషి అడుగు పడితే
దారి జాడ! కంటి ముందు ఏర్పడినట్లే

అడ్డదారులెన్నొ ? మధ్య మధ్య ఎన్నిటినో క్రాస్‌చేస్తూ
ఆటంకం కలగవచ్చు; విరమణమొ తలచవచ్చు
పంట బాగా తేలింది, తోట ఎంతో ఎదిగింది
సంతోష బాష్పకణం అమృత లవ మయ్యేనా?

రైతు పొలం నుండి ఇంటికి ఒక పొరలో మోదం
పై పొరలో శూన్య హస్తంలో చెల్లు చీటితో ఖేదం

ముని మాపున నివాసం చేరడమొకటే మిగిలేను
దేనికైన నిరీక్షణ మసలే లేదు, పరివారం తప్ప

గగనంలో రవి తాపంచే నీడ క్రిందికి దిగేను
దిశలలో మేఘంచే వర్షం తరలుతూ పోయేను

ఎవరికి చెందిన అందిన పనివారు చేసుకుపోవడమే
వసంత సుమఫల నిరీక్షణంలో తృప్తిని చూస్తూనే

కవితలో అక్షరం శాసిస్తుంది దీవిస్తుంది
ఇది నిజ జీవన సమాజ దృశ్యానికి సృజన భాక్

# 15. సహభావన

మోదంలో బాష్ప బిందువు చల్లగ వెడలుతుంది
శీత పవన రేఖ స్పృశిస్తుంది, ముఖాన్ని హ్లాదంగా
ఖేదంలో అదే బిందువు వెచ్చగ తరలుతుంది
దేని కది వేరుగా హృదయం తలుపులు తెరవబడీ

కవితలో ఇది అనుభూతి చే బ్రతుకులో
బింబ ప్రతిబింబ భావ సమాకలన రమణీయం
చూపు కన్న అనుభవంలో కరస్పర్శకు తెలుస్తుంది
సాధారణ స్థాయిలో దృష్టికి రెండు కళికలూ సమానం

పని లేని తీరిక పై తూగాడే సమయంలో
మతిలో స్మృతిచక్రం తిరుగుతుంది స్వేచ్ఛగా

పగలు రవి పాలనలో రాత్రి చంద్రుని వశమై
ప్రకృతికి సరిపడేట్లుగా బ్రతుకుల సరళిని
రోజువారి కార్య క్రమాలతో అలరించేరు ప్రజలు
ప్రకృతితో సమాజ సమన్వయ మొక విజయం

ప్రతి వ్యక్తిలో బయటపడని లోన దాగిన
తెలిసీ తెలియని మనిషికై అన్వేషణం
ఇదొక చిర బంధం! కాలం గడుస్తుంది అలవోకగా
ఆదర్శం నుండి కల్పనకు, కల్పన నుండి యధార్థానికి

దేనికేది అవసరమో అది లభిస్తేనే తృప్తి సార్థకం
లేనిది ఫలితం పూర్తిగ చేతికి రాక పోవచ్చు

చౌర్యం మోసం నేరం శత్రుత దోషం
తమకు దొరకిన గూళ్ళను చేరేను

చీకటి నెవరు దగ్ధం చేయగలరు?
మనిషి మనసును వికల పరచే స్థితిలో

జటిలమైన సమస్యలతో చీకటి ముడులతో బ్రతుకులు
ప్రమాద మెపుడు జరిగేదీ, అపాయమెపుడు కలిగేది
తెలియని స్థితి! సంశయ డోలాందోళనలో మనసు!
ఇంతచేసి పక్కన నీడలో చీకటి బొమ్మలు! ధైర్యంగా

చీకటి గోడ! కొంత సమయం వరకే
సూర్యుని కిరణ జాలంతో అదృశ్యమయ్యేను
ఎవరి యత్నం సహాయ సంపద లేకుండా
ప్రకృతితో సహభావనతో పరివర్తన సంకేతం

# 16. విషాద పర్వం

విషాద పర్వంలో బాధను వహిస్తుంది బాష్ప బిందువు
ప్రతి రుతువు ప్రభావంతో ప్రత్యేకత చూపుతుంది
ఉదయం పైకి చూస్తే రోజు రోజుకీ
ఆకాశం పరచబడీ విశాల హృదయంతో
నాలో దిగుతూన్నట్లుగా ఉంటుంది
సాయం సమయంలో కుంచిత మవుతుంది

కాలాంతరాన ఆలోచన కప్పుగ మారేనా?
ఇది ఎవరో చెప్పేది కాదు! చర్యకు దిగలేనిదీ

ముక్కలు ముక్కలయి గతం! చరిత్రలో ముఖమెత్తేను
బృహదాకృతిలో సాగే కవితకు వస్తువు! పుష్కలంగా
జలధి నుండి విడివిడిగా బయలుదేరిన మబ్బులు
అక్కడక్కడ కలిసి ఒకటై జలదాతగ మారేను

ఆ ఎత్తులో సృష్టి ఈ దిగువన పేద బ్రతుకులు
పెద్దల దృష్టి పడని జీవన గాథలతో వ్యథలతో
కల్పనకూ వాస్తవానికి భిన్నం! ఈ అక్షర ప్రపంచం
కవిత అంటేనే ఇరువైపుల బొమ్మలతో నాణెం! చలామణిలో
ప్రశ్న వెనుక సమాధానం తనదైన దార్శనిక పథంలో
బాధ్యత ఎంతటిదో తూకంలో భూమి బరువు చాలదు

దూరం మాట లేదు స్వపర భేదాలులేవు అంతా ఒకటే
కష్టమైన నష్టమైన మానసికంగా బాధ్యత వహించవలసిందే
ఏ దృశ్యం విడువరాదు, ఏ నిరాకరణం జరగదు
అందరికీ ఆహ్వానం, అక్షర నిలయానికి కవితలో

ఎవరి తిరస్కరణం లేదు ఎవరి బహిష్కరణం ఉండదు
కవి బాధ్యత ఎంతటిదో ? ఆకాశం భూమి విస్తుపోయేను

రాగమయం కాని పగలు లేదు
శాంతి పదం లేని రాత్రి లేదు
ఎన్నిటికో సరిపడేది దొరకడం అదృష్టం
ఎంత సేపయినా నిరీక్షణం తప్పనిదీ వాస్తవం

పీడన నుండి విరోధాన్ని శత్రు శిఖల దాక
అణచివేత నుండి నిరోధ గుణ చర్యల వరకు
జల నిధిలో నుండి నావలా గగనంలో స్వర్ణ విహగంలా
తన కాలానికి నిజ బింబానికి కవిత అక్షర వాస్తవం

# 17. ప్రకాశ రూపం

సృజన ప్రతిభ నుండి ప్రకాశ రూపం
కవిత! అక్షర నిలయంతో దివా నిశలు
వెలుగు పాత్ర వహించేను తేజో హృదయంతో
చరిత్ర పుటలో దాగిన 'నిజం' రహస్యాన్ని చూపేను

తెల్లవారినా రాత్రి చీకటి ముక్క దాగింది ప్రశ్నిస్తుంది
ఎక్కడిదో ? మిగిలిన స్థానం, ఏమిటని? ధీమాగా
అవసరమయితే ! ప్రబోధాలు శాసనాలు తయారుగా
మారేను ! సమాజ చింతనలో ప్రజాస్వామ్య బలంతో

క్రింది నుండి పై మెట్టు దాక అహంకార మందరిలో
జనుల మనః ప్రపంచాన్ని నడిపించేను పాలించేను
మట్టిపై అడుగులు పడేంత వరకు అందరూ సమానం
కాళ్ళు పైకి లేచి చేతులు రెక్కలయి ఎగిరితేనో
ఇక చెప్పేదేముంది? మనిషి చూపే గొప్పదనం
మతి విభవంతో పరిష్కారం లేని సమస్యలేదు

ఎవరి కంటి నీరు తుడిచేందుకు
సూర్యుడు వచ్చేను, కిరణ ప్రసారంతో
ఎవరిలో ఉత్తేజం నింపాలనుకునేను
సంక్షోభం లోనే కాదు అవసరాలలోను

గగనం భుజాలపై కెరటాల చేతులు వేసి
నడవాలని, గట్టు దాటాలని జలధిలో కోరిక

చీకటితో మనిషికి స్నేహమెప్పటిదో?
పుట్టుక వెనక తల్లి గర్భంలో తెలియనిది
చీకటిలో మాట! ఎవరికి జ్ఞాపకం?
శబ్దం నుండి వెలుతురు ప్రవాహంలో తేలవచ్చు

మనిషికి కావలసింది దొరకడం భాగ్యం
బ్రతుకులో విలువలు పెరిగేను, విస్తృతితో

వర్షం కయి చేతులు చాస్తే పిడుగు పడవచ్చు
బయటికి వచ్చాక సమాజం ఏదయినా కానీ ఇస్తుంది!
ఇది స్వేచ్ఛా కవిత్వం! మనో విహగంపై ఆగని అక్షర యానం
కాంతి శాంతి రెక్కలతో ఇరువైపుల భద్రంగా సమాజ హితంకై

## 18. అదే మనిషి! చేష్టలు వేరు

అదే మనిషి ! ఒక అవసరంలో దేవత కావచ్చు
మరో సందర్భంలో రాక్షసంగా కనబడవచ్చు
ఏ క్షణంలో ఏ పని కేది అవసరమో
లోనుండి మనసు శాసిస్తుంది! అంతే

కాలం జడంకాదు నిత్య చలన గుణంతో చేతనలో
లోనుండి మనో రూపాన్ని తగిన విధంగా వెలువరిస్తుంది
ఒకరొకరి సహకారం వ్యతిరేకం మిశ్రమ రూపంతో
సమాజానికి అనల గీతమో మేఘరాగమో వినిపిస్తుంది

కింద భూమిపై ఉల్లాసం జన గణాలలో ఉత్సాహం
నింగి లోన మేఘం ఉరుములు మెరపులు వర్షం!
భయం వదలి మనిషి అన్నిటిని దీటుగా ఎదుర్కొనేను
ప్రాణ స్పృహతో ప్రకృతి నుండి సహకారం లభించేను

ఆశలు ముఖాలెత్తి చూస్తాయి, మానుషాన్ని వరిస్తాయి
ఆర్ద్రభావ ప్రభావంతో మనిషి సృజన పథం పట్టేను
జీవన చిత్రాలతో నిండిన వర్తమాన దృశ్యం
ఓటమి నంగీకరించని స్థిర చిత్తంతో ఆలోచనలో
ప్రగతికి రెడ్ కార్పెట్ ! పరుస్తుంది సంకల్పం
మానుష యత్నంలో విజయానికి బాటలు తీయబడేను

ప్రతి స్వేద కణంలో ఒక వజ్ర శకలం
ప్రతి అడుగు జాడలో తొంగిచూచే భవిత
మనసులో ఉత్తేజం నవతపై దృష్టిని పడజేస్తుంది
సమాజ శక్తియే వ్యక్తిలో అస్తితలకు దిశదశ చూపుతుంది

దూరాన సాయం సంధ్యలో వెలుతురు, చితి మంటను
తలపించేను, ఇది భయంలో ముంచి పైకి తీయబడేను

కాలానికి చివర లేదు, ఏ రూపం రంగులోనూ
మనిషి బ్రతుకును ఉద్వేజితమొనరిస్తుంది
జడ రూపంలో శకలం సకలం కావాలంటే
మానుష శక్తి ప్రమేయంతో చేతన అవసరం

# 19. నాటకంలో పాత్రగా

నాటకం చూడాలనే దాని కన్నా
నాటకంలో పాత్రగా నటించాలని
వచ్చే వారెందరో! నటనపై మోజుతో
ఏ రూపం ఏ పాత్ర ఏ విధమయినా సరే!

జీవితంలో నటనలో మనిషికి సహకారు లెందరో
ప్రకృతిలో పరిణామ ఫలాలకీ ఇవి ఎంతో సామ్యంగా

తాప దాహ సమయంలో క్లిష్టమైన లిప్తలో
కొన ప్రాణం కొట్టు మిట్టాడే స్థితిలో
ఆయువు నిలిచేందుకు వాన చినుకు అవుతుంది
అమృత బిందువు! అనుభవంలో మరో ఉదయం

మనిషి చుట్టు సహకార వాద్య విశేషాలెన్నో
లేంది! చిన్నదో పెద్దదో కచేరి రక్తి కట్టేదెలా?

అడవి నుండి దారి తప్పిన సింహగర్జన
ఊరు పొలిమేరలలో భూమిపై
నింగిలో అవతరించిన మేఘ గర్జన
మనిషిలో సరికొత్త ఆశా ప్రపంచాన్ని నిర్మించేను
ఇది విశాల సమాజానికి కాలం ఇచ్చేసృజన సూచన

తోడు నీడ లేక మనిషి ఒంటరిగా! బ్రతికేనా?
ఇది ధ్యానానికి బాగా ఉపకరించవచ్చు
జీవన సుస్థితి వాస్తవానికి అందరి బంధంతోనే
మనిషి చుట్టు సహోదరుల్లా ప్రకృతి రూపాలెన్నో

స్మృతి రేఖలతో చుట్టబడిన మేధ
తన అస్తిత్వంలో భాగం, పూర్వానుభవ విశేషాలు
గడ్డిపాక పెంకుటిల్లు మేడ సౌధం ప్రియమైనవి
ఉన్నవారికి సమాజంలో మానుష జీవన స్థాయిలలలో

కనుల నుండి జారిన నీరు తీగెలా సాగి
మోదంలో పూలను వేదనలో నిప్పులను పూయవచ్చు
కుడి ఎడమ చేతులలో జీవన సారభూతమైనవి తోచేను
ఊహల ఊయలపై మనిషి, గగన తలంపై దిగాలనీ

అడ్డంగా పడి ఉన్న కొండ రాయి మధ్యలో
తగలకుండా ఉంటే చాలు, అక్కడికి సంతోషం!

## 20. ముళ్ళు పూచే మనసు

అన్నీ ఉదయం మొదలు రొటిన్‌కు చెందినవే
విశిష్టమో ప్రత్యేకమో ఏదో కొత్తది, కవితలోనే

కాలం భూమి తలంపై వాహనమో
కాలం జలధి అలలపై నావయో
కాలం గగన తలంపై విమానమో
త్రిదశలలో భౌతిక మానస తాత్త్వికాలతో

చేతన మూలంతో ఒక్కొక తీరులో వనశోభ
జీవన వినియోగంలో ఒక్కొక విధం పనులలో

వర్తమాన సంస్థితిలో ప్రజాస్వామ్య దార్శనికం
ఒక సుందర వాస్తవానుభవంతో సమాజ చలనంలో
కర్తవ్య పాలనం బాధ్యత వినియోగంతో ఆదర్శం
ఈనాటి కవిత! ఎవరికి వారే సాటిగ, విశ్వమయం

ప్రతి కవి వ్యక్తిత్వం అపూర్వం, విశ్లేషణలో
తన మానస చేతనతో అనితరం అసదృశం
ఎప్పటికపుడు అభినవ ముద్రలతో
అంతో ఇంతో ప్రభావ సంపన్నత కలిగిందీ

ఎపుడో ఒకరిది ముందడుగు పడీ
ఇది ఎప్పటికీ అందరికీ చెల్లదవుతుంది

కవితలో కమనీయమో స్పృహణీయమో
మాట వెనకనే మేఘ శకలం కదలాలి
దారి చూపే ప్రగతి బింబం వెలగాలి
ఉదయవేళ బూది రాలే ముఖం కారాదు

ఏ రోజయినా వీధిలో రంగుల ముఖం ఎదురు పడవచ్చు
ఎదలో నిప్పులు దాచుకుంటేనే బొగ్గో, బూదియో? అన్నమో?

కొన్ని పనులు కొత్తవి, కొన్ని పనులు పాతవి
బ్రతుకులో ఎవరికయిన ఎదురయ్యేవి తప్పనివి

మంచిని ఏరడం ఎవరికయిన క్లిష్టమైన సమస్యే
నేరం తెలిసి శిక్ష వెంట సంస్కరణ పర్వం అవసరం

పాపాన్ని తలచుకుంటే గుండె బండ అవుతుంది
ద్వేషాన్ని పెంచుకుంటే మనసు ముళ్ళు పూచేను

# 21. కవితలో అర్థం

ఒకరి కవితలో అర్థం మరొకరికి మరో విధం
భిన్న భిన్నంగా దారి మార్చడం జరిగేను
దాని లోని ప్రత్యేకత ఎవరికి తోచే
అర్థం వారికి ఇష్టం బహు ప్రియం
కాలం గడచే కొద్దీ క్రమంగా
“నిజం”పై పొరలు తొలగేను

ఎవరి సానుభూతి అవసర మక్కర లేనిది
జలధి అలల పైన పడవలా సాగుతుంది
చేరే దిశ నడిపే కళ పొందే గమ్యం ప్రయోజనం
స్వతంత్రమైన పథంలో ఎవరి స్వేచ్ఛ వారికి మితం

విభేదాలు వివాదాలు పార్టీలు స్లోగన్లు చర్యలు
ఎడం ఎడంగా జరిగే దూర దూర. ప్రపంచాలు
రాజకీయ ప్రయోజనాలు ఎక్కువగా స్వంత లాభంలో
లబ్ధికి ఎత్తులతో చతురంగా వర్తించేను మనసు! గుప్తంగా

జీవితాన ఏ విషయ మయినా సరే!
పైపైకి తరువులా ఎదిగేందుకు ఎప్పటికీ
ధనం పదవి కీర్తి పైరవీల కోలాహల సమూహాలు
భావన సక్రియతో విజయంపైకోరిక
ఎప్పటి కపుడు కనుచూపుకు దగ్గరగా
అనుభవంలో ఉన్నదే కవితలోను సంఘంలో వలెనే

రవికి దిశలన్నీ ఒకటే, దృశ్యాలు వేరు
కవికి నరులందరొకటే బ్రతుకులు భిన్నం
కవుల నంటుకొని విమర్శకులందరన్ని విధాలు
తెలియక పోవచ్చు కాని ప్రతి కవిలో రవిచంద్రులు

ప్రతి కవిత పరిచయం లేని కొత్త ప్రపంచం
ఒడిశెల నుండి మిసైల్ దాకా, రెండూ మనిషి చేతిలోవే
అడవి నుండి పొలం తోట బొన్సాయ్ మొక్కదాకా
గిరివాసం నుండి నగరం ఆశాజాలం లోకి
మనిషిలోకి సృజన భాగ్యమక్షర మయం
మస్తిష్క నిలయాని కతీతమైన వెలుగు దర్శనం

# 22. నిశ్శబ్దంలో శబ్దం

నిశ్శబ్దంలో శబ్దం చేతనతో గుప్తంగా
ఓంకారం కావచ్చు ప్రాణ బిందువు కావచ్చు
సూక్ష్మంగా దిశలు విస్తరించేను కాల సూత్రం
పర్యవసానం మనసులో విజయం ధ్వనించాలనీ

చీకటికి మృత్యువు లేదు. భయమసలు లేదు
భయపెట్టడమే దాని పని, నిరోధమే ప్రవర్తనం

అణువు నుండి అలల నుండి విద్యున్నవ తేజం
వెలుతురు రేఖలతో రంగవల్లీ యంత్రమై కవిత!

బ్రతుకులో ఘర్షణ పోరాటం వైరం సమరం
మూలమైన ప్రేమ ప్రసారానికి క్షతి కలిగేను
సంఘంలో స్నేహాన్ని మలిన పరచేను
స్వార్థం ద్వేషం ఈ చెడుకు తోడుగ నిలిచేను

ఒక్క కన్నీటి చుక్క పడవ అయి
మనసును తిప్పుతుంది ఆంతర శోక జలధిలో
మనసుకు తానొక పూల తోట అవాలనీ
అనుకునే లోపల జ్వాలా దృశ్యం కనిపించేను

మనిషి బయట దైవానికి ప్రతినిధిగా నిలచి
సేవలో గడపేను, ఆపై దైవంగా ప్రవేశించేను
ఆలయ నిర్మాణానికి అట్ట హాసమెంతెంతో
వాతావరణం మారేను పూర్తిగా మానవ పరంగా

ప్రతి పరీక్ష జీవితంలో వ్యక్తిత్వంలో భాగం
అంగీకరణం నిరాకరణం ఏదో కోరుకోవడం జరగదు
జన యానంలో సహనం అవసరమైనది ఎప్పటికీ
అన్నీ కాలంపై అనుభవంలో ఒదిగి పోవలసిందే

ఏ కవికీ కఠిన నియమాలతో పనిలేనప్పటికీ
కవితకు ఆంక్షలు ఉండవు, వెలువడే ఆకాంక్ష తప్ప

ముళ్ళతో బ్రతుకులు మొగలి పూవుల వలె
సమయాన్ని పరిమళితం చేసేను, అంతరంగ స్పర్శతో

ఏది ఏమయినా చివరకు మిగిలేది మానవం
అంతా “లీక్” అయితే, సంశయ జగతికి తావు లేదు

# 23. ఆయువులో

ఆయువు కాలంలో మనోజగం, కోరేను ఎన్నో!
అందున కొన్నైనా అందించే బాధ్యత పాలనదే
పరంపరగా వచ్చేవి కొన్ని, సరికొత్తవి మరికొన్ని
సమాజ గమనంలో భాగాలై వేగాన్ని పెంచేను

పరివర్తనలో కదలే వాస్తవ సమాజ చక్రం
నిరంతరత కోల్పోకుండా ఉండడ మవసరం
జనాభిమత స్పందన తోనే, ఇది సాధ్యం
ఏ విజయం! అదే మొదటి మెట్టు కాదు

సంస్కరణ మదే! చివరి మెట్టు కాదు
ఏమయినా మానవ చేతనతోనే పూర్ణత
ఇది ఎప్పటికప్పుడు విశాలమైన చరిత్రలో
ఇది అప్పటికప్పుడు సుదీర్ఘమైన చింతనతో

నిలకడ ఎక్కువయితే స్థితులు మందమై
శిలాకృతులేర్పడతాయి క్రమేణజడిమగా
చలన శీలంతోనే లక్ష్యం చేకూరేను
రవి సిగ్నేచర్‌తోనే రోజుకు విలువ

కంటికి కనిపించని విద్యుత్ ప్రసార రేఖ
తన అనుభవ ముద్రల తోనే తెలిసేది
ప్రతి హృదిలో రవి కిరణం మౌలికమై
అద్దాల కేసులో నాల్గు దిశలను చుట్టేను

కిరణాల చువ్వల బోనులో సింహం వలె సూర్యుడు
పయనంలో పై గగనం కిందికి దిగుతూన్నట్లుగా
బహు దగ్గరగా ఇంద్రధనుసు వస్తూన్నట్లుగా
మనిషిలో మానవత చుట్టలుగా చుట్టుకొనీ

రాజకీయ స్పర్శలేని ఆలోచనలు లేవు
వ్యాపార స్పృహ లేని జీవన గతులు లేవు

ప్రవాహ రూపంలో కాలం! సవేగంలోను
చీలదు! ముక్కలయి దూర దూరం విసరబడదు
నాటకంలో అంతర్నాటకం ఉన్నదే, కృతులలో ఎప్పటి నుండో
జీవితంలో పశ్చాత్తాపం మిషతో, నిర్వాకంలో మనుషులు

# 24. పుష్పం-ఆయుధం

దారిన అక్కడక్కడ నేలపై పడి ఉన్న పూలు
చూచి చూడనట్లు కాలినడకన పోతూ తొక్కుతూ
ఒకటికి రెండు సార్లు ఎక్సర్ సైజు చేస్తూ
ఎవరు వెళతారు, ఏమనుకునీ, ఈ విచిత్రం

వాహన మయినా దూరం నుండి కనిపించినా సాహసించి
దగ్గరకు వచ్చేసరికి తటపటాయించినా, కాస్త బెరుకుగా
సూటిగా తెలియనట్లు దూసుకపోయేరు, త్వరగా వేగంగా
జీవితాన ఉత్సాహం ఉల్లాసం ఆనందంతో అనుబంధంలో

భిన్నతలలో వివిధతలతో అనుకోని సందేహాలు
తీర్చుకుంటూ సమన్వయంతో సమాధాన పడుతూ
బ్రతికిన ఆదర్శ మూర్తుల కీర్తి స్తంభం చౌరస్తా మధ్యలో
ఒకరికి నచ్చిన యశో చిహ్నం ! మరొకరికి మానవ కంటకం

ఇది ఖడ్గ ప్రహారాలకు గురి కావచ్చు గాయాలతో
సుత్తెల మ్రోతలో ముక్కలయిన శిల్పాలు కావచ్చు

ఏ మహా భవనానికో పునాది రాయియై నిల్చేనో!
తీరం చేరజాలని అజ్ఞానంతో జలధిలో దూకుతూ
లోతును ప్రశ్నిస్తూ దూరం శంకిస్తూ బ్రతుకులు సాగేను
ప్రశ్నకు సరి అయిన జవాబు ఎంత కాలమైనా పట్టవచ్చు

పురాణ మహనీయులు చారిత్రకరణ విజేతలు
ఉదార చరితులు ఆదర్శాలు దేనికి? ఎవరికి?

ఎవరి చేతిలో ఎవరు ఆట బొమ్మలై, ఆడేదీ
ఎంత కాలమైనా తెలిసి రాక పోవడం, అభాగ్యం

చేతిలో ఎత్తిన పతాక! రెప రెప లాడుతూ
ఏదో చెప్పాలను కునేను, పూనిన వారికి తెలియదు

చూచే వారి మనసుకు తోచేనా? మరచేనా?
నెత్తురు చుక్కను చూస్తే భయంతో రణ చర్యకు దిగేరా?

చేతిలో ఆయుధం అనల స్వరం వినిపిస్తుంది
గుండెలో ధైర్య సాహసం చరిత్రను స్మరిస్తుంది
శ్రమ బిందువులో జ్వాలా రూపం ఆరేది కాదు
వీపున వేలాడే ఆయుధం! హృది కావచ్చు నలకరించిన పుష్పం

## 25. అనుకోనిది

ఉదయించే సూర్యుడు నిత్య నూతనంగా చివరి దాకా
లోన మనిషి మనో దర్పణంతో ప్రతిఫలించేను ఎప్పటికీ
జీవన ప్రవాహంలో తేలుతూ మునుగుతూ నిరంతరం
సరికొత్త అనుభవాల దృశ్య పరంపర ప్రతి కవిలో

దీన్ని గుర్తించే వారెవరో? అనుభవ తేజసులు కొందరే
ప్రాణ మున్నంత వరకు దేహంలో ఇదొక విచిత్రమైన అనుభవం
కోష్ణ సత్వ స్పందనంతో శ్రేయో జగత్తులో ఉపకృతితో
స్వేచ్ఛగా సమాంతరంగా ప్రయోజవ బంధం తెగనిది

ఆహ్వాన పత్రంతో పనిలేదు
స్వాగత తోరణ మక్కర లేదు
బాధ్యత తెలిసిన మనిషికి
ఇది ఉంటుంది స్టాండ్ బైలో

మనసులో బయటకి కనబడక ఉండవచ్చు
ముఖం కనబడినా అర్థం కాని వాలకం
దీనితో బంధం తెంచరానిదై చిరమై
ప్రతి కవిలో దీనిని తెలుసుకునే ఆరాటం

అనుమానం సందేహం జిగేషతో ప్రతి వ్యక్తి
భూమి నుండి గగనానికి ఆరోహణలో యానం
ఏకవి అయినా మౌలిక సంపదతో తన అస్తిత
ప్రత్యేకతతో వాస్తవ దృశ్యంలో భాగమై

దిశల నుండి వాన చినుకులతో మబ్బుల సందడి
నిండి నుండి ఆపై వెలుగు పూలు రాలే అవకాశం
ఉరి కంబం వశమయ్యే క్షణంలో అనుకోకుండా
తాడు తెగి నేలపై జారి పడడం ఆటంకం

వాస్తవానుభవంలో ఖేద మోద చక్రంపై
భ్రమణంలో ఆనందం మెలకువలో ఆశ్చర్యం

బాధలో వేదనలో మనిషి కుప్ప కూలినట్టైనా
లేచి ఎన్ని సార్లయినా యథాస్థితికి వచ్చేను
చెట్టు కూలి తిరిగి లేచి పూర్వ స్థితిని చేరేనా?
సృష్టిలో మానుషం అంతశ్శక్తి చేత మహనీయం

# 26. గెలుపుకు సంకేతం

ప్రతి రోజు వరస తప్పకుండ ఉదయం
వెలుతురు పళ్ళెంలో బహుమానం! అందుతుంది
ఏదో ఒక దిశ నుండి తొలి కిరణంతో
నిరాశకు జాగాలేదు, కిక్కిరిసిన ఆశాలోకం

పగలు నుండి రాత్రికి, రాత్రి నుండి పగలుకు కాలం
ఆటంకాలెన్నైనా అవలీలగా దాటేస్తూ పోయేను
గెలుపు ఓటములను వేరు వేరు బ్యాగ్‌లలో సర్దుతూ
ఖజాన వేసుకొనీ పయనమెంత దూరమైనా సరే!

తెలిసినా తెలియకపోయినా అమాయకంలో
ఆ రోజు గెలిచినా ఓడినా సాహస గతిలో
చివరకు వానలో చలిలో వసంత సౌందర్యాలలో
జీవన చరిత్రలో పాత్రల పరిశీలన తప్పదు
జరిగిన న్యాయం గురించి తనలో పరీక్ష చివరకు

అపుడపుడూ చందో బద్ధమైన పద్యం
హఠాత్తుగా ప్రత్యక్ష మవుతుంది, మదిలో
స్మృతి పీఠ మాక్రమిస్తుంది ఆత్మీయంగా
చకితంగా కొత్తదారి! ఎదురుగ విమాన పయనంలో

రెండిటితో మరొకటి మరొకటి భాగ్య రాశిలో
స్వేచ్ఛా జగతికి పూర్ణత కూర్చే సంపదయై
హృదయ మెంత విశాలమో వికాసమో ప్రత్యక్షంగా
మేధ ఎంత విభాతమో వైప్లవమో తెలిసిన వాస్తవం

ఇది తెలుగు కవితకు మహోదార చరితయై
తెలుపుతుంది గెలుపుకు సంకేతమై నవమై

చెప్పా చెప్పా 'స్వేచ్ఛ' ఎంత స్వచ్ఛమయినా చాలదు
తుపాను బీభత్సం ఎవరికి సమ్మతమవుతుంది

తనలో రవిచంద్రులు చుక్కలు ప్రతీకలు తెలిసీ
వ్యవహరించడమే నిజ జీవన తత్వంలో సౌందర్యం

స్వతంత్రమైన స్వేచ్ఛా పథంలో ఈనాటి కవిత
దిశ దిశ నుండి వివిధతలతో ధునులు ధునులుగ
గాయపడే స్థితిలో రక్షణయే తక్షణ కర్తవ్యం
మండే సూర్యుని ఖజాల పై జలదం శాలువాలా

## 27. చిరాను బంధం

చీకటిలో సతమతమయ్యే కనుచూపుకు
ఒక రెప్ప పాటు వెలుగు రేఖతో
కావలసిన దానిని చూపి వెళ్ళిపోతుంది
తిరిగి యథా స్థితి చేకూరుతుంది
ఈ చీకటి పలకపైన ఎందరి చూపులో ! భ్రమించేను

ఇది విద్యుత్ లహరి అని కొందరు
నమ్మిన దేవత ధరించిన ఆభరణమని
తన్వీరూపమని మరి కొందరు
శ్రమ జీవన స్వేదకణ పంక్తి అని మరొకరు

చీకటిలో ఏకాకృతిగా కనిపించింది
వెలుగు స్పర్శతో దేనికది స్వతంత్రంగా

ఎవరి భావనా ప్రపంచం వారిది
ఎవరి దార్శనిక బలం వారిది
మనిషికీ మరో లోకానికీ మధ్య
కలిపే! బంగరు వంతెన కావచ్చు
మనిషికీ మరో మనిషికీ మధ్య
కనిపించని మనో బంధం చిహ్నం

జారి పడిన స్వప్న శకలం అవచ్చు
కలుస్తూ విడిపోయే సుమమాల కావచ్చు
విజయం తన పక్షమన్న సూచన ఉండొచ్చు
ఎవరైతేనేం ! తనలో తృప్తి రేఖ వదలుతూ
ఎపుడెపుడొ ఎక్కడెక్కడో తెలిసీ తెలియక
కలుస్తూ విడిపోతూ ఇష్టమైంది సాధిస్తూ

క్రితం సమయంలో చూచిన ఒక దృశ్యం
మరో సమయంలో కనిపించని వాస్తవం
దీని స్థానంలో సరికొత్తది చేరుతుంది
మనుషులు కోరేవి అనివార్యాలు కావచ్చు
ప్రకృతిలో వలె సమాజంలో మార్పులు
పరస్పర ప్రభావాలు చిరానుబంధంతోనే చిరానుబంధంతోనే !

# 28. మార్పులో

మనసు పడింది దొరకవచ్చు దొరకక పోవచ్చు
కోరిక మాత్రం వీడదు చిట్ట చివరి దాకా
ఊపిరి అలలపై తేలుతూ వెళ్ళేరు పడవల వె
హృదయ స్పందనతో ఎగురుతూ పోయేరు పతంగి వలె
చినిగి పోయి ముక్కలయి చివరకు
ఎక్కడెక్కడనో ! నేలపై చెట్టుపై ఒరిగేను

కళ్ళకు ఇంపుగా మనసుకు నచ్చిందీ
దూరం నుండి మనిషిని ఆకర్షించేను
నిలిపి వేయవచ్చు కాని అందక పోవచ్చు
చీకటిలో ఉన్నది అయితేనేం చిక్కుకొనీ
దీప సహాయంతో బయట పడవచ్చు
ఎవరి వస్తువో? తనది కాని మాట వాస్తవం

దోపిడి అయినా రాపిడి అయినా
ఓపికతో సర్దుకొని మనిషి బ్రతికేను
బ్రతుకులో మార్పుకు మనుషులు సంసిద్ధంగా
చెట్టు కొమ్మ పట్టుక వ్రేలాడే చేతులు
శ్రమకు తగిన సమాజ చిహ్నాలు! ఎప్పటివో?

స్వార్థంతో కొమ్మలు బల సంపదతో
అందని స్వర్గంపై చూపులు మరల్చేను

శుష్కమైన నీటి కొలను మార్పులో నీరుతో
వర్ష భావనచే కుసుమ యశసు మెరసేను
ముడుచుకొన్న శిశిర తరువు ఓర్పుగా
వసంత స్పృహతో పచ్చదనం తలచేను

దహ్యా మాన గ్రీష్మ ముఖం
మబ్బు లోని నీటి కణం తలచేను

## 29. కాలంతో పాటు

కాలంతో పాటుగ నడచేను మనిషి నిర్భయంగా
భయం వేసినపుడు తక్షాలోపాయాలతో గడపేను
ఎవరికి వారు శక్తి కొలది విజయ కళలు కోరేరు
తమ చతురతతో ఎన్నో సాధింపబడేను సులభంగా

అన్నీ తమ తమ స్థానాల నుండి
అవసరాల ప్రయోజనాల సందర్భ క్షణాలే

భౌతిక మానస స్థితులలో రహస్యాన్ని ఛేదిస్తూ
తెలియని సమాచార గంధాన్ని వ్యక్తుల కందించేను

బుజం బుజం కలిపి కాలంతో పాటుగ
వ్యక్తి నుండి జనత వరకు లక్ష్యంతో గమనం
క్షణాలపై అడుగులతో అనుభవ వాస్తవ ముద్రలు
మానవ చరిత్రలో భాగమై హృది సంస్పందనం

ఉన్న చెట్టు నీడలో ఆహారం దొరికేనని
పక్షులు ఆకాశ విహరణం మానేనా?
అరణ్యం అపాయకరం భయదం అనీ
తెలియని వారెవరని అంతా ఎరోన తెలిసినవారే

లౌకికమో? తాత్వికమో? రెండిటి మేళనమో?
అణువు నుండి నింగి వరకు జీవన సూత్రమొకటే!

చీకటి భయానికి దీప మొకటే ధైర్యం
"నిజ" మెప్పటికి అబద్ధం కాదు, కానేరదు
ఎందరి చూపులకో? ఎన్నెన్ని విధాలో?
ఆశలపై ఆశయం ఎచ్చటిదచ్చట నిలబెట్టేను

ఇసుకతో ఆకాశ భవనం నిర్మించేరా?
బ్రతుకులో అనన్యం వ్యక్తుల స్వంతం అయ్యేను

ఆయుధాన్ని చూపి స్నేహ బలం పెంచలేం
గిరులు నదులు చెట్లు బ్రతుకులో సహాయకులు
నిప్పుల మూటను విప్పి మనిషి ముందు
స్వర్ణ వజ్ర ముక్తాహారాలను మురిపించలేరు

బాధ ఆర్తి బహిరంతర విషయ సూచికలు
స్వస్వరూపం తెలిసే విశేష మనో రూపాలు

# 30. ఏమైనా కావచ్చు

చీకటిలో ప్రతి మస్తకాన్ని గాఢ నిశీథి
దీపానికి ఆధార తలం చేయాలనీ
ఎందరి కోరికో? ఎన్ని ప్రయత్న ఫలాలో?
వెలుతురులో స్వేచ్ఛా యాన మొక విజయం

బ్రతుకున దుర్భరతను గతిలో నిర్భయతను
ప్రతి హృదిలో ప్రజాస్వామ్య స్పందన కిరణం

నిప్పు కణాలతో ఆటలు ఆడే వారూ
కత్తులతో శాంతి ముఖాన్ని చూపే వారూ
జలధి హోరును మింగేసే నినాద సంరంభం
ఏ రూపంలో నయినా పీడించే చీకటి
ప్రతీకను విసరి వేయాలని దిగ్వలయంలో
ప్రజాస్వామ్య గంధంతో గాలులు కదలాలని

విషయం తెలియడమయితే అందరికీ అవసరం
పరిశీలకులు పరిశోధకుల అన్వేషకుల పని
గూడు పక్కన గుడిసె మేడపైన మరో భవనం
ఈ మధ్య తరగతులెన్నో ప్రియమైనవి ఇష్టంగా

సుఖమూ సంతోషం రెక్కలపై ఎగరాలని
వ్యక్తులలో కొర్కెలు వివిధ కుసుమ సుందరమై

కాల గమనంతో పాటుగ జీవన యానం
ఇది ఆషామాషి వ్యవహార ప్రపంచం కాదు
"ఎంత చెట్టుకు అంత గాలి" సామెతలో అర్థం
సమాజంలో ఒక్కొక్క వ్యక్తికొక ఉదాహరణం అవుతుంది

సమస్య విషయం తెలియడ మెంత అవసరమొ
వాటి పరిష్కారం కూడా అంతే సత్వర ప్రాధాన్యం కలిగింది

ప్రజాస్వామ్యం బుజాలపైన రాజ్యాంగం పార్లమెంటు
ప్రతి పౌరుని హృదయంలో ఇవి మర్యాదాలంకృతాలు
సమాజ చేతన కళతో స్వేచ్ఛకు సంకేతమో నవమై
మనుషులలో ఆశలు ఎప్పటికీ చుక్కల సంఖ్యలో

రోజు సూర్యుని మొదటి కిరణంతో కరస్పర్శ కోరేను
రాత్రి నిశ్శబ్దంలో శబ్ద చిత్రాన్ని సమావిష్కరించాలనీ
అర్థాలు మారి పోవచ్చు
భావ జగం వేరు కావచ్చు

## 31. విషమ లిప్తల నుండి

జనగణ హృదయం ఉదయాశయ తేజం
జీవన పన్థా నిజ నైతిక ధవళం
దేశం భాగ్యం పచ్చని సృజన భవం
వ్యక్తి ముఖంలో మానవీయ రేఖా రూపం

ఒక మనోరూపం చీకటికి తావు లేని
శుభ్రమయిన చాంద్రీ గుణ జాలం కోరేను
ఈ దేశం మట్టి పైన పురా సంస్కృతి సంపదతో
ఈ లోకం విశ్వ హృదయమయం ! మానుష నీతి కీర్తితో

ఈ జీవన రంగంలో సహన శాంతి కరుణతో
ఈ సమాజ బంధంతో అరుణ రాగ రంజనం
విశ్వ భావనా మతికి తెలుపు నలుపు భేదం లేదు
కాల గమనమొకే తీరు! బ్రతుకు బరువులు వేరు వేరు

నవ మానవ గీతం ఆధునికం కొత్తగా రూపొందేను
తలపై తిరిగే శాంతి పావురాలతో ఆకాశం శోభిల్లేను

ఉన్నతి తలపుకు రాగానే ఆ రోజున డైరీలో
మదిలో ఎదురుగ హిమ శిఖరం చూపట్టేను
ఆర్ద్రమైన జాడలు కనబడగానే అవనిపై
పాయలుగా గంగా లహరి చిత్రమైన ఆకృతిలో
వెలుతురు మతితో చేతన సంకల్ప బలంతో
విపులతపై దృష్టి మరలగానే ఊయలపై
వెనుక నుండి మహా జలధి దృశ్యం ఊగుతూ
దేని గుణం దానిది ఎవరి విధం వారిది, స్వతంత్ర మైనవి

మనుషులలో మాత్రం ఒకరిపైన మరొకరి ఆధిపత్యం
తిరిగే జీవన చక్రంలో ఒక్కొక అరలో ఒక్కొక విషయం
సంఘంలో విభేదాలు విరోధాలు ఘర్షణలు రణం శాంతి
ఉండి తీరవలసినదే, వీటితోనే! చరిత్రకు కండ పుష్టి
స్వార్థం ప్రేరణగా అహంకార విస్ఫులింగ విస్ఫోటనంతో
మనిషి నుండి దోష నేర చర్యలను విడుదల చేసేను
అధికారం వాస్తవం కావడమే! లక్ష్యంగా సంపాదన
ఏండ్లు గడచినా పూండ్లు తరలినా అదే వికృతి మనిషిలో
బయటికి కనిపించని గుప్త చరంగా మసలుతూ
విజయంకై విషమ లిప్తలు విసరుతూ

# 32. తెలియని వెన్నో

ఏ రోజు ! ఏ స్థితిలో ఏ రూపమెత్తేదీ తెలియదు
మారే జీవన గమ్యం సమాజ దృశ్యాన్ని ప్రభావిత మొనర్చేను
గ్రహాల గతులను లెక్కలు కట్టి చెప్పేరు జ్యోతిష్కులు
ఇక కాస్త తెలివిగల మనుషులయితే సమీక్షలతో
అధికారం హస్తగతంపై ఎత్తులతో నేతలు! మార్పులో
తనకు దొరకే అవకాశంపై ఎన్ని చతుర ప్రయోగాలో?

ఏ రోజు ఉదయం మొదటి కిరణంతో
కర చాలనం చేయాలని ఉబలాటం కవిలో
ఉదయ సంధ్య సాయం సంధ్య పగలు రాత్రి నాలుగు చక్రాలపై
వాహనం అవనిపై నింగిలో పయనానికి వీలుగా ఎందరో! ఒకటిగా
ఏదో వ్యాజంపై ఆగే వీలు లేదు సాగవలసిందే
సామాజిక రాజకీయ సంరంభంలో లాభం కష్టం ఆపై లెక్కలలో

అలలకు గట్టు దాటి అవనిపై ప్రవహించాలని
కలలకు నిద్ర అంచు దాటి మెలకువలో దిగాలనీ
చుస్తూ ఉండగానే కెరటం జరుగుతూ
ఎక్కడి దక్కడ వంగి పోయేను
దాని స్థానంలో మరొకటి చేరేను
నిరంతర చలన శీలంతో ప్రవాహం
కాలానికి ప్రతీక, ఆయువుకు సంకేతం
జీవవంతమైన గుండెలయకు తోడుగా
సాధ్యం కాదని తెలిసి కూడా యత్నం
గెలిచే కోరిక మూలం ఇచ్ఛా శక్తియే!

ఒక బిందెడు నీరు చాలు! అనిపిస్తుంది ముందుగ
దప్పిక లోనో వేదన లోనో అవసరాన్ని బట్టి స్వరం
కోరిక తీరేనా? తదుపరి మరొకటి తోడుగ బాగనిపిస్తుంది
**Okey!** సంతోషం పొంగేను బిందువులు రెండు కలిసీ

సన్నని రేఖలతో అనుకోనిది, చిత్రం రూపొందేను
అద్దంలో చూస్తే ఆ కనిపించే ముఖం? ఎవరిదా? నాదే కదా?
నేనో నువ్వో గుర్తు పట్టక పోవడం విచిత్రం ఆ సమయం
మోదంలో బాష్పమదే బిందువు, ముత్యమొ! వజ్రమొ మల్లెమొగ్గో

# 33. పూవో ఆయుధమో స్వేచ్ఛలో

శబ్దాన్ని పరిమళ ప్రసారాలతో పూవు గనో
దానినే ఆయుధంగానో మలచుకునే స్వేచ్ఛ
మనిషిదే! జీవశక్తికి యంత్ర శక్తి జోడింపబడీ
పట్టాలపై రైలు రోడ్డుపై వాహనం జలాలపై నావ
గాలిలో విమానం ఒకదాని పక్కనే మరొకటి నిండుగా
అన్నీ చక్కగ మనిషి ఆయువు నలంకరించేను పయనంలో

నిశ్శబ్దం నుండి శబ్దానికి తప్పని పయనంలో
ఊహలో విద్యుదున్మేషం! రవి కిరణ సమ విభవం
శబ్ద మెంత బరువైనా! వహిస్తుంది! సహిస్తుంది
భూమి ఎంత బాధ్యతనైనా స్వీకరిస్తుంది స్వాగతిస్తుంది

అగ్ని భయ మెరగదు, దహన మతితో
కింద పాకేను, భగ్గున పైకి ఎగసేను
ద్విపాత్రాభినయం రెండు రూపాలతో
లోన చీకటి కొండపై స్వర్ణ తేజో మయం

ఉదయం మనిషిలో ఉత్సాహం ఉద్వేగం నింపేను
మేఘ శమన తత్వానికి శాంత మయ మవుతుంది
సాయం అవుతూనే అధైర్యం భయం నిరాశలో
మనిషికి దారి చూపడమే వెలుతురు పని బ్రతుకులో

కోష్ణం మిగిలే ఉంటుంది, ప్రాణిలో జీవ రూపంలో
చేతన మిగిలి వెచ్చని ఆశను రాగమయం చేసేను
ఉదయమవుతూనే! బ్రతుకు గురించి చింతన
సాయమవుతూనే చీకటి భయం ఎదలో

అర్థంకాని 'అమాయకముఖంతో రాత్రి
అన్నీ తెలిసిన చతుర గుణంతో పగలు
ఈ రెండిటి మేళనంతో ! మార్పులు సమాజంలో
శూన్యమైన ఆకాశం చూస్తే కవితతో మనసు నిండేను

కవి మనసు అలలతో పద పదం పొంగి పొరలేను
బ్రతుకులు సుగమంగా భాగ్యంగా గడవడమే కావలసింది

జరిగే బాధాకర నాశనకర ఘటనలకు బాధ్యులెవరు
కాలానికి తగిన మనోజగాన్ని పొందలేక పోయే రెందరో
ఒక వైపున యధార్థం మరొవైపు అతీతం, మనోమయం
రెండిటి సమన్వయ సుందరతలను పొందలేక ఎందరో?

# 34. ఉదయ చేతనలో మొదటి మాట

నిశ్శబ్దం ఎపుడు బడితే అపుడు లభించేది కాదు
మనిషి సశబ్దంగా ఇతరుల నుండి మాటకు సంసిద్ధంగా
ఉదయం మొదటి స్వరం మనిషి నుండి మాటతో
ఆ తదుపరి పక్షుల కలకలా రావం రవళించేను

ఆపై ఏవో శబ్దాలు పరిసరాలలో ఎవరి నుండో దేని నుండో
వస్తువుల నుండో మనుషుల నుండో బ్రతుకుల కదలికలలో

మంద్ర మధ్య తీవ్ర స్థాయిలలో
స్థూల సూక్ష్మ భేదాల ప్రభావాలతో
స్వేచ్ఛను వాడుకొనే నిపుణతతో మనుషులు
దివారాత్రులు భేదం లేని శ్రమ జీవన చక్రంలో

చీకటి భయ మెరగదు, దీనికి మృత్యువు లేదు
కనిపించే దృశ్యం నుండి కాస్త పక్కకు తొలగడమే

నిశ్శబ్దానికి ప్రయత్నమెంత అవసరమో
అదీ పూర్తిగ కాదు, ఖండ ఖండంగా పాక్షికంగా

ఎప్పుడేది కావాలో దాని నపుడు పొందుతూ
చీకటితో అవసరమూ!మనిషికి బ్రతుకులో
ఈ నిశ్శబ్ద శకలాలను పొందేందుకు ఎందరికి
ఎన్నిటి సహకారం కావాలో? అదొక కృషి రూపం

పనికి రాదనుకున్న చీకటి ముక్కలకు రంగులు వేసి
బయట బొమ్మలాటలు వినోదానికి వాడుకునేరు
అర్థం పూర్తిగా తెలియని మనుషులలో అమాయక విభవం
ఖర్చుకు వెనకాడే సామాన్యులలోను కళా ప్రియులు ఎందరో

శూన్యమైన ఆకాశం నుండి దృష్టి భూమి పైకి
సంశ్లిష్టమై వాస్తవ గతిలో కవిత వెడలుతుంది
సంక్లిష్ట మనిపించే రచన కళాకృతిని తలపిస్తుంది
ఒక్కొక కవిలో ప్రత్యేకత, ఒక్కొక తీరున వ్యక్తిత్వం

కష్టాలను వరిస్తూ నష్టాలను భరిస్తూ పోవడమే
ఎక్కడికక్కడ సమాధాన పడుతూ ప్రగతి పథంలో
శ్రమ చేతనలో ఆగని పయనం ! నిరంతరంగా
మనిషిలో సంకల్ప శక్తి ! వ్యాఖ్యాన సుందరతను పొందేను

# 35. నీడలో భద్రంగా

భూమి పైన మట్టి అంటకుండా నింగి లోన
గాలికి కదలాడే పతాక ! పంపుతుంది
ప్రజలకు దీవెన అలలను సూటిగా ఆదరంగా
చూచే చూపులలో హ్లాదం తళ తళ లాడేను

దేశం అంతర్జాతీయం సంఘం కూటమి మరొకటి
సంఘటితమై ఆశయ సాధనలో ఏకాకారంగా
ఇది లక్ష్య సాధనలో ఆపై క్రియా శీల పాత్రలో
చిరకాలం తన పాత్రను నిర్వహించేను సర్వాధికారంగా

దార్శనికం లోని ఆదర్శం జెండాలో ప్రతిఫలించేను
అద్దంలో వలె అనుభవంలో ఎదకు హత్తుకునేను
ఎరుపు తెలుపు ఆకుపచ్చ సమాహిత రూపం
త్రివర్ణ పతాక! భారతీయం ! ప్రజలకు సంప్రేరణం

ఉదయ రాశ్మి రాగ రంజితం ఎరుపు
హంసాకృతి చంద్రరేఖ తెలుపు
సజీవ సృజన ఆకు పచ్చ ప్రకృతికి ప్రాణం
మూడు వన్నెల సమాహిత రూపంలో సంకేతం

ఇది సర్వ సత్తాకమైన ఈ దేశానికి ప్రతినిధి
స్వేచ్ఛా స్వాతంత్ర్యం సమభావన సంపద సౌభాగ్యం
పౌరహితం ఆచరణం శీలం వికాస ప్రకాశం
ప్రజలను మానసికంగా లక్ష్యానికి సిద్ధం చేసేను

చేయెత్తితే అందని ఎత్తులో విప్పారిన ఆశలతో
దేశాని కంకితమైన ఉద్యమ విషయం చారిత్రకం
ధరిత్రిపై కొత్త అధ్యాయంలో జనావళి సంచలనం
ఆత్మ గౌరవానికి మానవీయ శోభను చేకూర్చేను

దేశంలో ఎల్లలు ప్రభుత్వ వ్యవస్థలు తారుమారై
సరికొత్తగ స్వాగతం! ప్రతి పౌరుని ఉత్సవ హృదిలో
మారిన అస్తితలో సుందర పరివర్తతో మహర్దశ
దేశానికి స్వాతంత్ర్యం! తల ఎత్తగ జేసిన యశో రూపం

ప్రేమ కరుణ శాంతంతో మానుషం కలిసిన జీవితంలో
జీవన గతిలో కఠినత క్రూరత పీడన కలహం సమాజంలో
అచటచట ఘర్షణలు వెనుక నుండి పెనుభూతాలు తప్పనివై
కళ్ళు తెరచిన మనిషి ముందు ఎగిరే జెండా! అన్నిటికీ సాక్షి

# 36. జెండా ఎదురుగ

అర్ధరాత్రి సరిగ్గా పన్నెండు గంటల సమయం
ధ్వని తరంగాలు! ఒకటొకటీ వరసగా సస్నేహంగా
భారత దేశం విదేశయుల హస్తగతం నుండి పాలన
స్వీయ దేశ పరమయ్యే పోరాట ఫలితం! స్వతంత్రమై

చారిత్రక పరివర్తనలో అస్తితలో కొత్త కళ
ఆ సమయం ఒక్క క్షణం ఒక్క అడుగు
ముందుకు ! ఆవలి తీరం చేరేను జనత
చివరి బంతితో విజయం హ్లాదకరం, సిక్సర్

చంద్ర బింబం నుండి హృదయం సూర్య బింబానికి
చేరడం కల కాదు భ్రమ కాదు! వాస్తవ విశేషం
నిస్సందేహంగా రాజ్యతంత్ర విభవంతో జరిగింది
నిశ్చయం నిర్ణయం శుభావహం రాజనీతి క్రమంలో

చెట్ల కొమ్మల నుండి కర తాళ ధ్వనులు
నిరాటంకంగా గగన హృదయాన్ని స్పృశించేను
అవనిపై మనుషుల హృదయ స్పందనలు వినిపించేను
గాలిలోన ప్రతిశబ్దం పాటకు సిద్ధంగా! అప్పటికపుడు

తెల్లవారి దిశలు రాగమయమై కొత్తదనంతో
చెప్పరాని మాటదాటి అనుభవ లోకంలో నిశ్శబ్దంగా
ఉత్తమ లక్ష్యానికి, బ్రతుకు లెట్లా అంకితమయ్యేదీ

అనుభవైక వేద్య మయింది మళ్లీ రానిదీ విశేష సందర్భం
ఈ విజయం అసాధారణం!చీకటిపై గెలుపే
సహనం శాంతి ప్రేమలతో త్రిపథగ ప్రతి మనో లోకం

స్వతంత్రం వచ్చింది హంసీ యానంలో ముంగిట వాలేను
సుఖమూ సంతోషం రెండూ రెక్కలపై శాంతి ప్రియుల
విహరింపగ చేసేను!ఏ దారులు వరించేదీ తెలియదు
ఎవరి ముంగిలి అలంకృతమై ఆశయ భాండం ఒలికేనో?

ద్వేషం పగ మరచి శాంతమైన సహాయ వేదికపై
ఏ వెలుతురు ఛత్రం కింద భద్రంగా గడిపేనో?
రేపు ఏది ఎట్లా ఉండేది?ఏమయ్యేదీ!
తెలియని భవిష్య రూపం ! అన్నిటికీ సిద్ధంగా
నైతిక శీలతో రాజ్యాంగ బద్ధంగా యంత్రాంగంలో
మనో రూప మావహించి మూడు వన్నెల జెండా

# 37. చిరాయువు రూపం

సరికొత్త చరిత్రను పొందే దేశానికి శుభారంభం
పరాయి పాలనలో నిరంకుశం నుండి ముక్తమై
స్వయం పాలనలో ప్రవేశానికి శాంతం అహింస దారులుగా
కాలం గీసిన వెలుతురు గీతలతో దేశ వాసులు! తృప్తిగా

పైన ఎగిరే మూడు వన్నెల పతాక
భారత దేశానికి ప్రతినిధిగా నిలిచేను

సమాజ వికాస దిశలకు సాక్షీ భూతమై
జన జీవన రూపానికి ప్రేరణయై
మార్పులో తొలి ఉదయం స్వచ్ఛమైన వెలుగులు
స్నేహ సుందర సహజమైన శాంతి హారతి నిచ్చేను
పరాయి శాసనం తొలగి నిజ తత్వంతో
సర్వ సత్తాకమైన స్వతంత్ర దేశంగా ఇపుడు భారత భూమి

ఈ శ్రేయో రూపం కొత్తగ తలపుకు రాగానే
గాలిలో రెప రెపలాడే జెండా ఉన్నతాశయంతో
పై నుండి జలద శోభతో ఆకాశం
ప్రజల పాలతలంపై రవిబింబం వలె తేజం

ఉన్నవారు లేనివారు ఇరు పక్షాలకూ ఆశారూపం
ఇంకా మౌలికావసరాలు ప్రజలకు దక్కని దుస్థితి

ఇప్పటికి అధికారం చేపట్టిన ప్రజాస్వామ్య ప్రభుత్వాలు
హేతు దృష్టితో ఉదార నీతితో పాలనకు దూరంగా
జలధిలో పరచబడిన అలల వలె జీవన క్షణాలు
కష్టాల నష్టాలలోను జెండా! ఒక విశేష స్ఫూర్తి మూర్తి

ఇప్పటి వరకు స్వాతంత్ర్యనంతరం వచ్చిన పాలకులు
లేమిని మరవడమొ, తగిన శ్రద్ధ తీసుకొక పోవడమె
హేతు దృష్టితో పరిశీలనలో ఉదార పరిష్కారం జరగలేదు
వికాస పథం ఎరగవు, ప్రకాశ విభవం తెలియదు

సామాన్యుల వెన్నుకు దన్నుగ నిలచేను రాజ్యాంగం
దేశభక్తికి యుక్తి రక్తి తగిన పాళ్ళలో కలిసిన నేపథ్యం
మనిషి మనో రూపానికి ద్రఢిమను సమ సమాజ చేతనతో
నవ సమాజ నిర్మాణంలో ఎగిరే జెండా! ప్రగతి రూపం
దేశ హృదయ స్పందనకు ప్రతీక! చిరాయువు రూపం

# 38. వాస్తవ వేదికపై

సన్నని వెలుతురు ముఖాల నంటుకొనీ వాన చినుకులు
అవనికి మల్లెల సుమ హారావళిగా
మనసుకు తృప్తిని కలిగించేను శాంత భావనతో
దప్పిక తీరే అవసరంగా పచ్చని పంటకు సూచనగా

గ్రీష్మం వేసే ప్రశ్నకు సహనంతో వర్షం సమాధానంగా
కవి మనసును వశం చేసుకునే యథార్థంలో
ఇది తెలిసేది కొందరికే ఆకలితో అలమటించే
మనిషికో, దాచేసే జీవికో బ్రతుకులో

వర్తమాన శిఖరాల నుండి భవిష్యత్తు మైదానంలోకి
గతాన్ని పిలవనక్కరలేదు, ఆ వెనకనే ఉంటుంది
విస్తరించి పొడవుగా నీడలా గాలిలో కనబడీ కనబడకుండా
బరువయిన వస్తువుల్ని వర్తమాన తలానికి తరలించేను

ఉదయం లేచింది మొదలు ఎవరి పనులలో వారు
తమ కోర్కెలు తీరే ఆశలు పండే లిప్తలకై యత్నంలో
ప్రణాళికా సిద్ధంగా నిరీక్షణలో వివేచనలో ఆచరణంలో
కాలాన్ని చులకన చేసి ఎవరూ ముందుకు సాగలేరు
విలువల విజయంతో పైపై ఎత్తులకు పెంచుతుంది
మానసికోన్నతి కోరే వారికి కాలమొక అతీత బంధం

భూమిని నమ్ముకొనీ అనలం బదులు అమృత లహరి కోరేరు
కవి హృది ఆశా దీపమై స్పందనలో వేగమందు కునేను

ఒక్కొక్కరిలో ఒక్కొక విధమైన సాధారణ నిబంధనలు
సుగమతకై తాము విధించుకొనీ నడిపించేవీ
తరం నుండి తరానికి మారేవి, కొత్తవి చేరేవి
ఏదీ ఎవరి చేతిలో పూర్తిగా 'వశమై' ఉండదు, ఇది స్పష్టం

తమలో ఆశలు బావి నీరు తోడే తాడులా పెరుగుతూ పోవచ్చు
ఇంతకూ ఎక్కడికి? ఏ మజిలీలో ! అందరికీ కావలసిందే
రిటైరైన మరునాటి నుండి ఎన్నిటి అవసరమో బ్రతుకులో
గమ్యాలు వేరు కావచ్చు మజిలీలు మారవచ్చు, వేగం తరిగేను

గూటిలో దీపం గడప పైకి చేరినట్లు
విశేష సందర్భాలెన్నో బాధ్యత మరవని దశలో
కలలు గేటు వద్దనే నిలిచేను లోనికి రాలేవు
చుట్టపు చూపుగా తొంగి చూచి పోయేను త్వరగా

ఇందులో ఏదీ మాయాజాలంలో పాత్రలు కావు
బ్రతుకులో అనుభవ వేదికపై కనిపించే వాస్తవాలు

# 39. కావలసింది

ఒంటరిగా ఉంటే! భయ రేఖలావరించినట్లుగా
దారి దొరకని ప్రాణిలో మనిషి మనస్సు ఒంటరిగా

నాల్గు దిశలు చివరకు వలయాకృతి భ్రమణంలో
చెట్టు నీడలో కానరాని పవమాన వీచిక ఊరటగా
గాలి అయితే మరొకరికి కనబడేది కాదు
అనుభవంలో ఉన్న వ్యక్తికి తప్ప తెలియ దెవరికీ

మనసులో మరో మనిషి ఉనికి అందరికీ తెలియదు
దివ్య భావనా మతికి కవికి తప్ప! ఒంటరిలోను
బయటికి కనిపించే ముఖమొకటే
లోపల గుప్తం ఉండేవెన్నో!
ఒక కవిలో ఇతర కవులకు వేదిక కావచ్చు
దీని కెంత ఉదారమైన గుణ మవసరమో!

ఒక సమయంలో కవిత దిగుతుంది చకితంగా
అభయంగా కవి మనసులో పేరాచూట్‌లా
ఇప్పుడెన్ని యాన సాధనాలో కవితలన్ని విధాలు, తీరులు
ఇప్పుడెన్ని సమాజగతిలో పార్టీలో అన్ని వాద వివాదాలు

పారిశ్రామికం ప్రపంచీకరణం దశలొకటొకటి
తీసుకునే మలుపులతో మార్పులు! సామాన్యుల చింతనలో
ప్రజలకు ప్రశ్నల్ని అందిస్తూ సమస్యలయ్యేను
పరిష్కారం కర్తవ్యం బరువు బాధ్యతలో త్రిశంకు స్వర్గంలో

ప్రపంచ నేతలలో దేశ దేశ సామాన్య ప్రజలలో
అవల రాగం బదులు ఇపుడు జలద రాగం వినబడేను

కాలం ఒడిలో నిద్రించాలని ఎవరు కోరతారు
దీని నిర్దేశంలో చేతనతో అభ్యుదయం కోరేరు

అక్షర జగత్తులో కవితలో భావం చెట్టులా ఎదిగేను
ప్రయోజనాలెన్నో అన్నీ మనిషికి ధారాదత్తం అయ్యేను

ఎంత ఎత్తు గోడ నిలిపినా ! ఇంటి చుట్టూ బయటనూ
దుమ్ము ఎగసి పడుతుంది లోన! సర్వం మలిన పరుస్తూ
చూచీ చూడని మౌనం వహించి ఉండేదెవరు? ఉపేక్షలో
అందరికీ కావలసింది సుఖమూ భాగ్యంతో మానస తేజం

# 40. గాలి పటలా వలె

ఆకాశం శూన్యం అనిపించే స్థితిలో అంతలో
కారు మబ్బులు రావల్సిందే! బహు సమ్మోదంగా
చల్లని వాతావరణానికి సదుపయోగంగా గాలులు
భూమిపై మనిషిలో మనోజగం ! కవుల స్వంతం

ఏదీ ఎప్పటికీ నియతం కాదు; నిరంకుశం పనికి రాదు
ప్రకృతి ననుసరించి బ్రతుకు లోను ఇదే విధం మనోమయంగా

పరివర్తన చక్ర భ్రమణం అనుభవ గతిలో వేరు వేరుగా
కొత్తదనం కై మనుషులలో ఆరాటం ఆవేదన అన్వేషణం
ఏ మార్పు సామాన్యమైన పనికాదు; భారవహం
ప్రతిదీ తప్పనిదై మనిషికెదురు పడేను
గాలివశమై మబ్బులు ఏదారి నెవరు వరించేరో?
గాలి పటాలవలె ఆలోచనలు, కొంతసేపు ముచ్చటగా

ఉద్గమనంతో విహరణ కవకాశం దొరకేను
పై నుండి నేల పాలైన వర్షం చినుకులు
భూమి పొరలలో నూయి చెలమ చెరువు ఊటలు
అవసరానికి జలధుని వినబడేను చెవికి సుఖంగా

సరిహద్దులు లేని ఏ దేశం ఉనికి లేదు
నియమ నిబంధనలు లేని ఏ ఆట లేదు

చీకటి నిశీధిలో మాట వెలుగు దివ్వె అవుతుంది
పయనం ఆగదు ఎడారిలో జలాలలో నేలపై గాలిలో

చుక్కలలో వెలుగుల ముక్కలు అక్షరాలుగా
అవి దీవెనలో ప్రశంసలో చల్లినవి మెరుస్తూ
అవి పదాలుగ మారేందుకు సమయ మవసరం
వాక్యంలో ఆకర్షించేందుకు భావనాలోకం ముఖ్యం

నిశ్శబ్దంలో ఆపూర్ణమై కావ్య మవుతుంది
కళ్ళు మూసుకుంటే చెప్పడం వినడం ఆగదెవరిలో
ప్రకృతి నుండి దూరం చేయరాని చీకటి
నిశ్శబ్దంలో శబ్ద ప్రపంచం మనిషి మనసు నిండేను
తెల్ల వారుతుంది! గగనాన చుక్కలు మాయం అయ్యేను

అవనిపైన బ్రతుకులో శూన్య మెక్కడ? అద్దంలో ఆకాశంలోనా?
చిరంజీవి వెలుతురు హృదిలోనా? మనిషి ముఖంలోనా?

# 41. పూల స్థానంలో

కలహం నుండి కదనానికి ఎవరి ఆహ్వానంతో పనిలేదు
స్నేహం నుండి శాంతి రుచికి ఎవరి అనుమతితో పనిలేదు

స్వార్థంతో ఎవరి నుండైనా భంగం వాటిల్ల వచ్చు
ఒక్కొక విధం కుసుమం ఒక్కొక తీరు మనిషిని తలపించేను
గుణంతో చిరు భేదం స్వయం కృతమొ? గ్రహపాటో?
పూవు స్థానంలో ముళ్ళు కనబడేను - బాధా మయం!

ఆదర్శంలో మార్పు ప్రజాస్వామ్య సామ్యవాద విధానంలో
ఇంటి ముందు చెదరిన ముగ్గును తలపించేను
మొలకెత్తే కవితల కవకాశలెన్నో! ఆవరణంలో
ద్వారాలు తెరవబడీ మనిషి చూపుతో సమార్ద్రమై
సూక్ష్మమైన భేద గుణంతో మనో విధం మారేను
స్వేచ్ఛలో బాధ్యత పెరిగేను ప్రగతి శీల భావనతో

ఉదగ్రం అవివేకం అగ్ని పథం మూడు పేటల హారాలంకృతం
ఇనుప గొలుసులతో పొంచి పొంచి పక్కనే చీకటులు సమాజంలో

మధ్య మధ్య భ్రమ గొలిపే పూల వలె చుక్కలు
నింగి నుండి నేలకు దిగినట్లుగా నిశ్శబ్దంగా
కలగూర గంపలా అంతా సమ్మిళితమై
ప్రత్యేకత తరగి విశిష్టత మరచి ప్రజాస్వామ్యమిపుడు

దీనిని గుర్తించడమంత తేలిక కాదు సత్పథమవసరం
సరియైన సమాధానంతో సత్వరంబాగు చేయడం ముఖ్యం

అందులోను నీలిరంగు వేయబడీ ! చీకటి, చిత్రంగా
విశాలమైన ప్రకృతి వలయం తప్పించుకొనీ
వికాస రూపమైన సమాజ బంధం వదలి
ఒంటరి తనం వ్యక్తిగతంతో సమాజ లక్ష్యం మరచేరు

తెల్లవారి వెలుగులో పలు రంగుల ముఖాలతో
ఎక్కడ బడితే అక్కడ! దార్శనిక క్షోభలో సమాజం

నగరం మధ్యన ఆలయ శిఖరంపై మీనార్‌పై
శాంతి పావురాలు గూడు నుండి విహారణలో
భద్రంగా బయలుదేరి క్షేమంగా తిరిగి వచ్చేను
మనిషిలోని స్వచ్ఛమైన 'నిజం"లోని రూపానికి ప్రతీకయై

మట్టి చెట్టు ప్రాణి మనిషి! నాలుగు దిశల నుండి
ఒక చోట కలిసేరు, సంస్కృతికి చిహ్నాలై ఆశ్రయమయ్యేరు

# 42. మనోధర్మం

దీపం ఒంటరిగానే తన బాధ్యత నిర్వర్తిస్తుంది
సమాజ వ్యవస్థలో భాగస్వామ్యాన్ని కనబరుస్తుంది

ఎక్కడ బడితే అక్కడ బయట కాలిబాట ఏర్పడేను
అవసరానికి అవనిపై అమ్మతో నడచినట్లుగా
తనలోని శక్తులను కూడగట్టుకొని ఒకటై
మనిషికి తన నడత మరొకరి మెప్పును పొందాలనే

మానవాన్ని మానవేతరాన్ని కలపాలని ఎందరో
రెండిటి సహజీవనం సిద్ధించాలని నడతలో
సమాజ సంబంధాలతో బంధుత బలపరచాలని
ఈ జీవన గతి గురించే ఎప్పటికీ ఆలోచన మనిషిలో

ఎంత ఎత్తు ఎదిగి రోదసి నావహించినా
గగన తలం అందుకొనీ విహరించాలనీ

మనిషి నుండి మనిషి దూరం కాలేదు, అయ్యే వీలు లేదు
అంతలోనే రాగంతో ప్రేమ కరుణ దగ్గరకు చేర్చేను
రవి కిరణంతో తేజం
శశి కిరణంతో మోదం
రెండిటి ఆవశ్యకతను వీడలేదు కవి హృదయం
ఎవరి మనో ధర్మం వారిది ప్రత్యేకం ప్రియం

అస్తితలో కవి పాత్ర అరచేతిలో వెలిగే దీపం వలె
జీవన పథంలో ప్రకాశ రూపంలో ప్రతి అనుభవం

అక్షర హృదయంతో స్పందించే కవిలో
గాలికి పై బూది పొర లెగిరి పోయి
తళ తళ లాడే నిప్పు కణికలతో
బొగ్గు ముక్కలతో చిన్ని చిన్ని రాళ్ళతో
ఆడుకునే అమాయకులు పిల్లల
హృదయంతో సమానం! కవిలోకం

ఉదయం కిటికి తెరచి చూస్తే
రాత్రి కన్న కలలు ఈ సమయంలో పూలై
అమాయకమైన చూపులను సంతోష పరచేను
తమకు తగిన అనుభవం దొరకేనని తృప్తిగా

ఎవరి మానసికి జగత్తు వారికి ప్రియం
దీనితోనే అమరేను నవమానుష కిరీటం

# 43. వెలగవచ్చు

ఈ దిశ నుండి ఆ దిశకు
ఆ దిశ నుండి ఈ దిశకు
వలయాకారంలో జీవన రూపం
ఊయెల వలె నిరంతర చలనం

ఒక సమస్యలో ఎన్ని మారులు ఊగాలో
కాలం గడచేను మనుషుల కోర్కెలను బట్టి
ఏది ఎట్లా ఉన్నా ఏమి జరిగినా వహిస్తూ పోవడమే
కాలం గడవడమంటే మనిషి బ్రతుకు నడవడమే

కష్టం నష్టం సుఖమూ సంతోషం ఓటమి విజయం
దోషాలకు నేరాలకు పశ్చాత్తాపం సరిపోయేనా?
శిక్షలు ప్రతిఫలాలతో మళ్ళీ జరగకపోయేనా?
ఎవరి మాట నిజం! ఏ వాదం ఏ ఆదేశంలో! ఏ మతం! ఏ పార్టీ!

ఏ స్థితికే ఆయువు సరిపోతుంది? మంచి చెడులలో
ఇది పోయేదెప్పుడు ఆదర్శం అందల మెక్కేదెప్పుడు?
శోక స్వరం నిశితంగా దూసుకు పోయేను
దుఃఖం వరదలాగ మనిషిని ముంచేను

జలధి ఘోషను తలపించే నినాదాలు
ఇళ్ళ నుండి జనతను వీధులలోకి రప్పిస్తూ
చిత్ర మేమంటే కెరటం పూల మాల కావచ్చు
అదే తెలియనిదేమంటే కరవాలం కావచ్చు

కల్పన మబ్బులా రశ్మిలా ఉత్తేజ పరచి వెళ్ళిపోతుంది
సంతోషం మనసుకు విజయ గీతమందిస్తుంది

ప్రవాహ రూపంలో కాలం! మధ్యలో ఆగే ప్రశ్నలేదు
దప్పిక తీరేందుకో! పంటలు పండేందుకో
దేనిలో కలిసేదీ ఎవరికీ తెలియదు ముందుగ
పల్లంలో వంపులో సరించడమనేది వాస్తవం

కలల నుండి బయటపడి మెలకువతో
వాస్తవాల మెట్లపైన వాస్తవ గతిలో
జీవితం నడస్తుంది ఎక్కడి కంటే? ఎవరికినీ
ఎప్పటికీ తెలయని రహస్యం! సంధిగ్ధ భ్రమణంలో

విరిసిన పుష్పంలా ఆయువు తీరి నేలపై రాలవచ్చు
దిశ దిశలో దీపంలా దారి చూపి వెలగవచ్చు ఆరవచ్చు

# 44. యథాతథం

కవితకు చేతనతో స్పందించే హృదయ నిలయం
కవులకు ప్రవేశ ద్వారం తెరవబడీ! ఎప్పటికీ

పగలు రాత్రి భేదం లేదు కాలానికతీత మైంది
మూల మట్టం నుండి కవిలో సజీవమై శబ్ద జగం
అందరికీ ఆశీర్వాదం అర్హతను బట్టి ప్రతిభా
ప్రకాశాల ప్రభావాల ప్రసారాలతో మితమై

ఎవరికి వారు సాటియై ఎవరి వ్యక్తిత వారిదై
ఎంత కవిత అయినా అక్షర పంక్తులలో సమూహ రూపం
బరువనిపించని జలదంలా మనో గగనంలో తిరుగుతూ
దీనికై ఎదురు చూచేది సహృదయులు, నవ సమాజ సంబంధంతో

మండుటెండలలో పట్టపగలు చండ కిరణ సమం
ఆవేశం ఆగ్రహం అలజడితో కళ తప్పిన సమాజం
రోజు రోజుకీ పేరుకొని పీడనం రాసులుగా చూపట్టేను
నేతల పెద్దల ప్రభావం ప్రకృతికి ప్రతిబింబాలుగ మారేను

శుష్కమైన ముఖాలతో ప్రజాప్రతినిధులు కవులు పాలకులు
ఎవరికి భయపడని జ్వాలా రూపాలు! మేఘాలకు దూరంగా
ఫైర్ ఇంజన్ కన్న ముందు! సెల్‌ఫోన్ వీడియోల సంరంభం
ఎదరుగా కనుచూపు మేరలో దహన కాండ దృశ్యం

సగటు మనిషి మనోరూపం సునిశిత విమర్శనా మయం
రుద్రాకృతి పొందేను బీభత్స ముద్రలతో రాజకీయ చతురతచే
పార్టీల వారిగా నిజాన్ని తలక్రిందులు చేసే గ్రూపుల వ్యవహారం
అడుగుల క్రింద అవనిపై పిడికిలిలో ఆశలు ఎప్పటివో

పాల తలాన రేఖలు చూచి భవిష్యత్తు చెప్పాలనీ
అడ్డ దారిలో ప్రయత్నాలెన్నో ఆధిపత్యం కై భాగ్యంకై
ఉపశమనంకై మనుషులు జెండా నీడన చేరేరు
దారి తప్పిన నీతి గురించి చర్చించేరు అంజలి ఘటించేరు

కొందరు ఉత్సవ సమంగా శిథిలాలలో తిరిగేరు
ఏ యంత్రం ప్రత్యక్షమై పేదల ఆకలిని తీర్చలేదు

మనిషి గొప్పతనం తెలిసేది, సమాజ వికాస చరిత్రలో
వాస్తవానికీ కల్పనకూ మధ్య ఎడం తప్పని సరి అవుతుంది
నిజ రూపం తలక్రిందులయ్యే ప్రమాదం లేకపోలేదు
ఈ జెండా ఈ దేశానికి ప్రతినిధి, అందరూ మహనీయులే
స్వస్వరూపం మరచేరు, మిగతా తంతు యథాతథం

# 45. భవితవైపు ఉగాది

జీవ శక్తి ప్రకాశంలో కాల రేఖల గతి విశేషం
జడ భావనలో చేతన బిందువు కదలిక చిత్రం
ఉదయం సరికొత్త క్షణాలకు స్వాగతం పలికేరు
ముని మాపున పాత బడిన సమయానికి వీడ్కోలు

ఆశీర్వాదంతో వస్తుంది ఆశా సూచిక అవుతుంది
కదలుతుంది ఒక వత్సరం తన పేరున ఏలుబడిలో
ఆగని కాలం జరిగే కొద్దీ మును ముందుకు సంస్పృహలో
జీవిత రూపం గమనం తప్పని పరివర్తన గుణంతో
ఈ ఉగాది శోభకృత్ మహాకాల విభాగంలో ఒక పాత్ర
అందరు దేవతల కన్న విశిష్టమై మానుష జీవన విలసనం

ఇది ఉగాది రోజు ఇంతవరకు ఏడ్చే స్థితుల్ని మరపిస్తుంది
బాధల్ని కప్పేస్తుంది, ఆర్తిని దాచేస్తుంది గప్ చిప్‌గా

అందం పరిమళంతో ఆశా రూపం ఈ రోజు దీవెనతో
ప్రతి కవి కొక తరహాలో కవిత! తోటలో పూవుల్లాగా
ప్రతిభ లెన్ని విధాలో! అభిరుచు లెన్ని రకాలో ప్రత్యేకంగా
భిన్న భిన్న ముఖాలతో సృజన జగంలో, బహు ప్రియంగా

ఈ ఉగాది ప్రతిచోట సృజన వేదికలెన్నో
ఎక్కడి కక్కడ ప్రదర్శన శాలలుగా తీర్చబడీ
ఒంటరిగా తనలో తాను ఒకరొకరితో
అందరితో కూడా సమాజ చింతనలో

ఈ ఉగాది సృజన శాస్త్ర చింతన స్నేహ బంధంలో
తృప్తి రేఖలతో మనిషికీ మనసుకు మధ్య పూల వంతెన
జ్యోతిషం ఈ రోజు కాలాన్ని పాలిస్తుంది స్వతంత్రంగా
కొత్తదనం ప్రతి మనిషి హృదయాన్ని స్పృశిస్తుంది చల్లగా

కటువైన వాస్తవాల నుండి నిజమైన ఆనందానికీ మధ్య
ఎన్ని వంతెనలో ఈ రోజున అన్ని విస్తృతమై ఉత్సవ కళతో
ఆశలు ఎప్పటివే! హేతువులెప్పటివో కనిపించే శాఖలతో
పూవు ఫలం కోసం మనిషి! ఈ రోజున సమాధాన పడేను

కాల గమనంతో జీవన చలనం! వర్తమానం నుండి
భవితకు రసాల సాల మహనీయంగా, వివిధ రుచులతో

# 46. ప్రఫుల్లమై జనతలో

ఈ ఉగాది శోభకృత్, కాలం శోభా కర ముఖంతో
పచ్చనైన చెట్టు ! సుమ ఫల సంపద భాగ్యంతో
భాగ్యవంతమైన జీవన రూపానికి ప్రతీక అయింది
వసంత భావ రాగ మనోహరమైంది కాలంతో పాటు ప్రకృతి
శాస్త్ర విదులు గ్రహ సంచారంతో అదృష్టాన్ని చూపేరు
కొలిచేరు తూచేరు ధర పలికేను సమాజం అవసరంలో

సృజన బంధంతో ఈ పండుగ ఉత్సాహం నింపేను
తలపులలో పనులకు ఆరంభం జరిగేను
ఆరు రుచులు చేరి ఒకే చోట సమన్వయ రూపం
రుచిరంగా అనుభవ సుందరంగా మానుష విభవంగా
వ్యక్తంలో కాలాన్ని దైవంగా భావించే అతీతాన్ని
శాస్త్ర మర్యాదలలో బంధింప బడిన జ్యోతిష విజ్ఞానం

ఏడాది కొక పేరుతో పాలన సాగుతుంది కొత్తది
అరవై సంవత్సరాలు ఒక ఆవర్తం! జగతిలో
సూర్యుని మొదటి కిరణం నుండి ముని మాపు వరకు
వివిధ కార్య కలాపాలు! పంచాంగ శ్రవణమొక విధి రూపం

ఉగాదులొక క్రమంలో మనిషిలో హేతు విలసనంగా
కాలం ధరించే స్వర్ణ కంకణానికి వజ్రాల్లా పండుగలు

ఆశా బంధువైన కాలం! ఉదయం మంచు పొరలతో కదలేను
తృప్తి రేఖను పొడిగించే పనిలో, ఆకాశమే హద్దు! ప్రతి వత్సరం
కవులకు రుచిరమైన వస్తువు దొరకుతుంది ప్రచురంగా
కాల గతిలో సమాజ సంబంధం జీవన వికాసంలో
ఎవరు ఏమయ్యేదీ? ఏది లభించేదీ జాతక చక్రం సమీక్షలో
బయట పడతాయని ప్రజల నమ్మకం! కొండంత బలమిచ్చేను

ప్రతి చెట్టు ముఖాన చిరునవ్వు శోభతో స్వాగతం ! ఇచ్చేను
ప్రతి పూవు హృదయంలో చోటు కోసం ఎంతో వెదకేను

సీతాకొక చిలుకలు మనిషి చుట్టూ తిరిగేను
పలు రంగుల కలయికతో తోటలో కనువిందుగా
వాతావరణం ప్రకృతిలో కళా హృదయం చూపేను
ముగ్ధమైన ఇంద్ర ధనుసు కిందికి దిగినట్టె మిత్రంగా

స్నేహం ప్రేమలతో కారుణ్యం శాంతం రాగ రంజితమై
ఈ ఉగాది శోభామయమై జనతలో ప్రఫుల్ల సృజన చేతనయై

# 47. విషాద బంధంలో

వీధులలో ఎందరో వస్తూ పోయే వారు
తమ తమ పాత్రలు నిర్వర్తించేరు! సమాజంలో

ఒకరొకరు పుష్పమొ అనల కణమొ జల కళికయొ
స్నేహమొ! పరిచయమొ ? బంధుతయో మనిషి వశమై

ముఖాన చిరు నవ్వుతో, చూపులలో దాగిన చండ కిరణంతో
అపుడపుడు స్పర్ధలు కలహం సమర సమాన చర్యలు

సంఘం కోరేది ఏ మనిషి నుండైనా మంచి మాట
వికాస విభవ పథంలో తనదైన ఉపద
ఆచరణంలో మానవ గీతం ప్రవహించాలనీ
ఏ దేశం ప్రజ లైనా నైతికమొకటే! సూత్ర స్థాయిలో

మనిషిలో మనో జగానికి అనలం చేతనే, ఉత్సాహం
మాటలో పూవు ఊహలో కెరటం కదలవచ్చు

మౌనంలో మనుషులు విగ్రహ సమ స్థితి కారాదు
లోన ఉన్న విదూషకుడో జోకరో బయటికి వచ్చేను

భూమి గాలి నీరు వెలుగు నింగి అంతటా ఒక అవసరం
అన్నిటికే లొకికోపయోగా లొకటే సాధారణ భేదాలతో
ఇవి మానవ సమాజానికి పలు విధాల మేలుగా
ఇది కల కాదు; అనుభవంలో వాస్తవ దృశ్యమయం

పీడనలో దరిద్రంలో ప్రశ్నలకు జవాబులందించేను
ఎవరో కాదు తనలో సాక్షిగా ఉన్న అంతరంగ ప్రకాశం

మానవ స్వభావ వర్తన లొకటే అంతటా
ప్రకృతి నుండే కాదు సమాజం నుండి ఉదార సంపదతో
చండ తాపంలో దారిన చెట్టు నీడను చూపిస్తుంది
శిథిలాల మధ్య వాన చినుకులకు పచ్చని ముఖం తలెత్తుతుంది

బ్రతుకులు సంక్లిష్టంగా పరిణమించినపుడు లేమిలో
ఆలోచనలు సంశ్లిష్టంగా వెడలడం సహజం

పగలంతా శ్రమ జీవన గతిలో గడపుతూ
సాయం సమయం అయ్యే సరికి రాత్రిని కోరేరు విరామంలో

అస్తమయం చివరి కిరణం, నెత్తురు చారలతో శరీరం
కత్తి గాట్లకు గురి అయింది, వ్రేలాడుతూ విషాదమయంగా

చేతిలో కత్తి ఉంటే రాజ్యం, సంపాదించాలనీ, ఆశారూపంతో
స్వార్థంలో, విషాద స్వరంలోని అవసరాల్ని అందుకోవాలనీ

# 48. సానుభూతికై

చూపు మేరలలో చుట్టూరా ఎన్ని ఉన్నా ఎప్పటి నుండో
మనుషుల అవసరం, నడుస్తూనో పనిలోనో, త్వర పడుతూనో
ప్రకృతి నుండి పొందే సంతోషంతోపాటు పైపై మెట్టులో
ఆలోచనలో ఉదయ బింబంలా హృదయం! కిరణానికి తప్ప
చీకటికి అవకాశం లేదు, మనిషిని చూచే మాట్లాడే కలిసే
అవకాశం పుష్కలంగా, ఈ జన్మకీమాత్రం చాలనిపిస్తుంది

తాను ఉన్నప్పుడు వినని మాట పాట ఆపైన
ఎంతో ఇష్టంగా శ్రద్ధగ పైపై హెచ్చు స్వరంలో
సాధ్యమైనంత వరకు అందరికీ వినబడేట్లు
శ్రవో నిలయాన్ని ఆవహించేను, ఆనందింప జేసేను
స్మృతిలో కదలే వన్నీ ఈ నిలయ నివాస రూపాలే
దేనికీ ఎక్కడికీ పోనక్కర లేదు, అన్నీ దగ్గరికి వస్తాయి

అద్దంలో కనిపించే ముఖాన్ని చూచుకొని చూపులతో
మనిషి ! ఎంత సంతోష పడేనో? ఎన్ని మారులో! ఒంటరిగా
కోపం లేదు! తాపం లేదు అలసట కనబడదు
అద్దాని కంకితమైన మనసుకెంత సంతృప్తితో సంతోషమో
ఏ సమస్య లేని మౌన ముఖం! ఏమి చేస్తుంది? నిశ్శబ్దంగా
అంతా శూన్యం! ఆకాశాన్ని ఇముడ్చుకొని ఇంపుగా! తనలో

ముందు నుండి! అద్దం తొలగితే కనిపించేది
శూన్యంలో నా ఇష్టాని కనుగుణంగా మనుసులోనిది

కొన్ని ఏండ్ల అనుభవాలతో రూపొందిన ముఖ వాలకం
ఎక్కడికి వెళ్ళినా నాతో పాటు తప్పనిదీ, నాలో భాగమై

ఒంటరిగా ఉన్నపుడు కిరణ శకలమో మబ్బు తునకో
జ్ఞాపకంలో నిలిచింది ఘనమై ప్రవాహమై తరలుతుంది

ఒక్కొక మనిషి ముఖం పలు సందర్భాలలో ఒక్కొక విధంగా
జగత్తులో ఎన్నిటినో మనః పటలంపై నుండి సూటిగా
మరో ముఖాన బింబిస్తుంది, దీనికి సూక్ష్మ గ్రహణ పటుత అవసరం

నుదురుపై గాయం ! చిన్నదొ పెద్దదో! వెనుక నున్న కథ
చెప్పాలని ఎవరికైన మనసులో ఉబలాటం! అవకాశంకై నిరీక్షణం
వాడిన పూవైతే రాలేందుకు సిద్ధంగా, సానుభూతికై వేచీ

# 49. శిఖరాయమాణంగా

పర్వతంపై పిడుగు పాటుకు శిఖరం తరగబడీ
పగిలిన శకలాలకు స్థాన చలనం జరుగుతుంది
శిల్పాకృతుల్ని పొంద వచ్చు కొన్ని! అనుకోనిది జరిగి
పరివర్తనలో మనిషి యశో రూపానికి చిహ్నాలయ్యేను

అనుకున్నవి నిలిచిపోయి నిరీక్షణకు గురి చేసేను
అనుకోనివి జరిగిపోయి మార్పుకు దారులు తీసేను

శిలలు సర్వ సన్నద్ధంగా ఏ రూపమైనా ఎత్తేందుకు
తాపమో శాపమో మానవుల అవసరాలో! మరొకటో

కళా పిపాస తీర్చే సాధనాలలో భాగమై ఇష్టంగా
కవుల కల్పనలో అక్షరాకృతి పొందుతూ సుందరతలతో
తమ పూర్వుల కన్న మిన్నగ జీవించే ఆశతో
తరం నుండి తరానికి పెరిగేను వికాస స్థాయి!

ప్రతి దశకంలో ఆరోహణలో సంస్కృతుల విభాగం
ఉన్న దాని కన్న ఉన్నతమై వాస్తవంలో
ప్రతి మార్పుకు కొన్ని హద్దులు తప్పనివై
స్పందనతో మనిషిలో వివేచన పెరిగేను

మొన్న కన్న నిన్న, నిన్న కన్న నేడు, నేటికన్న రేపు, తెలియని
ప్రేయో పదంలో శ్రేయో గమనంలో శిఖరాలు నిలుపు కోవాలని

ఒకరి మాట, పెట్టని కోట గోడలా భద్రతలో
దేనికి భయ పడకుండా నిలబెడుతుంది స్థిరంగా

రెక్కలు లేని మనిషికిది రక్షణ కవచం వంటిది
రెక్కలున్న పక్షి నుండి కోటలోకి అవలీలగా

మదిలో రెక్కలతో విహగ ముద్రల ప్రజ్ఞతో
అనుకున్నది సాధించేను మనిషి, విమాన కల్పనతో

దేని ప్రత్యేకత దానిది! అయినా ఒకదాని కొకటి ప్రేరణయై
ఉపయోగపడే క్షేత్రాన్ని అనుసంధించే నిపుణత! గొప్పది
చుట్టూ ఉన్నవి తన కోసమో నన్నట్లుగా ఉంటుంది
మనిషి విజయ పథానికి కావలసినవన్నీ సమకూర్చబడేను
మెరపుకు ఆనందిస్తూ పిడుగును ధైర్యంగా ఎదుర్కొంటూ
సమస్త వస్తు జాలంలో మనిషి ఎప్పటికీ శిఖరాయమాణంగా

# 50. శూన్యానికి పూర్ణతకై

తరువు తీవె పైరు పంట ప్రకృతిలో శూన్యాన్ని నింపుతాయి
చెరువు నూయిలో కంటికి కనిపించని గాలి తప్పనిది
కనిపించే వెలుతురు అన్నిటి కన్న ముందు మనిషి, తన నీడతో
సమాజాన్ని రూపొందించేను, శ్రమ చేతనతో కృషి ఫలం పొందేను

కను రెప్పలు తెరిస్తే ఎదురుగ కనిపించేను దృశ్యం
సమాజ పరిచయ సంబంధాలతో, నేపథ్యంగా ప్రకృతి

మనిషిలో ఆలోచన కల్పన క్రియాశక్తి చలనం
కాలానికి రూపం ప్రయోజనం సిద్ధింప చేసేను
నిశ్శబ్దాని కెవరి సూచన జోక్యం అవసరం లేదు
శబ్దం లేని స్థితి నిశ్శబ్దం మనిషి కోరేను అంతరంగా

శబ్దానికే అవసరం, ప్రయోజనం వినబడ జేసేను
వ్యకిగానో సమాజగతమో ధ్వనిత మయ్యేను

ఏ రోజు ప్రతి మనిషిలో నిరభ్యంతరంగా
ఉదయ సూర్య బింబంతో పాటు మనో బింబం
స్వచ్ఛంగా శుభ్రంగా దివ్యమై నవ్యమై కనిపించాలని
సరసిలో పద్మం లానో హంస లానో ప్రకటితమయ్యేను
మనిషి బ్రతికినంత కాలం, అదృశ్యంగా పనిచేసేను
గత మేదయినా! వచ్చే రోజులో అమలినంపైనే కోరిక

కాలం గడచే కొద్దీ వడపోతలతో
అసలు వ్యక్తిత్వం స్ఫుట తరమవుతుంది
న్యాయం ధర్మం విపణిలో తేలేది కాదు
ఏ అధికారం ఆజ్ఞలు, విలువలను మార్చలేవు
మతి విభవం లోనో హృదయ వశంగానో లౌకిక తంత్రం
అందరికీ సమానమైన స్థాయినే, అంతర ముకురంలో

సూర్యుని తలిస్తే ఉత్తేజం, చంద్రుని చూస్తే హ్లాదం
పూవు వికసిస్తే ఆనందం, ఫలాన్ని గ్రహిస్తే తృప్తి

సృజన భావ చలనంతో, శ్రమైక భావనతో వీడని కోరిక
ఆశా సౌధాన్ని నిర్మిస్తుంది, సమాజ రూపం మారుస్తుంది

వ్యక్తుల చరిత్రను సువర్ణ రేఖలతో చిత్రిస్తుంది
శూన్యానికి పూర్ణతకై క్షణం క్షణం అభినవ సన్నాహంతో

# 51. నింగిలో విమానమై

ఒక సమయంలో చూచిన దృశ్యంలో రూపం
ఇంకొక సమయానికి మారుతుంది, అనుకోకుండా
జీవన గమనం లోను ప్రకృతిలో స్థితుల వలె! ఇదే మోస్తరు
భాగ్యానికి, సౌఖ్యానికి మార్పుల కెదురు చూస్తూ
మనిషికి ప్రతి అనుభవం ఉపయోగానికి వచ్చేస్తుంది
బ్రతుకుల మార్పులతో భవితకు, దారి చూపుతుంది

పూవు వాడుతుంది రాలుతుంది శూన్యాన్ని నింపుతుంది
మట్టిలో ఒకటై మట్టి నుండి సృజన స్వేచ్ఛలో స్వచ్ఛంగా
సృజన శక్తి ప్రకటిస్తుంది మనిషిని స్పందింప చేస్తుంది
దీనికి పూర్తిగ భిన్నమైంది కవిత, అక్షర పద సంపదతో

ఇది వాడిపోదు, రాలిపోదు, మనిషి అవసరంలో
సుందరతను తెలుపుతుంది, లక్ష్యానికి తోడ్పడుతుంది

ఎంత వరకు వీలైతే అంతవరకు సాగదీయ బడుతుంది
మనిషి బ్రతుకులో ఏ ఘట్టం కల కాదు, వాస్తవ రేఖలపైనే

అన్నీ వ్యూహాలే బోనులుగా రూపొందేను
ఆశ్చర్యం కావచ్చు, విపరీతంగా ఉండవచ్చు
వ్యవహారంలో విషయాలెన్నో అన్నీ చతురతలతో
సంఘంలో మానవేతర మయిన పాత్రలుగా వెలసేను

మంచి కోసమయినా, ఏ కీడు పై బడినా
ఇరు బుజాలపై రెండూ, ఎదుర్కోవలసిందే

ఏ రోజూ అస్తమయం నుండి రాత్రి వరకు
ఏది ఎంత వరకో అంత వరకు సాగవలసిందే

ఇది ఎవరికయిన పశ్చాత్తాపానికి సుందర సమయం
ఇది కవిత లోనె అమరుతుంది, క్షాళనలో శుభ్రమై

కవిలో రూపొందే అంతర్జగత్తులో విషయం
ప్రతి బింబిత మవుతుంది, సూక్ష్మ సూక్ష్మంగా కవితలో

బయటికి జీవన ఘటనలో అంశాలెన్నో చేరేను
అంతర్వీక్షణంలో తాత్త్విక శోభను పొందేను

మార్పులతో వ్యక్తి మనసు గుణాత్మకమై విలువలతో
జలధిలో పడవ బదులుగ నింగిలోన విమానమై

# 52. ప్రవహించే మానవ గీతం

కాలంలో స్నేహం వైరం మంచి చెడులని ఏది ఉండదు
మానుష కార్య కలాపాలతోనే ఏదైనా జరిగేను

జననం మరణం రెండూ ఆయువులో ఒకమారే కలిగేను
తదుపరి ఆలోచనలో తృప్తికై మానసిక స్తిమితంకై ఎన్నో

పంటలో కలుపు మొక్కలు ఎదగడం సర్వసహజం
వీటిని తొలగించడం కృషికారునికి బహు ముఖ్యం

చెట్టు అయినా మనిషి అయినా ఆగమనం నిష్క్రమణం
సమాజ నిలయం లోకి సంతోషంగా మనోజ్ఞంగా

భూమి తలంపై పైకి ఎదిగేను చెట్టు
అదే విధం! కాళ్ళపై నడచేను మనిషి
నిరంతరం చలన శీలి కాలం! ఆగదు! ఆపలేరు
మనిషి ఆగవచ్చు విశ్రమించవచ్చు పరుగెత్తవచ్చు

భూమి పొరలలో గుప్తంగా దాగిన నీరు
బయటి కొచ్చి వాలులో జాలుగా, పాయలుగా చిందులతో
ఉరుకులు పరుగులతో ప్రవహించడమే ఆనందం
చెట్టు మనిషి నీరు గాలి వెలుగు నింగి నేల మధ్య
సమన్వయంతో అనుభవమొక సుందర వాస్తవ బంధం
దేని గుణం దానిదే ఎవరి తత్త్వం వారిదే ఉన్న స్వేచ్ఛలో

గ్రహ తారాబల సంపదతో మహా కాల వాహనం
ఎప్పటికిని చైతన్య స్ఫూర్జితంగా అనుభవం పథంలో కదలేదీ

శిల అయినా అల అయినా కల అయినా నిజ మయినా
అన్ని స్థితులలో మనసును అస్తితతో హవణింప జేసేను
క్షణాల చక్రాలపై లిప్తల రెక్కలపై నేల నింగి మధ్య
ఆవహించిన బ్రతుకులు అనుభవంలో చెదరవచ్చు నలగ వచ్చు

యుగాలుగా ఇప్పటికీ కరగని హిమ గిరులెన్నో
వీటిని ఆవాసాలుగ చేసుకొని బ్రతికే రెందరో!
ఎడారులలో చండ తాపంలో, గుడారాలలో చిర నివాసంతో
ఇవి దాటగనే మేఘాగమనంతో పరచిన పచ్చదనం మురిపించేను

కొన్ని చోట్ల మంచు కరగి వాలులో జాలుగా పాయలుగా మెరపుల్లా
సృజనలో ఆశా బీజాలు ముఖమెత్తేను మార్పులో సమాజ గతి వేగంతో

స్వేచ్ఛా కవిత్వం - 126

# కవిత్వమొక థెరపి

మాదిరాజు రంగారావు




**2023**

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

**126 SWECCHA KAVITHVAM**

# KAVITHVAMOKA THERAPY

# కవిత్వమొక థెరపి

by
Prof. Maadiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Year of Publication 2023

*Presented*
*to*
**Dr. Charitha M**
*my daughter*
*California USA*
*with*
*Hearty Blessings*
*on her Birth Day*

# పీఠిక కవిత్వమొక థెరపి (THERAPY)

## అనుభవ వాస్తవం

"కవిత్వం ఒక థెరపి" దీనికి పీఠిక అవసరం లేదు. ఈ పరంపరలో భాగంగా అవతరించింది. భారత దేశంలో ఉన్న గొప్ప కవిత్వ విషయంలో "ఆత్మబంధం" ఇంకా ఇంకా దృఢతరం కావాలనే, నా ఆకాంక్ష. సూక్తుల నుండి స్తుతులు స్తోత్రాలు మహాకావ్యాల వరకు పర్యాప్తమై ఆకర్షణీయతను కలిగింది. మయూరుని సూర్య శతకం గురించి అందరికీ తెలిసిందే. మిగతావి ఎన్నో గ్రంథాలలో.

తెలుగులో పోతన భాగవత రచన విషయంలో అందరికీ తెలిసిందే. కృతులు శబ్దం అర్థం భావం లక్ష్యంలో బ్రతుకుపై విశ్వాసం పెంచే మంత్ర శక్తి ప్రభావం, ఈ సందర్భంలో హృదిలో మెదలుతుంది. ఇది సాధారణమైన సాహిత్య విమర్శతోనే సరిపడదు. ఆపైన ఆలోచన వివేచన విశ్వాసం తాదాత్మ్యంతో ముడివడింది.

శబ్ద శక్తి ప్రసారంతో అక్షర ప్రభావంతో మంత్ర గుణంతో సృజనరూపం ఇందులో విశేషం. దీనికి దివ్యమైన భావన పవిత్రమైన ఆచరణం అవసరమవుతుంది, దీనికి మాత్రం (క్రియేటివ్) సృజనాత్మక చేతన ఎంతో కొంత సరికొత్తగా పూలతో పండ్లతో వికాస రూపాన్ని పొందాలి. ప్రయోజన తత్పరతను కలిగి ఉండాలి.

నిరంతరం స్మరణీయమైన గ్రంథాల విషయం వేరు. సహజమైన 'సత్త్వం' తోనే సాధ్యం! ఎవరు కోరినా కోరక పోయినా దాని గుణాన్ని అది ప్రకటిస్తుంది. ఇక కావ్యానుశీలనం వేరు. శబ్ద విలసనం భావజాలం అభివ్యక్తి విధం నిర్వహణలో నిపుణత లక్ష్యసిద్ధి ఇలా ఎన్నిటి సమాహారమో దృష్టికి వస్తాయి. పోనుపోను వ్యక్తి సమాజం స్థాయిలలో "అతీత స్పృహ"తో మదిలో ఇదొక రహస్య పేటిగా స్ఫురిస్తుంది.

కవిలో సహృదయులైన పాఠకులు శ్రోతలు తమ తమ అభిలాష అభిమానం అభిరుచి చేత కవిత్వం బ్రతుకుతుంది. తత్కాలంలో పరవశతలో బాధల్ని మరపిస్తుంది. సుస్థితిని చేకూరుస్తుంది. ఇది ఎందరికో అనుభవంలో ఉన్నదే.

పాశ్చాత్య దేశాలలో దీని స్థానం పదిలంగా ఉంది. అభివృద్ధి చెందుతూంది.

తాను నమ్మే దృక్పథమేదయినా దార్శనిక మెటువంటిదయినా విజయఫలం దూరం కాదు. ఇది సహృదయులదీ, వారికి చెందింది, చెందుతుంది.నా విషయంలో ఇది పూర్తి అయిన సందర్భంలో విశిష్టమైన పరవశతలో ఆనందంతో పాటు ఆరోగ్యం రెండు రెక్కలపై మానసికమైన దృశ్యం అనుభవంలో హ్లాదమయం ఉపశమన వాస్తవం, హ్లాదమయం.

**"కవిత పట్ల అభిమానం లోలోపల అమరంగా అందరిలో**
**ఒకరిలోన ప్రకటితమయి బయటికి శోభాకృతి ప్రభావం**
**సమర ముంది, శాంత ముంది, తాప ముంది, మేఘ ముంది**
**ఎన్ని చేరినా, ఇంకా మిగిలే జగాతో, నవ మనోరూపం"**

**– మాదిరాజు రంగారావు**

# కవిత్వమొక థెరపి

## 1. తెరచిన తలుపులు

కవిత్వమొక థెరపి ఆదరణీయమైంది సర్వదా
కవిలో స్వానుభవానికి సందీప్తిని చేకూర్చేను
కవితో వినేవారు చదివే వారు కలిసిన బంధుమయం
శరీర స్వాస్థ్యానికి జీవన భాగ్యానికి సంప్రేరణం

ప్రతి జీవకణం చేతనతో నింపే ఆశారూపం
గాఢత స్వాదుత హ్లాదం పరవశ గుణవంతం

లోకోత్తర శ్రేణులలో ఒకటయి నిలుస్తుంది
ప్రాక్ ప్రతీచి సంస్కృతులను కలిపే విభవం
ఒకే హృదయ స్పందనతో చిర యశోరూపం
పఠనం శ్రవణంతో జీవన తంత్రీ నాదమయం

పూర్వ పూర్వ సంస్కృతి సాహిత్య శాస్త్ర సందర్భాలలో
'ముకురీభూత" "సంక్షాళనం" మరొకటి మరొకటి
ఈ థెరపీకి దగ్గరగా చికిత్సలో వెలుగులు ప్రసరించేను
విషయ సంవృతితో వివరణల కవకాశమిచ్చేను
మరికొన్ని పరిగుప్తంగా, దృష్టికి వస్తాయి కూడా
ఇదొక అక్షర చికిత్సా శబ్ద నిదానంలో విధానం

ఇది సబ్జక్టివ్ విషయం, కొన్ని కొన్ని పరిమితులతో
అనుభవ క్రమంలో అనుభూతి విశిష్టతయే దీని విశేషం
ఇది థెరపీకి వీలును లభింపజేస్తుంది
ప్రేయో స్వరంలో నిరాశకు చోటులేదు

ఇది ఒక్కొక్కరిలో ఒక్కొక విధమైందిగా
కవిత పట్ల అభిలాషను అభిరుచిని పెంచుతుంది

మనో యానంలో విభవాన్ని విశేషాన్ని వికాసాన్ని
తలపించేను థెరపీ తరహాలెన్నో కవితను బట్టి

వైద్య పరిభాషలోని పదం కవితకు సాధనమై
ఉపచేతనలో నిదాన క్రమంలో భాగమై
మరో జగతిలో మనసును విహరింపజేసేను
మనసుకు సుస్థితితోనే తనువుకు ఆరోగ్యం

కవిత వినిన మీదటనో చదివిన తరువాతనో
మూసిన తలుపులు తెరచిన విధం! తలపులలో

# 2. ఆత్మీయం కీలకం

భౌతికం మానసం ఇరు స్థాయిలలో దేనికది
అపుడపుడు కలిసిన స్థితిలో సమన్వయం

ఇది ఎన్ని విధాలో పూర్వం నుండి ఇప్పటి వరకు
సంస్కృతిలో భాగమై కవిత్వం థెరపీలెన్ని తీరులో
గళగళత్ శబ్ద లహరి మంత్ర పూతమై
సూక్తి నుండి ముక్తకం మొదలు మహా కావ్యం వరకు

పరోక్షంగా నిధానం క్రమంగా సంతృప్తి కళతో
విజయ భావన మానసికంగా సుఖదమై వశమై

పఠనం శ్రవణం ఉత్సాహం ఉత్తేజం పొందేను
పేరుకొన్న స్తబ్ధత చేతనతో ముందుకు కదలేను
ఇదొక పరంపరా రూపమై సంస్కృతిలో ఒక అంగమై
మనిషి స్థాయి పెరిగేను ఆరోగ్యం సుస్థితి పొందేను

మధ్య మధ్య వ్యాఖ్యానాలు విస్తరణలు పోషకాలుగా
తదంకితం తల్లీనం తాదాత్మ్యం తటితల తలవలె

శబ్దం భావం గమ్యం ఉపయోగం మనో జగంలో
ఆయా స్థాయిలలో తగిన విధంగా "నిదానం" చర్యలు
మౌనంగా చూపులతో చదవడం వెలుతురులో
ఉచ్చారణలో శ్రద్ధతో ఉత్సేకం రెక్కలు విప్పారేను

పఠనం శ్రవణం కవితకు నప్పిన అవసరాలు
మనిషికి ఆరోగ్య రూపానికి ముఖ్యమైన బలాలు

కవితల, ప్రక్రియా భేదాలతో పనిలేదు
వాటికి తగిన విధానం రూపొందేను అనుభవంలో
కృతిలో రస భావ శిల్పకళా రమణీయకతలతో
ఉపయోగం ప్రయోజనం లక్ష్యం ఏదైనా కావచ్చు

శబ్ద సారంతో ధ్వనిచిత్రం మానస పటంపై
థెరపికి గుణాత్మక మైన సత్వాన్ని కూర్చేను

మూల బలం లేంది సుస్థితిలో స్తిమితం కోల్పోయేను
ఆచరణ కంతరాయ మేర్పడేను ఆలోలితమై సర్వం

పద్యం గేయం పాట వచన రూప భేదాలో ఏదయినా
గ్రహణ పటుత పందనలో ఆత్మీయం కీలకమైంది

# 3. చిత్తానికి దోహలం

మనిషి జీవితంలో ఎంతో కొంత భాగం మానసంలో
నమ్మకాలపై పరపరాగత క్రియా కలాపాలతో నిండీ

ఇప్పటికీ పోతన భాగవతం త్యాగరాజు కృతులు మరికొన్ని
మంత్ర పూతమైనవి థెరపీకెంతగనో ఉపకరించేను

కవిత్వ మయితే భాషా బంధం భావజగం మనో ధర్మం
జీవన శైలీ రూపం కవి కర్మ చేత పవిత్రమయ్యేను

అక్షరం మొదలకొని ఆశయం వరకు హృదయం మంత్రమయం
ఇది పార్టీలకు వాద వివాదాల కతీతమైన థెరపీయే
సామాన్య స్థాయిలో అందుబాటులోని సత్క్రియా విశిష్టం
దీని పైన ఉపాసన మొదలుకొని, మరో ప్రపంచమెంతో

నిదాన విధాన గుణంతో మనసుపై ప్రభావ జాలంతో
ప్రవృత్త మయింది అందుబాటు లోని శ్రేయో సాధనం

కవుల తపో బలం నుండి వెడలేను
అక్షర పద భావ సమావిష్కారంలో
బ్రతుకుల నేలే రాజస మనోజ్ఞం
శారీరక మానస సుస్థితి, ఒక అమూల్య వరం

విప్పలేని ముడుల జటిల సమస్యకు
ప్రత్యామ్నాయంకై యత్నం వికాస సహజం

ఆరోగ్యం స్వాస్థ్యం రెండు కాళ్ళవలె
సరిగా ఉంటేనే ఇలపై నడిచేదీ పరుగెత్తేదీ

పరిణామ గుణంతో మనో రూపం బ్రతుకులో
యానబలం తోనే వ్యవహార జలధి దాటేను

కవితతో నాల్గు ప్రయోజనాలు నెరవేరేను
పూర్ణత సిద్ధించేను, కృతిపై ఆశా బంధంతోనే

మానవ భౌతిక రూపం ఒకనాడు అదృశ్యమయినా
నిలిచేది సజీవంగా, అక్షర తేజో రూపం
అమరానికి అమృతానికి పర్యాపదమై కవిత
వ్యక్తితో సమాజ హృదిని క్షాళన మొనరించేను

ఎన్ని మాటలు చెప్పినా ఎన్ని చర్చలు జరిపినా ఒకటి నిజం
కవిత ప్రభావం శక్తితో రక్తితో సమ చిత్తానికి దోహలం

# 4. మంత్ర ముగ్ధం

ఈ శరీరాన్ని బాధల నుండి ముక్తం చేసేను
ఈ మనో వ్యథను చీకటి నుండి దూరం జరిపేను
అక్షర పద యోజనం నిర్వహణంతో థెరపి
పఠన శ్రవణ సుందరతలొక పవిత్ర కార్యమై
శ్రేయో సార్థకతకు విజయ రూపమిచ్చేను
స్వీయ మయిన అనుభవ జగతిని సృజించేను

దేహం మనస్సు రెండిటి సహయోగంతో సులభంగా
భూమి నుండి శరీర శిఖరం నుండి మనసు కలిసి
అంతశ్చేతన కదలికలో ఆశారూపానికి రేఖలతో
అక్షరాకృతి! పద చలన భావనా మయమై
శూన్యం నుండి పూర్ణత కోరేను ఆకృతిలో
లోనుండి సృజన భూమిక మానవవర్తనకు తగీ

థెరపిలో ఉపచేతన పాత్ర! కీలకం, నిదానంతో
వ్యక్తిలో ఆశారూపం కావలసినవి చేకూర్చేను

ఈ క్షేత్రంలో తన అవసరానికి కావలసిన వెన్నో!
స్వయం నిర్మాణ కుశలతతో వ్యక్తిత్వం పెరిగేను
భౌతిక స్థితిలో మానస గతిలో మనస్తత్వ శాస్త్ర
ప్రభావం పునర్నవ కళారూపానికి దారితీసేను

వ్యక్తి స్థాయి లోను సమాజ భూమిక ఉంటుంది
ఒకరిపై మరొకరి నమ్మకంతో నడచేను జీవితం

తృప్తి రేఖను దాటుతూ పూర్ణతకు చేరే యత్నం
జరుగుతుంది నిరంతరం మానవ సంస్కృతిలో భాగమై

మదిలో పరిణత క్రియకు ఏ లోటు లేదు
పఠన శ్రవణ వలయాలను దాటుతూ నాదమయమయ్యేను

కవిత్వంతో జీవితం సాధారణోపయోగంలో
ఆపై ఆంతర వికాసంతో విశేషతల్ని పొందేను

థెరపి విజయానికి! స్వానుభవంతోపాటుగా
సమాజంతో సమన్వయం ఆరోగ్యంతో ఆనందం కూడ

శబ్ద శక్తి భావ బలం కలసిన మనోహరమై ఆకర్షణ
ఆదర్శంతో దార్శనికం విలువలతో మంత్రముగ్ధం చేసేను

# 5. ఆంతర స్పర్శతో

సమస్యలలో జగడం ఎంత చిన్నదైనా పెద్దదయినా
ఈ థెరపితో శాంత భావ సమర్పకమవుతుంది

అక్షర పద పంక్తిలో వెలిగే హితమతితో
పక్షాలన్ని ఒకటే! వాద వివాద మేదయినా

అక్షర చలనంలో కవిత ఒక థెరపి అవుతుంది
మనిషికి హిత బంధువుగా శాంతి వనం కోరేను

ఆరోగ్యం సౌభాగ్యం రెండూ జన శ్రేయానికి
గగన విహారం కన్న జన సమూహాలకు
సుస్థితి చేకూరే, అమృత శక్తి పొందాలనీ
మానవ సంస్కృతిలో ఎప్పటి నుండో పాదుకొనీ

సారభూతమయిన మానవ శ్రమ ఫలంగా కవిత్వం
థెరపిగా నిలవడమొక వికాస యశో బింబం

ఉపశమనం ఉత్సాహం నైతికం మనో జవం
స్వంత అనుభవంలో ఈ థెరపికి అమరేవి

ఆయువును జీవితంలో అర్థవంతమొనరించేను
కవితోక్తికి మంత్ర బలం బహుమతి లభించేను

నిదాన నిలయంలో ఒకటై వసించేను ఇష్టంగా
ఉదార చరిత్రలో పుటను ఆవహించేను మోదంగా

ఇది వైద్యం మనస్తత్వం కావ్య శాస్త్ర సంస్పృహతో వర్తించేను
చిత్త సమత శక్తి సహిత రక్తి దృష్టితో వ్యక్తిత్వమేర్పడేను

ఏ వయసు వారయినా నిదాన నిలయం శాంతి సమర్పకం
ఎన్ని విషయతలకయినా హ్లాదకర సమాధాన మిచ్చేను
ఆధునిక కాలంలో విపరీతాలను సామాన్యమొనర్చేను
కవి కవిత సహృదయ లోకం ఏ సంకుచిత భేదాలు లేకుండా

ప్రత్యామ్నాయంలో ఈ థెరపి ఆంతరమైన పాత్రలో
అంతరంగ గుణ వల్లిక పూచిన పూలతో కాలం
అలంకృతమవుతుంది, ఆశాభావ మనో లోకంతో
ఒక మనుషులే కాదు, చుట్టూ ఉన్న ప్రాణులు వస్తువులు

సహభావనతో సత్కృతిలో కవిత్వం ఆంతర స్పర్శతో
దీర్ఘాయువు కోరేను ! గుణాపూర్ణమై ఈ థెరపి

# 6. విజయాశయం

కవిత్వమొక థెరపి ఈ సృజన ప్రపంచంలో
అక్షర పద మంత్ర ప్రభావోన్మీలనంతో నిదానోపేతమైంది

మనుషుల యోగ క్షేమంతో హిత ప్రసార భాగ్య రేఖలతో
అవతరించే కవిత్వం! కవి ప్రతిభా కిరణ స్పర్శతో
అనుభూతితో ఆనందం పరవశం స్థితులలో
సహృదయం మనసును రంజిత మొనర్చేను

పగలు ప్రతి దిశను స్వర్ణ మయం చేసేను
నిశి ఒంటరి దీపానికి తోడును చేకూర్చేను
పఠనం శ్రవణం కవి మానస జలధికి
ఇరువైపుల ఆవరించిన సస్యభూములతో
స్నేహ యాత్రలో, ఇది సాధారణం విషయం కాదు
ఈ థెరపి అన్వేషణలో దొరకే ఒక పుణ్య భాక్!

పునరాలోకనమనేది లేదు; ఏ రూపం మారేది లేదు
పునర్నవ జీవన నిర్మాణ సంకల్పంలో ఆచరణమొకటే

ఉన్న సమాజ రూపం! ఎప్పటికీ ఉండేది మారుతూ
పునర్విభవంలో వికాస చరిత్ర నాది నీది అందరిదీ
స్థూలం నుండి సూక్ష్మానికి దారులు తెరవబడీ
అంతఃకరణ నిలయానికి వెలుతురు లభించేను

కవిత్వ రూపానికావాసమైన మనో జగత్తులో
మనిషి మనిషికొక విధం చిత్రం రూపొందేను

ఈ థెరపి మనో బంధంతో సమాజాన్ని శిష్టంగా మార్చేను
ఇది సంస్కృతి సంపదను, నలు దిశలలో స్మరింపజేసేను
ఆదర్శాలను కాపాడుతుంది ఆశాబంధాన్ని దృఢతరం చేసేను

వేదనలో కావలసిన చిత్త శాంతి కెంతగానో తోడ్పడేను
సామూహిక సామాజిక వైయక్తిక సంస్కృతి ముఖాలలో
సదాశయంలో సత్ప్రయత్నంలో మనసును నింపుతుంది

అలజడిలో శాంతి స్థితికి దోహదపడేను
కాలం గడచే కొద్దీ సరికొత్త రూపంతో అస్తిత
మనిషిపై మనిషికి చెదరని తరగని నమ్మకం
ముందుకు నడిపిస్తుంది విజయాశయ పూర్ణతకై

# 7. ఇప్పటికీ

కవిత్వమొక థెరపి ఈ సృజన ప్రపంచంలో
నిదానోపేతమయింది, రస పద యుత మనన భవం
యోగ క్షేమాలకు హిత ప్రసార రూపంలో
కవిత! అవతరిస్తుంది ప్రతిభా ప్రకాశంతో

అనుభూతి ఆనందం పరవశ స్థితులలో
సహృదయుల అనురాగాని కంకితమయ్యేను
తమలో సత్తును స్వర్ణమయం చేసేను
ఒంటరి దీపానికి, తోడును కూర్చేను

పఠనం శ్రవణం కవి మానస జలధికి
తీరాలు రెండు! అటు ఇటు హరిత మయం
పునర్వివేచనతో, సత్వర మేదీ మారదు
పునర్నిర్మితికి సంకల్ప బలం తప్పదు

సమాజ మెప్పటికీ ఏదో కోరుతూనె ఉంటుంది
పునర్విభవ చరిత్రను మళ్ళీ మళ్ళీ హృదిలో
స్థూలం నుండి సూక్ష్మానికి మరో దారి తెరవబడీ
అంతఃకరణ నిలయానికి ప్రకాశం లభించేను

థెరపిలో మనస్సు విశేష క్షేత్రానికి పయనం
కవితలో ఇపుడు నిజ హృదయానికి ప్రాధాన్యం

ఈ ప్రక్రియ విషయంలో జాగ్రత లవసరం
ఆశారూపాన్ని ఆదరిస్తుంది పెంచుతుంది
ఇది మనో మయమవడమే సంక్లిషం
ఎవరికిని తెలియని రహస్య కారణం

వేదనలో చిత్త శాంతికి తోడ్పడుతుంది
సదాశయంతో రుచిలో జీవన కళతో

అలజడిలో సహన శాంతులను సూచిస్తుంది
కాలం గడచే కొద్దీ సరికొత్త అస్తితలతో

మనిషిపై మనిషికి చెదరని తరగని విశ్వాసం
మునుముందుకు నడిపిస్తుంది ధైర్యం కవచంతో

కోపం క్రోధం సహనం స్నేహం రాగం సంస్పృహలు
నిధాన రూపాలు ఆది కారణాలు ఇప్పటికీ వీడనివీ

# 8. ఆప్తంగా

వడ గాలికి పైకి ఎగిరిన ఎండిన ముళ్ళ కంప వలె
సంధిగ్ధమైన సమాజ స్థితులలో విషాద చూచికలు

దారిన వెళ్ళే సామాన్యులను బాధితులను చేయవచ్చు
ఆ సమయంలో బయటి కెవరు వచ్చినా, అసౌకర్యమే
గాయాల పాలు కావచ్చు ఏ పిర్యాదుకు వీలులేదు,
గ్రూపుల పార్టీల బల ప్రదర్శన లెన్నో! విపరీతాలెన్నో

ఒక సమయం వస్తుంది, ఎంతో అమాయకంగా
అనుకోనిది! సామాన్యుని కవిగా మార్చి వేసేను

తాను మెచ్చిన విధంతోనో, తనకు నచ్చిన తీరులోనో
రాత్రి చీకటి చిత్ర పరంపరలో గడపే రొకరొకరు
అడుగంటిన నీరుతో బావులవలె నైన ముఖాలు
ఎండిన చెరువుల వలె బీటలు వారిన బ్రతుకులు

ఏది జరిగినా ఎట్లా ఉన్నా సంసిద్ధంగా మానుషయత్నం
వాస్తవ శిఖరాలకు పైన, అతీతంగా కవిత్వ థెరపి

బ్రతుకులు మారేను, దారులు పలు దిశలలో
విశాల భూమి తలంపై విప్పారిన పద్మ సుందరం ఆరోగ్యం
యుగాలనాటి థెరపి ఇప్పటికీ నవనవమై
భౌతిక మానవ సంధానంతో జనతకు ప్రియమై

కవులను చూడాలని వెలుతురులో ప్రజలు
కవితను వినాలని బాధలలో మనసులు
కష్టాలను నష్టాలను దాటి పరుగెత్తాలని ఎటకో

పునరుదయం భావ జగంతో ఒకరొకరు
ఏదీ దూరం కాదు కవితకు థెరపి చికిత్సలో
ప్రతి మాటలో సుగంధం సంస్కార ప్రియ స్పర్శతో

గ్రీష్మానికి మిత్రం వలె
వర్షానికి చిర బంధువు
శిశిరానికి ఆశ్రయ మతి
వసంతానికి అభినవ ప్రియం

కాలం మెడలో వేసిన క్షణాల పూలదండ
తోడుగ ఉండేననీ, ఆప్తంగా ఈస్మృతి చిహ్నం

# 9. విజయం రుచి

ఎవరి ప్రపంచం వారిది మనో నిలయం
దేని కదే పరిగుప్తంగా మానుషమై థెరపిలో

అవసరాని కెపుడయినా అన్వేషణలో ముఖం చూపవచ్చు
బయట బ్రతుకులో లౌకిక తంత్రం! వ్యవహార సరణిలో
భాగ మందరిదీ ప్రజా స్వామ్య జీవన శోభలతో
ఆదాన ప్రదానాలతో ఏర్పడే సంకలనం ఈ సమాజ మొకటే

ఎన్నో విషయాలు జ్ఞాపకంలో నిశ్శబ్దంగా వచ్చేను
ఇవి మదిలో కార్నర్‌లో స్వంత ఆస్తి లాగా నిలిచేను

వ్యక్తుల జీవన గమనంలో సంసూచికలై
వ్యక్తిత్వ వికాసాలను తీర్చి దిద్దుతాయి
అంతో ఇంతో తెలుసుకొనే అవకాశంతో
ఇంతవరకు ఏర్పడిన భావ నిర్మాణం చెదర వచ్చు

సేద్యానికి అంకితమైన గ్రామ జీవనంలో శ్రమ చరిత్ర
విశ్వమయం పరంపరగా విలువలు కాపాడే అమూల్యం

ఇంటి ఆవరణంలో చెట్టు పూలు పండ్లుతో
భౌతికం నుండి మానసానికి ఆరోహణలో
ఉత్సవ కళ నిచ్చేను, జీవన గ్రంథంలో భాగమై
హృదయానికి ఆమోదంతో సంస్కృతిని నిలిపేను

మనిషితో మనిషి పరిచయం నుండి పరిణతం వరకు
జీవిత గమనంలో తత్త్వ ప్రకాశం! ప్రతిఫలించేను

కవితలో శబ్దం పూవును తలపించవచ్చు
సన్నని ఇనుప సీల దిగే అనుభవమూ కలిగేను

అగ్నికి రూపాంతరాలెన్నో! ప్రాణ చలనంలో
మనిషి అవసరాల్ని బట్టి, అన్ని కవితలో
కవిలో నేతలో వీరునిలో వికాస దశలలో
చేతన! దార్శనిక పథానికి సంసూచనగా

మనో వేదిపై మనిషి మనిషిగా బ్రతికే చర్యల మధ్య
మానవేతర శక్తులు దూరి తమతో తోడ్కొని పోయేను
పరిచయంతో మిత్రత బంధుత లెన్నో! సమకూడేను
ఖేదంలో నిరాశ ఓటముల చవి చూచేను

ఒక్కొక్క విధంగా అన్నీ కలిసిన సంశ్లిష్టమై మానసం
మోదంలో ధైర్యంగా విజయాల రుచి చూచేరు

## 10. గీతలు చెరపుతూ

ఎవరి భౌతిక స్థాయిలో వారు ఎప్పటికీ
అదొక జగత్తు, లౌకిక వాదానికి దగ్గరగా

విత్తులు నాటిన మరునాడే ఉదయ రశ్మిలో
పూల తోట కనుల ముందు నృత్యం చేయదు
ఇది ఎదగడానికి కొంత సమయం పడుతుంది
దీనికి పోషణ రక్షణ భద్రత లెంత అవసరమో

గాలిలో ఊగే పూవు నుండి
భూమిపై నడిచే మనిషి దాకా
కనబడేవి అన్నీ కాలంతో ముడివడినవి
ఒక్కొక్క ముడిని విప్పడమే మనుషులు చేసే పని

ఎదురు పడే ప్రశ్నలెంత పాతవి అయినా
వచ్చే జవాబులు, తరతరానికి వేరు వేరుగా

ఒంటరిగా ఉన్నప్పుడు తనలో తాను
మాట్లాడుకునే మనిషిలో, కిలక ప్రపంచం
దీనిలోకి ప్రవేశం అందరికీ దొరకదు
బయటికి వచ్చే మాట అగ్ని కణం కావచ్చు
కట్టె ముక్క కావచ్చు దూది పింజ కావచ్చు
ఏదయినా ఆంతర సంబంధంతో కవిత్వ థెరపి అవసరం

పర్వత శిఖరం పై నుండి కిందికి చూస్తే
లోతున లోయ అట్టడుగున జల చలనం
ఆ సమయంలో పడవలు పయనించాలని కోరిక
ఎవరికయిన కలగవచ్చు! సాహచర్యం అవసరం

చుట్టు ఉన్న చెట్లు శిలలు ! ఎప్పటివో ఏ తరాలవో
సాహసం ధైర్యం రెండు రెక్కలపై కవితో భావ విహంగం

శ్రమ జల కణాలపుడపుడు నిప్పులు ఎగసేను
ఇవియే అపుడపుడు మల్లె మొగ్గలు రాల్చేను

వ్యవహార క్షేత్రంలో మనిషి మనిషికీ మధ్య
ఎరుపు నలుపు తెలుపు పచ్చన రంగుల హద్దుల గీతలు
ప్రతి గీతను దేని కది ఎడం చేసి వైరం పెంచేరు కొందరు
గీతలన్ని చెరపుతూ శూన్యాకృతి నిచ్చే వారూ ఉన్నారు

## 11. మూలంతో పాటు

మృత్యు దూత కరోనా సమాజాన్ని భయభ్రాంత చేసిన శత్రువు
ఎంతో అపాయకరమైంది, ఇపుడు తొలగిన స్థితి అమృతమయం

దీని బదులు మరొకటి దూరే ప్రమాదం గురించి
ఆలోచన సామాన్య ప్రజలలో ముందు జాగ్రత చర్యగా

ఇపుడయితే ఉల్లాసం ఉత్సాహం రెక్కలు విప్పారి
మనిషికి భద్రతపై ఎవరి బాధ్యతలలో వారు మునిగి

దోసిలిలో నిలిచిన నీరు అప్పటికపుడు
నదిలో చేరాలని కోరికలో ఆరాటం

మదిలో ఆలోచనలకు విశ్రాంతి లేదు
ఎదలో అనుభూతి అలకు అడ్డంకి లేదు
క్షితిజంలో సూర్యకిరణ పంక్తి బదులుగ
నీల మేఘ మాలను కట్టాలని ఊహించేరు

అమ్మ చిటికెన వేలు కట్టుకొని
నడచిన బాల్యం! మళ్ళీ వచ్చే వీలు లేదు
అమె చేయి పట్టుకొని పరిణతిలో నడిపించే
సమయం! ఆసన్నం కావడం మానుష సహజం

ఉన్నంతవరకు మనిషిలో తన బల ప్రదర్శనం
పోయాక తెలిసేది అద్దంలో యశోరూపం

పగలు రాత్రి తరాజు తూకంలో పళ్ళేల వలె
వెన్నెల ఉపకరిస్తుంది ఏది కాస్త అటూ ఇటూ అయినా

తూచే పనులను నిర్వహించే వ్యక్తి
దృశ్యా దృశ్యంగా వ్యాపార మొక కళగా

తూచే రాళ్ళు తూచబడే వస్తువు రెండూ విలువైనవి
తీసివేసేవి కావు ఎవరి మెప్పులోనో ! ఇష్టంపైనో

గాఢమైన అనుభూతితో సాంద్రమైన ఆనందం
కవిత లోని మర్మం అందరికీ చెందుతుంది

ఆరోగ్యం మహా భాగ్యమన్న సూక్తి అమృతమయం
అందరికీ తెలియవలసి ఉంది కవిత్వమొక థెరపి మానవ భాగ్యం

ఏ పార్టీ అయినా ఏ నమ్మకమయినా ఏ వర్గమయినా
"నిజం" దర్పణంలో కనిపించదు ముఖంతో పాటుగా

# 12. స్వర లహరులపై

సృజన చేతన సర్వ స్వంతంత్రమైంది కవిలో
బ్రతుకులో దీని సంకేతా లెన్నో ! మనో మయమైనవి
మనుషుల ఆయువు ముగిసే ప్రాణంతో ముడివడింది
తప్పని తెరవులతో ఆశయ సాధనలో పరివ్యాప్తమై
వివిధ స్థాయిల్లో చరిత్ర పుటల్ని రెప రెపలాడించేను
మానుష శక్తి మేరల్ని విలువల్ని పై స్థాయిలో ప్రకటించేను

ఎండల నిరంకుశ ప్రభల చివరి దశలో
జలదాగమ దృశ్యంతో వెచ్చదనం తగ్గేను
పవమాన చలన వాతావరణంలో తృప్తికి చోటు దొరకేను
వేడి రవి బింబాని కెదురుగా జలద పటం వేలాడుతూ

సామాజిక రాజకీయ సమస్యల తాపం హెచ్చి
ఇంత వరకు మనిషిలో పూచే నిప్పు పూల బదులుగ
హృదయ కోరుతుంది, సహన శాంతి వీచికలు
కలహం హననం అలంకార బంధురత కారాదు

పిల్లల నుండి పెద్దల వరకు సమాజంలో
కర్షకులు కార్మికులు పలు వృత్తుల పనుల వారు
సామాన్యుల నుండి శిష్టుల స్థాయి వరకు థెరపి
ఆశలతో కార్య కలాపాలను విస్తృత పరచేను “నిదానం”

ప్రతి వత్సర మొక్కక పేరుతో చెల్లుబడియై
అరవై సంఖ్యలతో ఒక ఆవర్తం ముగిసేను
చక్ర భ్రమణమొక సుందర వాస్తవ రూపం
పలు కార్య ప్రభావాలతో పౌరులు అన్వర్థమయ్యేరు

ఇది ఉగాది! వసంత హృదయ పీఠం నుండి
మనిషి సమాజం ప్రకృతి మేళనంతో జగతి నేలుతుంది

ఏరాత్రి ఏ దుర్ఘటనో విలయ నృత్యం విసరవచ్చు
భయ భ్రాంతంగా భూకంపం రావచ్చు తుపాను వీచవచ్చు
ప్రమాదాల ప్రభావాలు సుడిగుండంలో దింపవచ్చు
మనిషిలోని నిర్మాణగుణం కష్టాల జలధి నెదుర్కొనేను

# 13. ప్రతి రూపం కాదు

హృదయం మరో హృదయాన్ని చేరాలనీ
మేఘం మరో మేఘాన్ని కలవాలనీ
పై నుండి మేఘం క్రింది నుండి హృదయం
రెండిటి అనుసంధానంతో కవిత్వ మొక థెరపి

నిరాశ ఛేదింప బడేను, నిర్మూలిత మయ్యేను
ఆశలను మొలిపించేను, రంజిత మొనరించేను

శుష్కత తీరని సంతోషలహరులపై
నావలో యాన దృశ్యం! అద్భుతానుభవం

కవిత్వాన్ని థెరపిగా గుర్తించి ముందుకు సాగడం
అంతా మన మంచికే అన్నట్లుగా ఉంటుంది
ఇది మానవతా ధర్మంలో కలిసిన విభాగం
బ్రతుకును రాణించే భాగ్య వశం చేస్తుంది

తనలో విశ్వాస మెంతగానో తోడ్పడుతుంది
మానవ విజయానికి చేరువగా సాగుతుంది

ఒకరు కళాత్మకతకు ప్రాధాన్యం ఇచ్చేరు
ఒకరు సంస్కృతి రుచికి ప్రాముఖ్యం ఇచ్చేరు
అంతరంగ పూర్ణతకు దారి తీసే విధంగా
చతురతతో నడిపేరు, మనస్తత్వ వివేచనతో

అనుభవ శిఖరంపై లోకోత్తరమైన హ్లాదం
ఆలోచనలో పలు విషయాలకు చోటు లభించేను

ఒక పిలుపు నవ్వు కేక కను బొమల ముడి
మనసులోని రహస్యాన్ని బయటికి ప్రకటించేను

ఇది కవికి కూడ వర్తిస్తుంది; పూర్తిగా
మానుష రూపాన్ని ఉన్మిషితం చేసేను

వికాస విభవ పదాలు కోరే మనసుకు
అన్నిటితోను అవసరం ఉంటుంది కవితలో
సృజనలో అపూర్వమైన సమాజ దృశ్యం! కవితలు
ఆరోహణలో శిఖరాలను ఆలోచనలో ఆకాశాన్ని
స్పృశించేను! ఏదీ మరొక సృజనకు నమూన కాదు
ఒక థెరపి ! మరొక తీరుకు ప్రతి బింబం కాదు

# 14. మానస థెరపి

ఎక్కడిక్కెడివో ఎవరెవరి నుండో ఎప్పటికీ
రాలిన దూసిన విసరిన ప్రశ్నలకు సమాధాన వేదిక
పోయెట్రి థెరపి సమయ సమయం ప్రజలను
వికాసోన్ముఖంగా మారగ చేసే అమర నిభం

వర్తమాన క్షణాలను కాల రథం చక్రాలుగా
సమాజానికి లాభించే సుపథంపై ఫోకస్

అక్షర బద్ధమయిన స్వర లహరికి గతులేర్పడేను
కవితలోని అంతశ్శక్తి, వ్యక్తి నుండి వ్యక్తికి సాగేను

హ్లాదంగా సుఖదంగా శబ్దం విప్వమయ మయ్యేను
ఎన్ని యుగాలయినా తరగని మారని ఆకర్షణతో
మనసు పాత్ర ఉన్నంత వరకు ప్రతి బ్రతుకులో
కవిత! అవసరం విలువైనది ప్రియమైనది వరమయినది

ప్రశ్నా పత్రంతో మొదలైన మనిషి జీవితం
కాలం గడచే కొద్దీ తొలి లయ చెదరేను
జన శ్రేయో పీఠాన్ని ఆవహించి “థెరపి” నిలిపేను
చరిత్రలో సాంస్కృతిక విశాలతను కూర్చేను

వైరుధ్యం వైముఖ్యంలో చీకటి మచ్చలను తొలగించి
ఆరోగ్యానికి లోటు లేని సుస్థితికి దారితీసేను

రోజు రోజుకూ మారే మనుషుల చర్యల దృశ్యాలు
కొత్త దనం కోరే వారి కెంత ముఖ్యమో ప్రియమో
ఇది ఇంకా ఇంకా బ్రతికే ఆశను పొడిగిస్తుంది
కుసుమ గుచ్ఛమై కవిత! జలధి అలలపై నడిపిస్తుంది

మానసికంగా థెరపి ప్రభావమెంతో !ప్రగతి పథంలో
లయ తప్పిన జీవన వాహనాన్ని సరి చేస్తుంది

ఆవలి గట్టుకు చేరడమొక పెద్ద సమస్యకాదు
పొయెట్రి థెరిపి! చేయకలిగింది! యంత్రం చేయలేనిది
ఆధునిక యుగంలో అలజడి ఆర్తి అశాంతిలో
ఇది మనస్తత్వ ప్రకాశం చెదరని లయతోనే సాధ్యం

జీవన రణ సంగ్రామ స్థితులలో చిర బంధానికి
శాంతి సూత్ర మవసరం! ఇది క్రియలో మానస థెరపియే

# 15. అమూల్యం

కవిత్వమొక థెరపి ఎక్కువగా ముఖ్యంగా చికిత్స మానసికం
వ్యక్తిలో ఆరోగ్యం నైతికంతో మానసిక విజయ పథంలో
ఇది సాగినంత వరకు అవసరమయిన విషయ ప్రభావాలతో
ఇది కవికి కూడ తన పనికి వచ్చే ఉత్తమ సాధనం

దైనందిన చర్యలలో ఇదొక ముఖ్యమైన భాగం కావచ్చు
ఏదయినా మానసిక భావనతోనే సృజన కళ చేతనే

ఎవరికి వారు సరి అయ్యే నయం చేసుకొనే వారూ
ఆశాభావంతో నిర్మితమైన తమ వ్యక్తిత్వంతోనే
చికిత్సకు సహకరించే స్పందనం తెలుస్తుంది
మనస్తత్వ శాస్త్ర పరిశోధన పెరిగిన కొద్దీ
ఇది! ఎన్నిటికో ఉపయోగపడుతూంది చింతనచే
థెరపిలో కవిత్వం తరువాత సంగీతానికే పెద్దపీట

నిరక్షరాస్యుల నుండి విద్యావంతులు నిపుణులు వరకు
ఎవరూ మినహాయింపు కాదు; ప్రయోగాల సరణిలో

ఏ దిశ అయినా ఏ పథమయినా మనిషిలో
బాధ ఆర్తి కష్టం దోషం ఏదో చుట్టుకొనీ
సర్పంలా భయ భ్రాంతం చేసేది కనబడరాదని
పూల దండతో ధైర్యం వడపోసేరు విజయం కోరేరు.

ఒత్తిడిలో రాపిడిలో దోపిడిలో నలిగిన మనిషి తనం
పునరుద్భవమందేనా? ఉత్తమ సమాజ శ్రేణులలో ఒకటై
ఆంతరమైన పూర్ణతకై యత్నం! సాధ్యం కావాలని
సామాన్యం కాదు చరిత్రలో పుటలు ఆగవచ్చు
అడ్డంకు లెన్నో అలసట లెన్నో దూకే అలజడు లెన్నో
తరతరాల ప్రజాస్వామ్య స్వేచ్ఛలో విపన్నుల ముద్రలతో

తనలో చింతన తనను గురించి సమీక్షలో
ఒక సుందర వాస్తవ విహగం అనుభవంలో
కోర్కెలు తీరని ఆకాశం తిప్పుతుంది మనసులో
కిందికి దింపుతుంది భూమిపై అనివార్యమై

అడుగు వేస్తే భూమిపై "సస్యమివ" జ్ఞాపకం వస్తుంది
మనిషితో చెట్టుతో పైరుతో సంబంధం! అమూల్యమై

# 16. థెరపి కళతో వెలుగులై

కంటికి కనిపించని మనసు ప్రమేయం తప్పనిది
జీవితంలో మనిషి గుర్తించి నడవడిలో మార్పు! కోరేను
బాధా నివారణం ఆర్తి హరణంతో సానుకూల వర్తనం
యత్నంతో మొదలవుతుంది అప్పటికిది అంతర్విషయంగా

విశ్లేషణ వివేచనతో అనుభవ క్రమం సాగుతుంది
ఇది స్థిర పడే దాక థెరపి ప్రాబల్యం! చిత్త వికాసం కోరీ

ఆశావహులకు ఆధారం దొరికినట్లు ఉంటుంది
ఆత్మ విశ్వాసం పలు రకాల పూలను పూయిస్తుంది
బ్రతుకుల్ని అలంకరిస్తుంది, అంతా ఆత్మ తృప్తి తోనే

పూవు లెన్ని రకాలో మనస్తత్వ రూపాలన్ని విధాలు

సుఖమూ భాగ్యం కాకపోతే మరేమికోరేరు మనుషులు!
ఆయువు అధికారం ఆనందం డ్రెస్ అప్ అయి వచ్చేరా?

బయటికి బాధలు తాము తీర్చేవి తీర్చలేనివి
వేదన లోనే ఆంతర చేతనలో ఉన్ముఖమవుతూ
చిత్త వికాసంతో పాటు అనుభవ పరిణతి కూడా
మనుషుల్ని ఎంత దూరమయినా పయనింపచేసేను

దేశాలు దాటేను జాతుల్ని కలిసేను సంస్కృతులు తెలిసేను
తన పేరు తన ఇల్లు తన ఊరు ఇంకెన్నో తనవి

ఆశ నుండి ఆత్మ ప్రత్యయం వరకు సాగుతుంది
థెరపియై కవిత్వం హృదిలో కదలే రవి శశి మూర్తుల వలె
బహిర్వర్తనం వెనకనే ఆంతర్వర్తనం కాల చక్రం వలె
పఠనం శ్రవణం మనసంతా థెరపితో మంత్ర కళను పొందేను

సామాన్యం నుండి విశేషానికి చేరేను వ్యక్తి
సంస్కరణం పరివర్తనం మానవ జీవన హేతువుగా

ఏదో ఒక ఆందోళన అవాంతరం అన్యాయం అజ్ఞానం
లోని చేతన బింబాన్ని నిరోధించాలని చూచేను
కాలం గడుస్తుంది మర్యాదామయంగా
దీని నీడలోనే అందరూ బ్రతికేది థెరపి కళతో వెలుగులై

## 17. ప్రతి ఫలనం

జీవ రూపానికనుగుణమైంది మనసు కోరుతుంది
స్వేచ్ఛలో స్వచ్ఛతతో నైతిక వికాస మవసరం
ఇది థెరపిలో మొదట పొందే !ప్రయోజనం
రోజు రోజుకీ విస్తృత మయ్యే మనో భూమిక
నిర్వహణం సామాన్యం కాదు, బాధ్యతతో కూడింది
థెరపిలో శ్రద్ధతో పాటు అభిలాష ముఖ్యం

ఒక వైపు నుండి ప్రకృతి వైపరీత్యాలు, తప్పనివీ
సమాజంలో సమస్యలపై ఘర్షణలు మరోవైపు నుండి
ప్రతి ఒకరు కోరేరు బ్రతుకులో విభవ వికాసాలు
ఇవి పొందే చేరే పథాన నడతలోనే భిన్నతలు

ఈ మనుగడకు సాధారణమైనవి, అవసరమయినవి
అందరికీ కావలసినవి! నింగి నుండి, ఊడి పడవు

దేహానికి నివాసం లాగ మనసుకు కావలసినది
అంతరంగం! ఎక్కడో మనసులో పొరలలో చేతన
అన్నిటికీ దేని కది సరిది చెప్పగల చూపగల
థెరపి! కవిత్వం, ఎప్పటికీ అమూల్యమైన వాస్తవం !

సామాన్య స్థాయి నుండి విశేష ప్రగతి లోకం చెరుతూ
దిశదిశనూ ప్రొగ్రెస్ రిపోర్టుతో మార్పుకు సిద్ధం చేసేను

కొత్త మనో లోకంతో స్తిమిత భావ కలనంతో
జీవన చక్రానికి కోణాలవలె, విషయాలెన్నో!
ఒకరికి తెలిసినదయితే మరొకరికి తెలియనిది
సమస్యలో రెండూ ఎదురెదురుగ పోటీలో విజయంకై

మనిషిలో రక్తితో సమాంతరంగా సమూహంలో సంఘ శక్తి
రెండూ కలిసిన శ్రమ చేతన ప్రయోజనం నవ నిర్మాణం

తుపాను వేగ తీవ్రతలకు ఇల్లు కూల వచ్చు
చెట్టు విరిగి పడవచ్చు, చేసే దేముంది చూస్తూ
కొత్త ప్రకృతి దృశ్యం కోర వలసిందే
బీభత్సం నుండి శాంతానికి ధ్వంసాన్ని మరపించే సృజనకు

గతం భవిత మధ్య ఏదో విధం వంతెన వర్తమానం
అక్షర జగత్తులో ప్రతిఫలించేవే థెరపిలో అన్నీ

# 18. అంతరంగ వేది నుండి

అంతరంగ వేది నుండి కాలం ప్రశ్నలు వదలేను
ఎవరి కయిన సరే ! ఒంటరిగా ఉన్నప్పుడే చనువుగా
జవాబు వెడలే లోపల సమూహ దృశ్య మావహించేను
యత్నంలో కవిత్వం థెరపితో కొంత తృప్తి లభించవచ్చు
ప్రగతి వేగం పెరిగే కొద్దీ, మాలలుగా కొత్త ప్రశ్నలు
జవాబులును బట్టి కొత్త సమస్యలు ఒకటొకటి చేరేను

ఎవరిపై ఎంత కోపం కసి వైరం తాండవ మాడినా
నెత్తురు చుక్కల గీతల చిత్రం కన్నా, అవని
పచ్చ గడ్డి మాత్రమే కోరేను ప్రియంగా
పోషణలో అమ్మ ! చేసే పనిని చేస్తుంది,

ఇది ఆధునిక రణం! అగ్ని శిఖల ప్రాకారాలతో
ఆలోచనలోకటొకటీ ద్వేషం పొగలతో ఎగసేను

చేతిలో ఆయుధంతో ఎదురైన మనిషిని చూస్తూ
ఏ రోజునో! తననే కాల్చేనని సంశయంపై ఊగుతూ
అనుమానంలో మనుషులు ఎవరికి వారు ఒంటరిగా
తిరిగే భయచక్రంపై, తామూ తిరుగుతూ కాలం గడపేరు

ఆరని జ్వాలా చలనం అణగే ఆశతో నిరీక్షణం
మేఘం వచ్చే లోపల ఎందరి ప్రాణాలర్పిత మయ్యేనో

ఆయుధంతో అణచివేసే రనుకుంటూ కొందరు
దాని తోనే తొలగ జేసే పని సమన్యాయమా?
తూకం ఒకటేనా? విలువలు సరిపోయేనా?
చీకటిలో వెలుగునీయాలని కోరిక! ఎందరికో

ఎందరికో? థెరపి అవసరం! మౌన బంధనలో
ఇది స్వయం కృషితో పరివర్తన ప్రభావ కళతో

అలలపైన సుగమంగా సాగే నావలా
భూమిపైన సృజన భవం పచ్చని మొలకలా
గాలిలోన ఎగసి పోవు పతంగి యానంలా
వాన రాకతో విరిసిన ఇంద్ర ధనుసులా

మంచిలో మార్పును మేలులో ప్రగతిని
దర్శింపగ చేసే, అంతర ప్రేరణ కారణం

## 19. ఉన్నదే సరికొత్తగా

ఈ పొయెట్రి థెరఫి ఎప్పటి నుండో ఉన్నదే
సమాజంలో ఇమిడి పోయి పరంపరలో
ఇష్టమైన శబ్దంతో ఉల్లాసం ఉత్తేజం
ఇష్టమవని శబ్దం వినబడుతూ ఉంటే
అగ్గిపుల్ల గీసి అంటిస్తే మానేనా? తొలగేనా?
దీనికన్న రెండు చెవులు మూసుకోవడం మంచిదేమో!

దేనికేది సరి పడుతుందో, సముచిత మవుతుందో
దాని కదే వీలుగ! చర్యలతో, బాధలు తొలగేను
ఈ థెరపి మౌలికంగా అనుభవ రూపితమైంది
కవితో కవిత్వం సమాజం అనుబంధం మూడు కోణాలలో
మనసుపై ప్రభావ ప్రసరణ మొక ఆరోగ్య విధం
అందరికీ ప్రవేశం మనో నిలయంలోకి థెరపితో జరిగేను

వేద వేదిపై ఉపనిషద్గోష్ఠిలో ఈ రూపం తొలి ప్రకటనం
ఇపుడు రికార్డులు సిడిలు పెన్‌డ్రైవ్‌లు మరెన్నో!
అందరికీ అందుబాటులోకి వచ్చిన ఉపయోగాలు
వైద్య క్షేత్రానికి సహాయకారులుగా ప్రేరణ కళతో

శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం భాగ్యవశం అయిన కృషి
రెండు రెక్కలుగా మార్చి జీవన గగనంలో తిప్పేను

బాహ్య ప్రపంచం కన్నా ఆంతరమైన మనోలోకం
ఈ థెరపిలో గొప్ప పాత్రను పోషిస్తుంది
లోని ప్రగతి నిలయం తలుపులు తెరవబడీ
వ్యక్తిని ఆదర్శ బింబంగా తీర్చాలనీ మనసులో

విజ్ఞతతో వివిధ సాధనాలను వాడుకునే వ్యక్తి
సమాజ రూపం మార్చేను, వ్యక్తుల ఉన్నతి పెంచేను

ఉన్నదే కొత్తగా ప్రయోజన విస్తృతి పెరిగేను
ఛందశ్శాస్త్రం ప్రమేయంతో! తనకు నచ్చిన
పద్ధతిలో చదివి ఆనందం పొందే రెందరో
సహృదయుల స్థానంలో ప్రజలు ! అక్షర ప్రియులు

ఆరోగ్యం విషయంలో మానస క్షేత్రంలో
పండని పంటలేదు, పొందని లాభం లేదు

# 20. భద్రంగా

థెరపి ప్రభావంతో సుస్థితి పొందిన వారూ ఉన్నారు
కవితలో ప్రతీకాత్మక నిర్వహణంలో భావ జగంతో
స్వయం నిర్మాణంతో పాటు ఇతరులను ప్రేరేపించేను
బాధితులకు పీడితులకు ఇదొక ఉపశమన ప్రక్రియ
ఒక ప్రణాళికా బద్ధంగా ఆధునికం కావలసి ఉంది
మనో వైఖరితో సమస్యల బరువు తగ్గడమొక ఫలితం

ఇది నిలబడే స్తంభాలు నాల్గు నాలు దిశలలో చుట్టూ
స్పందన శీలం నిర్మాణ గుణం ఆశా రూపం నిపుణత
అర్ధ వంతమైన నిజ జీవన గమనం సమకూర్చేను
ఆదర్శ సోపానాలపై నైతిక సరణి నవలంబించేను
వ్యక్తులను బట్టి ఈ థెరపీలు వేరు వేరుగా
అడుగడుగున మానుష ధర్మాన్ని జ్ఞాపకం చేసేను

మనసుపై ఒత్తిడి తగ్గి మబ్బులా తేలికగా
హృదికి పద్మ సుందర స్థితిని చేకూర్చేను

గాయం శాశ్వతమైన జ్ఞాపక చిహ్నామైంది
ఊహలో చరిత్ర పుటను విప్పుతుంది
బాధా స్థానంలో గాఢా ప్రియత చోటు చేసుకునేను
శుష్కమైన ముఖంలో సమార్ద్ర రేఖ కనబడేను

అన్ని యథాతథంగా, మనిషి చూపు! నవ్యతపై
గుణ దోష వివేచనలో మదిలో హంస రూపం!
ఏ పద్ధతి అయినా, ఏ థెరపీ అయినా సరే
ప్రాణ మెంత విలువైందో! చేతిలో ఆయుధంతో
అవగతమవుతుంది, మానవ బంధాన్ని తలపిస్తుంది
వస్తువులెన్నో పనిముట్లుగ కత్తి మాత్రం ఒరలో ప్రత్యేకం

జీవన గమన మెంత తప్పనిదో, అవసరమో
ఉదయ సాయం సంధ్యా సమయంలో తెలిసేను
స్వార్థం కేంద్రంగా గానుగ ఎద్దులా చుట్టూ
తిరిగే మనో రూపమెవరు కోరతారు, తనలో

ఆయువు ఉన్నంత వరకు సుఖాపేక్షతో థెరపి
ఎదురుగ ఎదిగే మొక్కలో కొత్త జీవితం భద్రంగా

# 21. కనిపించని రూపం

స్వకీయం నుండి పరకీయం వరకు అడ్డమైన దారులు
వీటి నధిగమించే విధానాన్ని బట్టి ఈ తెరపి విజయం
మనిషి మనిషికీ వేరు వేరుగా యోజితమవుతుంది
విధి నిర్వహణంలో సార్ధకతతో శోభామయమయ్యేను

శరీరంలో ఆక్షణం సజీవమైన కణకణంలో ఆకృతి
విద్యుదున్మేష రేఖలతో ప్రకాశమాన మయ్యేను

అనుభవలోకంలో ఎవరి తత్త్వం వారిది నడతలో
ఇది అనుభవ వేద్యమయింది, మౌలికంగా
ఎవరు కోరిన పనివారు చేసుకోవచ్చు
ఎవరు మెచ్చిన పని వారు పూనుకోవచ్చు
థెరపికి పై స్థాయి కింది స్థాయి భేదాలు లేవు
పనికిరాని అలవాట్లను దూరం జరపడమే

వాన చినుకు లేక ప్రకృతిలో దరిద్ర తాండవం
ఆర్ద్ర గుణం లేక బ్రతుకులో కఠోర వాస్తవం
బ్రతుకు పంట పండలేదని దరిద్ర విలాపం
రోజులన్ని ఒకే విధంగా పూల రేకులతో రావు

కొత్త కొత్త కూర్పులతో మార్పులతో
సంసిద్ధంగా ఉండి తీర వలసిందే

మధ్య మధ్య ఒత్తిడులు రాపిడులు క్షోభాకుల సందర్భాలు
వీటి నుండి శుభ్రమై బయటపడడం సామాన్యం కాదు
పథ పథాన సత్యం ధర్మం న్యాయం మానవత
విషయాలలో హిత సూచనలెన్నో! ఎప్పటివో మార్మ్రోగేను

మనుషులు తప్పిన లక్ష్యం, శుక్ర తారలా మినుకు మినుకుమనీ
రాత్రులు తల ఎత్తిన కానీ, కనిపించని అసలు రూపం

ఎప్పటివో కుప్పలుగా దుష్కర్మలు దురూహలు బయట
అనలం దగ్ధం చేసేనా? వరదకు కొట్టుక పోయేనా?

మంచులోన అణగి మణగి దీన స్వరం వినిపించేనా?
కాలం చూపుల మేరలు దాటినవై చేతుల కందనివై
కాలానికతీతంగా సృజన హృదయం కవిత్వంలో
తత్కాలంలో అక్షర చేతనతో నిజ శక్తిని సాధించేనా?

# 22. ప్రదర్శనం

ఇది జీవన వాస్తవం ! అలరించే సర్కస్‌లో
ఇంద్రజాల ప్రదర్శనం శూన్య ముఖంతో సమాజం
మండే ఆలోచనలతో మనుషుల మస్తిష్కాలు
గడచే ఆయువు పెరిగేను దృశ్యం వేరయ్యేను

తెలియని యధార్థాలు కొన్ని ఘటనలతో
మరో మనిషి జీవితాన్ని చుట్టుకొనేను

మట్టివో గాజువో ప్లాస్టికో రబ్బరో
బొమ్మల ఆట కలతో సమానమై
మరొక చోట తమాషాలు! హ్లాదపరుస్తూ
మనిషిలోనే గుప్తమైన కళను పైకి తీస్తూ
సుగమ సుందరతలను కోరే జీవన గమనం
మృత్యు భయం వీడిన మనో రూపంతో

అన్నిటికీ తేజో రూపమొకటే! రవి తేజం
పైన చంద్రుని మొదలు క్రింద మనిషి ముఖం దాకా
ఆరోగ్యం కోసం, "నిదాన" జగత్తు! ఆదుకునేను
వ్యథబాసిన మనో రూపమొక వరం బలమిచ్చేను
మారే సమాజానికి అధిపతి అవుతుంది, కవిత్వ థెరపి
మనిషిని సంస్కృతీ తరుచ్ఛాయలోకి దింపుతుంది నేరుగా

గగనంలో మేఘం కనిపించడంమెంత సంతోషమో
కవిత్వం థెరపి స్పృహ పెట్టుబడి లేని ఆదాయంలా
ఇది సర్వస్వతంత్రమైంది సమాజ హిత బంధువు వైంది
తన పాత్రను నిర్వర్తించేను! నిబద్ధతతో

ఇది దాచేది కాదు ఎవరైనా ఎత్తుక పోయేది కాదు
సహృదయ సమాజ సంస్పందనతో ముడివడి ఉండేను

సృజన చేతనతో బ్రతుకులో కళాత్మకమయ్యేను
విజయ భావనతో అందల మెక్కేను మనసు
వ్యక్తులను సమాజంతో ఆరోగ్యంగా ఉంచడమే లక్ష్యం
ఇపుడు విశ్వ సంస్కృతిలో భాగమైంది, ఉత్సాహంతో

# 23. పరిశోధనలో ధునియై

ఈ జీవన గతిలో ఉన్నతిలో వికాసానికీ
ఏ వైపు నుండి దేని నుండి ఎవరి నుండి
ఎంత సహాయం లభించినా ఈ థెరపి పూర్ణతకై
స్వీకరింపబడేను కవితలో కవులచే పరిశోధనలో

చిహ్నా మెత్తయినా అవసరమైనది ఉపయోగపడేది
విజ్ఞానం సాహిత్యం తాత్త్వికం మనస్తత్వం రాజ్యతంత్రం

ఈ థెరపి నిదాన రూపం వేల ఏండ్లు దాటింది
వ్యక్తుల అస్తితలకు వేరు వేరు దృఢతల నిచ్చేను
అక్షర సంబంధంతో చిరకాలం బ్రతికేను
వ్యక్తిత్వ వికాసంలో స్వయం ప్రేరణ నిచ్చేను

భౌతిక సంస్థితిలో విజ్ఞాన కాంతి శిఖరాలతో
పఠనం శ్రవణం మననంతో త్రిపుటి ఆకృతి శుభ్రమయింది

మధ్య మధ్య తెగే బంధాల్ని స్థాపిస్తూ
ఉచ్ఛ్వాస నిశ్వాస ప్రాణితమై అమరతతో

మనోమయ రూపానికి మనస్తత్వం తీరు తెన్నుకు
ప్రాముఖ్యంలో అంతశ్చేతన పని చేస్తుంది
కనిపించని గాలిని అడిగితే ఏం చెబుతుంది?
అనుభవ సుందరమయిన అక్షర పద స్పృహను తప్ప!

ప్రతి మనిషి ఎంతో కొంత తనది వదలిపోయేను
ఆ వచ్చే తరానికి ! ధనమొ సంపదొ యశసో! మరేదో
స్మృతితో మిగిలేది, ఫోటో విగ్రహం అక్షర తేజం! అనన్యం
చరిత్ర నిర్మాణంతో సరిపోదు ప్రభావ ప్రసారం అవసరం

క్షణాల అలలపై పడవలో పయనిస్తే సరిపోదు
ఒక క్షణంలోనయినా సాధించిన కార్యం ముఖ్యం

ఈ భూమిని ఆ నింగిని చూస్తూ కూర్చుంటే ఒరిగే దేమిటి?
చిలుక నెమలి హంస పావురం హరిణం ప్రేమాస్పదంగా
విషాద స్థితుల మధ్య గడపే కళాత్మక చేతనతో
సమాజంలో కోల్పోయిన ప్రియ భావన పూచేనా?

చోటు నుండి చోటుకు బరువులు! క్రిందికి దించి సాగేనా?
తానే ఒక బరువై శిలయై నిలిచేనా? సంశోధనలో ధునియై తరలేనా?

# 24. శబ్దంతో మహనీయం

స్వర స్వచ్ఛత సంగీతంలో గాత్రానికి తప్పని అంశం
అన్నిటికీ కలుపుకొని పోతుంది! సుగమంగా జయావహం కాలం!
కడలి అలల లయ సంస్పందనం సుందర కళామయం
భౌతిక క్షేత్రంలో ఒక బ్రతుకు, మానస గగనంలో ఒక విధం

ఉత్తమ సంస్కృతి స్థాయిచే, కవిత్వ మొక థెరపి అయింది
అందం గంధంతో మనిషి అసలు రూపాన్ని తలపించేను

ఈ థెరపి మనో గతమైంది, శాంతి సమర్పకమయింది
కవిత్వ రుచి తెలిసిన వారికి అంతో ఇంతో పరిచయమే

నైకమైన అనుభవ గాఢత కొత్త బంధం కూర్చేను
స్వర సుందర లయాత్మకం రాగఛాయతో కలిసి
ప్రయోజన పరతతో, ఎదకు సుఖాపాదకమయ్యేను
ప్రతి ఒక్కరి అంతిమ ధ్యేయం ఒకటి కాదు, అవదు

తొలి 'రుక్' నుండి ఉషస్సు తేజం వరకు
ఈ థెరపి, సంస్కృతీ శిఖరాలను దర్శింపచేసేను
ప్రతి ఒక్కరిలో వ్యక్తి నుండి సమాజ చేతన వేరువేరుగా
దార్శనికంలో భేదం; స్వేచ్ఛా రూపాన్ని ముందు నిలుపుతుంది

గతం నుండి సంక్రమించింది, ఉపయోగంలో ప్రేయం
వర్తమాన పథంలో నయితే అనుభవైక వేద్యం

భాషతో భావం గమనంతో లక్ష్యం తప్పనివీ
విముఖతతో కాలం గడుపుతూ వ్యర్థంగా
నిరాశలో చీకటి గురించి చింతనకన్నా
థెరపి రూపం మనసుకు భద్ర పేటి అవుతూంది

సుముఖతతో కాలాన్ని ఎదకు హత్తుకొనీ
వెలుతురుపై అభిమానం అభిలాష కదలనీ

భాష వెనుక నుండి భావం ప్రత్యక్ష మవుతుంది
భావ జగం నుండి థెరపి పైకి అవతరిస్తుంది

ప్రస్తుతం కావలసింది మాత్రం ! ఆరోగ్యం స్వాస్థ్యం
ఆయువుతో జన శ్రేయోరూపం ప్రేయంగా స్వచ్ఛంగా
మనిషిలో ఎన్ని ప్రశ్నలకో సమాధాన మిచ్చే శక్తితో స్వేచ్ఛ
ఉందనీ! తెలుసు అందరికీ, ప్రాణిత శబ్దంతో ఇది మహనీయం

*

# తెలంగాణ స్వరం

మాదిరాజు  రంగారావు



2018

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్ – 500 028

# TELANGANA SWARAM
# &
# ATHMA BANDHAM

by

Prof. Maadiraju Ranga Rao

© : Dr. M. Santhosh Kumar

Year of Publication 2018

**ఇది**

**ఉద్యమ త్యాగ మూర్తులకు**

**అంకితం**

**తెలంగాణ రాష్ట్రం**

**అవతరణ సందర్భంగా**

**02 జూన్, 2014**

# పీఠిక

ఈ కృతి అపుడపుడూ మిత్రుల కోరికపైన ప్రత్యేక సందర్భాలలోను వ్రాసిన స్వీయ పద్య రచనల సంపుటి. పద్యం పట్ల నా అభిమానాన్ని, గౌరవాన్ని తెలియజేసేవి. తెలంగాణ ప్రత్యేకరాష్ట్రంకై జరిగిన ఉద్యమ దశల్ని మొదటి నుండి చూచిన వాళ్ళలో నేనొకణ్ణి. ఆ ప్రభావంతో చివరకు మంచి ఫలితాన్ని చూచిన సంతోషం స్పష్టం.

ఇదే విధంగా 'ఆత్మ బంధం' కాల్పనిక స్పర్శనూ, మానవీయం సామాజిక వాస్తవ స్పృహనూ కలిగినవి.

"తెలంగాణ స్వరం" కృతిని ఇంగ్లీషు భాషలో Voice of Telangana పేరుతో అనువదించిన డా॥ లంకా శివరామ ప్రసాద్‌గారు సహృదయులు బహు గ్రంథకర్తలు విశాలమైన ఆలోచన, ఉన్నతమైన ఆదర్శం అంకితమైన జీవన రూపంతో విశిష్టమైన అస్తిత్వాన్ని పొందిన మాన్యులు! సన్మిత్రులు కృతజ్ఞతలతో..

**మాదిరాజు రంగారావు**

# తెలంగాణ స్వరం

## 1

ఈ తెలగాణ నేడు ప్రజ
స్వేచ్ఛకు వేదికయైన భూమియై
ప్రాత రుదార బింబమయి
ప్రాభవ శోభను పొంది నట్టిదై
శాంతి కవాటముల్ తెరచి
స్వాగతమున్ రచియించు చున్నదీ
ప్రాంత మనోజ్ఞ సంస్కృతుల
ప్రాపణముల్ ప్రకటించు దీప్తితో

## 2

తెలగాణమ్మొక రాజకీయ ఘన నీ
తిన్ నిల్చి, కాలాగ్నికిన్
జలదం బై విచరించి నిల్చినది, ఓ
జన్, నేడు స్నేహాశయా
కలితంబై ఒక తృప్తి రేఖ హృది, రా
కా కార పద్మాకృతిన్
వెలసెన్ రాష్ట్ర చరిత్ర ఏండ్ల పయి ఆ
వేశాల ఘట్టాలతో

## 3

ఈ దిన మాత్మ తైజసము
　　నింగిని ఆనెడు కీర్తి మూర్తియై
ఈ దిన మాత్మ భావనలు
　　రేకులు విప్పిన పద్మ గంధమై
ఈ దిన మాత్మ గౌరవము
　　రెక్కలు విప్పిన హంస శోభతో
ఈ దిన మందు ఉద్విభవ
　　వీచిక! కాలము మార్పు గుర్తుగా

## 4

మా తెలంగాణ ఉద్యమ మాన్య చరిత
వివిధ భాషల సంస్కృతి విభవ నిలయ
నిఖిల జగతికి ఆదరణీయ మగుచు
ఇంద్ర ధనుసును తలపించు పీఠ భూమి

## 5

హైదరాబాదు సంస్థాన హార రత్న
ఈ తెలంగాణ ప్రాకృత స్నేహ సీమ
ప్రజల స్వాతంత్ర్య కాంక్షతో ప్రభవ రూప
రాష్ట్ర భావ తరంగిత రాగ రమ్య

## 6

తన అస్తిత్వము రూపు దిద్దుకొని, చి
త్తంబందు స్వేచ్ఛాశయా
నినదం బెంతయు శాంతి తేజమున, ఆ
నీతాంశు త్యాగాలతో
కనిపించెన్ ఒక రేమి? అందరును, ఏ
కాకార చైతన్యమై
విన సొంపైనది రానె వచ్చినది, భా
విన్ భాగ్య రాష్ట్రంబుగా

## 7

వీరా లోలము లోన ఏండ్లు గడచెన్
స్వేచ్ఛా స్వయం పాలనా
భారానన్ తమ వంతు కోసమయి, ఈ
ప్రాంతానికిన్ మేలుగా
హర్తాల్ స్ట్రైకులు దీక్షలున్ నిరసనల్
హోరాళిగా వీధులున్
ప్రారబ్ధంబని ఊరకుండ గలరే!
ప్రాణైక ధీ సేవధుల్

## 8

ఆశ సన్న గిల్లి రాష్ట్రమ్ము రాదని
ఒకడు టవరు నెక్కి దూక బోయె
ఆశ దూర దూరమై క్రుంగి వేసారి
ఒకడు అగ్ని నంటి బూది అయ్యె

## 9

సాహసాన దూసి శాసన ధిక్కార
చర్య వెంట ప్రభుత చకిత చర్య
నేర మన్న మాట నిండు ప్రాణము తీసె
కరుణ చిమ్ము త్యాగ గాథ మిగిలె

## 10

క్లాకు టవరు సాక్షి కదలిన స్థితులకు
మనసు సాక్షి మనిషి మలిన కృతికి
పొద్దు పొడవ జేసె, పోరాట గడ్డపై
మనిషి నమ్మ కమ్మె! మనిషి పైన

## 11

అన్ని వైపుల నుండి ఆవేశ గతులు
కర్మ వేది నుండి కార్యమతులు
సర్వ జనుల మహోద్యమ సవన ఫలము
అమృత శక్తి హృదికి అందజేసె!

## 12

ఆనాడే ఉదయించి నట్టిది సుమీ
ప్రత్యేక రాష్ట్రాభిమా
నా నూనం బగు ఈహ! అందున ప్రయ
త్నం బంత! పోరాటమే,
నానా కష్ట ఫలంబుగా ప్రజల, ప్రా
ణాలాకులై రాలి పోన్
నానా వాద ప్రకారముల్ కలిసి, స
న్నాదంబుతో ఒక్కటై

## 13

ఒక రటు నుండి, పాట అయి
గుండెల నూపుచు పోవు చుండగా
ఒక రిటు నుండి, మాటలకు
ఊపిరి నింపుచు పోవుచుండగా
ఒక రెటు నుండొ, మ్రోడులకు
పూతల దుస్తులు తాల్ప జేయగా
నికరము తేల్చి వేయుటకు
నిర్ణయ భావ నిమగ్న శోభితుల్

## 14

వనముల్ గుట్టలు చెర్వులున్ చెలమలున్
వాసించు ఈ ప్రాంత మం
దనువై యున్నది భాగ్య రాసులకు, సా
దా జీవనాపేక్ష వీ
డని, లే కొబ్బరి పాల వంటి హృదయుల్,
ఏ దారిలో సాగినన్
నినదించున్ తెలగాణ నాణెము, దిశల్
నిర్వ్యాజ స్వేచ్ఛా గతిన్

## 15

అనల పథమున నడచిన అమర చరిత
శాంతి కవచము వీడని కాంతి కలిత
ప్రజల దైన్యము హైన్యము బాపు సుహిత
మా తెలంగాణ ఉద్యమ మాన్య చరిత

## 16

రుతువు లన్నియు ఒక చోట రూపు నంది
బ్రహ్మ నాశ్చర్య పరచు సమాజ విభవ!
భయము లేని చీకట్లకు భయము గొలుపు
మా తెలంగాణ! ఉజ్వల మాన్య చరిత

## 17

పచ్చ పచ్చని చేలపై ప్రభలు విరిసి
తెల్ల తెల్లని వెలుగుతో తెలివి సాగి
ప్రజ మనో భావముల నేలు పరమ రాజ్ఞి
మా తెలంగాణ! ఉన్నయ మాన్య చరిత

## 18

అందముగ గౌరి రూపము నావహించి
ఎన్ని రంగుల పూలను పేర్చి పైకి
పరమ బిందువు సాకార ప్రకృతి హేల
అమ్మ భావన! హత్తిన బ్రతుకు ఆట!

## 19

సంస్కృతిని అల్లుకొన్న ఉత్సవము లెన్నొ
అన్నియును ఆత్మ బింబ ప్రకాశకములె!
ఈ తెలంగాణ అట్టిది! ఎవరి కైన
శాంత జీవన సుందర స్వేచ్ఛ భూమి

## 20

శ్రేణు లన్నియు వర్గముల్ ఏక మైన
వేల కిరణాల సంహిత! వెలుగు రూపు,
ఈ తెలంగాణ మీనాడు విజయ సుషమ
అస్తమించుట లేని ఉత్సాహ పూర్ణ!

## 21

పరచిన ఎఱ్ఱ ఎఱ్ఱని తి
వాచిగ మోదుగ పూల దారిలో
తెరలను చీల్చి వైచి జన
తేజము రూపము మధ్య మధ్యలో
పరి పరి హింసలున్ మసక
బారిన మానస దుష్ట చర్యలన్
తరలుచు, కాల రేఖలను
దాటుచు, పొందిన దీ స్వతంత్రమున్

## 22

తొలి నాళ్ళన్ బహు బంధనమ్ములవి సం
తోషంబు లేనట్టి చే
తలతో పాలన సాగి పోయినది, సం
తాపంబు చేకూర్చు, విం
తలలో వింతగ నోరు మూయబడి, అ
తా ఉర్దు భాషా రుచిన్
తెలుగున్ మూలకు నెట్టి వైచి, బ్రతుకుల్
తిప్పల్ వడన్ జేయుచున్

❀

## 23

ఆంధ్ర మన్న అగ్గి అంటి నట్లయి పోయి
కత్తి దూయ బోయె! కరకు గుండె
తెలుగు నేల అయిన తెలుగిట శూన్యమ్మె
పగలు కూడ చంద్ర వంక వెలుగె!

## 24

మంచు కప్పి యైన మరపున బడి యైన
జనత చూడ లేని జాతి చరిత
ఎవరొ! చూప! ముకుర బింబము సాక్షిగ
ఉద్యమమ్మె నడచె! ఊర్జితముగ

## 25

గడచిన రోజు లన్నియును
　　　　గాసిలి నట్టి హృదంతరంబుతో
నడచు శిలల్ వలెన్ ప్రజలు
　　　　నాలుగు వైపుల చిమ్మె! చీకటిన్
వెడలిన సూర్యరశ్మి వలె
　　　　విజ్ఞత మబ్బుల చాటు మాటునై
జడ మయ మైన మానవత
　　　　జాలిని గొల్పెడు శిల్ప భంగిమన్

## 26

ఈ సమయమ్ము వర్ణనకు
వీలును కాని విచార ధారలన్
వాసిత మానసంబు ఒక
అగ్ని సమాన విభాస నీతితో
ఈసురు వోవు ప్రాణములు
నిల్పగ జేయుటయే ప్రధానమై
వేసర జేయు వారలకు
వీర నికామము చూప నెంచెదున్

## 27

కాల మేదైన స్నిగ్ధమౌ కాంతి లేని
మానసాకృతి బ్రతుకులో మాను సమము
తెగిన బంధము ముక్కలౌ తీరు లోన
కలిపి ఉంచుట, సాధ్యము కాని నిజము

## 28

బండి చక్రమ్ము కింద పుష్పమ్ము వోలె
బ్రతుకులో శూన్య భావము ప్రబలి పోయి
గాయపడి నట్టి హరిణమై గడుపు టెట్లు
సాదువైనను, ఈ ప్రజాస్వామ్య మందు

## 29

ఉత్సవ పూర్ణమై వెలుగు
        నూతన రాష్ట్రము నందు వాయువుల్
ఉత్సుక భావనా లహరి
        లోలములై తన రారు చుండగా
వత్సరముల్ యథావిధి న
        వాంబుద వర్ష సమార్ద్ర రీతులన్
మత్సరముల్ తొలంగిన మ
        నమ్ములు! అభ్యుదయంబె! కోరెడిన్!

## 30

అభ్యుదయమ్ము కోరు మన
        మందున పోవలె ! దుష్ట తంత్రముల్
సభ్యత తోడ రావలెను
        శాసన పర్వము నీతి చిహ్నమై
లభ్యము కాని ఆశ పయి
        లంగరు నెత్తి తుపాను లందు, వా
ల్లభ్యము తీవి జారిన, వి
        లాప మనస్కత వీడగా వలెన్

## 31

కంట కమ్ముల మొనలపై కదలి కదలి
విజయ మంత్రము పెదవిపై వెడలి వెడలి
కడచి వచ్చిన దీ తెలంగాణ చరిత
ఉద్యమమ్ముల కాదర్శ రూప! మాన్య

## 32

విషయ మర్యాద తెలిసిన విపుల మతికి
అధిక భావ మనే దొక సహజ గుణము
స్థాయిలో పైకి ఎదిగిన స్థాన మందు
విలువ లెరిగిన చేతిలో "గెలుపు" కార్డు

## మాదిరాజు రంగారావు కృతులు - 1953-2025

### A) స్వేచ్ఛా కవిత్వం

**❖ I.స్వేచ్ఛా కవిత్వం - మొదటి సంపుటం రచనా కాలం 1953 - 2002**

**i. స్వేచ్ఛా నవం :** 1. మానవీయం 2. పడగెత్తిన ఉదయం 3. ముక్తధాత్రి 4. ఇది వియత్నాం 5. యుగ సంకేతం **ii. 6. ఆవాహనం iii. 7. ముక్తకాలు. iv. సమయ దర్పణం :** 8. నాలో ప్రవహిస్తోంది నది 9. నాకు జ్ఞాపకముంది **v. 10. కిర్మీరం** 11.మనోభూమికలు **vi. వర్తమానం స్క్రీన్ పై :** 12. వెలుగులో ఈ నేలపై 13. మేల్కొన్న ఈ సమయం 14. శబ్దమయి ప్రాణమై 15. అగ్నిమయం జీవితం 16. కాలాన్ని నిలిపి క్షణం 17. ఈ తరం స్వరచిత్రం 18. అశాంతి ఆర్కెస్ట్రా 19. వర్తమానం స్క్రీన్‌పై **vii. 20. అగ్ని నుండి ఆనందానికి viii. ఈ శాతాబ్ది రెక్కలపై** 21. జైలు కార్నర్ నుండి 22. ప్రయాణం నుండి ప్రయాణం 23. డైరి దర్పణంలో 24. ఈ శతాబ్ది రెక్కలపై 25. శాంతి స్వప్నం **ix. అగ్నిపితం** 26. క్రాస్ ఫైర్ 27. సీజ్ ఫైర్ 28. నేడు రేపు మధ్య **x. 29. కిరణ పథం** 30. స్వేచ్ఛకు సిగ్నెల్

**❖II. స్వేచ్ఛా కవిత్వం - రెండో సంపుటం రచనా కాలం 2003 - 2012**

31. అభిషేకం 32. ఆగమనం 33. ఎప్పటికీ కొత్తే 34. సృజన దర్శనం 35. మరో వైపు 36. హృదయ మేఘం 37. సమకాలీనం 38. అభినవ యానం 39. ఆత్మ బంధం 40. సృజన మేఘం 41. ఉగ్ర చరణం 42. సవారంభం 43. గిఫ్ట్ ప్యాకెట్ 44. నవ దర్శనం 45. పునర్దర్శనం 46. నడిచే వెలుగు చుట్టూ 47. అపూర్వ 48. అజ్ఞాతం నుండి 49. రోజు వస్తుంది 50. ఉద్యమ చరణం 51. ఆల్బంలో ప్రజాస్వామ్యం 52. అద్దంలో ప్రజాస్వామ్యం 53. ప్రవాహంలో ప్రజాస్వామ్యం

**❖III.స్వేచ్ఛా కవిత్వం - మూడో సంపుటం రచనా కాలం 2013-2015**

54. ఖడ్గం కన్నీరు కార్చదు 55. చార్ ధామ్ 56. ఆల్ ఇన్ వన్ 57. ఉద్యమ పథం 58. అడవిలో ఆయుధం 59. చెదరిన ప్రజాస్వామ్యం 60. గాయ పడిన ప్రజాస్వామ్యం 61.ఈనాటి నిజం 62. ఇంకా బహు దూరంలో ప్రజాస్వామ్యం 63. సంస్కృతి & హృదయం నుండి 64. తెలంగాణ స్వరం, ఆత్మబంధం

**❖IV. స్వేచ్ఛా కవిత్వం - నాలుగో సంపుటం రచనా కాలం 2015 నుండి 2018**

65. వర్తమాన స్వనం 66. లైన్ క్లియర్, 67. వర్తమాన వాస్తవం 68. వర్తమాన లహరి 69. వర్తమాన యానం 70. వర్తమాన సంకేతం 71. ఇదే దారి 72. నవ మానవం 73. ప్రపంచీయం 74. హృది కిటికి నుండి 75. కార్నర్ కవితలు

**❖V. స్వేచ్ఛా కవిత్వం - ఐదో సంపుటం రచనా కాలం 2017 నుండి 2019**

**ఇది జీవితం :** 76. ప్రశ్నలతో ఇప్పటికీ 77. బ్రతుకులో కవితయై 78. గమ్యంపై గురితో 79. అస్మితలు, అస్తితలు 80. వాస్తవ చక్రంపై 81. ఎవరి దారి వారిది 82. అశాంతి పరిచయం 83. కవిత నా ఆత్మ 84. కాలం కప్పులో 85. నిప్పు రెక్కలపై 86. సమాప్తి కాదు 87. కాలానికి కృతజ్ఞతలు 88. సమయ పథం 89. ఇది అందరిదీ 90. సమాంతరం 91. ప్రాణం కన్న మిన్న 92.

వర్తమానం ఆనవాలు 93. నీడ నుండి వెలుగులోకి 94. అక్షర ముకురం 95. జీవితం స్వతంత్రం 96. కాలంతో నేను 97. కర్తవ్యంలో కవిత

**❖VI. స్వేచ్ఛా కవిత్వం – ఆరో సంపుటం రచనా కాలం 2019 నుండి 2020**

98. ఏది కవిత 99. వర్తమానం ముందుకే 100. మార్పుకు సిగ్నల్ 101 కవిత ప్రభుతతో 102 హృదయ దర్పణం 103. నేను నేనే 104. స్వేచ్ఛలో స్వతంత్రం 105. భవితకు సంకేతం 106. అక్షరంలో స్వేచ్ఛ – సమాజ యానం 107. స్వేచ్ఛలో బంధనం 108. కాక్‌టెయిల్

**❖VII. స్వేచ్ఛా కవిత్వం – ఏడో సంపుటం రచనా కాలం 2020 నుండి 2022**

109. రేపటికి రిజర్వులో 110. అక్షతం 111. లాక్‌డౌన్ 112. వర్తమానం మెట్లమీంచి 113 అజేయం 114 ఈ వారం కవిత 115. గుడ్ బై 116. అక్షర హృదయం 117. గాయ పడిన శాంతి 118. వార్తలో కవిత 119. నిప్పులపై మేఘం 120. తెలియని వాస్తవం

**❖VIII. స్వేచ్ఛా కవిత్వం – ఎనిమిదో సంపుటం రచనా కాలం 2022 నుండి 2023**

121. మార్నింగ్ వాక్ 122. విప్లవ ప్లవనం, స్వేచ్ఛలో మనోజ్ఞం 123. అదృష్టం 124. మేల్కొన్న కవిత 125. ఆగని పయనం 126. కవిత్వమొక థెరపి, తెలంగాణ స్వరం

**❖IX. స్వేచ్ఛా కవిత్వం – తొమ్మిదో సంపుటం రచనా కాలం 2023**

127. హృది నుండి హృదికి 128. రౌండ్ టేబుల్ 129. మానస తంత్రులపై 130. సరికొత్తగ 131. ఆశానవం 132. మౌనం మాట్లాడుతుంది 133.శిల నుండి రసాకృతి 134. అశాంతి చక్రంపై 135. మేనిఫెస్టో

**❖ X. స్వేచ్ఛా కవిత్వం – పదో సంపుటం రచనా కాలం 2024**

136. కవిత సర్వ స్వతంత్రం 137. ఇది మలి తెలంగాణ 138. నిజయానం – (బొన్సాయ్ అనంతం) 139. స్వేచ్ఛామేఘం, మెరపులు తలపులు 140 స్వేచ్ఛా పవనం

**❖ XI. స్వేచ్ఛా కవిత్వం – పదకొండో సంపుటం రచనా కాలం 2025**

141. జీవన దర్శనం 142. అద్దంలో అనల చిత్రం 143. ముక్తకాలు 144. ఆశాబన్ధం

**B) పరిశోధన – సమాలోచనం**

1. కవిత్రయం సృజనకళ (సిద్ధాంత గ్రంథం) 2. నవల స్వరూపం 3. పరిశోధనా స్వరూపం 4. అధికార భాష 5. అనువాద కళ 6. దాశరథి కవితా సమాలోచనం 7. ఆలోకనం 8. సమదర్శనం 9. సృజన రూపం–మానవీయ భావన 10. సృజన చేతన–భావ రూపాలు 11. Facets of to Free-verse 12. శ్రీశ్రీ మహా ప్రస్థానం–సమాలోచనం 13. రామాయణ కల్పవృక్షం–సృజన చేతన 14. స్వేచ్ఛా కవిత్వం ప్రజాస్వామ్య దర్శనం 15. స్వేచ్ఛా కవిత్వం – మానవీయ దర్శనం 16. స్వేచ్ఛా కవిత్వం–సహృదయ స్పందనం 17. గురజాడ ఆధునిక చేతన (2013) 18. కవితా సమాలోచనం–2017 19. కవితల సమాలోచనం 2019 20. సాహిత్య విమర్శ వ్యాసాలు

# సంక్షిప్త పరిచయం



మాదిరాజు రంగారావు గారి జననం జూన్ 8, 1935న పండితాపురం గ్రామం, ఖమ్మం, తెలంగాణ రాష్ట్రం. మాదిరాజు రంగారావు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యను పూర్తి చేసి నిజాం కాలేజీ ఉస్మానియా యూనివర్సిటీ (O.U), హైదరాబాద్, తెలంగాణలో చేరారు. మాదిరాజు రంగారావు తెలుగు మరియు సంస్కృత సాహిత్యంలో M.A. సంస్కృతం 1960 (O.U), M.A. తెలుగు 1962 (O.U), Ph.D. తెలుగు 1966 (O.U) మరియు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యు.జి.సి, UGC) యొక్క పరిశోధనా పండితులు.

డాక్టర్ మాదిరాజు రంగారావు ఆంధ్ర మహాభారతం మరియు ఆంధ్ర మహాభాగవతం యొక్క విమర్శనాత్మక సంచికా సంపాదక మండలిలో సభ్యులుగా ఉన్నారు. 1964లో హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో డాక్టర్ రావుకు మొదటి విద్యా సంబంధ నియామకం లభించింది. ఆ తరువాత తెలంగాణలోని వరంగల్‌లో ఉన్న కాకతీయ విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్‌గా మరియు డీన్‌గా సుదీర్ఘ కాలం పనిచేశారు. ఆచార్య రావు యు.జి.సిచే మంజూరు చేయబడిన రెండు ప్రధాన పరిశోధన ప్రాజెక్ట్ గ్రాంట్‌లకు మరియు భారత ప్రభుత్వ మానవ వనరుల శాఖ, న్యూఢిల్లీచే స్పాన్సర్ చేయబడిన ఒక పరిశోధన ప్రాజెక్ట్ గ్రాంటుకు ప్రధాన పరిశోధకులుగా ఉన్నారు. ఆచార్య రావు 'రసధుని సాహితీ పరిషత్తు' అనే సాహిత్య సంస్థకు వ్యవస్థాపకులు మరియు అధ్యక్షులుగా ఉన్నారు. ప్రముఖ కవి, రచయిత మరియు సాహిత్య విమర్శకులైన ఆచార్య మాదిరాజు రంగారావు, సాంప్రదాయ సాహిత్యం, ఆధునిక కవిత్వం మరియు విమర్శతో సహా తెలుగు సాహిత్యం యొక్క వివిధ ప్రక్రియలకు విస్తృతంగా సేవలనందించారు. మాదిరాజు రంగారావు గారు తమ స్వేచ్ఛా కవిత్వం మరియు సాహిత్య విమర్శ రచనల ద్వారా సమకాలీన ఆధునిక తెలుగు సాహిత్యంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు. ప్రముఖ పత్రికలైన భారతి, స్వతంత్ర, స్రవంతి, జయంతి, ఆకాశిక, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి మరియు ఆంధ్రభూమి వంటివి, మాదిరాజు రంగారావు గారి సృజనాత్మక రచనలను క్రమం తప్పకుండా ప్రచురించాయి.

ఆచార్య మాదిరాజు రంగారావు కవిత్వానికి మూల స్తంభం మానవతా ఆదర్శాలు మరియు శాంతికి ప్రతీకగా నిలిచే ప్రజాస్వామ్య దృక్పథం. ఇదే వారి స్వేచ్ఛా కవిత్వానికి ఆయువు పట్టు. మాదిరాజు రంగారావు గారు స్వేచ్ఛా కవిత్వ ప్రక్రియలో సాగించిన ప్రస్థానం వారి విశిష్ట వ్యక్తిత్వం, సామాజిక స్పృహ, మానవతా భావాలు, ప్రజాస్వామ్య సామ్యవాద సామరస్య దృక్పథం మరియు శాంతి సందేశం ద్వారా సుసంపన్నమైంది. మాదిరాజు రంగారావు గారి 'పరిశోధన మరియు సాహిత్య విమర్శ' రచనలు సాంప్రదాయ సాహిత్యం, సాహిత్య ఇతివృత్తాలు, భావజాలాలు, మానవ అంశాలు మరియు సార్వత్రిక దృక్పథం యొక్క సృజనాత్మక మరియు కళాత్మక విశ్లేషణపై దృష్టి పెడతాయి. తన సుదీర్ఘమైన మరియు అత్యంత ఫలవంతమైన సాహిత్య జీవితంలో, ఆచార్య మాదిరాజు రంగారావు యొక్క సృజనాత్మక రచనలు జూన్ 21, 2025న వారు కాలధర్మం చెందిన నాటికి 'స్వేచ్ఛా కవిత్వం' పై 150కి పైగా, సాహిత్య విమర్శపై 20కి పైగా, మొత్తం సుమారు 170 పుస్తకాలుగా వెలువడ్డాయి.

## BRIEF SKETCH



Madiraju Ranga Rao was born on June 8, 1935, in Pandithaapuram village, Khammam, Telangana. Madiraju Ranga Rao completed High School Education from Govt. High School, Khammam and joined Nizam's College Osmania University (O.U), Hyderabad, Telangana. Madiraju Ranga Rao was a student of Telugu and Sanskrit literature, obtained M.A. Sanskrit 1960 (O.U), M.A. Telugu 1962 (O.U), Ph.D. Telugu 1966 (O.U) degrees and was a research scholar of the University Grants Commission (UGC).

Dr. Madiraju Ranga Rao was a member of the Editorial Board for the critical editions of Andhra MahaBharatham and Andhra MahaBhagavatham. Dr. Rao's first academic appointment in 1964 was with the Department of Telugu, O.U, Hyderabad, then a long tenure at Kakatiya University, Warangal, Telangana as Professor, Chair Board of Studies, and Dean for Faculty of Arts followed. Prof. Rao was the Principal Investigator on two major research project grants awarded by UGCand one research project grant sponsored by the Department of Human Resources, Govt of India, New Delhi. Prof. Rao was the Founder and President of 'Rasadhuni Sahithi Parishath' literary organization.

Prof. Madiraju Ranga Rao, an acclaimed poet, writer and a literary critic, contributed extensively to various literary genres of Telugu literature including classical literature, modern poetry, and criticism. Prof. Rao established his niche in contemporary modern Telugu literature through his literary works in 'Free Verse'(Swecchaa Kavithvamu) and Literary Criticism. Popular journals published his creative writings on a regular basis and this list includes Bharathi, Swathanthra, Sravanthi, Jayanthi, Akashik, AndhraPathrika, AndhraPrabha, AndhraJyothi, AndhraBhoomi and several others.

Central to Prof. Madiraju Ranga Rao's poetic purpose was humanistic ideals and a democratic ideology that symbolized peace. This was the very essence of his 'free verse' poetry. Prof. Madiraju Ranga Rao's journey in the genre of 'free verse' poetry is enriched by his unique personal spirit, social consciousness, humanitarian feelings, a democratic ideology, and a message of harmony. A substantial number of Prof. Rao's contemporary modern 'free verse'poetic works are based on his creative mindset pertinent to historical development, existing situations, social realism, element of reason and reform, humanistic sentiment with a sign of peace and harmony. Prof. Rao's 'literary criticism' works focus on creative and artistic analysis of classical literature, literary ideologies, human elements, and universal outlook. During his long and highly productive literary career, Prof. Madiraju Ranga Rao's creative writings culminated in more than150 books on 'free verse' poetry and over 20 books on 'literary criticism' – a total of about 170 books – published until his departure on June 21, 2025.

9 789356 809475